

కందుకూరి వీరేశలింగము

# రాజశేఖర చరిత్రము

నవల

# రాజశేఖర చరిత్రము

నవల

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435 బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్-500 001

**RAJASEKHARA CHARITRAMU**
**A Novel by Kandukuri Veereshalingam**

ప్రచురణ సంఖ్య : 2350 /2287 R
ప్రతుల సంఖ్య : 1000
గత ముద్రణలు : 1987, 1992, 1996, 1999, 2001
ఆరవ ముద్రణ : డిశంబర్, 2004

© 1987 అధోజ్ఞాపికలు, కూర్పు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

**వెల : రూ. 50-00**

ప్రతులకు : **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
విజ్ఞానభవన్, బ్యాంక్ స్ట్రీట్,
హైదరాబాద్ - 500 001.
E-mail: visalaandhraph@yahoo.com

**విశాలాంధ్ర బుక్ హౌస్**
(అబిడ్స్, సుల్తాన్‌బజార్) హైదరాబాద్,
విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు,
తిరుపతి, హన్మకొండ, అనంతపురం, కాకినాడ.

ముద్రణ : విశాలాంధ్ర ప్రెస్, హిమాయత్‌నగర్, హైదరాబాద్
ఫోన్ నెం.23222308

# THIS TELUGU NOVEL

IS

BY PERMISSION

MOST RESPECTFULLY DEDICATED

BY THE AUTHOR

TO

## Col. ROBERT
## MACKENZIE MACDONALD

DIRECTOR OF PUBLIC INSTRUCTION

MADRAS PRESIDENCY

AS A SMALL TOKEN OF ESTEEM FOR THE GOOD

HE HAS DONE TO THE TELUGU COUNTRY.

# వివేక చంద్రిక

అను

# రాజశేఖర చరిత్రము

## మొదటి ప్రకరణము

ధవళగిరి-దేవాలయవర్ణనము-గోదావరి యొడ్డున నున్న ధర్మశాల మీఁద ప్రాతఃకాలమున రాజశేఖరుఁడుగారు వచ్చి కూర్చుండుట-అప్పటప్పటికి వచ్చిన సిద్ధాంతి మొదలగువారి స్తుతివచనములు-అందఱును గలిసి రామపాదముల యొద్దకు బైరాగిని చూడఁబోవుట.

శ్రీ[1] నాసికాత్ర్యంబకముకడ కడుదూరమున నెక్కడనో పశ్చిమమున నొక్క యున్నత గోత్రమున జననమొంది యూర్మికాకంకణాదుల మెఱుంగులు తుఱంగలింపఁ దన జననమునకు స్థానమైన భూభృద్వర పురోభాగముననే పల్లములంబడి జాఱుచు లేచుచుఁ గొంతకాలముండి యక్కడినుండి మెల్ల మెల్లగా ముందు ముందుకు బ్రాఁకనేర్చి యెల్లవారల చూడ్కులకు వేడ్కలు నింపుచు, పిదప నవ్యక్తమధుర స్వరంబులతో ముద్దులు గులుకు శరవేగమునఁ బరుగిడుచు, ఆ పిమ్మట ఘనతరుల చెంతఁజేరి తల్లి వేళ్ళను విడిచి తక్కిన వేళ్ళనంటుచు జాతి జమ్ములోనడఁగి దాఁగుడుమూఁత లాడుచు, వెలువడి [2]విదర్భాది దేశముల గుండఁ బ్రయాణములుచేసి, త్రోవపొడుగునను వచ్చి పుచ్చుకొనని వారిదే

---

1. రాజశేఖర చరిత్రం రచించే నాటికి పంతులుగారి వయస్సు ముప్పై. ఇంచుమించుగా ఇరవై యేళ్ళ వయసునుంచే ఆయన గ్రంథ రచన ఆరంభించారు. పూర్వ సంప్రదాయం మీద అభిమానం యింకా ఆయన్ని పూర్తిగా వదలలేదు. అందువల్లనే శ్రీకారంతో ప్రారంభించారు. ప్రారంభ కథన శైలి కూడా ప్రౌఢ గంభీరంగానే వుంది. వర్ణనా సామర్థ్యం కవి ప్రతిభకు తార్కాణం కదా. సమకాలీన పండితులు వీరేశలింగాన్ని గొప్ప కవిగా గుర్తించి గౌరవించారు.

2. గోదావరి మహారాష్ట్రంలోని నాసికాత్ర్యంబకంలో పుట్టింది. ఇప్పటి నాగపూర్ ప్రాంతాన్ని పూర్వకాలంలో విదర్భగా వ్యవహరించేవారు.

లోపముగా స్నానపానములకు వలయునంత నిర్మల జలం బొసంగి యా బాలవృద్ధ మందఱి నానంద మొందించుచు, తా నడుగిడిన చోటులనెల్ల సస్యములకును ఫలవృక్షములకును జీవనములిచ్చి వానిని ఫలప్రదములఁ గావించుచు తన చల్లఁదనము వ్యాపించినంత వఱకు నిరుపార్శ్వములందు భూమినంతను బచ్చని లేఁబచ్చికతో నలంకరించి పశుగణంబుల కాహా రంబు కల్పించుచు, తన రాక విని దూరమునుండి బయలుదేఱి యడవి పండ్లును, నెమలికన్నులును వహించి పొంగి నానాముఖములఁ దన్నుఁ గానవచ్చు వరద, మంజీర, పిన్నగంగ మొదలగువారి నాదరించి లోఁగొనుచు, అంతకంతకుఁ దన గంభీరత గానుపింప నాథుని వెదకి కొనుచు వచ్చివచ్చి యేగిరిని దూరమునుండి విలోకించి గోదావరి రసోత్త రంగముగా ఘోషించుచు పాదము నంబడి శిఖరంబున నధివసించు జనార్దనస్వామి దర్శనము చేసికొని తోడనే యచ్చటనుండి తన శాఖా రూపములయిన రెండు చేతులను జాచి సరసత మీఱ నాదునిం గలియు భాగ్యము గాంచెనో యా ధవళగిరి. యాంధ్రదేశమున కలంకారభూత మయి రాజమహేంద్రవర సమీపమున మిక్కిలి వన్నెకెక్కి యుండెను.[1]

ఆ పర్వత మంత యున్నతమయినది కాకపోయినను, తెల్లని పిండిరాళ్ళతో నిండియుండుటచేఁ జూచుట కెంతయు వింతగా మాత్ర ముండును. ఆ రాళ్ళను బట్టియే దానికి ధవళగిరియను నామము కలిగి యుండును. దక్షిణపువైపునఁ గ్రిందినుండి పర్వతాగ్రము వఱకును నల్లరాళ్ళతోఁ జక్కని సోపానములు కట్టబడి యున్నవి. ఆ సోపానముల కిరుప్రక్కలను కొంత పొడుగున నర్చకులయుఁ, దదితరులగు వైష్ణవ స్వాములయు గృహములు చాలుగానుండి కన్నులపండువు చేయు చుండును. ఆ సోపానముల వెంబడిని మీఁదికిఁ జనినచో గొండమీఁద నల్ల రాళ్ళతోఁ గట్టఁబడిన సుందరమైన చిన్న దేవాలయ మొక్కటి కానఁ బడును. దానిచుట్టును నించుమించుగా నిలువెత్తు ప్రాకారము మూఁడు

1. వీరేశలింగం పంతులుగారి మౌలిక ప్రతిభ యీ వర్ణన ద్వారా తెలుసుకోవచ్చు. శ్రీ వివేకవర్ధని పత్రిక ప్రారంభించినప్పుడు వీరేశలింగం ధవళేశ్వరంలోనే ఉండేవారు. 1874 అక్టోబరు నుంచి వివేకవర్ధని మాసపత్రికగా ప్రారంభమైంది. 1878లో రాజశేఖర చరిత్రం వివేకవర్ధనిలో ధారావాహికంగా మొదలైంది.

ప్రక్కలను బలిసియుండును. ఉత్తరపు వైపున మాత్రము గోడకు బదులుగా పర్వతశృంగమే పైకి వ్యాపించి, గోడలు తన పాదము నాశ్రయింప వానిని మించి యాలయశిఖరమును నిక్కి చూచుచుండును. ప్రాకారములోపలనె యుత్తరమున నొక చిన్న గుహ కలదు. అందులో గూర్చుండి పాండవులు పూర్వ మరణ్యవాసము చేయునప్పుడు తపస్సు చేసిరని పెద్దలు చెప్పుదురు. అందులో నిప్పుడు చిన్న రాతివిగ్రహ మొక్కటి యుండెను. సంవత్సరము పొడుగునను పూజాపురస్కారములు లేక బూజుపట్టియున్న యా దేవర నుత్సవ దినములలో నర్చకు డొకఁడు పైకిదీసి పులికాపుచేసి, ఆ స్వామి సన్నిధానమున దీపము నొకదానిని వెలిగించి గుహాముఖంబునఁ దాను నిలుచుండి పల్లెలనుండి యాత్రార్థము వచ్చిన మూఁకలవలన తలకొక దమ్మిడి[1] వంతునఁ బుచ్చుకొని లోనికిం గొనిపోయి దేవతాదర్శనము చేయించి వారి పెద్దలు ధన్యులయిరని చెప్పి పంపుచుండును. జనార్దనస్వామి కళ్యాణదినములు నాలుగును వెళ్ళినతోడనే యెప్పటియట్ల స్వామి రథము యొక్క పగ్గముల నందుంచి, వాని కా చిన్న దేవరను గావలి యుంచి జీతభత్తెములు లేకపోయినను రాత్రిందివములుకాలు గదలపక స్థిరవృత్తితోఁ గాచుచుండు నా పిన్న దేవరయెడల గల విశ్వాసము చేత పూజారులు మఱుచటి సంవత్సరమా త్రాళ్ళపని మరల వచ్చువఱకును ఆ గుహ త్రొక్కి చూడనక్కఱలేక నిర్విచారముగా నుందురు. ఈ ప్రకారముగ మనుష్యులు భక్తిహీనులయి దేవతాసందర్శనము చేసి కొనక పోయినను పర్వతమును కనిపెట్టుకొనియున్న చిన్న చతుష్పాద జంతువులు మాత్రము మిక్కిలి భక్తికలవై నిత్యము నా స్వామిని సందర్శించుకొనుచు ఉత్సవదినములలో మనుష్యులువచ్చి తమ్ముఁ దఱిమివేయునంతటి

---

1. దమ్మిడి అంటే ఒక కాసీ. అణాకు నాలుగు కానులు, రూపాయికి పదహారు అణాలు, అణాకు పన్నెండు పైసలుగా ఆర్థిక వినిమయం వుండేది, వీరేశలింగం పంతులుగారి రోజులలో. దమ్మిడి- **A copper coin worth either three or four pies,** చిన్నమెత్తు రాగి ముద్ర, పాత దమ్మిడి- **A coin worth four pies,** కొత్త దమ్మిడి- **a copper coin worth three pies, a quarter anna** అని సి. పి. బ్రౌన్ తెలుగు - ఇంగ్లీషు నిఘంటువులో వుంది.

పాపముం గట్టుకొన్నదాఁక రాత్రులు దేవతాసన్నిధానమున గుహలో వట్టి భూతలముననే శయనించుచుండును. తూర్పువయిపునఁ బ్రాకారములోనే జనార్దనస్వామి కెదురుగా గొప్ప ధ్వజస్తంభమొకటి యున్నది. దాని శిఖరమున నున్న చిఱు గంటలు గాలికిఁ గదులుచు సదా శ్రావ్యమైన నాదముతోఁ జెవులను దనుపుచుండును. ఆ స్తంభమునకు మొదట నాంజనేయవిగ్రహ మొకటి చేతులు జోడించుకొని స్వామి కభిముఖమయి నిలిచి యుండును. ఈ శిలా విగ్రహమునకును ధ్వజస్తంభమునకును ఉత్తరముగాఁ గళ్యాణమంటప మొకటి యుండెను. స్వామి కళ్యాణదినములలో నుత్సవ విగ్రహములు నందు వేంచేయింపఁజేసి యథావిధిగా వివాహ తంత్రమంతయు మహావైభవముతో నడిపింతురు.

ప్రతి మాసమును రెండు పక్షములయందును ముఖమంటపము మీఁద ఏకాదశినాడు రాత్రి హరిభజనము జరుగుచుండును. హరిభక్తులు తులసిపూసల తావళములను ధరించుకొని, ద్వాదశోర్ధ్వపుండ్రములను స్ఫుటముగాఁబెట్టుకొని కరతాళములును మృదంగములును మ్రోగుచుండఁగా దంబురలు మీటుచు, బిగ్గరగాఁ దమ యావచ్ఛక్తిని "నవనీతచోరా" "గోపికాజారా" "రాధికాలోలా" "గోపాలబాలా" మొదలగు నామములచే నిష్టదేవతలను సంబోధించుచు మధ్య మధ్య గొంతుకలు బొంగురుపోయి నప్పుడు మిరియములను బెల్లపు ముక్కలను నమలుచు కృష్ణలీలలను బాడుచుందురు. తలలు త్రిప్పుచు భక్తులు తమ సత్తువంతయుఁ జూపి చేతికొలఁదిని వాయించుటచే నొకానొకప్పుడు మద్దెలలును తాళములును పగిలిపోవుటయు సంభవించుచుండును. దేవతావేశముచేత తఱుచుగా భక్తులలో నొకటిద్దరు దేహములు పరవశమయి రెండు మూడు నిముషముల వఱకు వెనుకకు స్తంభముమీఁది కొఱగుచుండుటయుఁ గలదు. ఇట్టి భక్తి మార్గమును బొత్తిగా గుర్తెఱుఁగని యన్యదేశీయులకు మాత్రము వచ్చిన జనులు వారెంత వికృతముగా కేకలు వేయుచు భజనచేయుదురో యంత పరమభాగవతోత్తములని తలఁతురు.

కొంచెము శ్రమపడి యెవ్వరైన మధ్యాహ్నవేళ నొక్కసారి కొండమీఁదికెక్కి నలుఁగడలఁజూడ్కి నిగిడించినచో, వన్నెవన్నెల పిల్లలు చెంగు చెంగునఁ దమముందఱ దుముకులాడుచుండఁ గొంద పొదుగునను,

ముంగాళ్లు మీఁదికెత్తి పొదలపయి యాకులను మేయు మేఁకలును, పూర్వ దక్షిణములఁ గుప్ప వోసినట్లున్న తాటాకుల యిండ్ల నడుమ వానిని వెక్కిరించునట్లక్కడక్కడ నెత్తుగా నొక్కొక్క పెంకుటిల్లును, ఉత్తరమున మంచెలపైనుండి పొలముకాఁపులు కోయని కూఁతలిడుచు నొడిసెలలు ద్రిప్పుచు బెదిరింపఁ జేరువతోఁపులలో నుండి వెలువడి మధుర రుతములు చేయుచు ఆకాశమున నెగయుచు సందయినప్పుడు కంకులను విఱుచుకొని పఱచి పలువిధములయిన పక్షులు చెట్లకొమ్మలమీఁదఁ బెట్టుకొని తినుచుండ ముచ్చటగా నుండు పలువిధముల పచ్చని పయిరులును. ఆ పయిని వృక్షములమీఁదను గూర్చుండి కర్ణరసాయనముగాఁ బిల్లనగ్రోవిని మోవినిబూని పాడెడి గోపబాలకుల గానములకు హృదయములు కరఁగి, మేపులు చాలించి, క్రేపుల తోడఁగూడఁ జెవులు నిక్కించి యఱ్ఱులు చాచి యాలింపుచు నడుమ నడుమ గడ్డిపఱకలు కొఱుకుచు బయళ్ళయందు నిలుచున్న పశుగణములును, పడమటను నీలములవలెనున్న తేటనీటిపై సూర్యకిరణములు పడియెల్లెడలను వజ్రపుఁదళుకులను బుట్టింపఁ బలు తెఱంగుల జలవిహంగంబులు పుట్టచెండ్లవలె మీలఁ బట్టుకొనుటకయి నీటంబడుచు లేచుచుఁ బ్రవాహంబుతోడం బఱచు చుండ నఖండ గౌత మియు నేత్రోత్సవము చేయుచుండును.

ఆ పర్వతపాదమునకు సమీపమున గోదావరియొడ్డున నల్లరాతి బండమీఁదఁ జిక్కఁగా మలఁచిన రామపాదములు వెలసి యున్నవి. శ్రీరాములవారు పూర్వ కాలమున సీతాలక్ష్మణులతోడఁగూడఁ బర్ణశాలకుఁ బోవుచు త్రోవలో ఈ పర్వత సమీపమున నడచిననాటి పాదముల చిహ్నములే యవి యని యెల్లవారును నమ్ముదురు.[1] కాఁబట్టి యా రామ పాదములను సందర్శింపవలె నను నభిలాషతో దూర దేశములనుండి సహితము యాత్రాపరులు వచ్చి రామపాదక్షేత్రమున నఖండ గౌతమీ స్నానము చేసికొని, కొండమీఁది కెక్కి శ్రీ జనార్దనస్వామివారి దర్శనము

1. "ఈ దేశంలో పాండవులు వుండని గుహలూ, సీతమ్మవారు స్నానమాడని గుంటలూ లేవు" అని గురజాడ అప్పారావు "మీ పేరేమిటి?" అన్న కథలో ప్రసక్తం చేయటం జ్ఞాపకం వస్తుంది వీరేశలింగం పంతులుగారి యీ వర్ణన చదివి నప్పుడు.

చేసికొని, స్వశక్త్యనుసారముగా దక్షిణతోడి ఫలములను సమర్పించి కలిగినవారైన స్వామికి భోగముసహితము చేయించి మఱి పోవుచుందురు. అది దివ్యక్షేత్ర మగుటంజేసి జాతి మతభేదములు లేక యెల్లవారును పులి యోగిరము దధ్యోదనము మొదలుగాఁగల స్వామి ప్రసాదమును స్వీకరించి కన్నుల కద్దుకొని యచ్చటనే యారగించి చేతుల నంటుకొన్న దానిని కడుగుకొన్న నపచారమగును గనుక గర తలములు పయికెత్తి చేతుల కందినంతవఱకు దేవాలయ స్తంభములకును గోడలకును వర్షము వేయుటయేకాక తచ్ఛేషముతోఁ దమ మీఁజేతులకును బట్టలకును మెఱుఁగు పెట్టుకొనుచుందురు.

ఈ కొండకు దక్షిణమునను తూర్పునను కొంతదూరము వఱకు గ్రామము వ్యాపించి యున్నది. పర్వతము పేరే పూర్వము గ్రామము నకుంగూడఁ గలిగియుండెను. కాని,యిప్పుడిప్పుడు గ్రామమును ధవళేశ్వర మని వ్యవహరించుచున్నారు. కొండ మీఁదినుండి సోపానములు దిగివచ్చిన తోడనే రాజవీధియొక్క యావలిప్రక్కను శ్రీ అగస్త్యేశ్వరస్వామివారి యాలయ మొక్కటి లోచనగోచరం బగును. తొల్లి వింధ్య పర్వతము యొక్క గర్వము నణఁచి దక్షిణాభిముఖుఁడయి చనుచు అగస్త్యుం డా స్వామిని అచట ప్రతిష్ఠ చేసెనని స్థలపురాణము చెప్పుచున్నది. ఈ దేవా లయమునకును,పర్వతమునకునుమధ్యను తూర్పుననుండిపడమటికిగోదావరి వఱకునువిశాలమయిన రాజవీధి యొకటిగలదు.ఆ వీధి చివరను నల్లరాళ్ళతో నీటివఱకును సోపానములు కట్టఁబడియున్నవి. సోపానములకు సమీపమున వీధికిఁ దూర్పు ప్రక్కను "ధర్మచావడి" అని యొకటి యుండెను. అది పర దేశ బ్రాహ్మణులును, మార్గస్థులును రాత్రులు పరుండుటకై మొట్టమొదట కట్టఁబడినది కాని, ఆ కాలమందది యుబుసుపోవుటకై గ్రామములోని పెద్ద మనుష్యులు ప్రతిదినమును ఉదయాస్తమయ సమయములయందు ప్రోగై యిష్టకథాగోష్ఠిం గొంత ప్రొద్దుపుచ్చి పోవుచుండుటకు మాత్రము విని యోగపడుచుండెను.

ఒకానొక దినమున సూర్యుఁడుదయించి ప్రాచీముఖంబునఁ గుంకుమబొట్టునందంబు వహించి వృక్షాగ్రములను బంగారు నీరు పూసి నట్టు ప్రకాశింపఁ జేయుచుండెను. చెట్లమీఁది గూళ్ళనుండి కలకల ధ్వను

లతో వెలువడి పక్షులు నానా ముఖముల ఎరకయి వెడలుచుండెను. పసులకాపరిబాలురు చలుదులు మూటగట్టుకొని పశువుల మందలను దోలు కొని పచ్చికపట్ల కరుగుచుండ, వెనుక "వెల్లావు కడినాది" "దోరగేదె కడినాది" యని గంపలు చేతఁబట్టుకొని, పడుచు లొండొరుల మీతి పరుగులిడుచుండిరి; కాఁపులు ములుకోలలు బుజములమీఁదఁ బెట్టుకొని, కోడెలను దోలుకొని తమ తమ పొలములకుం బోవుచుండిరి;[1] అప్పుడు కాయశరీరముగల యొక పెద్ద మనుష్యుఁడు జందెము పేరుగా వేసికొని యెడమచేతితో నిత్తడి చెంబు నొకదానిం బట్టుకొని, గోదావరిలోఁ గాళ్ళను చేతులును గడుగుగొని, ఒడ్డునకు వచ్చి పుక్కిలించివైచి యజ్ఞోపవీతమును సవ్యముగా జేసికొనివచ్చి, ధర్మశాలమీఁద నొడ్డున గూర్చుండి, వచ్చు నపుడు చెంబులో వేసి తెచ్చుకొన్న తుమ్మపుడకతో దంతధావనము చేసి కొనుచుండెను. ఆయనకు వయస్సు నలువది సంవత్సరము లుండును; మొగముమీఁద స్ఫోటకమచ్చలే లేకపోయెనేని, మొగము సుందరమయిన దనుటకు సందేహింపనక్కఱ యుండదు. అట్లని, యా ముఖ మాయనను నిత్యమును దర్శింపవచ్చు ప్రవక్తలస్తోత్రములకు మాత్రమెప్పుడును బాత్రము కాకపోలేదు. శరీరచ్ఛాయ యెఱ్ఱనిది. విగ్రహముకొంచెముస్థూలము గాను పొట్టిగాను ఉండును. నుదురు విశాలమయి చూచువారి కతఁడు పండి తుఁడని తోఁపఁజేయుచున్నది. అప్పుడు కట్టుకొన్నది గోరంచు నీరుకావి ధోవతి. సరిగంచుల చలువ వస్త్ర మొకటి శిరస్సునకు వదులుగా చుట్టఁ బడి కొంగు కొంత వ్రేలాడ వేయఁబడి యున్నది; చెవులనున్న రవల యంటుజోడును, కర్మిష్ఠుఁడనుటకు సాక్ష్యమిచ్చుచున్న కుడిచేతి యనా మికయందలి బంగారపు దర్భముడి యుంగరమును, తర్జనియందలి వెండి బటువులు రెండును దప్ప శరీరమున నాభరణము లేవియు లేవు. ఆయన పేరు రాజశేఖరుఁడు; ఆయన ముఖప్రక్షాళన మగునప్పటికి గ్రామము లోని గృహస్థులు నలువురును అక్కడికి వచ్చి, ఆయన వారి వారి తార తమ్యముల కర్హముగాఁ దగిన మర్యాదలు చేసి కూర్చుండుఁ డని చేయి

---

1. పాలపల్లె నవలలో కూడా మొదటిభాగం ఆరవ ప్రకరణం- 'గొల్లవాప రుటు' అనే పేరుతో ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు గ్రామీణ జీవిత సౌంద ర్యాన్ని వర్ణించారు.

చూప, 'చిత్తము' 'చిత్తము' 'మీరు దయచేయండి' అనుచుఁ జావడినిండఁ గిటగిటలాడుచుఁ గూరుచుండిరి.

అప్పుడు రాజశేఖరుఁడుగారు "సిద్ధాంతిగారూ! మీరు నాలుగు దినములనుండి బొత్తిగా దర్శనమిచ్చుట మానివేసినారు! మీ యింట చిన్న పెద్దలందఱును మఱేమియు లేకుండా సుఖముగా నున్నారుగదా?"

సిద్ధాంతి—"చిత్తము చిత్తము. తమ యనుగ్రహమువల్ల మే మందరము సుఖముగానే యున్నాము; ఎన్ని కుటుంబములనైన నన్న వస్త్రాదులిచ్చి కాపాడఁగల ప్రభురత్నములు తమరు గ్రామములో నుండఁగా మా వంటివారి కేమి కొదువ. మా గ్రామము చేసికొన్న భాగ్యముచేతను, మా పురాకృత పుణ్యముచేతను, తమ వంటి దాన కర్ణులు మా గ్రామమునకు విజయంచేసినారుగాని మఱియొకటి కాదు" అని రామశాస్త్రిగారి వంకఁ దిరిగి, "మనము వారి ముఖము ముందఱ స్తుతి చేయవలసినది కాదు గాని, రాజశేఖరుడుగారు కేవలము నీశ్వరాంశ సంభూతులు సుండీ!"[1]

ఆ మాటల కాదరమును సూచించెడి మందహాసము చేసి రామశాస్త్రి "అందుకు సందేహమేమి ? ఈ సంగతి మీరు నాతోఁ జెప్పవలెనా! వారీ గ్రామమున నుండఁబట్టి మన మందఱము వారి యండను నిలవగలిగినాము గాని, లేనియెడల నిండ్లును, వాఁకిళ్ళును విడిచిపెట్టి మన మీ పాటికి దేశములపాలయి లేచి పోవలసినవారము కామా! వారి తండ్రిగా రిక్కడికి

1. రాజశేఖరుడు పాత్ర చిత్రణలో వీరేశలింగం పంతులుగారి తాతగారైన వీరేశలింగంగారి వ్యక్తిత్వాన్ని దృష్టిలో పెట్టుకున్నట్లు కనపడుతుంది. "ఇట్లు మహోన్నత దశలో నున్న …లము నందాయన పూర్వార్జితములయిన భూములను జ్ఞాతులకు గొన్నిటిని విడిచిపెట్టి తక్కిన వానిని విద్వాంసులకు దానము చేసెను" అని తాతగారిని గూర్చి వర్ణించారు స్వీయ చరిత్రలో. పుట 9 - 1992 ముద్రణం.

వచ్చినప్పటినుండి యిది యొక గ్రామముగాఁ గనఁబడుచున్నదిగాని యింతకుఁ బూర్వము దీనికి నామరూపము లున్నవా ?"[1]

అని మంచి సమయము తటస్థించినప్పుడు తన పాండిత్యమును దాఁచిపెట్టక, అందుకొని సిద్ధాంతిగారి స్తోత్రపాఠములకు సాయముగాఁ దనవి కూడ నాలుగు కలిపెను.

అప్పుడు రాజశేఖరుఁడుగారు మనసులో మిక్కిలి సంతోషించినను పయి కా సంతోషము కానరాకుండ నడఁచికొని "సిద్ధాంతిగారూ! మొన్న మీ రెండవచిన్నదానికేమో గ్రహబాధ కనఁబడ్డట్టు విన్నాను. కొంచెము నిమ్మళముగా నున్నదా ?"[2]

అని యడిగిన తోడనే సిద్ధాంతిగారు మోమున దీనభావము గానిపింపఁ గొంచెమాలోచించి తలయూఁచి "జోస్యుల కామావధానులగారి

---

1. తమ తాతగారైన పేరేశలింగాన్ని గూర్చి పంతులుగారు స్వీయ చరిత్రలో ఇట్లా చెప్పారు.

"మా తాతగారి జన్మభూమి యేలూరు. అక్కడనే వారికి బూర్వార్జితము అయిన భూములును గృహములును నుండెను. మా యింటి పేరునుబట్టి మా పూర్వులాది యందు నెల్లూరు మండలములోని కందుకూరు పుర నివాసులయి యుండినట్టును, ఆటు తరువాత మహమ్మదీయుల కాలములో నుద్యోగ ధర్మమును బట్టి యేలూరునకు వచ్చినట్టును తెలియుచున్నది.

....భూముల యందాయమును నమ్ముకొని స్వస్థలమునందే యుండుట కవకాశము లేక మా తాతగారు రాజాశ్రయమును బొంది స్వగ్రామమును విడిచి రాజమహేంద్రవరమునకు వచ్చి కొంతకాలమున కక్కడ మిక్కిలి ప్రబలులయి విశేష ధనార్జనము చేసి రాజభవనమున దగినంత మహాసౌధమును గట్టి యచ్చటనే స్థిర నివాస మేర్పరచుకొనిరి."

మొదటి భాగం, మొదటి ప్రకరణము
—పుటలు 8, 9 - 1982 ముద్రణం.

2. "ఆ కాలము నందెల్ల వారికిని దయ్యముల యందలి విశ్వాస మత్యధికము. స్త్రీలలో నొకప్పుడును దయ్యము పట్టని వారెక్కడనో యుండిరి. ఎవ్వరికే వ్యాధి వచ్చినను వైద్యుని ఇంటికి మాఱుగా భూత వైద్యుని యింటికో సోదె చెప్పు వాని యింటికో పరుగెత్తుచుండిరి."

—స్వీయ చరిత్రము మొదటి భాగం
మొదటి ప్రకరణం, పుట 11.

చేత విభూతి పెట్టించుచున్నాను. కాని, దానివల్ల నిప్పటి కేమియు గుణమే కనఁబడలేదు. జాతకరీతిచే దాని కిప్పుడు శని బాలదు. ఎందుకై నను మంచిదని నా తమ్మునిచేత నవగ్రహ జపము చేయించుచున్నాను. అంతతో నూరకుండక కామావధానులుగారిచే 'పంచముఖి వీర హను మంతము' పునశ్చరణ చేయవలసినదనియు, జపశాంతి కేమయినఁ గావ లసియున్న ఏ రాజశేఖరుఁడుగారినైన కాళ్ళో కడుపో పట్టుకొని తెచ్చి నాలుగు రూపాయల సొమ్మిచ్చుకోనైన నిచ్చుకొనియెద మంచి విభూతి పెట్టుమనియు ఆయన ననుసరించి బతిమాలుచున్నాను. అందుచేతనే యీ నాలుగుదినములనుండి దర్శనము చేయలేదుగాని లేకపోయిన నేడి యెట్లయినను నేను తమ దర్శనము మానుదునా?" అనెను.

రాజ - "శాస్త్రిగారూ! మీరు రూపాయల నిమిత్తము సంశయు పడ నక్కరలేదు. కావలసియున్న ఆ నాలుగు రూపాయలను నే నిచ్చె దను. మఱి నాలుగు రూపాయలు పోయినను మంచి వైద్యుని విచారింప వలెను. మన గ్రామములో కామావధానులుగారికన్న—" అని మిన్ను వంకఁ జూచి యేమో యాలోచించుచుండెను. సిద్ధాంతిగారు చేసినస్తుతి యమోఘముగాఁ బట్టుకొని కొంచెముగానో గొప్పగానో ధనరూపమైన ప్రతిఫలమును దెచ్చుచనే వచ్చుచున్నదిగాని, యీవఱకెన్నఁడును రాజశేఖరుఁడుగారివద్ద వ్యర్థముగాఁ బోలేదు.

ధవళేశ్వరమునందును, చుట్టుపట్టుల గ్రామములయందును వేఱు సిద్ధాంతి లేఁడు గనుక, ఆయన యింటికి వచ్చి వర్జ్య మెప్పుడని కాని, ప్రయాణమునకు ముహూర్తము పెట్టుమనికాని, క్రొత్తబట్ట చించి కట్టు కొనుట కేదినము మంచిదనికాని, ఇల్లు కట్టుకొన నారంభించుట కేమాస మనుకూలమైనదనికాని, క్షౌరము చేయించుకొనుట కే వారము మంచిదని కాని, వివాహమునకు లగ్నము పెట్టుమని కాని, రజస్వల యయినప్పుడు నక్షత్రము చెప్పుమని కాని సదా యెవ్వరో యొక రాయన నడిగి పోవు చునే యుందురు. దూరబంధువులు పోయినప్పుడు మైల యెంత కాలము పట్టవలెనో తెలిసికోవలెనన్నను, జబ్బు నక్షత్రమున నెవ్వరైన మృతి నొందినప్పుడు ఇల్లువదలి యెంతకాలము లేచిపోవలెనో కనుగొనవలె నన్నను, రోహిణ్యాది నక్షత్రములయందు బిడ్డను గన్నప్పు డేమిశాంతి

తగులునో యెఱుఁగవలెనన్నను సిద్ధాంతి యొద్దకు రాకసరిపడదు. ఏ కాఁపువాని పశువు తప్పిపోయినను, ఎవనింట ఏ వస్తువు పోయినను వచ్చి సిద్ధాంతిగారి నడుగకపోరు. ఇటువంటి సమయములయం దెల్లను, అతఁడు వీధినడవలో నేలమీఁద ఇసుకపోసి దానిలో పూచికపుడకతో ఏమేమో బీజాక్షరములును అంకెలును వ్రాసి మీఁదివంక చూచి యాలోచించి వచ్చినకార్య మిది యనియు, కార్య మీప్రకారముగా నగుననియు చెప్పి పంపుచుండును. అతఁడు బల్లిపాటు మొదలైనవాని ఫలములును,[1] శకునములు చూచి సంతానము కలుగు కాలమును గూడ చెప్పుచుండును. వేయేల? సిద్ధాంతి యాలోచన లేక యా చేరువగ్రామములలో ఏ శుభ కార్యము గాని యశుభ కార్యముకాని జరుగదు. అతఁడు చెప్పెడి జ్యోతి

---

1. బల్లిపాటుకు ఫలమిట్లా వుంటుందని పెద్దబాలశిక్షలోను, పంచాంగంలోను ఆయా వివరాలు కనబడతాయి.

"శిరస్సు - కలహం, ముఖం - బంధు దర్శనం, కనుబొమల నడుమ - రాజానుగ్రహం, పై పెదవి-ధన వ్యయం, క్రింది పెదవి-ధన లాభం" ఇత్యాది. దీన్ని గౌళిశాస్త్రం అని కూడా అంటారు.

అయితే ఇక్కడ 'పాటు'గాదు. ఆ బల్లి చేసే ధ్వనులనుబట్టి ఆయా శకునాల శుభాశుభాలు నిర్ణయించడం జరిగేది.

గౌళి - శకునములు చెప్పే బల్లి, A kind of lizard called by naturalist Monitor from in chirping note అని సి. పి. బ్రౌన్ తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు.

"ఈ కాలము నందు జ్యోతిశ్శాస్త్రములోని, ముహూర్త జాతక భాగముల యందును, శకునములు మొదలైన వానియందును గూడ నాకు విశ్వాసము సంపూర్ణముగా చెడినది.

స్వీయ చరిత్రము మొదటి భాగము, మూడవ ప్రకరణము.
పుట 51 - 1982 ముద్రణ.

వీరేశలింగంగారి కప్పటికి 24 సం॥ల వయస్సు. తరువాత 6 సం॥లకు రాజశేఖర చరిత్ర రచించారు.

షము తఱుచుగా అబద్ధమే యగుచు వచ్చినను, అప్పుడప్పుడు కాకతాళీ యముగా కొన్ని సంగతులు నిజమగుటయుఁ గలదు గనుక జనులాతని మాట యమోఘమని నమ్ముచునే యుండిరి.

అప్పు డా చావడిలో నున్నవారిలో నెవరో "బైరాగులు భూత వైద్యమునకు గట్టివా"రని మెల్లగా ననిరి. అంతలో రాజశేఖరుఁడుగారు సిద్ధాంతిగారివంకఁ జూపు త్రిప్పి "ఔను, బైరాగులన్న తోడనే జ్ఞప్తికి వచ్చినది. పది దినముల క్రిందట ఈ గ్రామమున కెవ్వడో యొక బైరాగి వచ్చినాఁడట! అతనికిఁ జూపింపరాదా? గోసాయీలకుఁ బరమహంస క్రియ లును, వనమూలికలును విశేషముగాఁ దెలిసియుండును. వాండ్రెట్టి యసాధ్యమైన పీడలనైనను జిటికెలలోఁ బోగొట్టుదురు" అనినతోడనే చావడి యంతయు 'చిత్తము' 'వాస్తవము 'అలాగున నవశ్యము చేయ వలసినదే' యను ధ్వనులతో నిండిపోయెను. మాటలాడువారు ధనవంతు లైనచో, వ్యర్థవచనము సహితము స్తుతియోగ్యము కాకపోదుసుండీ. ఆ మాటల వలన నుత్సాహము కలిగి, రాజశేఖరుఁడుగా రా బైరాగిని తాము చూడకపోయినను బ్రహ్మవర్చస్సు కలవాఁడని శ్లాఘించిరి.

అంత సిద్ధాంతి యుల్లములో లేని సంతోషమును మోమునఁ దెచ్చి పెట్టుకొని యొక్క చిఱునవ్వు నవ్వి, వినయముతోఁ జేతులు జోడించి రాజశేఖరుఁడుగారి ముఖమున దృష్టి నిలిపి, "తమమాట చేతనే మా చిన్న దాని బాధ నివారణ మయినది. దాని యదృష్టము బాగుండబట్టియే దేవర వారి ముఖమునుండి యీ మాట వచ్చినది. ఇప్పుడే తమ సెలవు ప్రకా రము బైరాగియొద్దకు వెళ్ళెదను" అని మనవిచేసి, ప్రయాణోన్ముఖుఁ డయి లేచి నిలువఁబడెను. రాజశేఖరుఁడుగారి యభిప్రాయము కొంచెము తెలిసినతోడనే బైరాగి మహానుభావుఁ డనువారును, మహా మంత్రవేత్త యనువారు, వాయుభక్షణము చేయుననువారును, మందువేసవిని పంచాగ్ని మధ్యమునఁ దపస్సు చేయుననువారును అయి సభ యంతయు ఆతని

విషయమైన స్తుతిపాఠములలో మునిఁగిపోయెను. ఒక గొప్పవాఁడొకనిని. మంచివాఁడన్నచో, ఎవ్వని వాక్కు భిన్నముగా లేచును? ఎవ్వని నోరు స్తుతి వాక్యముల కొఱకు తడవుకొనును?

అప్పుడు రాజశేఖరుఁడుగారు వీధివంకఁజూచి "ఎవ్వరో స్త్రీలు నీళ్ళకు వచ్చి మనలఁజూచి సిగ్గుపడి వెనుకకు నాలుగడుగులు పెట్టి నిలుచుండి యొండొరుల మొగముల వంకఁజూచుకొనుచున్నారు. మనమందఱము లేచి బైరాగిని జూచివత్తమురండి" అనుమాట తోడనే ఎల్లరును లేచి ప్రయాణోన్ముఖులయి నిలుచుండిరి. వెంటనే యందఱును గలిసి యుత్తర ముఖముగా రామపాదములవైపునకు నడవ నారంభించిరి.

# రెండవ ప్రకరణము

రాజశేఖరుఁడుగారి కూతురు రుక్మిణి స్నానమునకు వచ్చుట-నదీతీర వర్ణనము - రుక్మిణికిని సిద్ధాంతిగారి భార్యకును జరిగిన సంభాషణ-నీళ్ళకు వచ్చిన యమ్మలక్కల ప్రసంగములు-పంచాంగపు బ్రాహ్మణుఁడు వచ్చి సంకల్పము చెప్పుట - రుక్మిణి స్నానముచేసి బయలు దేఱుట.

రాజశేఖరుఁడుగారు పౌరబృందముతో నాలు గడుగులు ముందుకు సాగిన తోడనే యొకసుందరి సుందరగమనముతో బాదముల యందలి యందియలమ్రోత మట్టియలమ్రోఁతతోఁ జెలిమి సేయ, మొలనున్న వెండి యొడ్డాణము యొక్కయు ముంజేతుల పసిడికంకణముల యొక్కయు, గాజులయొక్కయు కాంతులు ప్రతిఫలించి కుడిచేతిలోని తళతళ లాడుచున్న రాగి చెంబునకుఁ జిత్రవర్ణ మొసంగ, మోమున లజ్జాభయములు నటియింప, పయ్యెద చక్కఁజేర్చుకొనుచు తిన్నగాఁ దలవంచుకొని మెట్లుదిగివచ్చి చెంబును నీటియొడ్డున నుంచి చెంబుమూతి కంటించియున్న పసుపుముద్దను దీసి కొంత రాచుకొని మోదుగాకులోఁ జుట్టి తెచ్చికొన్న కుంకుమపొట్లము నొక బట్ట యుతుకురాతిపయిం బెట్టి, మోఁకాలి బంటినీటిలో నిలుచుండెను. ఆమె రాజశేఖరుఁడుగారి పెద్దకూఁతు రగు రుక్మిణి— ఆహా! ఆమె సౌందర్యమును బ్రత్యక్షమునఁ జూడ నోఁచిన వారికన్నులే కన్నులు. ఆ కాలమున హిందూ దేశమునందలి సుందరులలో నెల్లఁ దెనుఁగు దేశములోనివారే రూపరేఖా విలాసములచేత నసమా

ములుగా నుండిరి.[1] వారిలోను బ్రాహ్మణజాతినాతులు మిక్కిలి జక్కని వారు. కాని, రుక్మిణి రూపమును దలఁచినప్పుడు మాత్రము, ఆ సుందరు లౌక సౌందర్యవతులని చెప్పుట కెల్లవారును సంకోచపడుచుందురు. జను లందఱును మిక్కిలి సౌందర్యవతులని యొప్పుకొన్నవారిలో చక్కనివారి నేఱి యీమె చెంత నిలిపినచో గురూపురాండ్రనిపించెడు యామె మనో జ్ఞత నేమని పిలువవలెనో తెలియకున్నది. అపూర్వ వర్ణనా సామర్థ్యము గల కాళిదాసాది కవులలో నొకరినైనను బోలఁజాలని నేను, ఉన్నత సౌందర్యమును బోధించు పదములు లేని భాషతోను, పదములు బోధించు నంత వఱకైనఁ బూర్ణముగా దెలుపలేని బుద్ధితోను వర్ణింపఁబూనుట యామె చక్కఁదనముయొక్క గౌరవమునకుఁగొఱంత కలుగఁజేయుటయే గదా! అయినను యోగ్యవస్తువు దొరికినపుడు వర్ణింపక మానుట యుచితము కాదు. కాఁబట్టి, యీ సృష్టిలోని వస్తువులతో వేనితోనైనను పోల్చి యీ పుస్తకముల జదువువారి కామె యవయవముల యొక్క రూపము నించుక మనస్సునఁ బుట్టింతునన్నను ఆమె యంగముల నెంచి యా వస్తువుల పేరు చెప్పుటకె సిగ్గు వొడముచున్నది. వేయేల? చతుర్ముఖుఁడును ఘుణా క్షరన్యాయమునఁ బడినయామె రూపమునను దలయూఁచి, తన యపూర్వ వస్తునిర్మాణ చాతురిని మెచ్చుకోకపోఁడని యామెంజూచిన వారెల్లరు నెంచుచుందురు. అమె శరీరచ్ఛాయం జూచిన, ఇఁక నీ భూమిమీఁద బంగా రమున కేమిచాయ యెక్కువగలదని తోఁచును; నల్లగానుండు నేని, వింధ్లామెతనుబొమలం గొంచెము పోలియున్నవని చెప్పవచ్చును; నేత్రము లను జూచిన భాగ్యదేవత వానియందే కాఁపురము కుదిరినట్టు కనిపించును;

---

1. వీరేశలింగం పంతులుగారికి తెలుగుతనం పైనా, తెలుగుదేశం పైనా చాలా అభిమాన ముండేది.

"నే నఱవ దేశమునందును కన్నడదేశము నందును సంచారము చేసి వచ్చుటక్కడివారు సాంఘ సంస్కారాది విషయములలో తమ దేశముల కంటె తెలుగు దేశమెక్కువ యభివృద్ధి పొందినదని చెప్పుకొనుచుండగా నేను పలుమాఱు విని యాంధ్రదేశము యొక్క యభ్యున్నతి కానందించి గర్వపడుచువచ్చినాడను."

స్వీయ చరిత్రము-రెండవ భాగము,
నాలుగవ ప్రకరణము, పుట 306.
(ద్వితీయ భాగం ముద్రణం 1984)

కాని, నిపుణముగాఁ బరిశీలించినచో నేదో స్థిరవిచారమొకటి యామె హృదయపీఠమున నెలవుకొనియున్నట్లు ముఖలక్షణములు కొంచెము సూచించుచున్నవి. ఆ విచారమునకు గారణము లేకపోలేదు; ఆమె పెనిమిటి సహవాస దోషముచేత నాలుగునెలల క్రిందట దరిద్రులతోఁ జెప్పక దేశాంతరము లేచిపోయినాఁడు.

ఇప్పుడామెకుఁ బదునాలుగు సంవత్సరముల వయస్సు గలదు. బంగారమునకుఁ బరిమళ మబ్బినట్లు, ఇప్పుడిప్పుడే యౌవనము తలచూపి యామె మేని సోయగమునకు మెఱుఁగు దెచ్చుచున్నది. పచ్చని దేహము మీఁద అప్పుడు కట్టుకొన్న తెల్లనిబట్టయు బంగారమునకు పటిక పూసి నట్టు లొకవిధమయిన యందమునే కలిగించుచుండెను. సుందరాంగుల యంగముం జేరినప్పు డేది యందముగా నుండదు? ముక్కున నడ్డ బాసయు, చెవుల నీలాలబావిలీలును, చేతుల కంకణములును, మెడలో పత్తెడయును, మొలను వెండియొడ్డాణమును, కాళ్ళ నందెలును మట్టెలును ఆమె యప్పుడు ధరించుకొన్నది. కంకణములకు సాహాయ్యముగా రంగు రంగుల గాజులును లక్క పట్టులును ముంజేతుల నలంకరించుచుండును. ఈ నగలచే నామె యవయవముల కేమైన శోభ కలిగినదో లేదో కాని యవయవములచే నగలు కొంత శోభగాంచుట మాత్రము కరతలామలక ముగాఁ గనఁబడుచున్నది.

సృష్టిలోని యే పదార్థమునకును పరిపూర్ణత్వమును దయచేయని రీతిచే, సర్వసమునఁడగు భగవంతుడు రుక్మిణి సౌందర్యమందును గొంత కొఱంతను గలిగించినాఁడు కాని బొత్తిగాఁ గలిగింపక మానినవాఁడు కాఁడు. నిజముగా అదియొక కొఱంతయే యయ్యేనేని యామెకుగల లోపమెల్లను మెడ మిక్కిలి పొడుగుగా నుండుట, అయినను ముష్టి సర్వశాస్త్రి యాయ వారమునకుఁ వచ్చినప్పుడెల్ల నామె మెడనుజూచి సంతోషించి, "మిక్కిలి నిడుదగుమెడకామిని కులవర్ధని దాని నెట్టిఁగికొం డనిరి బుధుల్॥" అను సాముద్రిక గ్రంథములోని పద్యమును జదివి పోవుచుండును.

అప్పుడొక్క విధవ మొలలోఁతు నీళ్ళలో దూరముగా నిలుచుండి నోటిలో నేమేమో జపించుకొనుచు నడుమనడుమ దలయెత్తి సూర్యుని వంకజూఁచి దండములు పెట్టుచు, దోసిటలో నీళ్ళుపట్టి సూర్యున కర్ఘ్యము

విడుచుచు, అప్పుడప్పుడు ప్రదక్షిణములు చేయుచుండెను. ఆ వఱకే వచ్చియున్న కొందఱు స్త్రీలు తమ యిత్తడిబిందెలను నీళ్ళలోఁబెట్టి రేవునకు సమీపముగానున్న రాళ్ళపయిని నిలుచుండి యొక్కొక్క పెట్టువేయుచు మధ్యమధ్య నొక్కొక్కమాట చెప్పుకొనుచు బట్టల నుతుకుకొనుచుండిరి. ఒక వృద్ధాంగన సగముబట్ట కట్టుకొని తక్కిన సగము నుతుకుకొన్న తరువాత, ఉతికిన భాగము మార్చికట్టుకొని మిగిలియున్న భాగము నుదుకుకొనుచుండెను. కొందఱు వయసులోనున్న స్త్రీలును గోప్యముగా నుంచఁదగిన తమ యవయవములు స్నానము చేయుచున్నట్టియు గట్టుననున్నట్టియు పురుషులకుఁ గనఁబడునట్లు సిగ్గువిడిచి తొడుగుకొన్న రవికలను దీసి యుదుకుటకయి తాము కట్టుకొన్న వస్త్రముల నక్కడనేవిచ్చి యావలకుదికిన వేఱు తడిబట్టలను చుట్టఁబెట్టుకొనుచుండిరి. ఆవల పది బారల దూరమున దాసీజనములు, క్రిందఁబడిన మెతుకులకై కావు కావని మూఁగిన కాకులను చేయెత్తి యదలించుచు అంటుతప్పెలలను ఒడ్డునఁబెట్టుకొని తోముకొనుచుండిరి. ఆ పయిని బెస్తలు పుట్టగోచులతో మొలబంటి నీటిలో నిలుచుండి వలత్రాడు మొలత్రాడునం దోపుకొని రెండుచేతులతోను వలను త్రిప్పి లోఁతునీళ్ళలో విసరివైచి మెల్లమెల్లగా లాగుచుండిరి. మరి కొందఱు లాగిన వలను నీళ్ళలోఁ బలుమారు జాడించి యంటుకొనియున్న బురద పోయిన తరువాత గట్టునకుఁ దీసికొనివచ్చి చివర దగిలించియున్న యినుపగుండ్లు గలగలలాడ వలలను విప్పి రాయిరప్ప క్రిందఁబాఱవైచుచు నడుమనడుమ వల కన్నులసందున నుండి మిట్టిమిట్టిపడు చిఱుచేపలను చేతులతో నదిమిపట్టి మీలపుట్టికలను చేతఁబట్టుకొని నిలుచున్న పిన్నవాండ్రచేతి కందిచ్చుచుండిరి. ఆ పయిని నాలుగడుగులు నడచిన తరువాత దినమున కాఱణాల పాటుపడఁగలిగిన యొక సోమరిపోతు నీళ్ళలోనున్న నడదోనెమీఁదికెక్కి నల్ల యనఁబడు పేరిన నెత్తురు ముద్దను త్రాటిచివర నున్న గాలమునకు గ్రుచ్చి, లేచి నిలువఁబడి కుడిచేతితో సత్తువ కొలఁదిని త్రాడు గిరగిరత్రిప్పి లోతునీటన్విసరివైచి మరలం గూర్చుండి చేప యెప్పుడు చిక్కునాయని తదేకధ్యానముతో త్రాడువంకనే చూచుచు త్రాడు కదలినప్పుడెల్ల నులికిపడుచు దైవవశమున చేప గాలమును మ్రింగి కొట్టుకొనుచుండ మెల్లమెల్లగా లాగుచు, త్రాడు తెంపుకొని పాఱిపోవునో యను

తయనమునఁ గుడిచేతిలోని త్రాడు వదలుచు మరల లాఁగి ఉండగాఁ జుట్టుచు, శేప కలసట వచ్చిన తరువాత నొడ్డునకు లాఁగి పెన్నిధిగన్న పేదవలెఁ బరమానందము నొందుచు, ఒడ్డుదాఁక వచ్చిన తరువాత గ్రహచారము చాలక మత్స్యము త్రాడు తెంపుకొని పఱచిన చేతిలోఁబడ్డ సొమ్ము పోఁగొట్టుకొన్న వారివలె నిర్వేదించుచు చేఁప రాకపోగా రెండణాల గాలము కూడఁ బోయెనని విచారించుచు వట్టిచేతులతో నింటికి బోయెను. ఆ సమీపముననే యొడ్డునఁ జేరి కుఱ్ఱవాండ్రు వెదురుచువ్వ కొక దారమును గట్టి దాని కొననున్న చిన్న గాలమునకు ఎఱ్ఱలను గ్రుచ్చి నీళ్ళలో వైచుచుఁ దటాలునఁ దీయుచు జిన్నచేపలను బట్టుకొని మఱియొక దారమునకు గుదిగ్రుచ్చి 'నాకుఁ బదిజెల్లలు దొరికినవి' 'నాకు నాలుగు పరిగెలు దొరికిన' వని, యొండొరులతోఁ జెప్పుకొనుచు సంతోషించుచుండిరి. అక్కడి జువ్విచెట్టుమీఁదఁ గూర్చుండి చూచుచున్న చెడుగ్రద్దయొకటి యకస్మాత్తుగావచ్చి యొకటిరెండు పర్యాయములు పిల్లవాండ్రు త్రాటికి గ్రుచ్చుటకయి చేతఁబట్టుకొన్న చేపఁ నెగరదన్నుకొనిపోయెను.

అప్పుడొక్క పెద్దముత్తయిదువ మొగమంతయు నొక్కటే బొట్టు పెట్టుకొని, బట్టలతోనున్న బుజముమీఁది బిందెను తీసి చేతఁబట్టుకొని రుక్మిణియున్న తావునకువచ్చి గౌరవము తోఁప '"అమ్మాయిగారూ! ఏమి? మీరీవేళ స్నానమునకు దయచేసినారు."

రుక్మిణి—"కార్తీకసోమవారము కాదా? కడపటి సోమవారము గనుక ప్రదోషవేళ మా అమ్మతోకూడ శివాలయమునకు వెళ్ళవలెనని గోదావరిస్నానము చేయ వచ్చినాను."

పెద్దముత్తైదువ—మీరు రాత్రిదాఁక భోజనము లేకుండ నుండఁ గలరా?

రు—"ఒక్కదినమున కేమి? ఏలాగునైన నుందును. మొన్న మీ రెండవ చిన్నదానికి శరీరములో నిమ్మళముగా లేదని చెప్పినావు. ఇప్పుడు కొంచెము నిమ్మళముగా నున్నదా?"

పె—"ఏమి నిమ్మళమో నాకు తెలియదు. మావారు రెణ్ణాళ్ళఁబట్టి కామావధానులచేత విభూతి పెట్టించుచున్నారు. రాత్రి తెల్లవారినదాఁక నిద్రలేక బాధపడినాము."

రు—"గ్రహబాధయా యేమి?"[1]

పె—"ఏమనమ్మాయీ! ఏమి చెప్పుకోను? మగడు"—అని 'ఇక్కడ నెవరునులేరుగదా' యని నాలుగు ప్రక్కలనుజూచి మఱింత దగ్గఱగా జరిగి చెవిలో మెల్లగా "మగడు పట్టుకొని వేపుకొని తినుచున్నాఁడు. మీ రెఱుఁగుదురు గదా. దానికి పెండ్లియయి మూడేండ్లు కాలేదు. అప్పుడే దానిమగఁడు పోయి యాఱునెల లయినది. అప్పటి నుండియు దానికి కొన్నాళ్ళు కలలోను కొన్నాళ్ళు రాత్రివేళ ఒంటరిగా నున్నప్పుడును కనఁబడుచునే యున్నాఁడు. పిల్లది సిగ్గుచేత ఎవ్వరితోను చెప్పక దాఁచినది. నెలదినముల నుండి బొత్తిగా ఎప్పుడును విడువక తేయింబగళ్లు వెంటవెంటనే యెక్కడికి వెళ్ళిన నక్కడికెల్లఁ దిరుగుచున్నాఁడు. ఏమిపాపమోకాని మూఁడు దినములనుండి మఱింత పీకుకొని తినుచున్నాఁడు. ఈ మూణ్ణాళ్ళలోను పిల్లది సగమయిపోయినది. ఇంతే గదా? మగనితో"—అని కడుపులోనుండి దుఃఖము బయలుదేఱఁగాఁ గొంచె మాపుకొనుచుఁ గన్నీరు పైట చెఱఁగుతో తుడుచుకొనుచుఁ గొంచెముతాళి గద్గదస్వరముతో—"మగనితో సౌఖ్యమనుభవింపనా? కాపురము చేయనా?" అని కొంచెము బిగ్గరగా నేడ్వఁజొచ్చెను.

రు—(ఆమాటలు మనసునకు నాఁటి యొడలు పులకరింపఁ గొంత తాళి ధైర్యము తెచ్చుకొని) "పెద్ద ముత్తైదువవు. అలాగునఁ గంట తడి పెట్టరాదు. ఊరుకో? ఊరుకో! రోగము మనుష్యులకు రాక మ్రాకులకు వచ్చునా?"

పె—(ఏడుపు చాలించి) — 'అమ్మాయీ!. దానికే సౌఖ్యము నక్కఱలేదు. ఈలాగునైన నుండి బ్రతికి బట్టకట్టిన జాలును, మా ముసలి

---

1. "ఏ యింట నే పురుషుడు మరణము నొందినను, ఏ తరుణి మరణము నొందినను దయ్యమయి తిరుగుచుండునని స్త్రీ పురుష సామాన్యముగా...." ఆ రోజుల్లో నమ్మేవారని పంతులుగారు స్వీయచరిత్రలో వ్రాశారు.

మొదటి భాగం, మొదటి ప్రకరణం,
పుట 11, 1932 ముద్రణం.

1874 అక్టోబర్ నెల వివేకవర్ధని ప్రారంభ సంచికలోనే దయ్యాలనుగూర్చి పంతులుగారు అపహాస్యంచేస్తూ వ్రాశారు.

ప్రాణములు రెండును బ్రతికి బాగున్నంతవఱకు దాని యన్న వస్త్రముల కేమియు లోపమురాదు.

ర—కొంచెము సేపేమో యాలోచించి—'సోమిదేవమ్మా? మీవారు గ్రామములో పెద్ద సిద్ధాంతులుగదా? తెలిసికూడ చిన్నదానిని అంత యర్ధా యుష్మంతున—'[1]

పె—(మాట కడ్డమువచ్చి) — "ఔనౌను.! నీ వడుగఁబోవునది నేను గ్రహించినాను. ఎవరియదృష్టమున కెవరు కర్తలు? దానికి ముండ మోయవలసిన వ్రాఁత యుండఁగా నెవరు తప్పింపగలరు? ఎవరైన జాత కము మంచిదిగాఁ జూచి వివాహము జేయుదురుగాని పెండ్లికుమారునకు లేని యాయువును తెచ్చి పోయఁగలరా?"

ర—"అవును, జాతకములో మీ యల్లునకు పూర్ణాయుస్సే యున్నది కాఁబోలు!"

పె—(కొంచె మనుమానించి) — "పూర్ణాయుస్సా ! —అవును పూర్ణాయుస్సే యున్నది. జాతక ప్రకారము జరగదా అందువేమో. వేళ తిన్నగా కట్టి జాతకము వ్రాసినయెడల, అందులో నెన్ని యక్షరము లున్నవో అన్ని యక్షరములును జరుగును. శాస్త్రము చక్కఁగా తెలియని

---

1. "నేనారంభదశలో జ్యోతిశ్శాస్త్రమునందత్యంత విశ్వాసము కలవాఁడనే యైనను జన్మపత్రికలలో దీర్ఘాయుష్మంతులగుదురని చెప్పబడినవారనేకు లల్పాయుష్కులగుచుండుటయు, మహాధనాఢ్యులగుదురని చెప్పబడినవారనేకులు దరిద్రులగుచుండుటయు, సంతానవంతులగుదురన్నవారనేకులు సంతానహీనులగుచుండుటయు, చిరకాల సువాసినులగుదురన్న కాంతలు పలువురు బాలవితంతువు లగుచుండుటయు, సుముహూర్తములు పెట్టుకొని చేసిన కార్యములు పెక్కులు భగ్నములగుచుండుటయు, చూచుచు వచ్చినకొలది నాకీ జ్యోతిష విషయమయి యంతకంతకు నమ్మకము తగ్గి లోకానుభవమధికమయిన తరువాత పూర్ణముగా నశించెను.

....సుముహూర్తములను బెట్టుకొని జన్మపత్రములను దీర్ఘాయుష్మంతు లయిన వరుల నేర్పరచుకొని వివాహ కార్యములు నడుపునప్పుడు వివాహితలలో లక్షలకొలది బాల వితంతువులేల కావలెను?"

స్వీయచరిత్రము - మొదటి భాగము
మొదటి ప్రకరణము; పుటలు 6, 7 - 1982 వ ముద్రణం.

వారు తిన్నగా వేళ కట్టలేక పాడు చేయదురు. మా వారు ఇన్ని ముహూర్తములు పెట్టినారుగదా ? నీ వెఱిఁగినంతవరకు మఱియొక విధముగా నెక్కడనైన జరిగినదేమో చెప్పు."

రు — "కన్నమ్మగారి బుచ్చమ్మ వివాహముహూర్తము మా చావడిలో మన సిద్ధాంతిగారే పెట్టినారుగాని దాని మగని జాతకము కూడ సిద్ధాంతిగారే వ్రాసి—"

ఫె— "అవును; ఒకానొకటి తప్పిపోవుటయుఁ గలదు జ్యోతిషమునకుఁ బార్వతిశాప మున్నదఁట! మావారెప్పుడును ఈ సంగతినే చెప్పుచుందురు. గట్టుమీఁద మట్టెలచప్పు డగుచున్నది. ఎవ్వరో వచ్చుచున్నట్లున్నారు. ఈపాటికి మన మీ సంగతి చాలింతము" అని వెనుక తిరిగి చూచి బిందె యొడ్డున నుంచి స్నానమునకు నీళ్ళలో దిగుచున్నది.

ఇంతలోఁ గొందఱు పుణ్యస్త్రీలును విధవలును మెట్లుదిగుచు నుండున్నవారు వంగి కాళ్ళ వెండి పావడములను కొంచెము పయికిఁ దీసికొనుచు వెనుకఁ దిరిగి దూరముననున్నవారు వచ్చువఱకు దగ్గఱ వారితో మాటలాడుచు మెల్ల మెల్లగా నీటి సమీపమునకు వచ్చి గృహకృత్యములను గుఱించి మాటాడుకొనుచు బిందెల నొడ్డున బెట్టిరి. అందఱు నొక్కచోట సమావేశమయి సావకాశముగా మాటాడు కొనుటకు నీళ్ళకు వచ్చినప్పటికన్న మంచి సమయము స్త్రీలకెప్పుడును దొరకదు గదా ? అందుచేతనే వారు సాధారణముగా కొంచము తీఱుబడి చేసికొని మాటాడవలసిన నాలుగు మాటలను నీళ్ళకు వచ్చినప్పుడే మాటాడుకొని పోవుదురు. అప్పుడు ముప్పది యేండ్ల యీడుగల పొట్టిదొకతె ముందునకు వచ్చి ముక్కుమీఁద వ్రేలువైచికొని "ఓసీ ! వెంకమ్మా ! రాత్రి శేషమ్మను మగఁడు కొట్టినాఁడట ! విన్నావా?"

వెంకమ్మ—"దానిని మగఁడెప్పుడును అలాగుననే కొట్టుచుండును. నెల దినముల క్రింద కఱ్ఱపుచ్చుకొని కొట్టినప్పుడు, చేతిగాజులన్నియు పగిలిపోయినవి."

పొట్టి—"దానిని మగఁడు తిన్నగా ఒల్లదఁట" అని బుగ్గను చేయి పెట్టుకొని "ఓసీ ! ఓసీ ! అతఁడు ముండనుంచుకొన్నాఁడఁట సుమీ."

బట్టతల ముత్తైదువ యొకతె చేతులు త్రిప్పుకొనుచు ముందునకు వచ్చి "సరి సరి! దాని గుణము మాత్రము తిన్ననిదా? మొన్న సుబ్బావధానుల కొడుకుతో మాటాడుచుండఁగా మగనికంటనే పడ్డదఁట! మగవాఁడేలాగున నున్నను దోషములేదు. ఆఁడుదాని గుణము తిన్నగా నుండనక్కఱలేదా?"

పొట్టి—"దాని కేమిగాని, పాపము! చిన్నమ్మను అత్తగారు లోకములో లేని కోడంత్రికము పెట్టుచున్నది. అంతేకాకుండ మగఁడింటికి వచ్చునప్పటికేవో నాలుగు లేనిపోని నేరములు కల్పించి చెప్పును. దాని మీఁద అతఁడు ప్రతిదినమును దానిని చావగొట్టుచుండును."

పదియారు సంవత్సరముల వయస్సుగల యొక చామనచాయది కన్నుల నీరు పెట్టుకొనుచు— "అత్తగారు బ్రతికియున్నచోట్ల నెల్ల నిదే కర్మము. లోకములో అత్తలెల్ల ఒకసారి చచ్చిరా"—

పొట్టి—"శేషమ్మా! నీ అత్తగారు కూడ నిన్ను చాలా బాధ పెట్టునని విన్నాను. నిజమా?"

శేష—"బాధ గీధ నాకు తెలియదు. కోఁత పడలేక చచ్చిపోవుచున్నాను; జాము తెల్లవారు లేచి యింటి ప్రాచి యంతయుఁ జేసి, అంట్లు తోమి, యింటికి కావలసిన నీళ్ళన్నియు తోడి, మడి బట్టలుదికి, ఆమె లేచువఱకు పనులన్నియు జేయుచుందును. అప్పుడు నాలుగు గడియల ప్రొద్దెక్కి లేచి కన్నులు నలుపుకొనుచు వచ్చి గరిటె నంటు వదలలేదని, వాకిటలోఁబెంట యట్టేయున్నదని తిట్ట మొదలు పెట్టును. తరువాత పేడ చేసి గోఁడమీఁద పిడకలు చఱిచి తెక్కలు విఱుచుకొని జాము ప్రొద్దెక్కి చలిది భోజనమునకు వచ్చువఱకు, "ఒకమూల తెల్లవారక మునుపే తిండికి సిద్ధపడుచుందువు పని మాత్రము ముట్టుకో"వని వంట చేసికొనుచు సాధించుచుండును. పగలు మగనితో మాటాడిన తప్పుగదా?[1] రాత్రి యందఱి భోజనములు అయిన తరువాత, అత్తగారికి కాళ్ళు పిసికి యామె నిద్రపోయిన తరువాత వెళ్ళి పడుకోబోవునప్పటికి రాత్రి రెండుయామము

1. సత్యవతీ చరిత్రం నవలలో కూడా ఆనాటి కుటుంబ జీవితంలో కోడలి కష్టాలు వర్ణితమైనవి.

అగును. పడుకొన్నది మొదలుకొని యెప్పుడు తెల్లవాఱిపోవునో, వేళకుఁ బనిగాకున్న అత్తగారెక్కడ కోపపడునో అని నిద్రలో సహిత ములికి పడుచుండును; ఎట్లు చేసినను నాకు తిట్లును దెబ్బలును తప్పవుగదా ?" అని మొగమునకు కొంగడ్డు పెట్టుకొని నేత్రముల నీరు కార్పఁజొచ్చెను.

రుక్మి—"అత్తగారికి కోపము తెప్పించకుండ జేసెడుపనిని నీవు తిన్నగానే చేయరాదా ?"

శేష—"అయ్యో! రుక్మిణమ్మా! నీ కత్తగారు లేదు గనుక నీ కీ సంగతు లేమియుఁ దెలియవు. ఎంతపని చేసినను అత్తగారి కెప్పుడును మెప్పులేదు. కల యంపి చల్లునప్పుడు చక్కగాఁ జల్లిన, "ఇల్లంతయు సముద్రము చేసినావు, జాఱి పడి చచ్చిపోనా ?" యని తిట్టును. పలుచగాఁ చల్లిన "నీళ్ళకు కఱవు వచ్చినట్లు పేణ్ణీళ్ళె చల్లినావుకా" వని తిట్టును. అడిగిన మాటలకు మాఱు చెప్పిన "నా మాట కెదురు చెప్పు చున్నావా"యని కోసి పెట్టును. బదులు చెప్పక యూరకున్న "మొద్దు లాగున మాటాడవే"మని తిట్టును. ఆమె ముండఱ ఏమిచేసినను తప్పిదమే. "ఆఁ" అన్న అపరాధము; "నారాయణా" యన్న బూతుమాట. నేను కాపురమునకు వచ్చిన నాలుగు సంవత్సరముల నుండియు వాడుకొను చున్న ఓటికుండ పగులఁగొట్టినా నని నేటివరకు తిట్టుచున్నది."[1]

పొట్టి—"అత్త పోఁగొట్టినది ఓడు గోటికుండ, కోడలు పోగొట్టి నది క్రొత్తకుండ[1] యన్న సామెత వినలేదా ?"

శేష—"నేను పడుబాధ యిప్పుడేమి చూచినారు ? నా విధవ వదినెగారు బ్రతికియున్నప్పుడు చూడవలెను. నిరుడు అమ్మవారి జాడ్యములో—దైవము కడుపు చల్లగా—ఆవిడ పోయినప్పటినుండి మూఁడు

---

1. కోడండ్రికాన్ని గూర్చి తెలుగు సామెతలెన్నో వున్నాయి. కోడలి తప్పు కొలువులోను, కూతురు తప్పు గూట్లోను; అత్త మంచీ వేము తీపూ లేవు; అంటి పేరొచ్చింది అత్తా అంటే కొలబుర్ర నా చేతిలోనే వుంది కోడలా అన్నదట; అత్తా మామల సందున (అడుగున) తిన్న కోడలు సానబెట్టిన వజ్రంలా రాణిస్తుంది; అతే అత్త, మగచే మామ, ఏలే మగడూ లేకపోతే ఆడది తన కనుక కలుసుకో మందట-ఆనాటి సాంఘిక జీవనంలో మహిళ స్థితిగతులు యీ సామెతలు తెలియ జేస్తున్నాయి.

పూటలును కడుపున కింత తిన్నగా అన్నమునైన దినుచున్నాను; ఆఁడ బిడ్డ జీవించియున్నప్పు డదియును లేదు. ఉన్న మాట చెప్పవలెను. ఎన్ని యన్నను ఇప్పుడు నా అత్తగారు అన్నము తిన్నగా తినవైతివని తిట్టును గాని తినిపోతివని తిట్టదు".

పొట్టి — "లోకములో నెటువంటివారును లేకున్న — పిండి బొమ్మనుజేసి పీటమీఁదఁబెట్టిన, ఆఁడుబిడ్డతనమున కదిరదరిపడ్డది— అన్న సామెత యూరకే పుట్టినదా ?"

ఇంతలో జపము చేసికొనుచున్న ముసలామె కొంత దూరము వచ్చి చెంబులోని నీళ్ళు పాఱఁబోసి "మీకు మాటల సందడిలో కన్నులు కనఁబడునా ? ఈవల స్నానము చేసిన వారున్నారని యయినలేదు. ఊరికే నీళ్ళు విడలుపుకొందురు. మీఁద మయిలనీళ్ళు పడి స్నానము చేసిన ముండను చచ్చినట్టు చలిలో మరల మునుఁగుచున్నాను".[1]

---

1. పంతులుగారు రచించిన 'ఆచారము' అనే ప్రహసనంలో చాదస్తపు చెంచమ్మ తన నిష్ఠాగరిష్ఠతను ఇట్లా చాటుకున్నది. మరొకావిడతో "నీవు అదృష్ట వంతురాలవు గనుక ఏదో మోస్తరుగా ఆచారం జరుపుకుంటున్నావు నాకు నట్లాగు జరుగదు. అక్కడికి నేను రోజుకు రెండువందల స్నానాలు చేస్తాను. ఈవేళ మట్టుకు ఇప్పటికి పది స్నానాలు చేసినాను. తెల్లవారి లేచి దొడ్లోకి వెళ్ళినప్పుడు కాలికిందయేదో మెత్తగా తగిలె అది యేమి గడ్డో అని తలనిండా స్నానము చేసినాను. తరువాత పాకోడు దగ్గరనుంచి వెళ్ళినప్పుడు పైటకొంగు తగిలినట్టు అనుమానం కలిగి మళ్ళీ స్నానము చేసినాను. గోదావరికి వెళ్ళి స్నానముచేసి బిందె ఎత్తుకొని వస్తూ బట్టలు వుతుక్కునే వాళ్ళనీళ్ళు పడ్డట్టు తోచి మళ్ళీ వెళ్ళి మునిగినాను. ఈలా వస్తుతూ వచ్చేటప్పుడు నీళ్ళలో కాలికేదో ఆకుతగిలె అంట తప్పేలాలు తోమే వాళ్ళు వేసిన అంటాకని నీళ్ళు పారపోసివెళ్ళి మళ్ళీ స్నానం చేసినాను. తరువాత బిందెత్తుకొని సగందూరం వచ్చేటప్పటికి ఇరవై గజాల దూరంలో మాలవాడు కనబడి, నీళ్ళు నడివీధిలో పారబోసి వాణ్ణి నాలుగు తిట్లు తిట్టి వాడి జీవానికి ఉసూరుమంటూ మళ్ళీ వెనుకకు గోదావరికి వెళ్ళి స్నానముచేసి నీళ్ళు తెచ్చుకున్నాను.... ఎన్ని స్నానాలయినవో లెక్కపెట్టినావా."

వీరేశలింగం రచించిన హాస్య సంజీవని 8 భాగాలలో ఇటువంటి ప్రహసనాలు చాలా వున్నాయి. ఆంధ్ర రచయితలనే గ్రంథంలో వీరేశలింగం పంతులు గారిని గూర్చి వ్రాస్తూ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు యీ ప్రహసన పంక్తి ఉదాహరించారు. పంతులుగారి శైలీ సారళ్యానికి, దురాచార ఖండన తత్పరత్వానికి నిదానిగా.

అని గొణుఁగుకొనుచు లోతు నీళ్ళలోనికి నడిచి బుడుగు బుడుగున నాలుగు మునకలువేసి బయలుదేఱి, మాటాడుకొనుచున్న వారివంక కన్నెఱ్ఱచేసి చూచుచు "అమ్మలక్కలు క్రిందును మీఁదను దెలియక పొంగి పడుదురు. మా కాలములోనున్న కోడం్రటికములో ఇప్పుడు సహస్రాంశము లేదు. అత్త మంచియు, వేము తీపును లేదు. ఎక్కడను అత్తలేని కోడలుత్తమురాలు కోడలులేని యత్త గుణవంతురాలు' అని సణగుకొనుచు, దోసిలితో నది లోని నీళ్ళు మూఁడు సారులు గటునపోసి, కొంచెము దూరము పోయిన తరు వాత మరల మూఁడు మాఱు లాత్మప్రదక్షిణములుచేసి మెట్టెక్కి యదృశ్యు రాలయ్యెను.

శేషమ్మ—నాలుగువంకలుజూఁచి వడవడ వడఁకుచు "అమ్మలారా! నేనీలాగున అన్నానని మీరెవ్వరితోనైన ననెపరుసుండీ! మా అత్తగారు విన్న నన్ను చంపివేసి పోవును. ఈవఱకే నాకు గతులు లేకుండ నున్నవి. ఇది విన్న బొత్తిగానే యుండవు. వెంకమ్మ తల్లీ! ఈ బ్రతుకు బ్రతుకుట కంటె గోదావరిలో పడిన బాగుండునని తోఁచుచున్నది" అని వలవల నేడ్వఁ జొచ్చెను.

వెంకమ్మ— "ఊరుకో! ఊఱుకో! అటువంటి అవాచ్యము లెప్పు డును పలుకరాదు. పడ్డవాండ్రెప్పుడును చెడ్డవాండ్రు కారు" అని యూరడించుచున్నది.

శేషమ్మ— ఆ మాటలతో దుఃఖము మాని "గోదావరికి వచ్చి చాల సేపయినదమ్మా! ఇంత సేపేమి చేయుచున్నావని అత్తగారు చంపివేయును. వేగిరము పోవలెను" అని వేగముగా నీళ్ళు ముంచుకొని బిందె బుజముమీద నెత్తుకొని గట్టునకు నడచుచున్నది.

అప్పుడే నీళ్ళకు వచ్చినవారిలో ఇరువదియేండ్ల ప్రాయముగల యొకతె చేరువనున్న మఱియొకతె మెడ దగ్గరకు చేయి పోనిచ్చి, "కాంతమ్మా. ఈ పట్టెడ క్రొత్తగా చేయించుకొన్నావా, నీకేమి? నీవు అదృ ష్టవంతురాలవు గనుక తల మొదలుకొని పాదముల వఱకు నీ మగఁడు నీకు నగలు దిగవేయుచున్నాఁడు."

కాంత—"నిన్ననే కంసాలి సుబ్బయ్య చేసి తెచ్చినాఁడు. నాలుగు పేటల పలకసరులుకూడ చేయుచున్నాఁడు. పేరమ్మా! నీ మగనికి నీ మీఁద బహుదయ అని విన్నాను, నిజమేకదా!

పేర—ఎందుకు వచ్చిన దయ? సంవత్సరమున కొక్క పర్యాయ మయినను పట్టుమని పదివరహాల నగ చేయించిపెట్టుట లేదుగదా? పూర్వ జన్మమునందు చేసికొన్న పాపముచేత నాకీజన్మమందు ఇటువంటి-

అప్పుడు ప్రక్కను నిలుచున్న మఱియొకతె—పేరమ్మా! నీవు వృధాగా లేనిపోని వ్యసనము తెచ్చిపెట్టుకొనుచున్నావు. నీ కేమయిన అన్న మునకు తక్కువయినదా? బట్టకు తక్కువయినదా? మహారాజువలె మగఁడు తిన్నగా చూచునప్పుడు నగలు లేకపోయిననేమి? మగనికి ప్రేమ లేకపో యిన తరువాత, దిక్కుమాలిన నగలెందుకు? వట్టి మోతచేటు, చూడు, మన గ్రామములో బంగారమ్మకు శరీరమునిండ నెన్ని నగలున్నవో! ఆ నగల పేర్లే కొన్ని నేను వినలేదు. దీపములు పెట్టగానే వెళ్ళి దాని మగఁడు భోగముదాని యింటిలోఁ గూరుచుండును. దానికేమి సుఖమున్నది? నీ మగఁ డెప్పుడును చీఁకటిపడ్డ తరువాత గుమ్మము దాఁటడు.[1]

పేర—నీవు చదువుకొన్న దానవుగనుక, కావలసిన శ్రీరంగ నీతులు చెప్పఁగలవు. నీకువలె మాకెవ్వరికి ఇటువంటి వేదాంతము తెలి యదు. నలుగురును నగలు పెట్టుకొని వచ్చినప్పుడు, వట్టి మోడులాగున

---

1. ఆనాటి కొందరు న్యాయవాదులను గూర్చి పంతులుగారు స్వీయచరిత్రలో ఇట్లా ప్రస్తావించారు. "రాత్రి భోజనములయిన తరువాత కాదు స్వగృహముల యందు దొరకరు. వారినప్పుడు సందర్శింపవలెనన్న పక్షమున వేశ్యా గృహముల లోనే వెదకవలెను. తాము వేశ్యల ఇండ్ల నుండి శృంగార వేషములతో వచ్చు చుండగా నా కంటబడుట నాకవమానకరమని యెంచి పగలు పదిగంటలకు నేను పాఠశాలకు నడచిపోవుచుండునప్పుడు నా రాక వేచియుండి పాచిముఖములతో తాంబూలము నములుచు భోగముదాని యింటినుండి రావలెనని పూర్వము నాకెదురు పడుచుండిన మహానుభావులు వారిలో నొకరిద్దరుండిరి."

మొదటిభాగము, మూడవప్రకరణము,
పుట 87, 1982 ముద్రణం.

ఎక్కడికయినను పేరంటమునకు వెళ్ళుటకు నాకు సిగ్గగుచున్నది జాన కమ్మా! నీకు నా మగనివంటి బీదవాడు—

జాన—పేరమ్మ తల్లీ! నేనేమో తెలియక అన్నాను కోపపడకు. అని బిందె ముంచుకొని వెళ్ళిపోవుచున్నది.

తక్కినవారందఱును నీళ్ళు ముంచుకొని వెనుకనే బయలుదేఱి "ఓసీ. పూజారిపాపమ్మ చెంపకొప్పు పెట్టుచున్నది" "కరణము పెండ్లా మెంతయొయ్యారముగా నడుచునో చూచినావా" "అయ్యగారి రామమ్మ కేమిగర్వమోకాని మనుష్యులతో మాటాడనే మాటాడదే" "పుల్లమ్మ పట్ట పగలే మగనితో మాటాడునఁట !" "కనకమ్మది కొంచెము మెల్లకన్ను సుమీ" "కరణమువారి సీతమ్మకు నగలే లేవే" అని పరులమీఁది దోష ముల నెన్నుకొనుచు మెట్లెక్కి యిండ్లకు నడిచిరి. విద్యాగంధమే యెఱుఁ గని మూఢ వనితలకు మాటాడుకొనుట కంతకన్న మంచి విషయములేమి దొరుకును ? అక్కడకు వచ్చెడి స్త్రీలు సాధారణముగా సంభాషించెడి యితర విషయములు సవతుల పోట్లాటలును, మాఱుతల్లుల దుర్మార్గము లును, మగల యనాదరణమును మొదలైనవి తప్ప మఱియేమియు నుండవు.

అప్పుడు కుడిచేతిలో తాటాకులమీఁద వ్రాసిన పంచాంగమును బట్టుకొని, నీర్కావిదోవతి కట్టుకొని, మడతపెట్టిన చిన్న యంగవస్త్ర మొకటి బుజముమీఁద వేసికొని, మొగమునను దేహమునను విభూతి పెండెకట్లు స్పష్టముగా గానుపింప, నిమ్మకాయ అంతలేసి రుద్రాక్షలుగల కంఠమాల ప్రకాశింప, రొంటిని బెట్టుకొన్న పొడుముకాయ చిన్న కంతి వలెఁ గనఁబడ, గట్టుమీఁది నుండి పోవుచు గోదావరిలో స్నానము చేయు వారెవ్వరోయని కనులకు చేయి యడ్డము పెట్టుకొని నిదానించి చూచి, గిరుక్కున మళ్ళి యొక బ్రాహ్మణుఁడు మెట్లు దిగివచ్చెను.

బ్రాహ్మణుఁడు — "రుక్మిణమ్మగారూ ! సంకల్పము చెప్పెదను స్నానము చేయండి."

రుక్మి—'నేను డబ్బు తీసుకొనిరాలేదే'.

బ్రా—దబ్బుకేమి? మధ్యాహ్న మింటివద్ద నిత్తురుగానిలెండి; (అని వంగి నిలుచుండి) ఆచమనము చేయండి. కేశవా—నారాయణా—మాధవా—గోవిందా—తూర్పు మొగముగా తిరుగండి. సూర్యునికేసి.

రుక్మి—స్నానము చేయవలెనా ?

బ్రా—'సంకల్పము చెప్పనిండి' అని పొడుముబుఱ్ఱను రొంటి నుండి తీసి రెండుమాఋలు నేలమీఁది మెల్లగాఁగొట్టి యెడమచేతిలో కొంత పొడుము వేసికొని మరల నెప్పటియట్ల మూఁతవేసి కాయను రొంటిని ధోవతిలో దోపుకొని యెడమ చేతిలోనున్న పొడమును బొటనవ్రేలితోను చూపుడువ్రేలితోను పట్టగలిగినంత పెద్ద పట్టునుపట్టి బుఱ్ఱనపీల్చి రెండు ముక్కులలోను ఎక్కించి, మిగిలినదానిని రెండవపట్టుపట్టి చేతిలో నుంచుకొని, ఎడమచేతిని కట్టుకొన్న బట్టకు రాచి ముక్కు నలుపుకొని, 'శుభే శోభన ముహూర్తే శ్రీ మహావిష్ణురాజ్ఞేయ - ప్రవర్తమానస్య - ఆద్య బ్రహ్మణః-ద్వితీయ ప్రహరార్థే-శ్వేతవరాహకల్పే-వైవస్వతమన్వంతరే - కలియుగే-ప్రథమపాదే - జంబూద్వీపే-భరతవర్షే భరతఖండే - అస్మిన్ వర్తమానే వ్యావహారిక చాంద్రమానేన - కాళయుక్తి నామ సంవత్సరే-[1] దక్షిణాయనే - శరదృతౌ-కార్తికమాసే-కృష్ణపక్షే-ద్వాదశ్యాం - ఇందువాసరే-శుభనక్షత్ర శుభయోగ శుభకరణాద్యనేక గుణ విశిష్టాయాం మాస్యాం శుభతిథౌ-క్షేమస్థైర్య విజయాయురారోగ్యైశ్వర్యాభివృద్ధ్యర్థం - అఖండ గౌతమీస్నానమహంకరిష్యే - మూడుమాఋలు స్నానము చేయండి.

రుక్మిణి, తఋుచుగా స్నానము చేయునదికాదుగాన లోఁతు నీళ్ళలోనికి వెళ్ళుటకు భయపడి, మునుఁగుటకు చేఁతగాక మోకాలిలోఁతు నీళ్ళలోఁ గూర్చుండి కొప్పు విప్పుకొని దోసిలితో తలమీఁద నీళ్ళు పోసి

---

1. 1858 వ సంవత్సరం కాళయుక్తి అయింది. వీరేశలింగం పంతులుగారి తప్పటికి పదేళ్ళు.

రాజశేఖరుడిగారి వృత్తాంతం 2 వందల సంవత్సరాల నాటిదని చివరి ప్రకరణంలో చెప్పారు రచయిత. వాస్తవికత కోసం ప్రతి చిన్న అంశాన్నీ పాత చిత్రణలో సమన్వయింప చేశారు పంతులుగారు.

కొనుచుండెను. అప్పుడు సంకల్పము చెప్పిన బ్రాహ్మణుడు డబ్బు నిమిత్తము తరువాత వచ్చెదనని చెప్పి వెడలిపోయెను. అంతట రుక్మిణి బట్టకొంగుతో తలతుడుచుకొని, శిరోజములు చివర ముడివైచుకొని గట్టు వంకఁజూసి దూరమునుండి వచ్చుచున్న తండ్రిగారిని జూచి వేగిరము బయలుదేఱి, రాతిమీఁద బెట్టిన కుంకుమ పొట్లమును దీసి నొసట బొట్టు పెట్టుకొని, రెండుమాఱులు చేతిలో నీళ్ళు చెంబుమీఁద పోసి తీసికొని, రెండడుగులు నదిలోనికిఁబోయి నీళ్ళు ముంచుకొని, బట్ట తిన్నగా సవరించుకొని, ఉతికిన బట్టలు బుజముమీఁదను వానిపయిని నీళ్ళతో నున్న బిందెయును పెట్టుకొని తన కొఱకయి కనిపెట్టుకొనియున్న సిద్ధాంతిగారి భార్యతోఁగూడ గృహమునకు బోవ బయలుదేరెను.

# మూడవ ప్రకరణము

రుక్మిణి యింటికిఁబోవుట—గృహ వర్ణనము—రాజశేఖరుఁడుగారు వచ్చి కచేరి చావడిలోఁగూర్చుండుట—బంధుదర్శనము—స్వహస్తపాకియైన వైశ్వదేవవరుఁడు.

సిద్ధాంతిగారి భార్యయు రుక్మిణియు బయలుదేఱి సోపానములెక్కి వీథి పొడుగునను దేవాలయముదాఁక తిన్నగా నడిచి, అక్కడనుండి కుడిచేతి వంకనున్న వీధిలోనికి మళ్ళి, కొంతదూరము పోయిన తరువాత రుక్మిణి తూర్పువైపు సందులోనికి రెండడుగులు పెట్టి నిలుచుండి వెనుక తిరిగి రెండుమాఱులు మెల్లగా దగ్గెను. ఆ దగ్గుతో సిద్ధాంతిగారి భార్య కూడ నిలుచుండి 'అమ్మాయీ! నేనుందునా?' అని వెనుక తిరిగి పలికెను.

రుక్మి—మంచిది, సోమిదేవమ్మగారూ! నా కొఱకయి మీరు చుట్టు తిరిగి యింటికి వెళ్ళవలసి వచ్చినదిగదా ?

సోమి—ఎంతచుట్టు? నిముషములో వెళ్ళెదను.

రుక్మి—'పోయిరండి'

సోమి—బీదవాండ్రము; మామీఁద దయయుంచవలెను సుండీ.

రుక్మి—'దానికేమి? వెళ్ళిరండి' అని నాలుగడుగులు నడచి మరల వెనుక తిరిగి 'సోమిదేవమ్మగారూ! చెప్ప మరచిపోయినాను. సాయంకాలము దేవాలయము లోనికి వెళ్ళునప్పుడు మీ రొక్క పర్యాయము వచ్చెదరు కాదా?

సోమి—అవశ్యము. అలాగుననే వచ్చెదను; నేను పోయివత్తునా?

అని సోమిదేవమ్మ నడచినది. సిద్ధాంతిగారు గాని, ఆయన పెద్దలు గాని యెప్పుడును .యజ్ఞము చేసినవారు కాకపోయినను, సోమిదేవమ్మ

పుట్టినింటివంక వారిలో మాత్రము యజ్ఞము చేసినవారు బొత్తిగా లేక పోలేదు. సాక్షాత్తుగా ఆమె పితామహుఁడే యజ్ఞముచేసి యేఁటేఁట నొక్కొక్కటి చొప్పున మూఁడుపదులమీఁద నాలుగు శ్రావణ పశువులను పట్టి మంచి రంభాదులతో స్వర్గసుఖ మనుభవింపఁబోయెను. సోమిదేవమ్మ తండ్రి యజ్ఞము చేయకపోయినను, తండ్రి యెంతో ధనవ్యయము చేసి సంపాదించుకొన్న పేళ్ళనుమాత్రము పోగొట్ట నిష్టములేనివాఁడయి తన కుమారునకు సోమయాజులనియు; కుమార్తెకు సోమిదేవమ్మ యనియు నామకరణములు చేసెను. రుక్మిణియు సందులో నూఱుబాఱలు నడచి; అక్కడినుండి దక్షిణముగా తిరిగి, ఆ సందులో రెండు గుమ్మములు దాఁటి పెరటి దారిని మూడవ యిల్లు ప్రవేశించెను.

రాజశేఖరుఁడుగారి యిల్లు ఆ కాలపుటిండ్లలో మిక్కిలి సుందరమైనది.[1] వీధి గుమ్మమునకు రెండు ప్రక్కలను రెండు గొప్ప అరుగులు కలవు. ఆ రెండు అరుగులకును మధ్యను పల్లముగా లోపలికిఁబోవు నడవ యున్నది. ఆ నడవ మొగమున సింహద్వార మున్నది. ద్వార బంధపు పట్టెలకు గడపదాపున ఏనుఁగు తలమీద సింహము గూర్చుండి కుంభస్థలమును బద్దలు చేయుచున్నట్లు చిత్రముగా చెక్కఁబడి యున్నది. ఇరుప్రక్కలనుండు నా సింహములయొక్క శిరోభాగములు మొదలుకొని గొడుగుబల్ల పలకును పువ్వులను కాయలను గల లత చెక్కఁబడి యున్నది. ఈ కమ్ములకు పయిగా రెండు ప్రక్కలను కఱ్ఱగుఱ్ఱములు వీధి వైపునకు ముందటికాళ్ళు చాచి చూచువారిమీఁద దుముకవచ్చునట్లుగాఁ

1. "నా రాజశేఖర చరిత్రము నందలి రాజశేఖరుడిగారి గృహవర్ణన యించుమించుగా మా గృహవర్ణనమే."

స్వీయ చరిత్రము - మొదటి భాగము;
మొదటి ప్రకరణము:
పుట 3, 1982 వ ముద్రణం.

వాస్తుశాస్త్ర ప్రకారంగా ఇటువంటి యిల్లు ఎక్కడా వుండదు. ఉండటానికి వీల్లేదు అని కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు ఆక్షేపించారు, వివేక చంద్రికా విమర్శనంలో (1896). దాన్ని దృష్టిలో పెట్టుకొని పంతులుగారు స్వీయ చరిత్రలో యీ ప్రస్తావన తీసుకొని వచ్చినట్లు అనుకోవచ్చు.

కనిపించును. ఈ గుజ్జములకాళ్ళకే శుభ దినములందు మామిడాకుల తోరణములు గట్టుచుందురు. గుజ్జముల రెంటికిని నడుమనుండు గొడుగు బల్ల మీఁద నడుమను పద్మముల కిరుపార్శ్వములను గుజ్జముల వలెఁ జిత్రములయిన యాకులను పువ్వులను గల తీఁగెపైని కాళ్ళమోపి ఫలములను ముక్కుతో పొడుచుచున్నట్లు నడుమ నడుమ చిలుకలు చిత్రింపఁబడియున్నవి. వీథి తలుపులకు బలమయిన గ్రంథులు చేయఁబడి వాని పయిని సహిత మొక విధమయిన పుష్పలత మలఁచబడి యున్నది.

గుమ్మము దాటి లోపలికి వెళ్ళిన తోడనే చావడి యుండెను. ఆ చావడి కెదురుగా పెద్దకుండు ఒకటి యుండెను. వర్షము కురియునప్పుడు నాలుగు వైపులనుండియు చూరు నీళ్ళాకుండులోఁ బడి వీధిచావడి క్రింద నుండు తూము గుండ వీధిలోనికిఁ బోవును. ఆ కుండున కుత్తరపు వైపునను దక్షిణపు వైపునను ఒకదాని కొకటి యెదురుగా రెండు చావళ్ళుండెను. అందు దక్షిణపుది కచేరిచావడి. దానిలో వివాహాదులయందు తాంబూలములకు పిలిచిన బంధువులును పెద్దమనుష్యులును సభచేసి గూర్చుండగా, క్రింద భోగము మేళము. జరుగుచుండును. ఇతర సమయములలో పెద్ద మనుష్యులు చూడ వచ్చినప్పుడును, మధ్యాహ్న భోజనమయిన తరువాత పురాణ కాలక్షేపము జరుగునప్పుడును, శిష్యులప్పుడప్పుడు చదువుకో వచ్చినప్పుడును రాజశేఖరుఁడు గారందు కూర్చుందురు. ఆ చావడికి రెండు ప్రక్కలను రెండు గదులు గలవు. ఆ చావడి దక్షిణవైపు గోడకు పొడుగునను రెక్కల తలుపులుండి, తీసినప్పు డెల్లను సభవారి చెమటలార్చు మలయమారుతమును లోపలికిఁ బంపుచుండును. ఆ తలుపులకు వెనుక పంచపాళియు, దాని వెనుక పలు విధములయిన, పూలమొక్కలతో నేత్రములకు విందుకొలుపు చిన్నదొడ్డి యుండెను. ఆ చావడిలో మూఁడు గోడలకును నిలువె డెత్తులకు పయిని మేకులకు గొప్ప పటములు వేయఁబడి యున్నవి. అందు దశావతారములును మాత్రమేకాక, కృష్ణుఁడు గోపికల వలువలు నెత్తికొనివచ్చి పొన్నచెట్టుమీఁదఁ గూర్చుండి వారిచేఁ జేతులెత్తి మ్రొక్కించుకొను చున్నట్లును, వెన్నలు దొంగిలినందుకయి తల్లి రోటను గట్టిపెట్ట దాని నీడ్చుకొనిపోయి మద్దులఁ గూల్ద్రోచినట్లును, మఱియు ననేకవిధముల కృష్ణలీలలుగల పటములును, కుమారస్వామి

తారకాసురుని జంపుచున్నట్లును, పార్వతి మహిషాసురుని వధించు చున్నట్లును, శివుఁడు త్రిపుర సంహారమును చేయుచున్నట్లును నున్న శివ సంబంధములయిన పటములును, విఘ్నేశ్వరుఁడు, సరస్వతి, గజ లక్ష్మి, చతుర్ముఖుఁడు మొదలగుగాఁగల మఱికొన్ని పటములును గోడల నలంకరించుచుండును. ఉత్తరపుప్రక్క చావడి మాత్రమే యుండి, అది తరుచుగా మూయఁబడి యుండును. ఈ చావడిలో రెండుమూడు పెట్టె సవారీ లెప్పుడును వ్రేలాడఁగట్టఁబడియుండును. రాజశేఖరుఁడుగా రప్పు డప్పుడు గ్రామాంతరములకుఁ బోవునప్పుడును పెద్దమనుష్యు లెవ్వ రయినఁ దఱచుగా నెర వడుగునప్పుడును ఉపయోగపడుచుండును. క్రొత్తసవారి మాత్రముఁ బురకా వేయబడి చావడిలో క్రిందనే పడమటి గోడ దగ్గఱఁ జేర్చబడి యుండును. ఈ చావడి గోడకున్న తలుపుతీసి యుత్తరపు పంచపాళిలోనికి పోయినతోడనే దొడ్డిలో నుయ్యి యొకటి కనఁబడును. ఆ నూతిపయి నుండుగిలకలు కీచుధ్వని చేయుచుండ నిరుగు పొరుగులవారు సదా నీళ్ళు తోడుకొని పోవుచుందురు. ఆ నూతికి పడమటి వైపున ధాన్యము నిలువచేయు గాదెలు రెండు, లోగిలిని చేరక ప్రత్యేక ముగాఁ గట్టింపబడి యున్నవి. నూతికి సమీపముగా వీధిలోనికి పాణిద్వార మొకటి యున్నది. ఇంతకు మునుపు రుక్మిణి వచ్చిన దా ద్వారముననే. ఇరుగుపొరుగువారు వచ్చి నీళ్ళు తోడుకొని పోవుచుందురు. మఱియు మధ్యాహ్న సమయమున చుట్టుప్రక్కలనుండు స్త్రీలు వారిని చూడవచ్చి నప్పుడును, రాజశేఖరుఁడుగారు కచేరీ సావడిలోఁ గూర్చున్న కాలమున లోపలియాఁడువారు వెలుపలికి వెళ్ళవలసినపుడును ఆ త్రోవనే వచ్చుచుఁ బోవుచుందురు.

లోపలికుండునకు నాలుగు ప్రక్కలను పనసకాఁయలు చెక్కిన నాలుగు స్తంభము లున్నవి. వీధి చావడి కెదురుగా నుండు పడమటి చావడిలో లోపలికి పోవు నడిమిగుమ్మ మొకటి యున్నది. ఆ గుమ్మమున లోపలికిఁ బోవఁగానే చావడి యొకటి కనిపించును. ఆ చావడికి దక్షిణ వైపున గుమ్మమొకటి యున్నది. ఆ ద్వారము లోపలికి వెళ్ళిన రాజశేఖ రుఁడుగారు పరుండుగదిలోఁ బ్రవేశింతుము. గదిలో నుత్తరపుగోడ పొడుగునను దూర్పునుండి పడమటకు పందిరిపట్టెమంచము రాతిదిమ్మల

మీఁద నాలుగు గానుగను మోపి వేయబడియున్నది. మంచమునకు చుట్టును దోమతెరయును జాలరును దిగవేయఁబడి యున్నది. పందిరి స్తంభములకు నడుమను లక్క పూసిన కొయ్య పళ్ళెములును బరిణెలు నుండును. పందిరికి మధ్యగా లక్క కాయలును నువ్వులునుగల చిలకల దిరి యొకటి వ్రేలాడుచుండును. గోడలకు సుద్దతో వెల్లవేయఁబడి యుండెను. గోడల పొడుగునను రుక్మిణియు తల్లియు నోపిక చేసి కుట్టిన గోడసంచులు తగిలించఁబడి యుండెను. ఆ గోడసంచులకు కొంచెము మీఁదుగా గుడ్డచిలుకలు దారములతో త్రాళ్ళకు కట్టఁబడి గాలికి సుందర ముగా కదలుచుండును. గోడకు పెద్ద మేకులు కొట్టి వానిమీఁదఁ బెట్టిన బల్లమీఁద కొండపల్లి బొమ్మలను లక్క పిడతలును గది కలంకార భూత ముగా నుండెను. గోడసంచులు కొట్టినమేకులకు దశావతారములు మొద లయిన పటములు చిన్నవి వేయఁబడియున్నవి. దక్షిణపుగోడకు శ్రీరాముల వారి పట్టాభిషేకము తగిలింపఁబడియున్నది. దానినే రాజశేఖరుఁడుగారు నిద్రలేచిన తోడనే చూచి, అవల మఱియొక వస్తువును జూతురు. గదికి నాయిని అందమయిన బల్లకూర్పు కూర్చఁబడి యుండెను. మంచమున కెదురుగా దక్షిణపుగోడ పొడుగునను గడమంచెమీద వరుసగా కావడి పెట్టెలు పెట్టఁబడి యున్నవి. ఆ పెట్టెలలో సాధారణముగా ధరించుకొను వస్త్రములును నాగరలిపితో బంగాళాకాగితముల మీఁద వ్రాయఁబడిన రాజశేఖరుఁడుగారి సంస్కృత పుస్తకములును వేయఁబడి యుండెను. గదిలో పడమటిగోడతట్టున పెద్దమందస మొకటి గట్టితాళము వేయఁబడి యుండెను. ఆ మందసము లోపలనున్న చిన్న తాళపుపెట్టెలలో నగ లును పండుగదినములలో ధరించుకొను విలువ బట్టలను రొక్కమును నుండును. చీఁకటి రాత్రులలో దొంగల భయము విశేషముగా నుండు నప్పుడు రాజశేఖరుఁడుగారు ఆ మందసము మీఁదనే పఱపు వేయించు కొని పరుండుదురు. మందసమునకును కావడి పెట్టెలున్న గడమంచెకును మధ్యను దక్షిణపువైపున గదిదొడ్డిలోనికి బోవుమార్గమొకటి కలదు. ఆ మార్గమున దొడ్డిలో ప్రవేశించిన తోడనే విశాలమయిన చేమంతిమడి యొకటి పచ్చని పూవులతోను మొగ్గలతోను నేత్రోత్సవము చేయు చుండెను. దాని కెడమ ప్రక్కను గొంచెము దూరమున మల్లెతీగలు

పందిరిమీఁద నల్లుకొని యకాలమగుటచే నప్పుడు పుష్పింపకపోయినను పచ్చని కాంతులనీనుచు మనోహరముగా నుండెను.

రాజశేఖరుఁడుగారి పడకగది ముందఱి చావడిలో దూలమునకుఁ జిలుక పంజర మొకటి వ్రేలాడఁగట్టబడి యుండెను. అందులో నున్న చిలుక సదా 'ఎవరువారు' 'ఎవరువారు' 'పిల్లివచ్చె కొట్టు కొట్టు' 'కూరోయి తోటకూర' మొదలగు మాటలను సహజ మధుర స్వరముతో పలుకుచుండును. ఆ దూలమునకే మఱికొంత దూరమున రామాయణము మొదలయిన తాటాకుల పుస్తకములు త్రాళ్ళతో వ్రేలాడఁ గట్టబడి యుండెను. ప్రొద్దుననే నిద్రలేచి రుక్మిణి చిలుకను పంజరమునుండితీసి చేతిమీఁదనెక్కించుకొని "చేతిలో వెన్నముద్ద" మొదలుగాఁ గల పద్యములను సహితము నిత్యమును నేర్పుచుండును. ఆ కాలమునఁ దఱచుగా స్త్రీలు చదువుకొను నాచారము లేకపోయినను, రాజశేఖరుఁడుగారు తన కుమార్తె మీఁది ముద్దుచేతఁదానె రుక్మిణికి క్రొత్త పుస్తకమును అన్యసాహాయ్యము లేకుండ నర్థము చేసికొను శక్తిగలుగునంతవఱకు విద్యను చెప్పెను. ఆమె స్వభావము చేతనే తెలివిగలదగుటచే విద్యకూడ దానికి సాయమయి చిన్నతనములోనే యుక్తాయుక్త వివేకమును జ్ఞానమును కలది యాయెను.[2] తండ్రి యామెకు చదువు చెప్పట చూచి యసూయచేత నిరుగుపొరుగులవారు చాటున గుసగుసలాడుకొనిరిగాని రాజశేఖరుఁడుగారు ధనికులగుటవలన నేమియుఁ బలుక సాహసింపకపోయిరి. అట్లని వారు బొత్తిగా

---

1. చేతిలో వెన్నముద్ద చెంగల్వ పూదండ
బంగారు మొలత్రాడు పట్టుదట్టి
సందె తాయెతులును సరిమువ్వగజ్జలు
చిన్నికృష్ణా నిన్ను నే చేరి కొలుతు

పూర్వ కాలం వీధి బడులలో ఇలాంటి ముక్తక పద్యాలు చెప్పుతుండేవారు పిల్లలకు.

2. స్త్రీ విద్య పట్ల పంతులుగారికి చాలా అభిమానం. 25 సం॥ల వయస్సులోనే స్త్రీ విద్యను సమర్థిస్తూ వీరేశలింగం (1873) పురుషార్థ ప్రదాయిని పత్రిక లోను, కొక్కొండ వారి ఆంధ్ర భాషా సంజీవినిలోను జరిగిన వాద వివాదాల్లో పాల్గొన్నారు. చంద్రమతీ చరిత్రమనే పెద్దకథలో స్త్రీలు నేర్చుకోవలసిన విషయాలన్నీ చంద్రమతి తన గురువుగారి నుంచి తెలుసుకున్నట్లు వర్ణించారు.

నూరుకున్నవారు కారు. పెద్దవాఁడని రాజశేఖరుఁడుగారు గౌరవముతోఁ జూచుచుండెడి యొకయావృద్ధుని మెల్లగా బ్రేరేపించి, ఆయనచేత అందఱును సభలోఁ గూర్చుండియుండగా "నాయనా! మన యింట ఆడు పిల్లలను జదివించు సంప్రదాయములేదే. మన రుక్మిణి నేల చదివించె దవు?" అనిపించిరి. రాజశేఖరుఁడుగారు విద్యవలని లాభముల నెఱింగిన వాఁడగుటవలనను స్త్రీ విద్య యే శాస్త్రమునందును నిషేధింపఁబడి యుండక పోవుటయు, పూర్వము పతివ్రతలందఱు విద్యావంతులయి యుండుటయు నెఱిగినవాఁడగుటవలనను ఆ వృద్ధుని వాక్యములను లక్ష్యముచేయక స్త్రీ విద్యాభ్యాసమున కనుకూలముగాఁ గొన్ని స్మృతి వాక్యములను జదివి మీ యభిప్రాయ మేమని సభలోనున్నవారి నడిగెను. వారందఱును మనసులో స్త్రీ విద్యయన్న నేవగించువారే యయినను రాజశేఖరుఁడుగారి యభిప్రా యము తెలిసిన పిమ్మట దానికి వ్యతిరిక్తముగా నేమియు జెప్ప నలవాటు పడినవారు కారు గావున స్త్రీ విద్యాభ్యాసము వలన గణనాతీతము లయిన లాభములు గలవని పొగడి రుక్మిణికి విద్య నేర్పుచున్నందునకయి రాజ శేఖరుఁడుగారిని శ్లాఘించిరి.

చిలుకపంజర మున్నతావునుండి నాలుగుబారలు నడిచిన తరువాత పడమటింట ద్వారమున్నది. పడమటియిల్లు విశాలమయి యేఁబదిమంది బ్రాహ్మణులు భోజనములు చేయుటకుఁ జాలియుండును. ఇంకఁ గొంచెము సేపునకు భోజనములకు లేతు రనఁగా వెళ్ళి చూచినయెడల మూఁరెడు మూరెఁడెడముగా రెండుగోడల పొడుగునను పీఁటలును పీఁటలకు ముందఱ పిండిముగ్గుతో పెట్టిన పట్టును చాలుగానుండును. పడమటింటి ఈశాన్య మూలను గచ్చుతో గట్టిన దేవునరుగు కలదు. ఆ యరుగుపయిని 'భువనేశ్వర' మను దేవతార్చన సామానులు సాలగ్రామాదులును పెట్టు పెట్టె యుండును. ఆ పెట్టెమీఁదనే రాజశేఖరుఁడుగారు మడితో నిత్యమును పారాయణచేయు శ్రీమద్రామాయణము సుందర కాండము పెట్టబడి

యుండెను.[1] రాజశేఖరుఁడుగారు స్నానముచేసివచ్చి దేవునరుగుముందఱ పీఁట వేసికొని కూర్చుండి రామాయణమును పంచపూజయు చేసికొందురు. దేవునరుగున కెదురుగా సన్న తలుపు తీసికొని యావలకు వెళ్ళినచో నొక పెరటిలోనికిఁ బోవుదుము. అక్కడ సున్నముతోను ఇటికలతోను కట్టిన తులసికోట యొకటి నాలుగయిదడుగుల యెత్తున నందమై యుండెను. ఆ కోటలోపల లక్ష్మీ తులసియు కృష్ణ తులసియు శ్రద్ధాభక్తులతోఁ బెంపబడు చుండును. ఆ సమీపముననే కొంచెము దూరమున తులసివనమును, ఆవల నిత్తెమల్లి చెట్టును, వాని చేరువనున్న నందివర్ధనపు చెట్టు మీఁదనల్లుకొన్న కాశీరత్నములును రాజశేఖరుఁడుగారికి నిత్యమును దేవతార్చనకయి పుష్ప పత్రాదులను సమకూర్చుచుండెను. అవ్వైని రుక్మిణియుఁ జెల్లెలును ప్రేమతో బెంచుకొనుచున్న బంతి చెట్లును, బొగడబంతిచెట్లును, చంద్రకాంతపు చెట్లును గోడ పొడుగునను వరుసగా నుండును. పడమటింటివంటిదే దక్షిణపువైపునున్న వంటయింటి దొడ్డిలోపల నరఁటిబోదెలు పిలకలతో నిండియుండి చూడ పండువుగా నుండును. రాజశేఖరుఁడుగారు ప్రత్యహ మును ఆ బోదె మొదలనె స్నానము చేయుదురు.

వెనుక చెప్పిన చొప్పున రుక్మిణి స్నానముచేసి వచ్చి గోదావరి నుండి చెంబుతోఁ దెచ్చిన నీళ్ళను తులసికోటలోఁ బోసి మ్రొక్కి, తడి బట్టలతోనే చుట్టును మూఁడు ప్రదక్షిణములుచేసి, లోపలికిఁబోయి తడిబట్ట వదలి పట్టుబట్ట కట్టుకొని యొకచేతిలోఁ గుంకుమ భరిణియు రెండవ చేతిలో పళ్ళెములను బసుపును బియ్యపుపిండియును గల గదులపెట్టెయును బట్టు కొనివచ్చి, తులసికోటతో నంటియున్న ముందరివేదిక మీఁద నీళ్ళు చల్లి చేతితో శుభ్రముచేసి బియ్యపుపిండితో పద్మములు మొదలయిన వింత

1. తమ తాతగారిని గురించి వీరేశలింగం పంతులుగారు స్వీయ చరిత్రలో ఇట్లా వ్రాసుకొన్నారు.

"వారు ధనకాములుగాక కీర్తికాములయి పండితుల నాదరించియు దాన - ధర్మములు చేసియు విశేష యశోధనమును సంపాదించినవారు. ఆయన యొద్ద పురాణము చెప్పెడు శాస్త్రుల యొద్దనే నేను కాళిదాసత్రయమును జదివినాడను.

స్వీయ చరిత్ర మొదటి భాగము,
మొదటి ప్రకరణం, పుట 10, 1982 ముద్రణం.

వింతల ముగ్గులను బెట్టుచు నడుమ నడుమఁ జిత్రముగా గుంకుమతోను పసుపుతోను నలంకరించుచుఁ గూర్చుండి, మధుర స్వరముతో మెల్లగా 'లంకాయాగము'ను పాడుకొనుచుండెను.[1]

ఈ లోపుగా రాజశేఖరుఁడుగారు వెంట నున్నవారితో నానా విషయములను ముచ్చటించుచు నడుమనడుమ వారికిఁజెప్పుల జోళ్ళుచప్పుడులలో నడఁగి పోయిన మాటలను మరల నడుగుచుఁ బలువురతోఁ గలసి యింటికి వచ్చి, పాదరక్షలను నడవలో విడిచి యొకరొకరే వచ్చి కచేరి చావడిలో రత్నకంబళము మీఁద గూర్చుండగాఁ దామును దక్షిణపు గోడ కానుకొని యెండలోనుండి నడిచి వచ్చిన బడలిక చేఁబట్టిన చెమ్మట పోవ నుత్తరీయముతో విసరుకొనుచుఁ గూరుచుండిరి. అప్పుడు నంబి రాఘవాచార్యుఁడు నామముల తిరుమణి బెత్తికలు లేవ నెడమచేతితో సద్దుకొని చేతులు నలుపుకొనుచు రాజశేఖరుఁడుగారి మొగముమీఁదఁ జూడ్కి నిగిడించి, 'దేవరవారి కీనడుమ స్వామిమీఁద కొంచె మనుగ్రహము తక్కువగా నున్నది" అని యొక చిఱునవ్వు నవ్వి లేచి నిలువఁబడి బట్టలో నున్న గన్నేరుపూలమాలెను దీసి చేతిలోఁ బట్టుకొని 'స్వామివారి యందుఁబరిపూర్ణ కటాక్ష ముంచవలెను' అని వినయముతోపఁ బలుకుచు మెల్లగా హస్తమునందుంచెను.

---

1. స్త్రీలు పాడుకునే రామాయణం పాటలన్నింటిలో చాలా ప్రాచుర్యం పొందినది యీపాట శ్రీరాముడు అడవికి పోవటంతో ప్రారంభించి రావణసంహారానంతరం అయోధ్యలో మళ్ళీ ఆయన పట్టాభిషేకం చేసుకోవడంవరకూ ఈపాటలో వర్ణించబడినది. రాముణ్ణి సంహరించటానికి రావణుడు చేసిన పాతాళహోమాన్నిబట్టి యీ పాటకు ఈ పేరు వచ్చింది. ఈ సందర్భం అవాల్మీకం. జానపదుల పాటల్లో వాల్మీకి రామాయణంలో లేని ఎన్నో విచిత్రమైన కల్పనలు చోటుచేసుకున్నాయి.

"మా యన్న మా వదినె పదునాలుగు
యేండ్లు వనము ప్రవేశమమ్మా
వారి వెంటా నేను తల్లి వెళ్తాను

దీవెనలు ఇవ్వవమ్మా" అని లక్ష్మణుడు తల్లిని వేడుకుంటున్న సన్నివేశంతో యీ పాట ప్రారంభమవుతుంది. రామాయణ గాథ ఇతివృత్తంగా గల పాటలన్నిటిలోనూ ఇది పెద్ద పాట.

రాజశేఖరుఁడుగారు భక్తితోఁ బుచ్చుకొని, 'యీ మధ్య మన జనార్దనస్వామి వారికి జరుగవలసిన యుత్సవము లేమయిన నున్నవా ?' అని యడిగిరి.

రాఘ—పదియేను దినములలో మార్గశిర శుద్ధ చతుర్దశినాఁడును, పూర్ణిమనాఁడును వరుసగా తిరుమంగయాళ్వారియొక్కయు, తిరుప్పాణాళ్వారి యొక్కయు తిరునక్షత్రములు వచ్చుచున్నవి. అప్పుడు విశేషోత్సవములు జరుగవలసి యున్నవి. ఆ నెలదినములలో ధనుర్మాసము వచ్చుచున్నది. ఆ నెలదినములును స్వామికి నిత్యోత్సవములును సంక్రాంతి దినములలో సద్యయనోత్సవమును జరుగవలసియున్నవి. ధనస్సులోనే పుష్య బహుళ ద్వాదశినాఁడు తొండరడిప్పొడియాళ్వారి తిరునక్షత్రము వచ్చుచున్నది. ఆ దినమున స్వామి యుత్సవముకన్నను విశేషముగా జరుగవలెను.[1]

రాజ—నిత్యమును స్వామికి బాలభోగమును నందాదీపమును క్రమముగా జరుగుచున్నవా ?

రాఘ—తమరు ప్రతి మాసమును దయచేయించెడి రెండు రూపాయలును బాలభోగమునకుఁ జాలకున్నవి. ఇప్పుడు స్వాములధికముగా వచ్చుచున్నారు. నందాదీపము క్రింద దమరు దయచేయు రూపాయతో

---

1. తిరునక్షత్రం అంటే జయంతి. ప్రసిద్ధ ఆళ్వారుల జయంతులను వైష్ణవ దేవాలయాలలో భక్తిశ్రద్ధలతో జరపడం సంప్రదాయం. తిరుమంగయాళ్వారు పరకాలుడని కూడా అంటారు. వైష్ణవారాధనకై సంపదకోసం దొంగతనాలు కూడా చేసేవాడని ఈయన చరిత్రలో వర్ణితం.

తిరుప్పాణాళ్వారు హరిజన జాతిలో పుట్టిన వైష్ణవభక్తుడు, శ్రీరంగనాథుడి పైన ఈ భక్తుడు రచించిన స్తోత్రాలను 'అమలనాదిపిరాన్' అంటారు. వైష్ణవ ఆళ్వారు రచించిన పాటలన్నింటినీ నాలాయిరం లేదా దివ్యప్రబంధంగా వైష్ణవ దేవాలయాలలో గానంచేస్తారు. తొండరడిప్పొడియాళ్వారు అసలు పేరు విప్రనారాయణుడు. భక్తాంఘ్రి రేణువని యీయన బిరుదు.

ద్రావిడ ప్రబంధ పారాయణం ముగింపు ఉత్సవాన్ని అధ్యయనోత్సవం అంటారు. ధనుర్మాసం అంటే పుష్యమాసమంతా వైష్ణవ దేవాలయాలలో విశేషోత్సవాలు జరుగుతాయి.

మఱియొక రూపాయిను జేర్చి యొకరీతిగా జరుపుకొని వచ్చుచున్నాను. కాని నందాదీపములో మఱియొకరికి భాగముండుట నా కిష్టములేదు. స్వామికి బొత్తిగా వాహనములు లేవు; పొన్న వాహన మొక్కటి యుండెనా రేపటి యధ్యయనోత్సవములో నెంతయైన నిండుగా నుండును. అది యీ యేఁటికిఁ గాకపోయిన పైఁదటికైనను నీకే మాట చెప్పవలెను. ముందుగా చెవిని వేసియుండిన నెందున కయినను మంచిదని మీతో మనవి చేసినాను.

రాజ—మొన్న దేవాలయములో స్వాములలో స్వాములేమో పోట్లాడినారట.

రాఘు—ద్వారకా తిరుమలనుండి వచ్చిన స్వామి సాపాటుచేసి కూర్చుండి యుండఁగా, పెంటపాడు నుండి వేంచేసిన స్వామి పెరుమాళ్ళ సేవ చేసి వచ్చి కూర్చున్నారు. వారిద్దరిలో నొకరు తెంగలెవారును ఒకరు వడహలెవారును గనుక, నామముక్రింద పాద ముంచవచ్చును కూడదని మాటపట్టింపులు పట్టుకొన్నారు.

రాజ—ఊరకే మాటలతో సరిపోయినదా ?

రాఘు—తరువాత గొంచెము చేయి చేయి కలిసినఁగాని ముదర నీయక నేనును నా తమ్ముఁడును అడ్డమువెళ్ళి నివారించినాము.

రాజ—మన జనార్దనస్వామివారి కేమాత్రము మాన్యమున్నది?

రాఘు—ఏడుపుట్ల మాన్య మున్నదందురుగాని, అయిదుపుట్లు మాత్రము భోగమువాండ్ర క్రింద జరుగుచున్నది. తక్కిన రెండుపుట్లు భూమియు అర్చకులదిగాని స్వామిది కాదు.[1]

రాజ—మొన్న జరిగిన స్వామి యుత్సవములో భోగముమేళము రాలేదే.

రాఘు—వా రన్ని యుత్సవములలోను రారు. రాజమహేంద్రవరములోఁ గాఁపురమున్నారు గనుక చిల్లరపండుగుల కెల్ల బండ్లు చేసి కొనివచ్చుట బహు ప్రయాసము. ఒక్క స్వామి కళ్యాణ దినములలో

---

1. 'గడిపాడైనా గూటవదలదు,
గడిపోలాల పూజారి వదలడూ' అని
అడివి బాపిరాజు గీతం ఉన్నది.

శతోత్సవమునాఁడు మాత్రము వత్తురు. అప్పుడు వారి ఛత్రము క్రింద స్వామి ద్రవ్యములోనుండి నాలుగు రూపాయలు మాత్ర మిచ్చుట యాచారము.

ఇంతలో నెవ్వరో ముప్పది సంవత్సరముల వయస్సుగల చామన చాయ గృహస్థు తెల్లబట్టలు గట్టుకొని కుడిచేతిలో నున్న పొన్నుకఱ్ఱ నాడించుచు, ముందఱ నొక కూలివాఁడు బట్టలమూఁటను నెత్తిమీఁదఁ బెట్టుకొని నడువ, నడవలో నుండి చావడిలోనికి చొరవగా నడిచివచ్చి అచ్చట నిలువఁబడి, "ఒరీ! రామిగా! మూట లోపలికిఁ దీసికొనిపోయి యెవరినైనఁ బిలిచి రాజశేఖరుఁడుగారు పరుండు గదిలోఁ బెట్టి రా" అని కూలివానిని నియమించి, కూరుచున్నవారి నందఱిని త్రోచుకొనుచు నడుమనుండివచ్చి మున్నెంతో పరిచయముగలవానివలెనే తాను రాజశేఖరుఁడుగారి ముందఱ తివాచిమీఁదఁ గూర్చుండెను. రాజశేఖరుఁడు గా రావఱకెన్నఁడును అతని మొగమే యెఱుఁగకపోయినను పెద్ద మనుష్యుఁడింటికి వచ్చినప్పుడు మర్యాద చేయకపోయిన బాగుండదని, కొంచెము లేచి దయచేయుఁడని చేయిచూపి తాను గొంచెము వెనుకకు జరిగి చోటిచ్చి "యింటివద్ద నందఱును సుఖముగా నున్నారా ?" యని కుశల ప్రశ్నమును జేసి 'మీరెవ'రని యడిగినఁ దప్పు పట్టుకొందురేమో యని సంశయించుచు నూరకుండిరి. అప్పుడా వచ్చినాఁతడు తన పొడుముకాయను రాఘవాచార్యులవంక దొర్లించి యాతని పొడుము బుఱ్ఱను పుచ్చుకొని, మునుపు చేతిలోనున్న పట్టును బాఱవైచి క్రొత్త పట్టుపట్టి సగము పీల్చి రాజశేఖరుఁడుగారివంకఁ దిరిగి "రాజశేఖరుఁడు గారు నన్ను మఱచిపోయినట్టున్నారు" అనెను.

రాజ—"లేదు లేదు" అని మొగమువంకఁ బాఱజూచిరి.

క్రొత్త—ఇంకను నానవాలు పట్టలేదు. మీరు నన్ను పది సంవత్సరముల క్రిందట రాజమహేంద్రవరములో రామమూర్తిగారింటి[1] లోపల జూచినారు. నేను వామరాజు భైరవమూర్తిని. మనమందఱమును

1. రాజశేఖరుడుగారి పినతండ్రి కుమారుడు, రాజమహేంద్రవరం నివాస స్థానం.

దగ్గఱ బంధువులము. మీ తల్లిగారి మేనత్తయల్లుఁడు మా మేనమామగారికి సాక్షాత్తుగా నొక వేలు విడిచిన మేనత్తకొడుకు. మొన్న మా అన్నగారు సాంబయ్యగారు మీ యింట నెలదినములుండి వచ్చిన తరువాత మీరు చేసిన యాదరణనే నిత్యమును సెలవిచ్చుచు వచ్చిరి. వెళ్లినపుడు మీరు పెట్టిన బట్టలను సహితము పెట్టెతీసి చూపినారు. దానిని జూచి మన బంధువులలో నొకరు మీరింత యనుకూలమయిన స్థితిలో నున్నారని పరమానందభరితుఁడ నయినాను.

ఆ మాటలు విని లోపలిగదిలోఁ బండుకొనియున్న యొక ముసలాయన దగ్గుచు లేచివచ్చి "ఓరీ భైరవమూర్తీ! నీ వెప్పుడు వచ్చినావు?"

భైర—ఓహోహో! ప్రసాదరావుగారా? మీరు విజయంచేసి యెన్నాళ్ళయినది?

ప్రసా—రెండు మాసములనుండి యిక్కడనే యున్నాను. బంధువని రాజశేఖరుని జూచిపోదామని వచ్చి యితని బలవంతమునకు మాఱు చెప్పలేక యిక్కడఁ జిక్కువడ్డాను. మన బంధువులలో రాజశేఖరుఁడు బహుయోగ్యుఁడు సుమీ! (అని కూర్చుండెను.)

రాఘ—తాతగారూ! మీకు రాజశేఖరుఁడుగా రెటువంటి బంధువులు?

ప్రసా—ఇప్పుడు మావాని బంధుత్వము విన్నారుగదా? : మీని మేనమామ బావమఱది నా కుమార్తె యత్తగారి సవతి తమ్ముడు.[1]

ఈ ప్రకారముగా సంభాషణము జరుగుచుండఁగా లోపలినుండి స్త్రీకంఠముతో "సీతా! సీతా!" యని రెండు మూఁడు పిలుపులు వినఁబడినవి. అప్పుడు రాఘవాచార్యులందుకొని, "అమ్మాయీ సీతమ్మా!" అని పిలిచి లోపల అమ్మగా రెందులకో పిలుచుచున్నారు అని చెప్పెను.

1. "బెల్లమున్నచోట నీగలు ముసురునట్లు తమవారొకడు 'మంచి దశలో నున్నప్పుడెక్కడెక్కడివో తరములనాటి బాంధవ్యములు తెచ్చుకొనుచు వచ్చి బంధువులై తన నాశ్రయింతురు. అట్టి చుట్టములతో మా తాతగారిల్లు సదా నిండి యుండెడిదట."

స్వీయ చరిత్రము, మొదటి భాగము,
మొదటి ప్రకరణము, పుట 7 - 1987 వ ముద్రణం.

అప్పుడు నూతివైపు పంచపాళిలోఁదన యీడు పడుచులతోఁగూడి గవ్వ లాడుచున్న యేడు సంవత్సరముల యీడు గల చామనచాయ పిల్ల పరికిణీ కట్టుకొని కుడిచేతిలో పందెమువేయు గవ్వలను ఎడమచేతిలో గళ్ళుగీచిన సుద్దకొమ్మను బట్టుకొని 'వచ్చె వచ్చె'నని కేకలు వేయుచు కాళ్ళగజ్జెలు గల్లు గల్లుమన చావడిలోనుండి పడమటింటి గుమ్మము వైపునకుఁ బరిగెత్తుకొని వెళ్ళెను. ఆ చిన్నది రాజశేఖరుఁడుగారి రెండవ కుమార్తె. అట్లు వెళ్ళి గుమ్మమున కీవలనే నిలుచుండి.

సీత—అమ్మా! ఎందుకు పిలిచినావు?

మాణిక్యాంబ—నాన్నగారితో వంటయినదని, స్నానమునకు లేవచ్చునని చెప్పు.

మాణిక్యాంబ రాజశేఖరుఁడుగారి భార్య. ఆమె రుక్మిణితో సమాన మయిన తెలివిగలదియు, విద్య నేర్చినదియుఁ గాకపోయినను, గృహ కృత్యములను జక్కఁబెట్టుటయందును, పాకము చేయుటయందును నిరుప మానమాయిన ప్రజ్ఞ కలది. రూపమున చాలవఱకు పెద్ద కుమార్తెను పోలి యుండునుగాని మొగము కొంచెము ముదురుదిగాను దేహచ్ఛాయ యొక వాసి నలుపుగాను కనఁబడును. ఆమె ముప్పది నాలుగేండ్ల వయస్సుకల దయ్యును దూరము నుండి చూచుటకు చిన్నదానివలెనే యుండును.

అంతట సీత మరలఁ జావడిలోనికిఁ బరుగెత్తుకొని వచ్చి, 'నాన్నగారూ! వంట అయినదఁట! అమ్మ స్నానమునకు లెమ్మను చున్నది' అని చెప్పి, యెప్పటి యట్ల గవ్వలాడుటకయి నూతిపంచపాళి లోనికిఁ బోయెను.

రాజ—ప్రసాదరావుగారూ! మీరు స్నానము చేయుదురేమో నూతి దగ్గఱకుఁ బొండి; భైరవమూర్తిగారూ! గోదావరికి వెళ్ళెదరా? లేక నూతియొద్దనే నీళ్ళు పోసికొనెదరా!

భైర—కార్తీకసోమవారము గనుక గోదావరికే వెళ్ళెదను.

అప్పుడక్కడ నున్నవారందఱును లేచి, రాజశేఖరుఁడుగారి యొద్ద సెలవు పుచ్చుకొని యెవరి యిండ్లకు వారు వెళ్ళిరి. రాజశేఖరుఁడుగారును పడమటింటిలోనికి నడచిరి. లోపల సానమీఁద గంధము తీయుచున్న మాణిక్యాంబ మట్టియల చప్పుడుతో పడమటింటి దొడ్డితలుపు దగ్గఱకు నడచి

యొకకాలు గడప కీవలను రెండవ కాలు పంచపాళిలోను బెట్టి, కుడిచేతితో ద్వారబంధమును బట్టుకొని నిలువఁబడి 'రుక్మిణీ! బాబయ్యగారు స్నానమునకు వచ్చినారు; వేగిరము వచ్చి నీళ్ళందిమ్ము' అని కేక వేసెను. ఆ పిలుపు విని, దేవతార్చనకుఁ బూలుగోయుచున్న రుక్మిణి "వచ్చుచున్నాను" అని పలికి తొందరగా రాగిహరివాణముతో నిత్యమల్లి పుష్పములను తులసిదళములను దెచ్చి దేవున కరుగుమీఁదబెట్టి తండ్రిగారికి నీళ్లిచ్చుటకయి వంటయింటి దొడ్డిలోనికిఁ బోయెను. మాణిక్యాంబ కంచుగిన్నెలలో గంధాక్షతలు గూటిలో నున్న యద్దమును విభూతిపెట్టెను గొనివచ్చి దేవునరుగునొద్ద నున్న పీఁటదగ్గఱఁ బెట్టినది. తోడనే లోపలినుండి నలువదియేండ్లు దాఁటిన విధవ యొకతె పిడిచి కట్టుకొనిన తడిబట్ట చెఱఁగు నెత్తిమీఁదినుండి గానిచ్చి ముసుఁగువేసికొని, పొయిలోని బూడిద నొసటను బొట్టు పెట్టుకొని, వెండిచెంబుల జోటితో మడినీళ్ళు దెచ్చి పీఁటయొద్దనుంచెను. తరువాత రాజశేఖరుఁడుగారు స్నానముచేసి జుట్టు తుడుచుకొని కొసలు ముడివైచుకొని, అప్పుడాఱవేసిన మడిబట్ట గట్టుకొని వచ్చి, దేవునరుగు ముందఱ నున్న పీఁటమీఁద గూరుచుండి యాచమనము చేసి, విభూతి పండు కొంచెము చిదిపి నీళ్ళతోఁదడిపి చేతి యంగుష్ఠమును కనిష్ఠకయుఁ దప్ప తక్కిన మూడు వ్రేళ్ళతోను నొసటను భుజములను కంఠమునను రొమ్మునను రేఖలను తీర్చి, భువనేశ్వరము తాళము తీసి విగ్రహములను సాలగ్రామములను పళ్ళెములో నిడి మంత్రములు చదువుచు దేవతార్చనమున కారంభించెను. ఇంతలో తక్కిన వారందఱును స్నానముచేసి వచ్చి గోతల పొడుగునను పీఁటలమీఁదఁ గూరుచుండిరి.

భోజనమునకు రావలసినవారందఱును లోపలికి వెళ్ళిన తరువాత మాణిక్యాంబ మడి విడిచి నడిమితలుపు వేసివచ్చి పడకగదిలో కూరుచుండి తమలపాకులు చుట్టుచుండెను. ఇంతలో వీధితలుపువద్ద "రాజశేఖరుఁడుగారూ!" అని పిలుపుమీఁద పిలుపుగా పొలము కేకలవలె నిరువది కేకలు వినఁబడెను. "వచ్చెవచ్చె"నని లోపలినుండి పలుకుచు మాణిక్యాంబ వచ్చులోపలనె, కేకలతోఁగూడ తలుపుమీఁద దబదబ గుద్దులు వినబడెను. ఆమె వెళ్ళి తలుపుగడియ తీయునప్పటికి, నుదుట దట్టముగాఁ బెట్టిన విభూతి చెమ్మటతోఁ గలిసి చప్పిడిదౌడలకు వెల్లవేయఁ జెవుల కుండలము

లయ్యాలలాగ ముడుతలు పడియున్న ముసలిమొగమును, అంగ వస్త్రముతోఁ జేర్చి చుట్టిన ఐట్టల సందునుండి కనఁబడు తెల్లనిజుట్టు గల తలయును, లోపలి నీరు కావిదోవతులపై నున్న దర్భాసనముచే లావుగాఁ గనఁబడు కృష్ణాజినపుచుట్టగల మూపులును, వీపునుండి కుడి భుజము మీదుగా వచ్చిన కృష్ణాజినపు త్రాటికొనను గట్టఁబడ్డ రాగిజారీయును నార సంచియుఁ గల యెండుకొమ్మను గల నల్లని పొడుగయిన విగ్రహ మొకటి ద్వారబంధము పొడుగునను నిలువఁబడి యుండెను. తలుపు తీయఁగానే యా విగ్రహము తిన్నగా పడమటింటి వైపునకు నడిచి లోపల రాజశేఖరుఁడుగారి కెదురుగా నిలువఁబడెను.

రాజ—శాస్త్రిలుగారూ! మీ దేయూరు?

శాస్త్రి—మాది కానూరగ్రహారము, మా యింటిపేరు బులుసువారు; నా పేరు పేరయ్య సోమయాజులు. మీ కీర్తి జగద్విఖ్యాతమయినది. పదిమంది బ్రాహ్మణుల కింత యన్నము పెట్టినను సంభావన యిచ్చినను భూమిమీఁద సార్థకజన్మము మీది, కాని నావంటి వ్యర్థుని బ్రతుకెందుకు?

రాజ—కార్తికసోమవారము మీరు రాత్రిదాఁక నుండెదరా?

సోమ—పెద్దవాఁడ నయినాను, ఇప్పు డుండలేను.

రాజ—సోమయాజులుగా రెండఁబడినట్టున్నారు. అట్లయిన వేగిరము నూతిదగ్గఱ నాలుగుచేఁదల నీళ్ళు పోసికొనిరండి, వడ్డన యవు చున్నది.

సోమ—మీ భోజనములు కానివ్వండి. నా దొక్క మనవి యున్నది. నాకు స్వహస్తపాకము కావలెను. పొయ్యి కొంచెము గోమయ ముతో శుద్ధిచేసి నాలుగు వస్తువులను అమర్చినయెడల స్నానము చేసివచ్చి పాకము చేసికొనెదను.

రాజ—వేఱే పొయ్యిలేదు. మీరు దయచేసి మా పాకములోనికే రావలెను.

సోమ—నాకు స్త్రీ పాకము పుచ్చుకోనని నియమము. మీ యింట వంట చేయువారు పురుషులేకదా!

రాజ—మా పినతల్లి కుమార్తె వంట చేసినది. మా యింట నెప్పుడును స్త్రీలే వంట చేయుదురు.

సోమ—అయ్యో! స్త్రీ పాకమే కాకుండ నియోగిపాకము కూడ నే నెట్లు పుచ్చుకొందును? కొంచె మత్తెసరు పెట్టించిన నేను వచ్చి దింపు కొనెదను.

రాజ— నేఁడు సందర్భపడదు. ఈ పూఁట మీరు వేరే ఎక్కఁడి కయిన విజయం చేయవలెను.

సోమ—(కొంచెమునే పనుమానించి) నే నెఱుఁగుదును. మీది మొదటినుండియు శిష్టసంప్రదాయము— మీ తాతగా రెంతో కర్మిష్ఠులు; మీ తండ్రిగారు కేవలము బ్రహ్మవేత్త. మీ యింట నా కభ్యంతరము లేదుగాని యొకచోట భోజనము చేసినానన్న మఱియొక చోటను గూడ నాలాగుననే చేయుచుందురు. నే నిక్కఁడ భోజనము చేసిన మాటను మీరు రహస్యముగా నుంచవలెను. కార్తీక సోమవారము గనుక గోదావరికిబోయి నిమిషములో స్నానముచేసి వచ్చెదను. ఇంతలో వడ్డన కానిండు.

అని పేరయ్య సోమయాజులు కృష్ణాజినమును నారసంచియు నట్టింటఁబెట్టి గోదావరికిఁ బోయి స్నానము చేసి వచ్చి, కృష్ణాజినమును చావడిలో క్రిందఁబఱచి దానిమీఁద దర్భాసనము వేసికొని కూర్చుండి, గోముఖములోఁ జేయిదూర్చి లోపల రుద్రాక్షమాలను త్రిప్పుచు కన్నులు మూసికొని జపముచేయ నారంభించెను. ప్రసాదరావు నల్లమందువాఁడనని తొందరపడుటను, వడ్డించియున్న యన్నమును, కూరలును చల్లారి పోవుటను జూచి లోపల విస్తళ్ళముందఱఁ గని పెట్టుకొని యున్నవారు లేచివచ్చి పలుమారు పిలువఁగాఁ బిలువగా, సోమయాజులు రెండు గడియ లకు మౌనము చాలించి లేచివచ్చి విస్తరిముందఱఁ గూరుచుండెను. అప్పు డందఱును పరిషేచనములు చేసి భోజనముచేయ మొదలుపెట్టిరి.

రాజ—రాజమహేంద్రవరమునుండి శుభలేఖ తీసుకొని వచ్చిన నీళ్ళకావడి వెంకయ్య జాడలేదు. ఎక్కఁడఁ గూరుచున్నాఁడు?

వెంక—అయ్యా! అయ్యా! ఇదిగో సోమయాజులుగారి వెనుక మూలవిస్తరి వద్దఁ గూరుచున్నాను.

సోమ—ఈ పాకము దివ్యముగా నున్నది. దీని ముందఱ సలబీమ పాకము లెందుకు?

వెంక—సోమయాజులుగారూ! నిన్న సత్రములో వండిన బీరకాయ యింత రుచిగా లేదు సుమండీ!

రాజ—ఏ సత్రము ?

నిన్న రాజమహేంద్రవరములో నొక కోమటియింట గృహ ప్రవేశమునకు సంతర్పణ జరిగినది. బొల్లి పేరయ్యగాఁడు వంటచేసినాఁడు. అక్కడ సోమయాజులుగారును నేనును ఏక పంక్తినే కూర్చున్నాము.

ఈ ప్రకారముగా నన్యోన్యసంభాషణలు గావించుకొనుచు భోజనము చేసి యందఱును పడమటింటిదొడ్డిలో చేతులు కడుగుకొని త్రేన్చుచు బొజ్జలు నిమురుకొనుచు వచ్చి చావడిలోఁ గూర్చుండిరి. సోమయాజులుగారు మొట్టమొదట నాలుగు దినము లుండఁదలఁచుకొనియే వచ్చినను భోజన సమయమున జరిగిన ప్రసంగమును బట్టి నిలువ మనసొప్పక సంభావనను సహిత మడుగకయే వెంటనే తాంబూలమును బుచ్చుకొని నడచిరి.

# నాల్గవ ప్రకరణము

పురాణ కాలక్షేపము—రాజశేఖరుఁడుగారి స్థితి—ఆయన బావమఱఁది దామోదరయ్య చరిత్రము — మిత్రుఁడు నారాయణమూర్తి కథ — ఎఱుక యడుగుట.

రాజశేఖరుఁడుగారు భోజనము చేసిన తరువాత ఒక్క నిద్రపోయి లేచి, తాంబూలము వేసికొని కచేరిచావడిలోనికి వచ్చి కూర్చుండిరి. అంతకుమునుపే గ్రామమునఁగల పెద్దమనుష్యులు పలువురు వచ్చి తగిన స్థలములలోఁగూర్చుండి యుండిరి. అప్పుడు రాజశేఖరుఁడుగారు 'సుబ్రహ్మణ్యా!' అని పిలిచినతోడనే 'అయ్యా' అని పలికి లోపలినుండి పదియాఱు సంవత్సరముల వయసుగల యెఱ్ఱని చిన్నవాఁడొకఁడు వచ్చి యెదుర నిలువఁబడెను. అతఁడు రాజశేఖరుఁడుగారి జ్యేష్ఠపుత్రుఁడు; సీత పుట్టిన తరువాత రెండు సంవత్సరములకు మఱియొక పిల్లవాఁడు కలిగెనుగాని యా చిన్నవాఁడు పురుటిలోనే సందుగొట్టిపోయెను. ఆ వెనుక మాణిక్యాంబకు కానుపులేదు. సుబ్రహ్మణ్యముయొక్క మొగము సుందరమైనదేకాని మూఁడేండ్ల ప్రాయమున బాలరోగము[1] వచ్చినప్పుడు పసుపుకొమ్ముతోఁ గాల్చిన మచ్చ మాత్రము నొసటను గొంచెము వికారముగా నుండెను; తలవెండ్రుకలు నిడువుగాను, నల్లగాను ఉండెను. చేతుల బంగారు మురుగులును, చెవులను రవలయంటుజోడును అనామికను పచ్చదాపిన కుందనంపుపని యుంగరమును ఉండెను.

రాజ—సుబ్రహ్మణ్యా! అందఱితోఁగూడ నీవు మధ్యాహ్నము భోజనమునకు వచ్చినావు కావేమి?

1. చిన్నపిల్ల చేష్ట అని కూడా అంటారు.

సుబ్ర—కార్తీక సోమవారము గనుక, ఈ దినము రాత్రిదాఁక నుండి మఱి భోజనము చేయవలెననుకున్నాను.

రాజ—లోపల బల్లమీఁద ఆదిపర్వ మున్నది. తీసికొని వచ్చి శాస్త్రిలుగారిని వెళ్ళి పిలుచుకొని రా.

తండ్రియాజ్ఞ ప్రకారము సుబ్రహ్మణ్యము లోపలికి వెళ్ళి పుస్తకమును దీసికొని వచ్చి తండ్రిచేతి కిచ్చి, నడవలో నుండి నడచి వీధి గుమ్మము మెట్లుదిగుచు, దూరమునుండి వచ్చుచున్న యొక నల్లని విగ్రహము జూచి 'వేగిరము రండి' అని కేకవేసి, తాను మరలివచ్చి శాస్త్రిలుగారు వచ్చుచున్నారని చెప్పి చావడిలో నడుముగా పుస్తకమును ముందఱఁ బెట్టుకొని కూర్చుండెను. ఇంతలో శాస్త్రిలును భుజముమీఁద చినిగిపోయిన పాఁతశాలువునుఁ మడతబెట్టివేసికొని, బంగారము తీ కెత్తుటచే నడుమ నడుమ లోపలి లక్క కనఁబడుచున్న కుంధలముల జోడు చెవుల నల్లలనాడుచుండ వచ్చి సభలోఁ గూర్చుండెను. రాజశేఖరుఁడుగాఢసాహిత్యపరులయ్యును, ఆ కాలమునందు పెద్ద పుస్తకమును[1] జదివి మఱియొక పండితునిచే అర్థము చెప్పించుట గొప్ప గౌరవముగా నెంచబడుచుండును గనుక, ఆ శాస్త్రిలు వచ్చువఱకును పుస్తకమును జదువక గనిపెట్టుకొనియుండిరి.

రాజ—మీ రీ వేళ నింత యాలస్యముగా వచ్చినారేమండి?

శాస్త్రి—ఇంతకు మునుపొకపర్యాయము వచ్చి చూచిపోయినాను. తమరు లేవలేదని చెప్పినందున, వేఱెయొక పెద్దమనుష్యునితోఁ గొంచెము మాటాడవలసిన పనియుండగా మీరు లేచునప్పటికి మరల వత్తమని వెళ్ళినాను. ఆయనతో మాటాడుట కొంచెమాలస్య మయినది. క్షమించవలెను.- నాయనా! సుబ్రహ్మణ్యము! పుస్తకము విప్పు.

సుబ్రహ్మణ్యము పుస్తకమును విప్పుచు, 'తుండము నేకదంతమును దోరపు బొజ్జయు' నను విఘ్నేశ్వరస్తవపద్యము నారంభించి చదువుచుండగా శాస్త్రిలందుకొని యా పద్యము కడవఱకునయిన తరువాత, 'అంజలిఁజేసి మ్రొక్కెద మదంబకు' మొదలుగాఁగాల సరస్వతీ

1. భారతము.

ప్రార్థనమును, పిమ్మట 'ప్రాంశుపయోదనీలతను భాసితు' మొదలుగాఁ గల వ్యాసస్తోత్రమును, పిదప మఱికొన్ని పద్యములను తానుగూడ కలిసి చదివెను. ఈ లోపల సుబ్రహ్మణ్యము గతదినము విడిచి పెట్టిన భాగమును దీసి, అర్జునుఁడు ద్వారకానగరమునకు వెళ్ళిన భాగమునందలి

> "ప్రాపిత పాసికవ్రతము ధర్మవిధిం జరుపంగ నేఁగి గం
> గాది మహానదీ హిమవదాది మహాగిరిదర్శనంబు మీ
> పాదపయోజదర్శనము పన్నుఁగ జేయుటఁ జేసి పూర్వ సం
> పాదిత సర్వపాపములు వాసె శుభోదయంబుగ నాకు నచ్యుతా!"

అను పద్యమును చదివెను. అప్పుడు శాస్త్రులు పద్యములో నున్నవి కొన్నియు, లేనివి కొన్నియుఁ గల్పించి దీర్ఘములు తీయుచు నర్థము చెప్ప మొదలు పెట్టెను. అర్థము చెప్పుచున్న కాలములో సుబ్రహ్మణ్యము పుస్తకముయొక్క సూత్రమునకుఁ గట్టియున్న పుదకను జేతితోఁ బట్టుకొని త్రిప్పుచుండెను. అది చూచి శాస్త్రులు ఉలికిపడి ముక్కుమీఁద వ్రేలు వైచుకొని 'పుస్తకము చదువుచుండగా దాని నా ప్రకారము ముట్టుకోవచ్చునా? వ్యాసులవారు దానిమీఁదఁ గూరు చుందురే.' యని దగ్గఱ నున్నవారి కావిషయమయిన కథ నొకదానిని జెప్పెను. ఆ మాటమీఁద నందులో నెవ్వరో యడిగినదానికిఁ బ్రత్యుత్తరముగా, 'వ్యాసులవారు దగ్గఱనుండి వెళ్ళుచుండినంగాని వారు స్మరణకు రారనియు, వారప్పుడా మార్గముననే యాకాశముమీఁద దివ్య విమాన మెక్కి వెళ్లు చున్నారనియు చెప్పి ఆకాశమువంక జూచి కన్నులు మూసికొని మూఁడు నమస్కారములు చేసెను. ఈ ప్రకారముగా సంజవేళకు ఆదిపర్వము ముగిసినందున నాటికిఁ బురాణ కాలక్షేపమును జాలించి "స్వస్తి ప్రజాభ్యః" మొదలుగాఁ గల శ్లోకమును జదివి యెవరి యిండ్లకు వారు వెళ్ళిపోయిరి.

రాజశేఖరుడుగారి యింటికి నిత్యమును బంధువులు నలువది తరములు గడచిపోయినను వంశవృక్షములు సహితము చూచుకొన నక్కఱ లేకయే తమ బంధుత్వము జ్ఞాపకముంచుకొని రాజశేఖరుఁడుగారి మీఁది ప్రేమచేత నాతనిని చూచి సంభాషించి పోవలెనను నుద్దేశముతో వచ్చి

నెలలకొలఁది నుండి తినిపోవుచు వస్త్రములు మొదలగువానిని బహుమానమును వడయుచుందురు. ఊరనుండు పెద్దమనుష్యులును పరిచితు అయిన వారునుగూడ రాజశేఖరుఁడుగారి యింట వంటదివ్యముగా జేయుదురని శ్లాఘించుచు నెలకు సగముదినము లచ్చటనే భోజనములు చేయుచుందురు. వారు చేయు స్తోత్రపాఠములకుబ్బి రాజశేఖరుఁడుగారును, వారు వచ్చినప్పుడెల్ల పిండివంటలును క్షీరాన్నమును మొదలగువానిని చేయించి వారిచేత మెప్పువడయఁజూచుచుందురు. అన్న ముడుకకపోయినను, పులుసు కాఁగకపోయినను, పప్పు వేఁగకపోయినను కూడ వారి వంట బాగుండలేదని యెవ్వరును జెప్పలేదు—ఊరకే వచ్చిన పదార్థము నందెప్పుడును రుచి యధికముగా నుండునుగదా? కొందఱు బంధువులు తాము వెళ్లునప్పుడు కొంత సొమ్మును బదులుపుచ్చుకొని అదివఱకుఁ బఱచుగా వచ్చుచుఁ బోవుచు నుండువారేయైనను అంతటినుండి తీఱిక లేక బదులుతీర్చుటకయి మరల నెప్పుడును వచ్చెడివారు కారు. ధనవంతుఁడు గనుక ఆయన కెల్లవారును మిత్రులుగా నుండిరి. ఆ మిత్ర సహస్రములలో నొకఁడైనను నిజమైన యాప్తుఁడున్నాఁడో లేఁడో యన్న సంగతిని మాత్ర మాయనకు ధనలక్ష్మి తెలియనిచ్చినది కాదు. అట్టి మిత్రోత్తము లందఱును రాజశేఖరుఁడుగారికి స్తుతిపాఠములతో భూమి మీఁదనే స్వర్గసుఖమును గలిగించి యాయన నానందింపఁ జేయుచుఁ దా మాయన యిచ్చెడి ధనకనకవస్తు వాహనముల నాతని ప్రీతికై యంగీకరించుచుందురు. నిత్యమును యాచకు లసంఖ్యముగా వచ్చి తమ కష్ట కథలను గాధలుగాఁ జెప్పి చివరకుఁ దమ కేమయినను ఇమ్మని తేల్చుచుందురు-ఆట్టివారు నటించెడి యాపదల నన్నిటిని అతఁడు నిజమయిన వానినిగానే భావించి సాహాయ్యము చేయుచుండును. కొందఱు బ్రాహ్మణులు పిల్లవానికి వివాహము చేసి కొనెదమనియు, ఉపనయనము చేసి కొనెద మనియు, తాము యజ్ఞములు చేసెదమనియు, సత్రములు సమారాధనలు చేయించెద మనియు, చెప్పి యాయనవద్ద ధనమార్జించుకొని పోవుచుందురు. మిత్రుల వేడుకకయి రాజశేఖరుఁడుగారియింట రాత్రులు పఱచుగా గానవినోదములును నాట్యవిశేషములును జారిపోతాది నాటక గోష్ఠులును జరుగుచుండును. మోసగాండ్రు కొందఱు తమ కమ్ముడుపోని

యుంగరములు మొదలగు వస్తువులను దెచ్చి, వానిలోఁ జెక్కినరాళ్ళ వెలయెఱిగి కొనఁగలిగిన సరసులు రాజశేఖరుఁడుగారు తప్ప మఱియొకరు లేరని ముఖప్రీతిగా మాటలుచెప్పి వస్తువు అంత వెల చేయకపోయినను మాటలనే యెక్కువ వెలకు విక్రయించి పోవుచుందురు. గ్రామములోని వైదిక బృందము యొక్క ప్రేరణచేత సప్తసంతానములలో నొకటైన దేవాలయ నిర్మాణముఁ జేయ నిశ్చయించుకొని, రాజవరపుకొండ నుండి నల్లరాళ్ళు తెప్పించి రాజశేఖరుఁడుగారు రామపాద క్షేత్రమునకు సమీపమున నాంజనేయునకు గుడికట్టింప నారంభించి నాలుగు సంవత్సరముల నుండి పనిచేయుచుండెను. కాని పని సగముకంటె నెక్కువ కాకపోయినను పనివాండ్రును పని చేయింపఁ దిరుగుచుండెడి యాశ్రితులును మాత్రము కొంతవఱకు భాగ్యవంతులయిరి. ఈ ప్రకారముగాఁ దన్ననాదరము చేసి యితరులపాలు చేయవచ్చుచున్నందున, ధనదేవత కాతనియందాగ్రహము వచ్చి లేచిపోవుటకు ప్రయత్నము చేయుచుండెను గాని చిరపరిచయమునుబట్టి యొక్కసారిగా విడువలేక సంకోచించుచుండెను. ఈ సంగతిని దెలిసికొని దారిద్ర్యదేవత యప్పుడప్పుడు వచ్చి వెలుపలనుండియే తొంగి చూచుచు, భాగ్యదేవత యాతని గృహము చోటు చేసిన తోడనే తాను ప్రవేశించవలెనని గూరుచుండెను. రుక్మిణి వివాహములో నిచ్చిన సంభావన నిమిత్తమై రాజశేఖరుఁడుగారికి మాన్యములమీఁదఁ గొంత ఋణమైనందున దానిమీఁది వడ్డి పెరుగుచుండెనేకాని మఱియొక తొందరయేమియును గలుగుచుండలేదు.

రాజశేఖరుఁడుగారివలన బాగుపడినవారు పలువు రున్నను వారిలో నెల్లి దామోదరయ్యయు, నారాయణమూర్తియు ముఖ్యులు. ఆ యిద్దరిలో దామోదరయ్య రాజశేఖరుఁడుగారి బావమఱఁది; రాజశేఖరుఁడుగారి తోడబుట్టిన పడుచునే యాతని కిచ్చిరి; కాని యామె ఒక్క కుమారుని మాత్రము గని కాలము చేసెను. ఆ కుమారున కిప్పుడు పదియేనువత్సరములున్నవి; అతని పేరు శంకరయ్య, అతని కెనిమిది సంవత్సరములు దాఁటకముందే తల్లి పోయినందున, అతడు చిన్నప్పటినుండియు మేనమామగారియింటనే పెరిగినాఁడు. అతనికి సీతనిచ్చి వివాహము చేయవలయునని తల్లిదండ్రుల కిద్దఱికిని నుండెను. భార్యపోయిన తర్వాత

దామోదరయ్య రాజశేఖరుఁడుగారి సాయముచేతనే రెండవ వివాహము చేసికొనెనుగాని యా చిన్నది పెండ్లి నాఁటికి తొమ్మిది సంవత్సరముల లోపు వయస్సు గలది. గనుక, ఈడేరి కాపురమునకువచ్చి రెండు సంవత్సరములు మాత్రమే యయినది. అతనికి ద్వితీయ కళత్రమువలన సంతానమింకను కలుగలేదు. దామోదరయ్య మొదటినుండియు మిక్కిలి బీదవాఁడు; అతనికి రాజశేఖరుఁడుగారి చెల్లెలి నిచ్చునప్పటికి రాజశేఖరుఁడుగారి తండ్రియు ధనవంతుఁడు కాఁడు. వారిది పూర్వము వసంతవాఁడ నివాసస్థలము. రాజశేఖరుఁడుగారి తండ్రి తన యింటికి గోడలు పెట్టించుటకయి పుట్టలు త్రవ్వించు చుండఁగా నొకచోట నిత్తడి బిందితో ధనము దొఱికినది. ధనము దొరికిన తరువాత స్వస్థలములో నున్న విశేష గౌరవ ముండదని యెంచియోఁ లోకులు యోర్వలేని తనమునకు జడిసియో రాజశేఖరుఁడుగారి తండ్రి దార పుత్రాదులతో నల్లుని గూడ వెంటఁ బెట్టుకొని వచ్చి యప్పటినుండియు ఈ ధవళగిరియందే నివాసముగా నుండి యా చుట్టుపట్టులనే మాన్యములు గొని కొంతకాలమునకు మరణము నొందెను. భార్య పోవుటయుకును దామోదరయ్య రాజశేఖరుఁడుగారి యింటనే యుండి, ఆయన పేరు చెప్పి ధనము నితరుల వద్ద తెచ్చి తా నపహరించుచుఁ బయికిఁ దెలియనియ్యక దాచుకొనుచుండెను. తరువాత అప్పులవారు వచ్చి తొందర పెట్టి నపుడు రాజశేఖరుఁడుగారే సొమ్మిచ్చుకొనుచుండిరి. తోడబుట్టిన పడుచు పోయిన తరువాత దామోదరయ్య చేయు నక్రమములకు సహించలేక యొకనాఁడు రాజశేఖరుఁడుగా రాతనిని కఠినముగా మందలించిరి. అందు మీఁద గోపము వచ్చి దామోదరయ్య తన్ను బావమఱఁది కట్టుబట్టలతో నిల్లు వెడలఁగొట్టినాఁడని యూరివారందరి ముందఱఁ జాటుచు దేశాంతరమునకు లేచిపోయి, యాఱు నెలలకు గడ్డమును తలయును బెంచుకొని మరలవచ్చి, భూతవైద్యుఁడనని వేషము వేసికొని నుదుట పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకొని వీధుల వెంబడి తిరుగుచుండెను. ఆ వఱకే దామోదరయ్య తా నార్జించుకొన్న ధనమును వేఱుగ జాగ్రత్తచేసి కొన్నందున అప్పుడా ధనముతో నొక యిల్లుగట్టి ఆ గ్రామములోనే ప్రత్యేకముగా నొక చోటఁ గాపురముండెను. అతని భూతవైద్యము నానాఁటికి బలపడి

నందున ఊర నెవ్వరికైన కాలిలో ముల్లుగ్రుచ్చుకొన్న నాతనిచేత విభూతి పెట్టించుచుందురు. ఈ విధముగా దామోదరయ్య భాగ్యవంతుడగుటయే గాక, జనులచేత మిక్కిలి గౌరవమును సహితము పొందుచుండెను.

రెండవ యాతఁడైన నారాయణమూర్తి మొదట సద్వంశమునఁ బుట్టినవాడేగాని దుర్మార్గులతో సావాసముచేసి తనకుఁగల కాసువీసములన్ని వ్యయము జేసికొని బీదవాఁడయ్యును పయికి ధనికునివలె నటించుచుండెను. అతనికి భాగ్యముపోయినను దాని ననుసరించియుండిన చిహ్నములు మాత్రము పోనందున నారాయణమూర్తి తఱుచుగా రాజశేఖరుఁడుగారి యింటికి వచ్చును. రహస్యమని చెప్పి రాజశేఖరుఁడుగారి లోపలికిఁ బిలుచుకొనిపోయి తన యక్కఱను దెలిపి సొమ్ము బదులడుగుచుండును. ఆ ఋణము మరల తీఱునది కాదని దృఢముగా నెఱిఁగియు, రాజశేఖరుఁడుగారు మానవంతుల గౌరవమును కాపాడుచుండుటయందు మిక్కిలి యభిలాష కలవారు గనుకను, అతఁడు చిన్నతనములో తన సహపాఠి గనుకను, అడిగిన మొత్తమును రెండవ వా రెఱుఁగకుండ చేతిలోఁబెట్టి పంపుచుందురు. ఆతఁడా ధనముతో సరిగవస్త్రములు, సుగంధద్రవ్యములు మొదలగువానిని గొనుచు మిత్రులకు షడ్రసోపేతముగా విందులు చేయుచుండును. ఇదిగాక యాతఁ డితర స్థలములలోఁ జేసిన ఋణముల కయి ఋణప్రదాతలు తొందరపెట్టినందున, రాజశేఖరుఁడుగారు తన సొంత సొమ్ములోనుండి యప్పుడప్పుడు మూఁడువేల రూపాయల వఱకు నిచ్చి యాతనిని ఋణ బాధనుండి విముక్తునిజేసిరి. రెండు సంవత్సరముల క్రింద నారాయణమూర్తి యొక్క పెత్తండ్రి భార్య సంతులేకుండ మృతి నొందినందున, ఆమె సొత్తు పదివేల రూపాయలు అతనికిఁ జేరెను. ఆ సంగతి తెలిసినతోడనే రాజశేఖరుఁడుగారు పరమానందభరితులై నారాయణమూర్తి యింటికిఁబోయి నాలింగనము చేసికొని తనకీయవలసిన యప్పును దీర్పవలసినపని లేదనియు, యావద్ధనముతోను గౌరవముతో సుఖజీవనము చేయవలసినదనియుఁ జెప్పి యాదరించిరి. రాజశేఖరుఁడు గారి కీవఱకు బదులుచేయవలసిన యవశ్యకమంతఁగా తటస్థింపనందునను ధనము విశేషముగ నున్నందునను నారాయణమూర్తి కావలసిన యెడల

తన ధనమును వాడుకోవచ్చునని రాజశేఖరుఁడుగారితోఁ బలుమారు పూర్వము చెప్పుచువచ్చెను.

ఒకనాఁడు నాలుగు గడియల ప్రొద్దెక్కిన తరువాత రాజశేఖరుఁడు గారు కచేరీచావడిలోఁ బలువురతోఁ గూరుచుండి యున్నసమయమున రుక్మిణి నూతి వద్దకువచ్చి యక్కడినుండి పెరటిగుమ్మము దగ్గఱకుఁబోయి లోపలనే నిలుచుండి, తరిగిన గుమ్మడికాయ పెచ్చులను వీధిలో బాఱవేయు వచ్చిన పొరిగింటివారి యాఁడు పడుచుతో మాటాడుచుండెను. అప్పుడు చేతిలో తాటాకుగిలకగుత్తుల నాడించుచు నెత్తిమీద నొక బుట్ట పెట్టుకొని యొక్క యెఱుకత యామార్గమునఁ బోవుచు రుక్మిణి మొగమువంక నిదానించిచూచి నిలువంబడి "అమ్మా! నీకు శీఘ్రముగానే మేలుకలుగు చున్నది; భాగ్యము కలుగుచున్నది; నీమనసులో నొకవిచారము పెట్టు కొని కృశించుచున్నావు. ఎఱుకయడిగితే నీ మనసులో నున్నది నూటిగాఁ జెప్పెద"నని చెప్పెను. ఆ మాటలు విని యా ప్రబోధికను దొడ్డిలోనికిఁ బిలుచుకొనిపోయి కొట్లచాటునఁ గూరుచుండఁబెట్టి తాను లోప లికిఁబోయి చేటలో బియ్యముపోసి తెచ్చి యా బియ్యమును దన చేతిలో నుంచుకొని మున్మాఱు తనచేయి ఫాలమున మోపి మ్రొక్కి, కార్యమును తలఁచుకొని రుక్మిణి తన చేతిలోని బియ్యమును చేటలో విడిచిపెట్టెను. అప్పుడా యెఱుకత తాను వర్ణించిన రీతిగా నిష్టదైవములఁ దలఁచుకొని వాక్కొందని వేఁడుకొని యామెచేయిపట్టుకొని 'భాగ్యముకల చెయ్యి! ప్రతిష్ఠగల చెయ్యి' యనిపలికి, 'నీ వొక్క తలపు తలచినావు; ఒక్క కోరిక కోరినావు; ఒక్క మే లడిగినావు; అది కాయో పండో, కల్లో నిజమో, చేకూఱునో చేకూఱదోయని త్రొక్కిటపడుచున్నావు; అది కాయకాదు పండు; కల్లగాదు నిజము; శీఘ్రముగానే చేకూఱనున్నది. ఆఁడువారివంక తలంపా మగవారివంక తలపా యుందు వేమో మగవా రంటే గడ్డము, ఆఁడువా రంటే లక్కా'కు అని రుక్మిణి ముఖ లక్షణములను చక్కగా కనిపెట్టి మగవారివంక తలంపన్నప్పు డామె మొగ మొకవిధముగా నుండుటచూచి సంగతి నూహించి 'నీది మగవారి వంక తలంపు; శీఘ్రముగానే కార్యము గట్టెక్కనున్నది. నీరొట్టె నేతఁ బడనున్న'దని చెప్పి తక్కిన ప్రసంగమువలన రుక్మిణి మనసులోని

సంగతి యంతయు దెలిసికొని, రుక్మిణి మగఁడు దేశాంతరగతుఁ డయిన వార్త నావలనకే వినియున్నది. కాన 'నీమగఁడు చెడుసావాసముచేత దేశాల పాలయిఁ తిరుగుచున్నాఁడు; నీమీఁది మోహముచేత నెలదినములలో నిన్ను వెదకుకొనుచు రాఁగలడు' అని చెప్పి సంచిలోని వేరు నొకదానిని తీసి పసుపుదారముతో జేతికికట్టి ప్రాఁతబట్టయు రవికయు బుచ్చుకొని, మగనితోఁ గలిసి కాపురము చేయుచున్న తరువాత క్రొత్తచీర పెట్టుమని చెప్పి తనదారిని బోయెను. రుక్మిణియుఁ బరమానంద భరితురాలయి అంత సూటిగాఁ తన మనోగతమును దెలిపి నందునకై యెఱుకతయొక్క మహాత్త్వమును మెచ్చుకొని యబ్బుర పడుచు లోపలికిఁ బోయెను.

# అయిదవ ప్రకరణము

సీతయొక్క వివాహ ప్రయత్నము — బైరాగియొక్క ప్రసిద్ధి — అతడు వైద్యమునకు గుదురుట—జనార్దనస్వామి యుత్సవము—రుక్మిణి యొక్క కాసులపేరు పోవుట;

ఒకనాటి యుదయమున రాజశేఖరుఁడుగారు సభ తీర్చి చావడిలోఁ గూర్చుండియుండగాఁ సిద్ధాంతి వచ్చి తాటాకులతోనల్లిన యొరలోనుండి సులోచనములజోడును తీసి ముక్కునకుఁ దగిలించుకొని దానిదారమును నొసటినుండి జుట్టు మీదుగా వెనుకకు వేసికొని కూరుచుండి తాటాకు పుస్తకమునకుఁ గట్టిన దారములో గ్రుచ్చిన చిన్న తాటాకుముక్కలను నాలుగయిదింటిని పయికిఁ దీసి ముందుకు వెనుకకు ద్రిప్పుచు వానివంకఁ జూడసాగెను.

రాజ—సిద్ధాంతిగారూ! సీత కే సంబంధము బాగున్నది ?

సిద్ధాం—చక్కగా నాలోచించి చూఁడగా మంత్రిప్రగడ బాపిరాజు గారి కుమారుని జాతకము సర్వవిధముల ననుకూలముగ గనఁబడుచున్నది.

మంత్రిప్రగడ బాపిరాజు తన కొమారున కేలాగునైన సీతను జేసికొని రాజశేఖరుఁడుగారితోడి బాంధవ్యమువలన బాగుపడవలెనని చిరకాలమునుండి కోరియున్నవాఁడు కాన, ఈ నడుమఁ దన యింట సీతాకళ్యాణసమయమున సిద్ధాంతికి మంచి దోవతుల చాపు కట్టఁబెట్టుటయే కాక, సీత నిప్పించినయెడల నింతకంటె మంచి బహుమానము చేసెదనని యాశ పెట్టెను.

రాజ—బాపిరాజు కొమారుఁడు నల్లనివాఁడు. చదువులోను తెలివి లేదని వినుచున్నాను. వాఁడిప్పుడే దుస్సహవాసముచేత చెడుతిరుగుళ్ళ

తిరుగ నారంభించినాఁడఁట! వానికి సీత నిచ్చెను. మన శంకరయ్యు జాతక మెట్లున్నది?

సిద్ధాం—మీ మేనల్లుని జాతకము చూచినాను. సమస్త విధముల చేతను దివ్యజాతకమేకాని జన్మనక్షత్రము కృత్తిక, మన సీతది కూడ కృత్తికానక్షత్రమే—

శ్లో. అజైకపాచ్చ। విష్ఠాచ పునర్వస్వథకృత్తికా!
మృగశీర్షంచ విత్తాచ సవితో తర ఫల్గునీ।
జ్యేష్ఠాచ విశ్వతోయంచ నక్షత్రైక్యే వినశ్యతి।
ఏకారాశౌ పృథగ్స్యాచ్చో త్తమం పాణిపీడనం॥

—అని శాస్త్రములో పయినక్షత్రము యైక్యమునందు కన్యావరులకు నాశనము సంభవించునని చెప్పబడి యున్నది. బాపిరాజు కొమారుని జాతకము సర్వోత్తముగా నున్నది—అందులో కేంద్రాధిపతికి త్రికోణాధిపతి సంబంధము కలిగియున్నది. ఇతరులయిన తృతీయ, షష్ఠ, ఏకాదశ, అష్టమాధిపతులతోడి సంబంధము లేదు—

శ్లో. కేంద్రత్రికోణ పతయస్సంబందేవ పరస్పరం
ఇతరైరప్రసక్తాశ్చే ద్విశేషశుభదాయకాః॥

—అని శాస్త్ర ప్రకారమతఁడు మిక్కిలి యదృష్టవంతుఁడు. తక్కిన చిల్లర చేష్టలకు రూపమునకును నేమి? మఱి నాలుగేండ్లు పైఁబడిన నెంత బుద్ధి మంతుఁడగునో యెవరెఱుఁగుదురు? నా మాట విని చిన్నదాని నాతనికిండు.

రాజ—నేను బాపిరాజు కొడుకునకు పిల్లనియ్యను. నా చెల్లెలు పోవునప్పుడు తన కొడుకునకు సీత నిచ్చునట్లు నా చేత చేతిలో చేయి వేయించుకొన్నది. దామోదరయ్యయు సీత నిచ్చి శంకరయ్యను మీ యొద్దనే యుంచుకొమ్మని నిత్యమును మొగమాట పెట్టుచున్నాడు. ఇప్పుడు నేను పిల్లదానిని మఱియొకరి కిచ్చినయెడల నా చెల్లెలు పోఁబట్టి యట్లు చేసితినని కలకాలము చెప్పుచుందురు. అదిగాక మా శంకరయ్య బహుబుద్ధిమంతుఁడుఁ సుపరద్రూపిఁ విద్యావినయ సంపన్నుఁడు. పిల్ల నాతనికే యిచ్చెదను. జాతకముచు మీరు మఱియొకసారి శ్రద్ధతోఁ జూడవలెను.

అప్పుడు సిద్ధాంతి తాను మఱియొక విధముగాఁ జెప్పిన కార్యము లేదని తెలిసికొని కొంచెము సేపాకాశమువంకఁ జూచి యనుమానించి 'సీత జననము కృత్తికా నక్షత్రము యొక్క యే పాదము?' అని ప్రశ్నించెను.

రాజ—ద్వితీయ పాదము.

సిద్ధాం—శంకరయ్యది ప్రథమ పాదము. అవును. అనుకూలము గానే యున్నది—

శ్లో॥ ఏకర్షైచైకపాదేతు వివాహః ప్రాణహానిదః।
దంపత్యోరేక నక్షత్రే భిన్నపాదే శుభావహః॥

—అను శాస్త్రమునుబట్టి దోషము లేకపోఁగా శుభావహముగా కూడ నున్నది; తప్పక సీత నీతనికిచ్చి వివాహము చేయండి.

రాజ—ఈ సంవత్సరములో పెండ్లికనుకూలమయిన ముహూర్త మెప్పుడున్నది?

సిద్ధాం—శ్లో॥ మాఘఫాల్గున వైశాఖ జ్యేష్ఠమాసా శ్శుభ ప్రదాః॥ అనుటచే మాఘమాస మనుకూలముగ నున్నది. బహుళ పంచమి మంగళ వారమునాఁడు రవి కుంభలగ్నమం దున్నాఁడు. ఆ ముహూర్తము దివ్య మయినది— శ్లో॥ అజగో యుగ కుంభాళి మృగరాశి గతే రవౌ।
ముఖః కర్మ గృహ స్త్వన్యరాశికేన కదాచన॥
అని ప్రమాణవచనము.

రాజ—మీ కుమార్తె జబ్బు నిమ్మళముగా నున్నదా?

సిద్ధాం—తమ కటాక్షము వలన నిమ్మళముగానే యున్నది. నాఁడు మీరు చెప్పిన బైరాగి బహుసమర్థుఁడు. అతఁడు మాయింట గ్రహమును నిమిషములో వెళ్ళగొట్టినాఁడు. భూతవైద్యులందఱును మా చిన్నదానికిఁ బట్టిన గ్రహమును వదలించుట యసాధ్యమని విడిచిపెట్టినారు. అతఁడు మూఁడుదినములు జల మభిమంత్రించి లోపలికిచ్చి రక్షరేకు కట్టినాఁడు. నాఁటి నుండియు పిల్లది సుఖముగా నున్నది.

రాజ—మా చెల్లెలు సుబ్బమ్మకు దేహ మస్వస్థగా నున్నది. మన గ్రామములో నెవ్వరును మంచి వైద్యులు కనఁబడరు. నాకేమి చేయుటకును తోఁచకున్నది.

రాఘ—బైరాగివేత మందిప్పించరాదా! అతఁడు మీరు సొమ్మి చ్చిన మాత్రమున పుచ్చుకొనఁడు. ఈ యూర నెందఱికో ధర్మార్థముగానే యౌషధము లిచ్చి దీర్ఘవ్యాధులను సహితము కుదిర్చినాఁడు.

రాజ—గట్టివాఁడయిన యెడల నీ వాతని నొక్క పర్యాయము మధ్యాహ్నము మా యింటికి వెంటబెట్టుకొనివచ్చి సుబ్బమ్మను చూపె దవా? నాలుగు దినములనుండి దాని శరీరములో రుగ్మతగా నున్నందున వంటకు మిక్కిలి యిబ్బందిపడుచున్నాము.

రాఘ—అవశ్యముగా దీసికొనివచ్చెదను. అతని కాభేషజములు లేవు. ఎవరు పిలిచినను వచ్చును.

సిద్ధాంతి—అతనికడ స్వర్ణముఖీవిద్య కలదని చెప్పుచున్నారు. మహానుభావులు గోసాయీలలో నెటువంటివారైనను నుందురు.

రాఘ—అతఁడు ప్రతిదినమును దమ్మిడియెత్తు రాగి కరఁగించి బంగారము చేయునట? అతఁడప్పుడప్పుడు బ్రాహ్మణులకు దానధర్మ ములు చేయుచున్నాఁడు. ఈ విద్యయే లేకపోయిన నాతనికి ధనమెక్కడ నుండి వచ్చును?

రాజ—రాఘవాచారీ! దేవున కధ్యయనోత్సవములు క్రమముగా జరుగుచున్నవా?

రాఘ—తమ యనుగ్రహముండఁగా ఉత్సవముల కేమిలోపము? నిరుడు పుష్యమాసములో సంక్రాంతినాఁటి యుత్సవము ప్రత్యేకముగా తమ ద్రవ్యములో జరిగినది. నిన్ననో మొన్ననోలాగున కనఁబడు చున్నది. అప్పుడే సంవత్సరమయినది. రేపే సంక్రాంతి – ఈ సంగతి తమతో మనవిచేయుటకేవచ్చి సుబ్బమ్మగారికి జబ్బుగా నున్నందున సమ యము కాదని యూరకున్నాను.

రాజ—క్రిందటి సంవత్సరము నూటయేఁబది రూపాయల నిచ్చి నాను. ఈ సంవత్సరము మాలోపల వివాహములు తటస్థమయినవి గనుక నూఱురూపాయల మాత్రమే యిచ్చెదను. ఎలాగునయిన , దానితో సరిపెట్టవలెను.

రాఘ—చిత్తము, దానికేమి? అలాగుననే చేసెదను.

రాజ—రాఘవాచార్యులూ? బైరాగి నవశ్యముగా నేఁడే మా యింటికి తీసికొనివచ్చి నీవు మఱియొక పనిని చేసికోవలెనుజుమీ? ప్రొద్దెక్కు చున్నది. శీఘ్రముగా వెళ్ళు—సిద్ధాంతిగారూ! మీకు సందేహముగా నున్న పక్షమున శంకరయ్య జాతకము మఱియొకసారి జూడుండి; ఎవరితోనైన నాలోచించవలసి యున్న యెడల లచ్చయ్యశాస్త్రిగారికి కూడ ఆ జాతకము చూపవచ్చును.

సిద్ధాంతి—చిత్తము. నా కటువంటి సందేహము లేదు.

రాజ—అట్లయిన, ఇప్పుడు బసకుపోయి తరువాత దర్శనమిండు.

అని చెప్పి పంపిన తరువాత సభవారందఱును తమ యిండ్లకు బోయిరి. రాజశేఖరుఁడుగారు భోజనముచేసి చేయి కడుగుకొను నప్పటికి రాఘవాచార్యు లాబైరాగిని వెంటఁబెట్టుకొనివచ్చి యింటఁ బ్రవేశపెట్టెను. నిత్యమును రాజశేఖరుఁడుగా రాతనికి సకలోపచారములును చేయుచు భక్తితో ననుసరించుచుండెను. సుబ్బమ్మకు వ్యాధి వెంటనే నిమ్మళించి నను స్వర్ణముచేయు విద్యను నేర్చుకోవలెనను నాసక్తితో రాజశేఖరుఁడుగా రాతనిని విడిచిపెట్టక, యింటనే యుంచుకొని నిత్యమును పాలును పంచదారయు వేళకు సమర్పించుచు; నెగళ్ళకు వలయు పుల్లలను సమకూర్చుచు, బహువిధముల భక్తిసేయుచు నాతని యనుగ్రహ సంపాదనకుఁదగిన ప్రయత్నములు చేయుచుండెను. ఈ ప్రకారముగాఁ గొన్ని దినములు జరుగఁగా నింతలో జనార్దనస్వామివారికిఁ గళ్యాణోత్సవము సమీపించినది. ఆ యుత్సవమును జూచుటకై చుట్టుప్రక్కల గ్రామములనుండి వేలకొలఁది జనులువచ్చి ప్రతి గృహమునను గ్రిక్కిఱిసినట్టు దిగియుండిరి.

మాఘశుద్ధమున నేకాదశినాఁడు రథోత్సవమునకు వలయు ప్రయత్నము లన్నియు జరుగుచుండెను. నాలుగు దినములనుండి రథమంతయు నలంకరించి దాని పొడుగునను వన్నెవన్నెల గుడ్డలను చిత్రవర్ణము గల కాగితములను అంటించి వెదురుకఱ్ఱల కొనలకు హనుమద్విగ్రహమును గరుడవిగ్రహమును గల ధ్వజ పటములనుగట్టి రథమునకుఁ

దగిలించిరి. దేవుఁడు కూర్చుండు పైవైపున గెలలతో నున్న కదళికా స్తంభములను నిలిపి వానికి మామిడిమండలతోను వివిధ పుష్పములతోను తోరణములను గట్టిరి. ఆ యరఁటి కంబెములకు నడుమను తెల్లని లక్క గుఱ్ఱములు రెండు, రథము నీడ్చుచున్నట్లు ముంగాళ్ళు మీది కెత్తుకొని మోరలు సారించి వీధివంకఁ జూచుచుండెను. ఆ రథమునకుఁ బదియడుగుల దూరమున వెదురు పేళ్ళతో నల్లబడి పయిని గుడ్డ మూయఁబడి వికృతాకారముతో నున్న యాంజనేయవిగ్రహములోను గరుడవిగ్రహములోను మనుష్యులు దూరి చూడవచ్చిన పల్లెవాండ్రను పిల్లలను జడిసికొనులాగున నెగిరెగిరిపడుచు లక్క తలకాయలు ద్రిప్పుచుండిరి. అప్పుడు పూజారులు పల్లకిలో నుత్సవవిగ్రహముల నెక్కించుకొని వాద్యములతోఁ గొండదిగివచ్చి రథమునకు మూఁడు ప్రదక్షిణములను జేయించి స్వామి నందు వేంచేయింపఁజేసిరి. చెంతలనున్న వారందఱును క్రింద నుండి యరఁటిపండ్లతో స్వామిని గొట్టుచుండగా రథముమీఁదఁ గూర్చున్న యర్చకులును తదితరులును చేతులతో దెబ్బలు తగులకుండఁ గాచుకొనుచు నడుమ నడుమ జేగంటలు వాయించుచు గోవిందా యని కేకలు వేయుచుండిరి. ఆ కేకలతో రథమునకుఁ గట్టియున్న మ్రోకులను వందలకొలఁది మనుష్యులు పట్టుకొని యిండ్ల కప్పులును వీధి యరుగులును కూలునట్టులుగా రథము నీడ్చుచుండిరి. అంతట భోగము మేళ మొకటి రథమునకు ముందు దూరముగా నిలువఁబడ, మద్దెల మీఁదఁ జేయి వైచుకొని యొకతె యాడసాగెను. మద్దెలమీఁద దెబ్బ వినబడినతోడనే దేవునితో నున్న పెద్దమనుష్యు లందఱును మూఁకలను ద్రోచుకొనుచు వెళ్ళి యాటకత్తియల ముందు మున్నున్నవారిని వెనుకకుఁబంపి తాము పెద్దలయి యుత్సవమునందు గాన వినోదమునకు కొఱత రాకుండ సమర్థించుచుండిరి.

అప్పుడు రుక్మిణి సమస్తాభరణభూషితురాలయి, ఉమ్మెత్త పువ్వువలె నందమై బెడబెడలాడుచున్న కుచ్చిళ్ళు మీఁగాళ్ళపై నొరయ, ఎడమ భుజముమీఁది నుండి వచ్చి జరీచెట్లుగల సరిగంచు పయ్యెదకొంగు వీఁపున జీరాడ, కట్టుకొన్న గువ్వకన్నద్దిన నల్లచీర యామె యంచమున కొక

వింతయందమును గలిగింప, కాళ్ళ యందియలును, పాంజేబులునుఁ గల్లుగల్లున శ్రావ్యనాదము చేయ కుడిచేయి తప్పఁ గదమభాగ మంతయు, బయిటలోఁ దాఁగి కనఁబడకయున్న వంగపండు చాయగల గుత్తపు పట్టు రైక నీరెండలో ద్విగుణముగాఁ బ్రకాశింప, కొప్పులోని కమ్మపూవుల తావి కడలకుఁ బరిమళము లెసంగుచు గంధవహుని సార్థక నామునిఁ జేయ, నడచివచ్చి వీధిలో నొక యరుగుచెంత నిలుచుండి రథమువంక జూచుచుండెను. ఈ దేశములో సాధారణముగా స్త్రీలు తమ భర్తలు గ్రామమున లేనప్పుడు విలువచీరలు కట్టుకొని యలంకరించుకొనుట దూష్యముగా నెంచువారయినను, ఇతరుల యింట జరుగు శుభకార్యములయందు పేరంటమునకు వెళ్ళునప్పుడుగాని, గ్రామములో జరిగెడి స్వామి కళ్యాణమహోత్సవమును గ్రామదేవతల తీర్థములును జూడఁబోవునప్పుడుగాని యెరువు తెచ్చుకొనియైన మంచి బట్టలను, మంచి నగలను ధరించుకొనక మానరు. అప్పటి యామె సౌందర్యము నేమని చెప్పుదును! నిడుదలై సోగలైన కన్నులకుఁ గాటుక రేఖ లొక సొగసు నింప, లేనవ్వుమిషమున నర్ధచంద్రునిఁ బరిహసించు నెన్నుదుటను బాలచంద్రు యాకృతినున్న కుంకుమబొట్టు రంగులీన, శృంగారరస మొలికెడి యా ముద్దుమొగముయొక్క యప్పటి యొప్పిదము కన్నుల కఱవుదీఱఁ జూచితీఱవలసినదేగాని, చెప్పి తీఱదు. రథమామె దృష్టిపథమును దాఁటి పోయినతోడనే ద్వాదశోర్ధ్వపుండ్రములను దట్టముగా ధరియించి దాసరులు ఇనుప దీపస్తంభములలో దీపములు వెలిగించుకొని నడుమునకుఁ బట్టు వస్త్రములను బిగించుకొని యొకచేతిలో నెమలికుంచె యాడించుచు రెండవ చేతిలోని గుడ్డచుట్టలు చమురులో ముంచి వెలిగించి సెక సోకకుండ నేర్పుతో దేహమునిండ నంటించుకొనుచు ప్రజలిచ్చు డబ్బులను దీపస్తంభముల పట్లలో వేయుచు నడచిరి. ఆ సందడి యడఁగిన తోడనే రుక్మిణి తల్లియు, మరికొందఱును తోడ నడువ బయలుదేఱి, ఉత్సవము నిమిత్తమయి పొరుగూళ్లనుండివచ్చి గుడారములలోఁ బెట్టిన కంచరి దుకాణములను పండ్ల యంగళ్ళను దాఁటి, మెట్ల పొడుగునను ప్రక్కల యందుబట్టలు పఱచుకొని యఱచుచు కూరుచున్న వికలాంగులకు సెనగ

పప్పును గవ్వలను[1] విసరివైచుచు, కాశీ కావళ్ళు ముందుబెట్టుకొని పుణ్యాత్ము లను పాపాత్ములను స్వర్గమును నరకమును జూపెదమని పటములు చేతఁ బెట్టుకొని వచ్చెడివారిని పోయెడివారిని నడ్డగించెడు కపటయాత్రికులకు తొలఁగుచు, కొండయెక్కి దేవతాదర్శనార్థము వెళ్ళెను. అక్కడ నిసుక చల్లిన రాలకుండు మూఁకలోనుండి బలముగలవారు దేవునకు బండ్లియ్యవలెనను నపేక్షతో దూఱి సందడిలోఁబడి దేవతాదర్శన మటుండఁగా మందిలో నుండి యీవలం బడినఁజాలునని నడుమనుండియే మరలి యీవలకువచ్చి సంతోషించుచుండిరి. వారికంటే బలవంతు లయినవారు గర్భాలయమువఱకును బోయి పండ్లను పూజారి చేతిలోఁబెట్టి యీవలఁ బడుచుండిరి. అర్చకులను ఒకరువిడిచి యొకరు వెలుపలికివచ్చి చెమటలచేఁ దడిసిన బట్టలను పిండుకొని వెలుపలి గాలిలో కొంతసేపు హాయిగా నుండి మరల గర్భాలయములోఁ బ్రవేశించి యాయుక్కలో బాధ పడుచుండిరి. ఈ ప్రకారముగా వచ్చిన యర్చకులలో నొకఁడు మాణిక్యాంబను

---

1. పైసల మాదిరిగానే గవ్వలు కూడా ఒకప్పుడు ద్రవ్యంగా చెలామణిలో వుండేవి. ఏనుగుల వీరాస్వామయ్యగారి కాశీయాత్రా చరిత్రలో పైసలకు గవ్వల మారకం క్రమం కూడా ఇచ్చారు.

"కృష్ణానది దాటినది మొదలు హైదరాబాదు వరకు పకీరులు నిండి యున్నారు గనుక సవారీమీద నెవరు వచ్చినా అడుగడుగుకు పకీరులు పోగడి భిక్షం అడగక మానరు. వారికి కొన్ని గవ్వలయినా యిచ్చిపోకపోతే అవమానము తోచుచున్నది. చెన్నపట్టణపు రూపాయి 1 కి అక్కడి పైసలు 50. పయిసా 1 కి 20 వుండేల గవ్వలు. వుండే 1 కి గవ్వలు 4" అని హైదరాబాదులో తాము మజిలీ చేసిన రోజులను గూర్చి వీరాస్వామయ్యగారు వ్రాశారు.

పుట 88-

సం॥ దిగవల్లి వేంకటశివరావు (1941).

చిన్నతనంలో చీట్ల పేక ప్రలోభంలో చిక్కుకున్నానని చెపుతూ వీరేశలింగం స్వీయ చరిత్రలో "నా మిత్రుడును నేనును మొట్టమొదట పందెములేకయే చీట్లాడుచుండినను తరువాత ప్రథమమున చింతగింజలను తదనంతరమున గవ్వలను బెట్టి యాడజొచ్చితిమి. అప్పుడు పదునారు గవ్వల వెల యొక దమ్మిడికి సమానముగా నుండెను; గవ్వలిచ్చి యప్పుడంగడిలో నే వస్తువునైనను గొనవచ్చును" ఇత్యాదిగా ప్రస్తావించారు.

పుట 47; ప్రథమ భాగము మొ. సం. (1982).

జూచి యామె చేతిలోని పండ్లను బుచ్చుకొని లోపలికిఁబోయి స్వామికి నివేదనచేసి వానిలోఁ గొన్ని పండ్లను తులసిదళములను మరలఁ దెచ్చి యందఱ శిరస్సులమీఁదను శఠకోపము నుంచెను. అంతట మాణిక్యాంబ వెనుతిరిగి యాలయ ద్వారమును దాఁటుచుండెను. రుక్మిణి యామె చెఱఁగు పట్టుకొని వెనుక నిలుచుండెను. ఒకప్రక్క సీతయు మఱియొక ప్రక్క నొక ముత్తైదువయు నిలుచుండిరి. ఆ సమయములో నెవ్వఁడో వెనుకనుండి రుక్మిణిమెడలోనికి చేయిపోనిచ్చి కాసులపేరును పుటుక్కున త్రెంచెను. రుక్మిణి వెనుకమరలి చూచునప్పటికి చేయియుఁ గాసుల పేరునుగూడ నదృశ్యము లాయెను. రుక్మిణి కేకతో పదిమందియు వచ్చి దొంగను పట్టుకొనుటకయి ప్రయత్నము చేసిరి. కాని యా దొంగ సహితము వారిలోనే యుండి తానును దొంగనే వెదకుచుండెను. అప్పుడు రుక్మిణి మొదలగువారు ప్రదోష సమయమున నగలుపోయినందుకయి మిక్కిలి విచారించుచు నింటికిఁ బోయిరి.

# ఆఱవ ప్రకరణము

సొమ్ము పోయినందుకు మంత్రజ్ఞులు చేసిన తంతు—రుక్మిణి మగఁడు పోయిన వార్త నొకఁడు చెప్పుట—రుక్మిణికి రుగ్మత వచ్చుట—సోదె యడుగుట—మగఁడు పట్టుట—భూత వైద్యము—సువర్ణ విద్య బైరాగి సొమ్ముతో నదృశ్యుఁడగుట

మఱునాఁడు ప్రాతఃకాలమున రాజశేఖరుఁడుగారు దంతధావనము చేసికొనుచు వీధి యరుగుమీఁదఁ గూరుచుండియుండఁగా సిద్ధాంతి తనతోఁ గూడ మఱియొక బ్రాహ్మణునిఁ దీసికొనివచ్చి యరుగుమీద నొకప్రక్కలు చతికిలఁబడెను. చేతిలో వెండిపొన్ను వేసిన ప్రేప బెత్తమును పట్టుకొని, తలయును గడ్డమును గోళ్ళును బెంచుకొని కనుబొమల సందున గొప్ప కుంకుమబొట్టు పెట్టుకొని గంభీరముగాఁ గూరుచున్న యీ విగ్రహమును నఖశిఖపర్యంతము తేఱిపాఱఁజూచి యాయన యెవరని రాజశేఖరుఁడుగారు సిద్ధాంతి నడిగిరి[1] – "వీరు మహామంత్రవేత్తలు; మళయాళమునందుఁ

1. వీరేశలింగం తల్లిగారికి దయ్యాలున్నాయన్న నమ్మకం ఉండేది. దాంతో ఆమె అప్పుడప్పుడు బాధపడుతుండేది.

1872 వ సం॥లో కోరంగిలోని ఆంగ్లో వెర్నాక్యులర్ స్కూలు ప్రధానోపాధ్యాయుడుగా వీరేశలింగం పనిచేస్తున్న రోజుల్లో తనకు తటస్థపడిన ఒక భూత వైద్యుణ్ణి గురించి విపులంగా స్వీయ చరిత్రలో పేర్కొన్నారు పంతులుగారు.

"అక్కడివారు గొప్ప భూత వైద్యుడని నా యొద్దకొక యోగిని గొని వచ్చిరి. ఆ బ్రాహ్మణ యోగి మిక్కిలి కండపుష్టిగలవాడు; పూటకు సేడు బియ్యపు అన్నమునకు తక్కువ కాకుండ తినెడివాడు. గడ్డమును, గోళ్ళను బెంచినవాడు, కాలికి కఱ్ఱ పావలు తొడిగి, చేత బెత్తమును బట్టి, కాషాయ వస్త్రములను గట్టి, నొసట గొప్ప కుంకుమ బొట్టుపెట్టి, చూచుటకు మహా భయంకరముగా నుండెడి వాడు. గంజాయి త్రాగెడివాడు; ముప్పదికిని, నలుబదికిని నడిమి ప్రాయముగల యా పురుషుని నా వద్దకు గొనివచ్చినప్పుడు నాకు మంత్రములయందు గాని, దయ్యములయందుగాని నమ్మకము లేకపోయినను, నేనాతని మా ఇంట నుంచుకొని భోజనము పెట్టెదననియు, నా తల్లి దేహము స్వస్థతపడిన తరువాత మంచి బహుమానము చేసెదననియు చెప్పితిని. అతడందుకొప్పుకొని మా ఇంట ప్రవేశించెను."

స్వీయ చరిత్రము, మొదటి భాగము.
పుట 68; 1982 ముద్రణం.

గొంతకాలముండి మంత్ర రహస్యముల నామూలాగ్రముగా గ్రహించినారు; వీరు కృష్ణా తీరముననుండి యాత్రార్థమయి విజయం చేసినారు; వీరి పేరు హరిశాస్త్రిలవారు; వీరీవఱకు బహుస్థలములలో పోయిన వస్తువుల నిమిషములో దెప్పించి యిచ్చినారు; వీరు నాలుగు సంవత్సరముల నుండి వానప్రస్థాశ్రమమును స్వీకరించి యున్నారు" అని తా నాతనిని రెండు దినముల నుండియే యెఱిగినవాఁడయినను జన్మదినము నుండియు నెఱిఁగి యున్న వానివలె నాతని చరిత్రమును చెప్పి, 'నఖలో మైర్వనాఁశ్రమీ' యను దక్షస్మృతి వచనమును జదివి గోళ్ళను వెంట్రుకలను బెంచుకొనుటచే వానప్రస్థుఁ డగు నని తల్లక్షణమును జెప్పెను. అప్పుడు హరిశాస్త్రిలు తన మంత్ర సామర్థ్యమును గొంతసేపు పొగడుకొని తా నావఱకు పోయినవస్తువులు తెప్పించినా నన్న స్థలముల పట్టిక నొకదానిని బహుదినములు ప్రయాసపడి వల్లించిన వానివలె తడవుకోకుండఁ జదివెను. అప్పుడు సిద్ధాంతి రుక్మిణి వస్తువు పోయిన సంగతి జెప్పి దానిజాడ చెప్ప వలయునని ప్రార్థించెను. తోడనే హరిశాస్త్రిలు తన ముక్కు పుటముల యొద్ద వ్రేలు పెట్టుకొని చూచి, ఆకాశమువంకఁ జూడ్కి నిగిడించి వ్రేళ్ళ మడఁచి యేమో లెక్కించి నిమిషమాలోచించి 'పోయినవస్తువు ఇక్కడికి వచ్చుచుఁబోవుచునుండు వారి చేతనే చిక్కినది కాని యిల్లు దాఁటిపోలే'దని చెప్పెను. ఇంతలో రాజశేఖరుఁడుగారి ముఖప్రక్షాళన మయినందున నందఱుఁగలిసి లోపలికిఁ బోయిరి. నడవలో నిలుచుండి హరిశాస్త్రిలు వస్తువును దెప్పించి యిచ్చుటకు తనదే భారమనియు, మధ్యాహ్నము వచ్చి మంత్రము వేసెదను కాఁబట్టి యాసమయమున కింట నున్న సేవకు లందఱను సిద్ధముగా నుంచవలయు ననియుఁ జెప్పి, 'లోపలి నుండి కొంచెము బియ్యమిప్పుడు తెప్పింపుఁడు' అని కోరెను. సిద్ధాంతియే లోపలికిఁ బోయి యొకపళ్ళెములో బియ్యమును దీసికొనివచ్చి శాస్త్రిల కోరిక ప్రకారము గృహమునఁ గనఁబడ్డ భృత్యవర్గమును బిలుచుకొని వచ్చెను. ఆ మీఁదట శాస్త్రిలు తమ మంత్ర ప్రభావమును గొంచెము చిత్తగింపవలయునని మనవిచేసి, అక్కడ నున్న వారిలో నెవ్వరైన నొక వస్తువును దీసి రహస్యముగా దాఁచిన యెడల వారి పేరు చెప్పెదనని చెప్పి, తాను వీధిలోనికిఁ బోయెను. అప్పుడు రాజశేఖరుఁడుగారు తన యుంగరము

నొకని చేతికిచ్చి పదిలముగా దాపించి, యాతఁడు వచ్చి కూరుచున్న తరువాత శాస్త్రిలను లోపలికిఁ బిలిచి యుంగరమును దాఁచిన వానిని జూపుమని యడిగిరి. శాస్త్రిలు తోడనే యక్కడనున్న పదిమంది చేతులలో బియ్యమునుబెట్టి యొక రొకరేవచ్చి బియ్యమును పళ్ళెములో బోయవలెనని చెప్పి తా నేమో మంత్రమును జపించుచుండెను. అప్పుడందఱును వరుసగా వచ్చి బియ్యము పళ్ళెములోఁ బోసిరి. వెంటనే యతఁడుంగరమును దీసినవాఁ డీతఁడని చూపెను. అప్పుడక్కడనున్నవా రందఱును నద్భుత రసాక్రాంతులయిరి. రాజశేఖరుఁడుగారును అతఁడు మహా మంత్రవేత్తయని యొప్పుకొని నమస్కారము చేసి, పోయిన నగ యాతని మంత్రశక్తి చేత వచ్చునని నమ్మకముతో మధ్యాహ్నమునఁ దప్పక రావలయునని పలుమారు ప్రార్థించి, తీసుకొనిరమ్మని సిద్ధాంతితోను జెప్పెను. సిద్ధాంతియు శాస్త్రిలును ముఖవిలాసముతో సల్లాపసుఖము ననుభవించు కొనుచు నింటికి నడచిరి. ఇక్కడికి వచ్చునప్పుడే సిద్ధాంతియు శాస్త్రియు రహస్యముగా నన్ని సంగతులను మాటాడుకొని రాజశేఖరుఁడుగారిచ్చు బహుమతిలో చెఱిసగమును బుచ్చుకొనునట్లు సమాధానపడిరి. కాఁబట్టి రాజశేఖరుఁడుగారికి నమ్మకము పుట్టించుట కయి ముందుగా చేయవలసిన తంతును కూడఁ బలుకుకొన్న తరువాత, వస్తువును దాఁచినవాఁడు పళ్ళెములో బియ్యము పోయఁగానే వెనుకఁ దాను బోసెదననియు వాఁడే దానిని తీసి దాఁచినాఁడని చెప్పవలసిన దనియు సిద్ధాంతి యింటి వద్దనే నిర్ణయము చేసినందున శాస్త్రి లాతనిసాహాయ్యముచేత నిమిషములో నుంగరమును దీసిన వానిని చూపఁగలిగెను. మధ్యాహ్న భోజనము చేసి బయలుదేఱి కావలసిన పరికరములతో సిద్ధాంతియు హరిశాస్త్రిలును వచ్చి రాజశేఖరుఁడుగారి యిల్లు చేరిరి. అంతకు మునుపే యింటఁగల పరిచారకులును తక్కినవారును రావింపబడిరి. హరిశాస్త్రిలకు వినబడు నట్లుగా సిద్ధాంతి రథోత్సవ సమయమున రుక్మిణితో నెవరు వెళ్ళిరో కానులపేరు పోయినప్పు డెవ్వరెవ్వ రెచ్చట నుండిరో యాసంగతులు వెంటవెళ్ళినవారి నడిగి తెలిసికొనుచుండెను. అంత సిద్ధాంతి వచ్చి రహస్యముగా శాస్త్రిలచెవిలో నొకమాటచెప్పి మరల వెళ్ళి యేమేమో సంగతులను మాటాడుచుండెను. ఇంతలో రాజశేఖరుఁడు

గారు వచ్చి వారినందఱని లోపలికి రండని పిలిచిరి. హరిశాస్త్రులు అమ్మవారి పెట్టెను తీసికొని యిప్పుడే వచ్చెదనని చెప్పిపోయి గడియసేపుతాళి యిత్తడి పెట్టెను పట్టుకొని కుడిచేతి కొక రాగికడియమును దొడుగుకొని మరలవచ్చి, అలికి దిగవిడచియున్న చావడిలో నల్లని పచ్చని ముగ్గులతో నొక్క విగ్రహము వేసి, దాని నాభిస్థానముం దాను దెచ్చిన యిత్తడి పెట్టెను బెట్టి మూత తీసి 'జయజనని' యని కేకవేసి కొంతసేపేమో కన్నులు మూసికొని జపముచేసి, రాజశేఖరుఁడుగారివంకఁజూచి యొక తెల్లకాగితము తెమ్మని యడిగెను. ఆ కాలములలో కొండపల్లి కాగితములు తప్ప మఱియొకరీతి కాగితములు లేవు. రాజశేఖరుడుగారి కుమారుఁడు లోపలికిఁబోయి యొక తెల్లకాగితము దీసికొని వచ్చి యిచ్చెను. అప్పుడా కాగితము నందఱును జూచుచుండగా సమానములైన యెనిమిది ముక్క లుగాఁ జించి యం దొక్కముక్కను దనయొద్ద నుంచుకొని తక్కిన యేడు ముక్కలను వారికిచ్చివేసి, తానుపాసించు దేవతయొక్క శక్తిచేత ఆ కాగితపు ముక్కమీఁదికి వస్తువును దొంగిలించినవారి పేరు వచ్చునని చెప్పి, యా ముక్కను ఇత్తడి పెట్టెలోఁబెట్టి నిమిష మందుంచి యొక మంత్రమును జదివి యా ముక్కను మరలఁ బయికిఁ దీసి తన చేతులోనే పట్టుకొని యందఱకు జూపి, దానిని క్రిందనుంచి మూలలను కుంకుమము రాచి, హారతి కర్పూరపు తునకతో దాని మీఁద బీజాక్షరములను యంత్ర మునువేసి క్రింద నుంచి, యొకరొకరే వచ్చి దానిమీఁద జేయివైచి పొండని యాజ్ఞాపించెను. స్పష్టముగా గనపడుచున్న యా తెల్లకాగితము మీఁద నెల్లవారును చేతులువేసి పోయి యేమి జరుగునో చూతమను వేడుకచేతఁ దమస్థానముల గూరుచుండి జూచుచుండిరి. అందఱును ముట్టుకొని పోయిన తరువాత హరిశాస్త్రులా ముక్కను దీసి సాంబ్రాణి ధూపమువేసి, హారతి కర్పూరము వెలిగించి దానిమీఁద ఆ ముక్కను నాలుగైదుసారులు మోపి రాజశేఖరుడుగారి చేతికిచ్చెను. ఆయన చేతిలోఁ బుచ్చుకొని చూచునప్పటికి దానిమీఁద పెద్ద యక్షరములతో 'చాకలసరడు' అని వ్రాసియుండెను. ఆ కాగితము పయికెత్తగానే యెల్లవారికిని స్పష్టముగా వంకరయక్షరములు కనఁబడుచుండెను. దగ్గరనున్న వారిలో నొకరు దానిని పుచ్చుకొని చదువు నప్పటికి చాకలి సర్వఁడొకడు తప్ప మిగిలినవారందఱును నద్భుత

ప్రమోదమగ్న మానసులయి చప్పటలుగొట్టి శాస్త్రిల శక్తిని, ఉపాసనా బలమును వేయినోళ్ళం గొనియాడఁజొచ్చిరి. కొంద ఱక్కడ నున్న వారిలో "వీఁడె నగదీసిన దొంగ; అప్పుడు వెనుక నిలుచున్నాఁ"డని వానిని నిందింపసాగిరి. సీతవచ్చి కాసులపేరు పోయినప్పుడు సర్విగాఁడు పండ్లు చేతిలోఁ బట్టుకొని మా వెనుక నిలువఁబడినాఁడని చెప్పెను. అందు మీఁద నందఱును నగపహరించినవాఁడు చాకలి సర్విగాఁడు తప్ప మఱి యొకఁడు కాఁడని నిశ్చయించిరి. ఇంటనున్నవారును రాజశేఖరుఁడు గారును కూడ ఆ ప్రకారముగానే నమ్మిరి. ఆ వస్తువును శీఘ్రముగాఁ దెచ్చియిమ్మని యడిగినప్పుడు, ఆ చాకలివాఁడు కంటికి నేలకు నేకధారగా రోదనముచేయుచుఁ దా నే దోషము నెఱుఁగనని బిడ్డల మీఁదను భార్య మీఁదను ఒట్టుపెట్టుకొనసాగెను. కాని యదియంతయు దొంగయేడుపని యెల్లవారును నిశ్చయము చేసికొనిరి. నయమున భయమున వాని నన్ని విధముల నడిగినను వాఁడు తాను నిరపరాధిననితియే చెప్పి యేడుచుచు వచ్చినందున, హరిశాస్త్రిలు రాజశేఖరుఁడుగారిని చాటునకు 'మాట' యని పిలుచుకొనిపోయి 'మీ సెలవయిన పక్షమున వీనికి ప్రయోగముచేసి పోయిన వస్తువును దెప్పించెద'నని చెప్పెను. వాఁడు చిన్నతనము నుండియు మిక్కిలి నమ్మకముగా బనిచేసినవాఁడయినందున వానికే హానియుఁ జేయ నొడఁబడక రాజశేఖరుఁడుగారు వానిని కొలువు నుండి మాత్రము తొలగించివేసిరి. వాడు తాను నిరపరాధినని యేడ్చుచు నింటికిఁ బోయెను. మొదట సిద్ధాంతి శాస్త్రిల చెవిలో రహస్యముగాఁ జెప్పినది చాకలి సర్వనిపేరు వ్రాయుమనియే. అతఁ డమ్మవారి పెట్టెను దెచ్చు మిషమీఁద వెలుపలికిఁబోయి యొక కాగితపు ముక్కమీఁద నీరుల్లి పాయల రసముతో "చాకలి సరడు" అని యక్షరజ్ఞానము చక్కగా లేక పోవుటచేత 'వ' వా ఒత్తు పోఁగొట్టి వ్రాసి యాఱబెట్టి పెట్టెలోఁ బెట్టుకొని వచ్చెను. రాజశేఖరుఁడుగారి కొమరుఁడు కాగితమును తీసికొనివచ్చినప్పుడు తానాపేరు వ్రాసిన కాగితమంత ముక్కను జింపుకొని తక్కినదాని నిచ్చి వేసి, దానిని పెట్టెలోఁ పెట్టినపుడు మార్చి మొదటి తన కాగితమును పయికిఁ దీసెను. అదియు మునుపటి కాగితమువలెనే యున్నందున నెవ్వరు ననుమానపడలేదు. ఆ కాగితముమీఁద హారదికర్పూరముతో బీజాక్షరములు

వ్రాసినది యుల్లిపాయకంపు పోవుటకేకాని మఱియొకందునకుఁగాదు. తరువాత సాంబ్రాణి పొగలోను కర్పూరపు దీపముమీఁదను పొగచూరఁబెట్టుట మున్ను కనబడకుండ నున్న యక్షరములు స్ఫుటముగాఁ గనబడునట్టు చేయుటకయి కావించినతంత్రము. ఈ ప్రకారముగా తన మంత్ర ప్రభావముచేత శాస్త్రి అంతటి ఘనకార్యమును జేసినందుకయి వస్తువు దొరకకపోయినను రాజశేఖరుఁడుగా రాతని కొక దోవతులచాపును కట్టబెట్టి నాలుగు రూపాయల రొక్కము నిచ్చిరి. ఇంటికి బోయిన తరువాత హరిశాస్త్రిలును సిద్ధాంతియు వానిని సమభాగంబులుగాఁ పంచుకొనిరి.

ఆ మఱునాఁడు జాముప్రొద్దెక్కిన తరువాత రుక్మిణి యొక్కతెయు పడమటింటి పంచపాళిలోఁ గూరుచుండి యెఱుకత చెప్పిన గడువు నిన్నటితో వెళ్ళిపోయెనే. ఇంకను మగఁడు రాఁడాయెనే యని తలపోయుచు వస్తువు పోయినందునకయి విచారించుచుండెను. ఆ సమయమున నిఱువది సంవత్సరముల వయసుగల యొక చిన్నవాఁడు లోపలికి వచ్చి చేతిలోని బట్టలమూఁటను క్రిందఁబడవైచి రుక్మిణి మొగమువంకఁ జూచి పెద్దపెట్టున నేడ్చెను. అదిచూచి రుక్మిణి సంగతి యేమో తెలిసికొనకయే తానును నేడ్వఁజొచ్చెను. ఆ రోదనధ్వని విని యింటనున్న వారందఱును లోపలినుండి పరుగెత్తుకొని వచ్చి యేమియని యడిగిరి. అప్పుడా చిన్నవాఁడు గ్రుడ్లనీరు గ్రుక్కుకొనుచు గద్గదస్వరముతో 'రుక్మిణి మగఁడు నృసింహస్వామి కాశినుండి వచ్చుచు త్రోవలో జగన్నాథమువద్ద పుష్యశుద్ధ నవమినాఁడు గ్రహణిజాడ్యముచేత కాలధర్మము నొందెననియు; దహనాదికృత్యములను తానే నిర్వహించితిననియుఁ జెప్పెను. ఆ మాటలు విన్నతోడనే యింటనున్న వారందఱును నొక్కసారిగ గొల్లుమని యేడ్చిరి. ఆ యాక్రందన ధ్వని విని చావడిలో నున్న రాజశేఖరుఁడుగారును పొరుగిండ్లవారును వచ్చి కారణంబును దెలిసికొని పలు తెఱంగుల విలపించిరి. అప్పుడక్కడనున్న పెద్దలందఱును వారినోదార్చి వారిచే స్నానములు చేయించి వేదాంత వచనముల నుపదేశింపసాగిరి. ఇట్లు కొన్ని దినములు జరిగిన తరువాత బంధువులు మొదలగువారు రుక్మిణికి

శిరోజములు తీయించు విషయమయి రాజశేఖరుడుగారితో ప్రసంగించిరి గాని, ఆయన తన కొమార్తె మీఁది ప్రేమచేత చిన్నతనములోనే యీ పని చేయింప నొప్పుకొననందున, నందఱునుగూడ దానివలన నొక బాధకము లేదని చెప్పి యాయన చెప్పినవిధమే మంచిదని యొప్పుకొనిరి.

మన దేశములో పతిరహితులగు యువతుల దురవస్థను తలఁచు కొన్న మాత్రమున పగవారికయినను మనస్సు కలుక్కు మనకమానదు. పతిశోకమును మఱచునట్లుచేసి యాదరింపవలసిన తలిదండ్రులే జీవితేశ్వరులుపోయి దుఃఖసముద్రములో మునిఁగియున్న తమ కడుపున బుట్టిన కొమార్తెను కరుణమాలి సమస్తాలంకారములకును దూరురాండ్రను జేసి తలగొఱిగించి కురూపిణులనుజేసి ముసుఁగువేసి మూల గూర్చుండ బెటుదురు. రెండుపూఁటలను కడుపునిండ తిండియయినఁ బెట్టక మాడ్చి యందఱి భోజనములు నయిన తరువాత మూఁడుజాముల కిన్ని మెతుకులు వేయుదురు. మనసయినను మంచిబట్ట కట్టుకోనియ్యక అంచులేని ముతక బట్టనే కట్టుకోనిత్తురు. వేయేల? మగఁడు పోయినవారి జీవనములనే దుఃఖ భాజనములుగాఁజేసి, వారిని జీవచ్ఛవములనుగా నుంతురు. ఎవ్వరును పెట్టినవిగాక పుట్టుకతోనే భగవంతు డలంకారము దయచేసినట్టియు, చిన్నప్పటినుండియు చమురురాసి దువ్వి ప్రాణముతో సమానముగా పెంచుకొనుచున్నట్టియు చక్కని శిరోజములను నిర్దయుఁడైన మంగలి వాని కత్తి కొప్పగించుటకంటె మానవతులకు ప్రాణత్యాగమే మేలని తోఁచును; ఇంటఁగల కష్టమయినట్టియు, నీచమయినట్టియు పనులన్నియు వారిమీఁదనే పడును; పుట్టినింటఁ జేరగానే, వదినెలు మరదండ్రును దాసినిగాఁ జూతురు; గారవమనుమాట యుండదు; శుభకార్యములయందు నలుగురిలోఁ దలయెత్తుకొని తిరుగుటకు నోచుకొనకపోఁగా, మొగ మగపడిన మాత్రమున మీఁదు మిక్కిలి యెల్లవారును దుశ్శకునమని దూషింతురు. ఈ హేతువుచేతనే "విధవ" యను మాటయే వినుటకు శూలము వలె గర్ణకఠోరముగా నుండును; ఎవ్వనినైన 'విధవా' యను పేరను

విశాలిన మాత్రమున శోకమయిన అట్లుగా నెంచుకొని వాఁడు మండి పడెను.[1]

ఈ స్థితియంతయు కన్నులకు గట్టినట్లగపడి, ఆ వర్తమానము తెలిసిన దినము మొదలుకొని రుక్మిణి రాత్రియుఁ బగలును గదిలోనుండి వెలుపలికి రాక నిద్రాహారములు మాని మగనికయి శోకించుచు గృశింప సాగెను. విచారమునకుఁ దోడు దేహమున నేదియో వ్యాధి కూడ నాశ్రయించెను. ఆమె లేవలేనంత బలహీనురాలగు వఱకును వ్యాధి సంగతిని నెవ్వరును కనుఁగొన్నవారుకారు. కనుగొన్న తోడనే రాజశేఖరుఁడుగారు ఘనవైద్యుఁడని ప్రసిద్ధికెక్కిన జంగము బసవయ్యను పిలిపించి చేయి చూపించిరి. అతఁడు రుక్మిణి పరున్న మంచముమీఁద గూరుచుండి యెడమచేయి పట్టుకొని నాడిని నిదానించి చూచి వాతనాడి విశేషముగా నాడుచున్నదని చెప్పి, యామెకుఁ బెక్కు దినములనుండి, శీతజ్వరము వచ్చుచున్నదనియు వెంటనే కనుగొనకపోవుటచేత జ్వరము దేహములో జీర్ణించినదనియుఁ జెప్పి వైద్య గ్రంథమునుండి—

శ్లో॥ పారాదార్వి మహాబలా త్రికటుకా జాజీరసోనా స్తథా!
విష్ణుక్రాంతసినాడికా గృహభవోధూమస్తులస్యాద్వయం!
నారంగస్య శలాటపత్ర మరలు త్యక్వత్ర నిర్గుండికా!
భార్గీపక్వపటచ్ఛదాచ్చ సకలాన్ శీతజ్వరా న్నాశయేత్॥-

---

1. "కడుపున పుట్టిన కన్న తల్లిదండ్రులకైన నా ముగ్ధబాలికలయందు కరుణపుట్టి వారిని పునర్వివాహముచేసి సుఖపెట్టవలెనన్న బుద్ధి జనింపగూడదా? నిన్న మొన్నటివరకు నెంతో ప్రేమతో పెంచి ప్రాణములనెల్లను వారిమీదనే పెట్టుకొనియుండి భర్త పోయినాడన్న పాడు వార్త విన్న మాత్రమున సమస్తాలంకారములను తీసివేసి విరూపినిజేసి ముసుగువేసి మూల కూరుచుండబెట్టి చచ్చియు చావకుండ ...దుఃఖభాజనముల జేయుటకై తల్లిదండ్రుల కెట్లు మనసొప్పుచున్నది" అని స్త్రీ పునర్వివాహశాస్త్ర సంగ్రహము, స్త్రీ పునర్వివాహ విషయకోపన్యాసము, స్త్రీ పునర్వివాహ విషయక ప్రథమ విజ్ఞాపనము, స్త్రీ పునర్వివాహ విషయక ద్వితీయ విజ్ఞాపనము మొదలైన రచనలలో యీ విషయాలన్నిటినీ వీరేశలింగం పదే పదే ప్రస్తావించారు.

అను శ్లోకమును జదివి, తెప్పించవలసిన వస్తువుల నొక కాగితము మీఁద వ్రాయించి యప్పటి కింటికిఁ బోయెను. ఆ మధ్యాహ్నము నకే రాజశేఖరుఁడుగారు వస్తువులన్నిటిని దెప్పించి వైద్యునకు వర్తమానము నంపినందున, అతఁడు వచ్చి వస్తువులను చూర్ణము చేయించి పొట్లములు కట్టించి, తేనె యనుపానముచేసి మూఁడు వేళలను మూఁడు పొట్లము లిమ్మని చెప్పి, నూనె, గుమ్మడి, బచ్చలి, పులుసు, కంద, పనస మాత్రము తగులగూడదని పథ్యమును విధించి, ప్రతి దినమును రెండు పర్యాయములు వచ్చి చేయిచూచి గుణము ను కట్టుకొని పోవుచుండును. మొదట రుక్మిణికి శరీరము కొంచెము స్వస్థతపడ నారంభించినది. కాని తరువాత రాత్రులు పలవరింతలు మొద లయినవిపుట్టి జ్వర మధికము కాసాగెను. అప్పుడు వైద్యుని బిలిచి జ్వరమింకను నిమ్మళించలేదేమని యడుగఁగా, అతఁడు 'రేవత్యా మను రాధాయాం జ్వరో బహుదినం భవేత్' అని చదివి యీ జ్వరము రేవతీ నక్షత్రమున వచ్చినదికాన బహుదినములకుఁగాని పోదని చెప్పెను. కాని యాతని మాటలయం దంతగా నమ్మకము చిక్కక గ్రామములోనున్న మరియొక వైద్యునిఁ బిలిపించి, రాజశేఖరుఁడుగారు రుక్మిణిని జూపించిరి. అతఁడు చేయి చూచి పైత్య జ్వరమని చెప్పి, మూఁడు పూటలలో రుక్మిణిది వజ్రశరీరము చేసెదనని ప్రగల్భవచనములు పలికి, అతని యొద్ద మాటలేకాని మందులు విస్తారముగా లేనందున వాడుక ప్రకార ముగా 'లంఘనమ్ పరమౌషధ' మన్న యొక్క సూత్రమునే శరణము గావించుకొని లంకణములు కట్ట నారంభించెను. అతఁడు నవజ్వర పక్వము కావలెనని పలుకుచున్నను లక్ష్యము చేయక, దినదిన క్రమమున రుక్మిణి శుష్కించి యంతకంతకు మఱింత బలహీనురాలగుచుండుట చూచి యాతని వైద్యమును మానిపించి, మరల మొదటి వైద్యునినే రావింపఁగా నతఁడు వెంటనే పథ్యము పెట్టించి యౌషధసేవ చేయింప నారంభించెను. ఆ యౌషధ బలమున వ్యాధి కొంచెము మళ్ళుముఖము

పట్టినను, ఒక పట్టున నిశ్శేషమయినది కాదు.[1]

ఈ లోపల మాణిక్యాంబ యొకయాదివారమునాఁడు నాలుగు గడియలకుఁ దెల్లవాఱుననఁగా లేచి సుబ్బమ్మను వెంటబెట్టుకొని యెవ్వరును వెళ్ళకముందే ముందుఁగా దాము వెళ్ళవలెనని బయలుదేఱి కొమార్తెమీఁది ప్రేమచేతఁ దాను స్వయముగానే కోరలమ్మ గుడికి సోదె యడుగుటకయి వెళ్ళెను. ఆ గుడియొద్ద నున్న మాలది మాణిక్యాంబ ధూపమువేసిన మీఁదట నిష్టదేవత తన కావేశమయినట్లు కనఁబడి తాను రుక్మిణి పెనిమిటినని బయలపడి, కానిదేశములో దిక్కుమాలిన పక్షినయి చచ్చిపోతినని యేడ్చుటయేగాక తాను రుక్మిణిమీఁది మోహముచేత వచ్చితిననియు, ఆమెను దనయొద్దకుఁ దీసికొని పోయెదననియుఁ జెప్పెను. ఆ సంగతులు చెప్పునప్పుడు మాణిక్యాంబయు సుబ్బమ్మయుఁ గూడ నేడువసాగిరి. ఆ యుద్రేకము శాంతి పొందినపిమ్మట వారా మాలదానికి సమర్పింపవలసినదాని నర్పించి యింటికిఁ బోయిరి. రుక్మిణికిని రాత్రులు కలలలోను పగలుసహితము కన్ను మూసికొనునప్పుడును మగఁడెదుటఁ గనఁ బడుచుండెను. ఒకానొకప్పుడు మాటాడునట్లు సహితమామెకు వినఁబడుచు వచ్చెనుగాని యామాటల నామె గ్రహింపఁ గలిగి

---

1. చిన్నతనంలో తనకు జబ్బు చేసినప్పుడు అనాటి వైద్యుల్ని గురించి వీరేశలింగం స్వీయచరిత్రలో ప్రస్తావించటమేకాక, వైద్యుల కపటాలను, స్వార్థపరత్వాన్ని గూర్చి వివేకవర్ధనిలో ఆయన చాలా వ్యాసాలు వ్రాశాడు.

"ఇంగ్లీషు వైద్యులును తెలుగు వైద్యులును కూడా బహుమాసములు నా కనేకౌషధములిచ్చిరి గాని యెవరి మందువలనను రోగమించుకయు నివారణము కాలేదు. శరీరములోని రక్తమాంసములు హరించుకుపోయి శల్యావశిష్టుడనై నేను పూచికపుడకవలెనయితిని.

—మన వైద్యులు నన్ను విడిచిపెట్టిన తరువాత మా యింటి సమీపముననే వాసము చేయుచుండినట్టియు మొదటినుండియు నాకు మందులిచ్చుచుండినట్టియు గంధ్రాపు వెంకన్నగారనెడు వైద్యశిఖామణి నాకు కూరగాయ వైద్యము చేయుచు వచ్చెను. తుదకాయన వైద్యమువలననే దేహస్వాస్థ్యము కలిగినది."

స్వీయ చరిత్ర, పుట 30 - ప్రథమ భాగము, మొదటి సంపుటం (1882)

నది కాదు. ఆమె యొకానొకప్పుడెవ్వరో గుండెలమీద నెక్కి కూరుచున్నట్లు తలఁచి నిద్రలోఁ గేకలు వేయుచుండును.

ఇట్లుండఁగా నొకనాఁడు హరిశాస్త్రులు వికృత వేషముతో మరల వచ్చి రుక్మిణి చేయిచూచి భూతనాడి యాడుచున్నదని చెప్పెను. బైరాగి చేత విభూతి పెట్టించి లోపలికి తీర్థమిప్పించిరి కాని, అందువలన రుక్మిణి క్షేమియు గుణ మగపడలేదు. ఒకనాఁడొక బుడబుక్కలవాఁడు నెత్తిమీఁది తలగుడ్డలోఁ బక్షియీఁకలును, బుజముమీఁద ప్రేపబెత్తముల కట్టయు, వీఁపున బెత్తములకు వ్రేలాడఁగట్టిన పెద్ద తోలుసంచియునుండ దక్క వాయించుచు వచ్చి, మాణిక్యాంబ శకునమడిగినప్పుడు గీతలను బొమ్మలను వేసియున్న తాటాకుల పుస్తకము చూచి తీర్థమునకు వెళ్ళిన దినమున రావిచెట్టుమీఁదినుండి వచ్చి యొక కామినీగ్రహము సోఁకిన దనియు దిగఁదుడుపు పెట్టినఁ బోవుననియుఁ జెప్పి యొక వేరుముక్క యిచ్చి దానిని వెండి తాయెతులోఁబెట్టి దండచేతికిఁ గట్టుమని చెప్పి యొక రూపాయపుచ్చుకొని పోయెను. ఆ ప్రకారముగా మాణిక్యాంబ రుక్మిణికి దిగఁదుడుపు పెట్టెనుగాని యందువలనను గార్యమగపడలేదు. ఒక దినమున సుబ్బమ్మ కావేశము వచ్చి వేంకటేశ్వరులు బయలఁబడి యదియంతయుఁ దన మాహాత్మ్యమే యనియు, కొండకువచ్చి తనకు నిలువుదోపిడిచ్చెదనని తల్లి మ్రొక్కుకొన్న పక్షమున సర్వము నివర్తియగుననియుఁ జెప్పెను. ఆ ప్రకారమే చేసెదనని మాణిక్యాంబ మ్రొక్కుకొని తన నగలలో నొక దానిని ముడుపుగట్టెను. గాని దానివలనను రుక్మిణి దేహస్థితి యనుకూల దశకు రాలేదు. అంతట హరిశాస్త్రులు వచ్చి యీ రాత్రి చిన్నదానిచేతఁ బలికించి దయ్యమును వదలగొట్టెదనని ప్రతిజ్ఞచేసి, తాను నాలుగు గడియల ప్రొద్దువేళనే వచ్చి చావడి యలికించి దానినిండ రంగు ముగ్గులతో ధైర్య శాలులయిన పురుషులు చూచినను భయపడునట్టుగా వికృతమయిన స్త్రీ విగ్రహము నొకదానిని వేసి తాను స్నానముచేసి జుట్టు

విరియఁబోసికొని కుంకుమముతో మొగమంతయు నొకదేబొట్టు పెట్టుకొని, రుక్మిణినీ స్నానము చేయించి తడిబట్టతో నా పట్టునడుమఁ గూరుచుండఁబెట్టి మొగమునకు విభూతి రాచి చుట్టును ఢిండెనాదములు మ్రోగునట్లు మనుష్యులను నియమించి, కన్నులు మిఱుమిట్లు గొన నెదుర గొప్ప దీపములు పెట్టించి, మంచివారికి సహితము పైత్యోద్రేకముచేయు కలాపములు వేయుచు, చుట్టుపట్ల యిండ్లలోని పిల్లలందఱును జడిసికొనులాగున "హ్రాం" "హ్రీం" అని పెద్ద గొంతుకతో బీజాక్షరముల నుచ్చరించుచు, గ్రుడ్లెఱ్ఱచేసి బెత్తము పుచ్చుకొని కొట్టఁబోయినట్టుగా రుక్మిణి మీదికి వెళ్ళి "ఉన్నది యున్నట్టుగాఁ జెప్పు" మని కేకవేసెను. ఆవలనే దేహస్మృతి తప్పి వికారముగాఁ జూచుచున్న యా రుక్మిణి తల్లి సోదెకు వెళ్ళివచ్చి చెప్పిన ప్రకారముగా తాను నృసింహస్వామిననియు, భార్యమీఁద మక్కువ తీఱక వచ్చి యావహించినాఁడ ననియు, తనతోఁగూఁడ నామెను దీసికొనిపోయెదననియు పలికెను. అంతనా పైత్యోద్రేకము పోవునట్టుగా రుక్మిణి మొగమునకేమోరాచి యామెకు తెలివి వచ్చినమీఁదట లోపలికిఁ గొనిపోయి శైత్యోపచారములు చేయుఁడని దగ్గఱ నున్నవారితోఁ జెప్పి హరిశాస్త్రిలు ఇంటికిఁ బోయెను. రుక్మిణి యాదినమును మఱునాఁడును బలహీనముగాను మత్తుగాను పడియుండెను. మఱునాఁటి యుదయమున మరల హరిశాస్త్రిలు వచ్చి రుక్మిణిని పట్టినది మొండిగ్రహ మనియు, మహామంత్రముచేతఁగాని శాబరములచేత సాధ్యము కాదనియు, అయినను తానుజేసిన తపస్సంతయు ధారపోసి వదలఁగొట్టెదననియుఁజెప్పి, రాత్రికి తొమ్మిదిమూరల క్రొత్త వస్త్రమును, అఖండము నిమిత్తము మణుగు నేయియు, పుష్పములును, ఆఱుమూరల జనపనారత్రాడును, నాలుగు మేకులు, రెండుకుంచముల నీరుపట్టు లోతైన యిత్తడి పళ్ళెమును సిద్ధము చేయించి రెండవత్రోవలేని యొకగదిని గోమయముతో నలికించి యుంచుఁడని రాజశేఖరుఁడుగారితోఁ జెప్పిపోయెను. రాజశేఖరుఁడుగా రాప్రకారము సర్వము జాగ్రత్తపెట్టించి యాతనిరాక కెదురుచూచు చుండిరి. అతఁడు రాత్రి తొమ్మిదిగంటలయిన తరువాత వచ్చి గదిలో అఖండదీపమును వెలిఁగించి, అమ్మవారి పెట్టెను దాని సమీపమునసుంచి, బియ్యపుముగ్గుతో గదికి నడుమ నొక చిన్న పట్టు పెట్టి యందులో రుక్మిణిని గూరుచుండబెట్టి

కొంచెము సేపు తనలోనేమో మంత్రమును జపించి దిగ్బంధనము చేసి, గది నాలుగు మూలలను మంత్రోదకమును చల్లి రుక్మిణి నావలకుఁ దీసికొని పోవచ్చు నని చెప్పి, ఆమెను లోపలికి గొనిపోయిన తరువాత గదితలుపు లోపల గడియవేసికొని గడియసేపుండి వెలుపలికి వచ్చి పయిని తాళము వేసి, ఆ గ్రహమునకు బ్రతికియున్న కాలములో నృసింహ మంత్రము వచ్చియున్నది, కాఁబట్టి యది యే దేవతకును లోఁబడినది కాదనియు, తన యావచ్ఛక్తిని వినియోగించి గదిని విడిచి రాకుండునట్లు బంధించి మాత్రము వచ్చితిననియు, తా నీవలనుండి శరభసాళ్వమును బ్రయోగించి నచో ఘోర యుద్ధముచేసి లోఁబడునుగాని మఱియొక విధముగా లోఁబడ దనియుచెప్పి— "ఓం-ఖేం-ఖం-ప్రమనిహుం-ఫట్-సర్వశత్రు సంహారిణే-శరభసాళ్వాయ-పక్షిరాజాయ-హుం-ఫట్-స్వాహా" –[1] అని శరభ సాళ్వమును పునశ్చరణ చేయనారంభించెను. రెండు మాఱులు మంత్రము నుచ్చరించునప్పటికి గదిలోనుండి యొక మనుష్యుని మఱి యెవ్వరో కొట్టు చున్నట్టు చిన్న చిన్న దెబ్బలు వినఁబడినవి; ఆ పిమ్మట నొక పెద్దదెబ్బ వినఁబడెను. ఈ ప్రకారముగా నరగడియ సేపు దెబ్బలు వినఁబడుచువచ్చి సద్దణఁగిన తరువాత గ్రహము సులభముగానె దొరికెననియు దానినిప్పుడే తీసికొనిపోయి గోదావరిలోఁ గలిపెదననియుఁ జెప్పి వాఁడొక్కఁడును, గదిలోనికిపోయి యందలి సమస్త వస్తువులను దీసికొని హరిశాస్త్రిలు వెళ్ళిపోయెను. ఆ మఱుచటి దినము మొదలుకొని క్రమక్రమముగా రుక్మిణి జబ్బువదలి యారోగ్యమును బొందసాగెను. తరువాత నా బ్రాహ్మణుఁ డొకదినమును రాగిరేకుమీఁద నొక ప్రక్కను ఆంజనేయ విగ్రహమును బీజాక్షరములును రెండవప్రక్కను ఎటు కూడినను

---

1. "నాకు మంత్ర మహిమ యందలి విశ్వాసము పోయిన తరువాతనే నా తల్లి యొక్క భ్రమను నివారించు నిమిత్తమయి నేను శరభసాళ్వ మంత్రము నుపదేశ మయితిని-" అని కోరంగిలో తనకు తటస్థపడిన భూతవైద్యుడి వృత్తాంతాన్ని వివరిస్తూ స్వీయచరిత్రలో మంత్ర తంత్రాల మోసాలు బయటపెట్టారు వీరేశలింగం.

పుట 55 - ప్రథమ భాగము, విశాలాంధ్ర ప్రచురణ - 1982

ముప్పదినాలుగు వచ్చునట్లుగాఁ బదునాఱు గదులుగల యీ క్రిందినున్న రీతి యంత్రమును వేసి, ఆ రక్షరేకును రుక్మిణి మెడకుఁ గట్టి యున్నంత

| | | | |
|---|---|---|---|
| ౧౦ | ౫ | ౧౬ | ౩ |
| ౧౫ | ౪ | ౯ | ౬ |
| ౧ | ౧౪ | ౭ | ౧౨ |
| ౮ | ౧౧ | ౨ | ౧౩ |

కాలము నేవిధమయిన గాలియు సోఁకదని చెప్పెను. కొమార్తె యొక్క గ్రహబాధ నివారణచేసినందునకయి రాజశేఖరుఁడుగారు శాస్త్రిలకు దోవతులచాపు కట్టఁబెట్టుటయేకాక నూఱు పదియాఱు రూపాయలను బహుమాన మిచ్చిరి. [1]శాస్త్రిలారాత్రి యమ్మవారి పెట్టెను దెచ్చినప్పు డందులో వేసి కొన్ని బొమ్మరాళ్ళను మాత్రము తెచ్చుకొనెను. ఆవలి కందఱను బంపివేసి తానొక్కఁడును లోపలఁ గూరుచున్నప్పుడు తలుపు వేసికొని గదియొక్క మట్టిమిద్దెకు నడుముగా

1. "తమ మంత్రములయందు పటిమ లేదని యెరిగి ధనార్జనమునకయి మాయ వేషములు వేసి జనులను మోసపుచ్చుచుండువారు సహితము యితరుల మంత్రములయందు పాటవముకలదని నమ్ముచుందురు" అని కోరంగి ఆంగ్లో వెర్నాక్యులర్ స్కూలు ప్రధానోపాధ్యాయుడుగా వీరేశలింగం పనిచేస్తున్న రోజుల్లో తనకు తటస్థపడిన ఒక దయ్యాలపోతు కపట మాంత్రికుడి వృత్తాంతం స్వీయ చరిత్రలో వర్ణించారు. వీరేశలింగం తనపై శరభసాళ్వం ఉపయోగించాడని భయపడి ఆ మాంత్రికుడు జబ్బుపడటం, ఆ భూత వైద్యుడిపై జాలిపడి తన ఇంట్లోనే వుంచుకొని వైద్యం చేయించడం స్వీయచరిత్రలో రాశారు పంతులుగారు.

"అతడు పూర్ణముగా స్వస్థతపడిన తరువాత నాతనికొక క్రొత్తబట్ట కట్ట బెట్టి యొక రూపాయి రొక్కమిచ్చి పంపివేసితిని. శరభసాళ్వ మంత్ర మెరుగ నపేక్షించువారు. నా రాజశేఖర చరిత్రమునందు జూడవచ్చును" అన్నారు స్వీయ చరిత్రలో. పుట 55, ప్రథమ భాగము 1982

మేకులను దిగఁగొట్టి యా మేకులకు జనుపనార త్రాడును గట్టి, క్రొత్త బట్టలోఁ గొంత ముక్కను జించి వానికిఁ గొంచెము కొంచెము దూర ముగా బొమ్మరాళ్ళను ముడివైచి గుడ్డను దిట్టముగా నేతిలోముంచి యొక కొసను జనపనారత్రాటికి వ్రేలాడఁగట్టి, దానికి సూటిగా క్రింద భూమి మీఁద పళ్ళెమునింత నీళ్ళుపోసి నీళ్ళలో పువ్వులను చక్కఁగా బఱచి ఆ గుడ్డకొనకు దీపమంటించి హరికాస్త్రిలు వెలుపలికి వచ్చెను. అప్పు డీవలకు వచ్చిన రెండు మూఁడు నిమిషముల కెల్లను గుడ్డ యంటుకొనఁగా మండుచుండెను. చమురుబొట్లు నీటిలోఁబడి టప్పుమని మనుష్యులఁమీఁద దెబ్బవేసినట్లు చప్పుడు కాసాగెను. ఆవల బొమ్మరాళ్ళు వఱుకును కాలి నప్పుడారాయి యూడి నీళ్ళలోఁబడి గొప్ప ధ్వనిని జేయుచు వచ్చెను. కాని పళ్ళెములో నడుమనఁ బువ్వులుండుటచేత నిత్తడి పళ్ళెముమీఁద వాయించినట్టెంతమాత్రము వినఁబడినదికాదు. ఆ గుడ్డంతయు మండి పోయిన తరువాత అతఁడు లోపలికిఁ బోయి మసి మొదలగువానిని పూర్ణ ముగా నెత్తుకొని వెడలిపోయెను.

రాజశేఖరుఁడుగారు సువర్ణవిద్యను గ్రహింపవలెనను నపేక్షతో నిత్యమును బైరాగికి సమస్తోపచారములను జరిపించుచు, అతని సమ యము కనిపెట్టి యనుసరించుచు, అతఁడొకనాడు గంజాయి త్రాగి యుల్లాసముగాఁ గూర్చున్నప్పుడు చేరఁబోయి వినయముతో "బావాజీ! లోకములో సువర్ణముచేయు విద్య యున్నదా?" అని యడిగెను. అతఁడు మందహాసముచేసి 'ఉన్నది' అని చెప్పెను. ఆ పయిని మాటల ధోరణిని 'ఆ విద్యయొక్క సంగతి యెటువంటి'దని రాజశేఖరుఁడుగారు 'మహాభక్తి శ్రద్ధలతో చేతులు జోడించుకొని యడిగిరి. అందుమీఁద నతఁడు 'సంగతి పరమ రహస్యమయినను నీకుఁ జెప్పెద'నని పూర్వయుగములలో స్పర్శవేదివలన నినుము బంగారమగుచు వచ్చెను గాని యీ కలియుగ ములో స్పర్శవేది లేదనియు, పూర్వము శంకరాచార్యులవారొక యీఁడిగ వానికి సువర్ణముఖి యను విద్య నుపదేశింపఁగా వాఁడు చిరకాలము బంగా రముజేసి కడపట యోగులలో గలసి వారి కుపదేశించి దేహము చాలించె ననియు, తన గురు వా విద్యను తన కుపదేశించెనుగాని మంత్రముయొక్క పునశ్చరణము పూర్తికానందునఁ దనకది యింకను ఫలింపలేదనియు,

తానిప్పుడు పసరులతో మాత్రమే బంగారమును జేయఁగలననియు, రాజశేఖరుఁడుగారిమీఁది యనుగ్రహము చేతనే చెప్పినట్లు జెప్పి, ఎల్లవారలుదన్ను బంగారము చేయుమని బాధింతురు గాన ఆ సంగతిని మహారహస్యముగా నుంచవలెనని కోరెను. రాజశేఖరుఁడుగారు తానా ప్రకారము గోప్యముగా నుంచెదననియు ప్రమాణముచేసి తనకు సువర్ణముచేయు యోగమును జెప్పుఁడని బహు విధముల వానిని బ్రార్థించిరి. దానిపయిని ఆ బైరాగి యది గృహస్థులు చేయఁగూడదనియు, చేసినయెడల వంశక్షయ మగుననియుఁ జెప్పి తనయెడల విశ్వాసముగలవారికి తానే బంగారమును జేసి యిచ్చెదను గాని యోగమును మాత్రము చెప్పనని చెప్పెను.[1]

అందుమీఁద బంగారమునైన జేయించుకోవలెనను నాశవుట్టి మఱింత శ్రద్ధాభక్తులతో నాతని నాశ్రయించుచు నొకనాఁటి యుదయ కాలమున రాజశేఖరుఁడుగారు పాలును శక్కరయుఁ దీసికొనివచ్చి యిచ్చి కూరుచుండియుండఁగా, ఆ బైరాగి రాజశేఖరుఁడుగారిమీఁద

1. ఈ శతాబ్దం మొదటి సంవత్సరాలలో రాజమండ్రి మున్సిపల్ కక్షలను వివరిస్తూ ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు సందర్భానుసారంగా ఆ రోజుల్లో బంగారం తయారుచేసి ఇస్తామనే కపట యోగుల ప్రాబల్యం వుండేదని, ఒక వృత్తాంతం వ్రాశారు. తనకు మున్సిపల్ రాజకీయాలలో అత్యంతాప్తుడైన యేలూరి లక్ష్మీనరసింహంగారిని దొంగ బంగారం కేసులో ఇరికించటానికి ప్రతిపక్షంవాళ్ళు పన్నిన యెత్తుగడ ప్రస్తావిస్తూ ప్రకాశం పంతులుగారు ఈ విషయాలు వ్రాశారు. రాజశేఖర చరిత్ర రచనా కాలం 1878. ప్రకాశంగారి స్వీయ చరిత్రలోని వృత్తాంతం 1901, 1902 సంవత్సరాలకు చెందింది.

"నా పార్టీలో నాకు బలంగా ఉండే యేలూరి లక్ష్మీనరసింహంగారిమీద మళ్ళీ ఒక కేసు బయలుదేరదీశారు. ఆ రోజులలో రాగి బంగారం చేస్తామనే మంత్రగాళ్ళ వాళ్ళ మాయల్లో పడే అమాయకులూ ఉంటూండేవాళ్ళు. శనివారపుపేట ఎస్టేటులోకి ఇల్లాంటి మంత్రగాడొకడు సిద్ధమై, రాగి బంగారం చెయ్యడానికి పూనుకున్నాడు. ఒక గదిలో దేవతని పెట్టి, ఇంట్లో ఉండే బంగారమూ, జవాహరీ అంతా ఆ దేవతకి అలంకరించి పూజ చెయ్యాలని చెప్పి బంగారం అంతా సేకరించాడు. నాలుగురోజులు జపం అయ్యాక ఆ బంగారం అంతా మూటకట్టుకొని రాత్రి రాత్రి ప్రయాణమై మాయమైపోయాడు."

పుట 185, నా జీవితయాత్ర (1957)

డనకుఁ బరిపూర్ణానుగ్రహము గలిగినట్టు ముఖ చిహ్నమువలనఁ గనఁ బఱచుచు నొక బేడయెత్తు బంగారమును బేడయెత్తు వెండినిఁదెమ్మని యడిగి యాతఁడు తెచ్చిన తరువాత వానిని రెంటిని నొక గుడ్డలో కట్టి రాజశేఖరుఁడుగారు చూచుచుండఁగా నిప్పులలో వేసి కొంతసేపుండనిచ్చి యొక పసరును దానిమీఁద పిండి కొంచెము సేపు తాళి పట్టకారుతోఁదీసి రెండుబేడల యెత్తు బంగారముగు చేతులోఁబెట్టెను. అందుమీఁద రాజ శేఖరుఁడుగారు మఱింత యాశ కలవారయి, తమ యింటగల బంగార మును వెండిని గలిపి యేకముగా బంగారమును జేసిపెట్టుఁడని వానిని బహువిధముల వేఁడుకొనిరి. అట్లు వేఁడుకోఁగా వేఁడుకోఁగా గోసాయి యాతని ప్రార్థన నంగీకరించి యింటఁగల బంగారమును వెండినిఁ జేర్చి యొక మూట గట్ట నియమించెను. అతని యాజ్ఞానుసారముగా రాజ శేఖరుఁడుగారు తమ యింటగల నగలును వెండిపాత్రములును ధనమును ప్రోగుచేసి యొక పెద్ద మూటను గట్టి యింటనున్నవారు సహిత మెఱుగఁ కుండ రహస్యముగ బైరాగియొద్దకుఁ దీసికొని వచ్చిరి. అతఁడు వెంటనే పిడకలదాలి పెట్టించి యా మూటను రాజశేఖరుఁడుగారి చేతులతోనే దానిలోఁ బెట్టించి పుటమువేసి ఆయనను లోపలికిఁ బోయి విసనగఱ్ఱను బట్టుకొని మరల వచ్చునప్పటికి బైరాగి గొట్టముతో నూదుచుండెను; పిడ కల సందుననుండి మూటయు కనఁబడుచుండెను. అప్పుడు బైరాగి మరి కొన్ని పిడకలను పైనిబెట్టి మంట చేసి, తాను వేమగిరి కొండమీఁద నున్న మూలికలను గొనివచ్చుటకయిఁ వెళ్ళెదననియు, తాను బోయి వానిని గొనివచ్చి పసరు పిండినం గాని యంతయు బంగారము కాదనియు, దాను వచ్చులోపల పిడకలను వేసి మంటచేయుచు జాగ్రత్తతోఁ గనిపెట్టుకొని యుండవలయుననియుఁ జెప్పి, మూలికల నిమిత్తమయి వెళ్ళెను. అతఁడు వనమూలికల కయి వెళ్ళి యే వేళకును రానందున, రాజశేఖరుఁడుగారు తామక్కడనే యుండి, బైరాగి పిలుచుకొనివచ్చుట కయి మనుష్యులను బంపిరి. వారును గొండయంతయు వెదకి యెక్కడను అతని జాడను గానక మందుచెట్టు దొరకకపోవుటచేత దూరపు కొండలకుఁ బోయినాఁ డేమో యనుకొని మరలవచ్చి యా వారను జెప్పిరి. ఆ బైరాగి బంగా

శము చేయు మూలికలు దొరకనందున గాఁబోలు మరల రానేలేదు. అతని నిమిత్తమయి యొక దినము వఱకు వేచియుండి రాజశేఖరుఁడుగారు పుటము దీసి చూచునప్పటికి దానియందు బంగారమును వెండియు లేదు గాని తెల్లని భస్మము మాత్ర ముండెను. సులభముగా రజిత భస్మమును సువర్ణ భస్మమును నయినందున రాజశేఖరుఁడుగారు సంతోషించి పదిల ముగా దానిని దాచిరి కాని, యేమి కారణముచేతనో యా భస్మమందు [illegible]గాని సువర్ణాది భస్మములయందుండు గుణముకాని కనఁబడలేదు.

# ఏడవ ప్రకరణము

రాజశేఖరుఁడుగారి బీదతనము—సుబ్బమ్మ మరణము — ఖలమిత్రుల ప్రవర్తన — రాజమహేంద్రవర ప్రయాణము — గ్రహణ స్నానము.

పూర్వము పుస్తకములయందు—

శ్లో॥ ఆధివ్యాధిశతైర్జనస్య వివిధై రారోగ్యమున్మూల్యతే ।
లక్ష్మీర్యత్ర ప్రతంతితత్ర వివృతద్వారా ఇవ వ్యాపదః ॥

ఇత్యాదులకు ధనమే యాపదలకెల్లను మూలమని బోధించు వచనములను జదువునపుడు పురాణ వైరాగ్యము గలిగి రాజశేఖరుఁడుగారు దారిద్ర్యమును గోరుచు వచ్చిరి. లక్ష్మివలెఁగాక యామె యప్పయైన పెద్దమ్మవారిప్పుడు నాశ్రితసులభురాలు గనుక, ఆతని కోరిక ప్రకారము దరిద్రదేవత వెంటనే ప్రత్యక్షమయి యాతని యభిమతమును సిద్ధింపఁజేసినది. కాని తాను మునుపనుకొన్న రీతిని పేదబ్రతుకమాతని కంత సుఖకరమయినదిగాఁ గనిపించలేదు. ఇప్పుడు మునుపటివలె నిచ్చుటకు ధనము లేకపోయినది గనుక, ఈవరకు నాతని నింద్రుఁడవు చంద్రుడవని పొగడుచు వచ్చిన స్తుతి పాఠకులందఱును మెల్లమెల్లగా నాతనిని విడిచిపెట్టి, ఆతని వలన ధనికులయి బాగుపడినవారి యొద్దకుఁ బోసాగిరి. అయినను రాజశేఖరుఁడుగారు చేయిచాచి యాచించినవారి నూరక పొమ్మనలేక నోటితో లేదనునది చేతితోనే లేదనుచు, తమ కున్నదానిలోనే వేళకు వచ్చి యడిగిన వారికి భోజనము పెట్టుచుండిరి. అందుచేత నతిథి యెంత బీదవాఁడయిన నంత సంతోషించుచుండునే కాని మునుపటివలె విందులకు విజయంచేయు మిత్రులవంటివా రెవ్వరు నిప్పుడు సంతోషపడుచుండలేదు. ఈ దానధర్మములకు సహితము కొంత ధనము కావలసి

యున్నది. కాఁబట్టి, ఇంటఁగల యిత్తడి సామానులను కుదువబెట్టి రాజశేఖరుఁడుగారు సొమ్ము తెచ్చుచుండిరి. అందుచే నానాఁటికి గృహమునఁగల సొత్తు తక్కువయి కాపాడవలసిన భారము తగ్గుచుండెను.[1] ఇట్లు కొంతకాలము జరుగఁగా నించుమించుగా నింటఁగల జంగమరూపమయిన సొత్తంతయు బుట్టలును తట్టలును కౌళ్యలునుగా మాఱఁజొచ్చెను. అప్పుడు సహిత మాతఁడు యాచించినప్పుడు లేదని యెవ్వరి మనస్సులకును నొప్పి కలుగఁజేయ నిష్టములేనివాఁడయి, మున్నెప్పుడు నసత్యమన్నమాట నెఱుఁగనివాఁడయినను దరిద్రత్వ దేవత యొక్క యుపదేశముచేత ధనదానములకు బదులుగా వాగ్దానముల మాత్రమే చేయ నారంభించెను. అహా! మనుష్యుల చేత దుష్కార్యములను జేయించుటలో దారిద్ర్యమును మించినది మఱి యొకటి లేదుగదా? అతఁడీ ప్రకారముగా సర్వవిధములచేతను బాధపడు చున్నను, ఆ సంగతి నొరులెఱుఁగకుండుట కయి భోజనపదార్థములలోఁ దక్కువ చేసియైన మంచిబట్టలను గట్టుకొనుచు అప్పుచేసి యైన బీద సాదల కిచ్చుచుఁ బయికొకరీతి వేషముతో ప్రవర్తించుచుండెను. అది యేమి మాయయోకాని లోకములో నెల్లవారును తాము సుఖపడుటకయి శ్రమించు దానికంటెఁ దాము సుఖము ననుభవించుచున్న ట్లితరులకుఁ దోఁచునట్లు చేయుటకయియే విశేష శ్రద్ధను వహించి, బీదతనమువలనఁ గలుగు సౌఖ్యములను లాభములను వేదాంత గ్రంథములు వర్ణించి చెప్పుచు ధనము పాపమునకుఁ గుదురని దూషించుచున్నను, రాజశేఖరుఁడుగారు

---

1. తమ తాతగారు చనిపోయిన తరువాత తండ్రులు వుద్యోగం కోసం కృషి చేస్తున్న రోజుల్లో తమ కుటుంబాన్ని క్రమంగా బీదతనం ముసుకుతున్న వైనం వీరేశలింగం తన బాల్యాన్ని వర్ణిస్తూ స్వీయచరిత్రలో ప్రస్తావించారు.

"తరువాత గృహవ్యయముల నిమిత్తమయి మా తండ్రులు మొట్టమొదట మా తాతగారిల్లు పెంపుచేయుటకొఱకు నిలువయుంచిన కలపను విక్రయించివేసిరి; పిమ్మట దొడ్డిలో పడమటివైపుది కొంత భాగము అమ్మివేసిరి; అటుపైని వెండి బంగారపు వస్తువులను విక్రయము చేయసాగిరి."

పుట 10 ప్రథమ భాగము; మొదటి సంపుటి, 1982.

మాత్రమే మనల నీ దారిద్ర్యదేవత యెప్పుడు వదులునాయని నిమిష మొక యుగముగాఁ గడుపుచుండిరి; కాఁబట్టి యాతఁడింతవఱకును లక్ష్యముతోఁ జూడని యదృష్టదేవత నిపుడు మఱిమఱి ప్రార్థింపసాగెను. దాని నాతఁ డెంతయాసపడి వేఁడవచ్చెనో యా యదృష్టదేవతయు నంతదూరముగాఁ దొలఁగ నారంభించెను.

అట్టి సమయములోనే సుబ్బమ్మకు రోగము తిరుగఁ బెట్టినది. డబ్బులేక యిబ్బంది పడుచున్న సమయములోనే యుపవాసమును నుప్పు డులుసు చేసి దినమున కిరువదిస్నానములు చేసి తడిబట్టలు కట్టుకొని రోగ పడి యొక్కొక తప్పును దెచ్చి పెట్టినందున కామెమీఁద నెంతో కోపము వచ్చి రాజశేఖరుఁడుగారు విసుగుకొనుచుండఁగా, పని నిమిత్తము వచ్చి తిరిగిపోవుచున్న యొక బ్రాహ్మణుఁడు దగ్గఱనుండి విని యామెను దూషించిన లాభములేదని చెప్పి తాను వంటబ్రాహ్మణుఁడనుగా గుడి కెళ నవియు, ఆమెను మనసు వచ్చినన్నాళ్ళు రోగపడనిండనియుఁ జెప్పుటయే కాక వంటను నలభీమ పాకములను మించునట్లు చేయ తా నున్నందున నిష్టమున్నచో నామె మృతి నొందినను బొందవచ్చునన్న యభిప్రాయ మును సహితము సూచనగాఁ గనబఱిచెను. అతని దెట్టిసత్యవాక్కో కాని యాదినము మొదలుకొని తగువైద్యుఁడు లేనందుననో, ఆ బ్రాహ్మణుఁడే పథ్యపానములు జరుపుచు వచ్చినందునో వ్యాధి ప్రబలి యొకనాఁడా మెతఁ బ్రాణముల మీఁదికి వచ్చెను. ఆ దినము నక్షత్రము మంచిదికాదని పురోహితుఁడు చెప్పినందున, ఆమెను వీధిలోనికిఁ గొనిపోయి గోడ ప్రక్కను భూశయనముచేసి యొకచాప యడ్డము పెట్టిరి. ఆమెయుఁ రాత్రి జాము ప్రొద్దుపోయిన తరువాత లోకాంతరగతురా లయ్యెను. ఆ దినము తెల్లవాఱినదనుక నింటనున్న వారందఱును పీనుఁగుతో జాగరము చేసిరి. మఱునాఁడు ప్రాతఃకాలము నుండియు సమస్త ప్రయత్నములు చేసినను, ఊరనున్న బ్రాహ్మణులలో నెవ్వరును సాహాయ్యమునకు వచ్చినవారు గారు; రాజశేఖరుఁడుగారు తామే వెళ్ళి యొకచోట భోగముదాని యింట పీనుఁగుల విస్సన్నను పట్టుకొని సంగతిని దెలుపఁగా అతఁడు బేరము నారంభించి పదియాఱు రూపాయలకు శవమును మోచుట కొప్పుకొని లేచివచ్చెను. ఇప్పుడు సహిత మాంధ్రదేశపు బ్రాహ్మణులలో ముఖ్యముగ

స్మార్తులలో నెవరియింటనైనా ఎవ్వరైనను మృతినొందినప్పుడు బంధువులును కులమువారును తక్కిన మతములయందువలెఁ దమంతటవచ్చి సాయముచేయుట లేకపోఁగా వచ్చి ప్రార్థించినను రాక సాకులు చెప్పటయు మొగము చాటువేయుటయు బ్రాహ్మణజాతికంతకు నవమానకరముగా నున్నది. సమస్తాపదలలోను ఘోర తరమయి యీ యాపదకే యెవ్వరును తోడుపడనపుడొక మతములో నుండుటవలనఁ బ్రయోజనమేమి? ఉండక పోవుటవలన హానియేమి? ఆ దినము శవమింటినుండి కదలునప్పటికిఁ బగలు రెండుజాము లయినది. దహనముచేసి మరల వచ్చునప్పటికిఁ బడమట నాలుగుగడియల ప్రొద్దున్నది. తరువాత విద్యుక్తముగా సంచయనము మొదలయిన యపరకర్మలన్నియు జరిగినవి.[1]

మునుపటివలె రాజశేఖరుఁడుగారిని చూచుటకయి బంధువులును నంతగా వచ్చుట మానివేసిరి; వీధిలో గనఁబడినపుడు సహితము చూడనట్టు తొలఁగిపోవుటకే ప్రయత్నించుచు విధిలేక కలిసికొని మాటాడునప్పుడు సంగ్రహముగా రెండుమూడు మాటలతోనే సరిపెట్టుచువచ్చిరి. పూర్వ మాయన మాటాడునపుడెల్లను ముఖస్తుతులను జేయువారు తరువాత సమ్మతిని గనఁబఱచు శిరఃకంపములను మాత్రము చేయుచు నాతని మాటలను మందహాసముతో విననారంభించిరి. కొన్నాళ్ళకా శిరఃకంపములును మందహాసములును పోయి యూరక యూకొట్టుట క్రింది మాఱినవి; అటు పిమ్మట

1. "మన దేశములో శవములను శ్మశానములకు గొనిపోయెడు విధమును, శవములను ఖననము చేసెడు విధమును, నాగరికులచే గర్హింపదగినవిగా నున్నవి. మరణసమయముల యందు బంధువులు తోడుపడి శవములను మోయక ప్రేత పత్నుల నగల దిగనమ్మించియైన డబ్బిచ్చి పనికిమాలిన యపవిత్రులచేత మోయించుటయు....బ్రాహ్మణులలోని యవశ్య సంస్కరణీయములైన దురాచారము"

స్వీయ చరిత్ర, ప్రథమ భాగము, పుట 103

ఈ విషయాన్ని గూర్చి వివేకవర్ధనిలో కూడా పంతులుగారు ద్విజులలోని గొప్ప దురాచారము (ఏప్రిల్ 1880), శవవహన సాహాయ్యము (నవంబర్ 1880) మొదలైన వ్యాసాలు ప్రచురించారు.

నా యూకొట్టుటలు సహితము నడఁగి హితబోధలు బలిసినవి; కాల క్రమ
మున హితబోధలు సహిత మడుగంటి యొకరీతి పరిహాసములుగా బరిణ
మించినవి. రాజశేఖరుఁడుగారును దారాపుత్రాదులును ధనములేనివా రయి
నను తామొక దుష్కార్యమునకయి ధనమును దుర్వినియోగము చేయ
లేదు గదా యని మనసులో నొక విధమయిన ధైర్యము నవలంబించి
యున్నదానితోనే తృప్తివహించియుండఁగా, వారి సౌఖ్యమునుగని
యోరువలేనివారు కొందఱు మిత్రులని పేరు పెట్టుకొనివచ్చి వారును
వీరును మిమ్ము దూషించుచున్నారని చెప్పి వారి నెమ్మదికి భంగము
గలిగించుచు వచ్చిరి; 'రాజశేఖరుఁడుగారు చేసిన వ్యయమును బూర్వము
దాతృత్వమని వేయినోళ్ళఁబొగడినవారే యిప్పుడు దానిని దుర్వినియోగ
మని నిందింపసాగిరి; ఆయనవలనఁ బూర్వ మెన్ని విధములనో లాభము
అను బొందినవారు సహితము రాజశేఖరుఁడుగారు వీధిలోనుండి నడుచు
చున్నప్పుడు వ్రేలితోఁ జూపి యీయనయే తన ధనమంతయుఁ బాడుజేసి
కొని జోగియైన మహానుభావుడని దగ్గఱ నున్నవారితోఁ జెప్పి నవ్వ
మొదలుపెట్టిరి. ఈవఱకును సీతను దన కుమారుని కిమ్మని నిర్బంధిం
చుచు వచ్చిన దామోదరయ్య, ఇప్పుడాపిల్లను దనకొడుకునకుఁ జేసికోనని
వారి వీరి ముందఱను బలుకజొచ్చెను. ఆ సంగతి కర్ణపరంపరచే రాజ
శేఖరుఁడుగారి వఱకును వచ్చినందున ఆయన యొకదినము పోయి యడు
గగా తానీసంవత్సరము వివాహము చేయనని చెప్పెను. సుబ్రహ్మణ్య
మంతటి యదృష్టవంతుఁడు లోకములో మఱి యెవ్వరును లేరని జాతకము
వ్రాసిన సిద్ధాంతియే యతనికిఁ గన్య నిచ్చెదనన్నవారి యింటికిఁబోయి
యాతనిది తాను జూచినవానిలో నెల్ల జబ్బుజాతకమనిచెప్పి పిల్లనీకుండఁ
జేసెను. రాజశేఖరుఁడుగారు ధనములేక బాధపడుచుండియు నొరుల నడు
గుట కిష్టములేని వారయియూరకుండఁగా నిజమైన మిత్రుడొకడైనానుండక
పోవునా యనియెంచి మాణిక్యాంబయు, సుబ్రహ్మణ్యమును రాజశేఖరుఁడు
గారి కడకుఁబోయి నారాయణమూర్తినిగాని మఱి యెవ్వరినైననుగాని బదు
లడిగి యే మాత్రమయిన సుబ్బమ్మ మానికమునకయిన తెండని ప్రార్థిం
చిరి. ఆయన వారి మాటను దీసివేయలేక దామోదరయ్యను నారాయణ
మూర్తిని మిత్రులవలె నటించి తనవలన లాభమును పొందిన మఱి

కొందఱిని బదులడిగి చూచెనుగాని, అక్కఱలేనప్పుడు వెనుక మేము బదులిచ్చెదము మేము బదులిచ్చెదమని యడుగనిదే పలుమాఱు సంతోష పూర్వకముగాఁ జెప్పుచు వచ్చిన వా రిప్పుడు నిజముగాఁ గావలసి వచ్చి నది గనుక పోయి యడిగినను వేయి క్షమార్పణలా జెప్పి విచారముతో లేదనిరి. పలువురు రాజశేఖరుఁడుగారి యింటికి వచ్చుట మానుకొన్నను, కొంత కాలమువఱకును కొందఱు వచ్చుచుండిరి. కాని తమ్మేమయిన ఋణ మడుగుదురేమో యని యిప్పు డావచ్చెడువారు కూడ రాకుండిరి. కాబట్టి మును పెప్పుడును మనుష్యులతో నిండియుండి రణగుణధ్వని గలిగియుండెడి రాజశేఖరుఁడుగారి గృహమిప్పుడు త్రొక్కి చూచువారు లేక నిశ్శబ్దముగా నుండెను. అయిన నాస్థితి యందది చిరకాల ముండి నదికాదు; దాని స్తంభముహూర్తబలమెట్టిదో కాని తరువాత మరల సదా మనుష్యులతో నిండి మునుపటికంటెను సమ్మర్థము గలిగి బహుజనధ్వను లతో మాఱుమ్రోయుచుండెను. మునుపు మనసులో నొకటి యుంచుకొని పయి కొకటి చెప్పుచుఁ గపటముగాఁ బ్రవర్తించువారితోను, బట్ట యిమ్మని కూడుపెట్టుమని యాచించు దరిద్రులతోను నిండి యుండెను గాని యిప్పుడు మనసులో నున్నదానినే నిర్భయముగా మొగముమీద ననెడు ఋజువర్తనముగల వారితోను బట్టలును భోజనపదార్థములు గొన్నందునకయి యీవలసిన సొమ్మిమ్మని యధికారమును జూపు భాగ్య వంతులతోను నిండియుండ నారంభించెను. గృహమునకు మనుష్య సమృద్ధి కలిగినట్టుగానే రాజశేఖరుఁడుగారికి వస్తుసమృద్ధియు నానాఁటి కధికముగాఁ గలుగ నారంభించెను. మునుపటివలెఁ బగటిపూటయందుఁ బదార్థసందర్శన మంతగాఁ గలుగకపోయినను తదేకధ్యానముతో నున్నందున రాత్రులు కలలయందుమాత్రము తొంటికంటె సహస్ర గుణాధికముగాఁ గలుగుచుండెను. ఆ బాధ లటుండఁగా, మున్ను రుక్మిణి శిరోజములను తీయించక పోవుటయే బాగుగ నున్నదని శ్లాఘించిన శ్రోత్రియులే యిప్పు డాతనినిఁ బలువిధముల దూషించుటయే కాక సభ వారికి నూఱురూపాయలపరాధము సమర్పించుకొనియెడల శ్రీ శంకరాచార్య గురుస్వామికి వ్రాసి జాతిలో నుండి వెలివేయించెదమని బెదిరింపఁ

జొచ్చిరి.[1] ఋణ ప్రదాతలతో నిండియుండి యిల్లొక యడవిగా నున్నం దునను, వీధిలోనికిఁ బోయిన సుగుణములను సహితము దుర్గుణములను గానే పలుకుచు హేళనచేయు మహాత్ములతో నిండియుండి యూ రొక మహాసముద్రముగా నున్నందునను గౌరవముతో బ్రతికినచోటనే మరల లాఘవముతో జీవనము చేయుటకంటే మరణమయినను మేలుగాఁ గనఁబడినందునను, ఎలాగునైనను ఋణవిముక్తి చేసుకొని యూరువిడిచి మఱియొక చోటికిఁ బోవలెనని ఆయన నిశ్చ యించుకొనెను. కాఁబట్టి వెంటనే రామశాస్త్రి యొద్దకు బోయి యింటి తాకట్టుమీఁద నయిదువందల రూపాయలను బదులుపుచ్చుకొని, సొమ్ము సంవత్సరము నాఁటికి వడ్డీతోఁగూడ దీర్చునట్టును, గడువునాఁటికి సొమ్మియ్యలేని పక్షమున నిల్లాతనికిఁ గ్రయ మగునట్టును పత్రమును వ్రాసియిచ్చెను. ఆ ప్రకారముగా సొమ్ము బదులుతెచ్చి దానిలో నాలుగు వందల రూపాయలతో ఋణములన్నిటినీ దీర్చివేసెను. బదులిచ్చిన మఱుసటి నాఁటినుండియు నిల్లు చోటుచేసి తన యధీనము చేయవలసినదని

---

1. మొట్టమొదటిసారి స్త్రీ పునర్వివాహం తాము నిర్వహించినప్పటి పాంఘిక పరిస్థితులను వీరేశలింగం పంతులు స్వీయ చరిత్రలో విపులంగా వర్ణించారు.

"కొన్ని దినములలోనే ముప్పదిమందికి శ్రీ శంకరాచార్యస్వాములవారి యొద్దనుండి బహిష్కార పత్రికలు కూడ వచ్చినవి. మా యూరి సభాపతులు మొద లైన వారా పత్రికలను జూచి పరమానంద భరితులయి వానిని బ్రకటించుటకు శ్రీ విజయనగరము మహారాజుగారి బాలికా పాఠశాలలో సభచేసిరి........వారిని వెలివేసితిమనియు శుభాశుభకార్యములయందు వారి యిండ్ల కెవ్వరును పోఁగూడ దనియు వారి నెవ్వరి యిండ్లకును బిలువగూడదనియు, కేకలు వేయుచు బల్లలమీఁద నెక్కి గంతులువేసి యరచిరి.

పుట 141, ప్రథమ భాగము,
మొదటి సంపుటం—1929

రామశాస్త్రి వర్తమానమును పంపుచుండెను. పూర్వము స్కాంద పురాణమును జదివినప్పటి నుండియు రాజశేఖరుఁడుగారి మనసులోఁ గాశీ యాత్ర వెళ్ళవలెనని యుండెను. ఆ కోరిక యిప్పుడీ విధముగా నెఱవేఱు నున్నందునకు సంతోషించి, రాజశేఖరుఁడుగారు సకుటుంబముగా గంగా స్నానము చేసివచ్చుటకు నిశ్చయించి తారాబలమును చంద్రబలమును బాగుగనున్న యొక చరలగ్నమునందుఁ బ్రయాణమునకు ముహూర్తము పెట్టి "ప్రతిపన్నవమీపూర్వే" యని యుండుటచేత తిథిశూల లేకుండఁ జూచుకొని "నపూర్వేశనిసోమేచ" యనుటచేత వారశూల తగులకుండ ఫాల్గుణశుద్ధ త్రయోదశీ బుధవారమునాఁడు మధ్యాహ్నము నాల్గుగడియల ప్రొద్దువేళ బయలుదేఱుటకు బండినొక దానిని గుదిర్చి తెచ్చిరి. వారీ వఱకుఁ జేసిన యాత్రలన్నియు గోదావరి యొద్దున నుండి యింటియొద్ద కును, ఇంటి యొద్ద నుండి గోదావరి యొద్దునకునేకాని యంతకన్న గొప్ప యాత్రలను జేసిన వారు కారు.

బండిని తెప్పించి వాకిటఁగట్టిపెట్టించి ప్రయాణ ముహూర్తము మించిపోకమునుపే బండిలో వేయవలసిన వస్తువులను వేయవలసినదని రాజశేఖరుఁడుగారు పలుమాఱు తొందరపెట్టినమీఁదట మాణిక్యాంబ తెమలివచ్చి బండినిండను నుద్ద తట్టలను బుట్టలను చేఁదలను నింపి, మఱియొకబండికిఁ గూడఁ జాలునన్నిటిని వీధి గుమ్మములో నుంచెను. బండిలో నెక్కవలసిన యిత్తడి పాత్రములును బట్టల పెట్టెలును లోపలనే యుండెను; ఇంతలో రాజశేఖరుఁడుగారు వచ్చి యాబుట్టలు మొదలగు వానిని బండిలోనుండి దింపించి వారు వెళ్ళిపోవుచున్నారని విని చూడ వచ్చిన బీదసాదలకుఁ బంచిపెట్ట నారంభించెను. ఆ వఱకు లోపల నుండి కదలి రాకపోయినను రాజశేఖరుఁడుగారు వస్తువులను బంచిపెట్టు చున్నారన్న మాటను విన్నతోడనే యిరుగుపొరుగుల బ్రాహ్మణోత్తములు వాయువేగమునఁ బరుగెత్తుకొని వచ్చిరి. బండిలో స్థలము చాలక క్రింద

నుంచిన తట్టలు మొదలగువానిని మాణిక్యాంబయుఁ దన్ననుసరించుచున్న వారికిఁ బంచిపెట్టెను. తరువాతఁబెట్టెలును నిత్తడి సామానులును బండిలో నెక్కింపఁబడినవి; మునుపు నాలుగుబండ్లలో నెక్కించినను సరిపోని సామాను లిప్పుడొక బండిలోనికే చాలక దానిలో నలుగురు గూరుచుండు టకు స్థలము కూడ మిగిలెను. రాజశేఖరుఁడు గా రెంతో తొందర పెట్టు చున్నను మాణిక్యాంబ తన కాప్తురాండ్రయిన యొకరిద్దరు పొరుగు స్త్రీల వద్ద సెలవు పుచ్చుకొని వచ్చుటకే ప్రత్యేకముగా నాలుగుగడియలాలస్యము చేసెను. ఈ లోపుగా మంచములను బండిగూటిపయిని గట్టించి, పిల్లలను బండిలో నెక్కించి, రాజశేఖరుఁడుగారు కోపబడినందున మాణిక్యాంబ వచ్చి బండిలోఁ గూరుచుండెను. బండివాని యొద్దకు వచ్చినప్పటినుండియుఁ గొంచెము వట్టిగడ్డిపరకలతోను కావలసినంత జలముతోను మితాహారమును గొనుచు పథ్యము చేయుచున్న బక్కయెద్దు మెల్లగా బండిని లాగ నారంభించెను. బండివాఁడును వాని వెనుకనే నడుచుచు మేఁతవేయుటలోఁ బరమ లుబ్ధుఁడుగానే యున్నను కొట్టుటలో మాత్రము మిక్కిలి యౌదార్య మును గనఁబఱుపసాగెను. ఊరి బయలవఱకును వచ్చి, రాజ శేఖరుఁడుగారి వలన బిచ్చములను గొన్న నిరుపేదలయిన తక్కువ జాతులవారు పలువిధముల వారిని దీవించి, విచారముతో వెనుకకు మరలిపోయిరి నల్లమందు వేసికొనుటచేతనో త్రాగుటచేతనో యీ మూఁడునుగూడఁ గలియుట చేతనో త్రోవపొడుగునను తూలుచుఁ గునుకు పాట్లు పడుచు నడుచుచున్న బండివాఁడు మొత్త నెక్కి కూరుచుండి, బండిలోనివారికిఁ గావలసినంత పరిమళమును ఆకాశమునఁ జిన్న మేఘములను గలుగునట్టుగా సగము కాలియున్న ప్రాఁతపొగచుట్టలను నాలిగింటిని గుప్పునగుప్పునఁ గాల్చి బండిలోని పెట్టెకుఁ జేరగిలఁబడి హాయిగా నిద్రపోయెను. బండియు మెల్లగా ప్రాకుచున్నట్టే కనఁబడు చుండెను. ఇంతలోఁ జీఁకటియుఁబడెను. కొంత సేపటికి రాజశేఖరుఁడుగారు

క్రిందఁ జూచునప్పటికి బండి కదలుచున్న జాడ కనఁబడలేదు. అప్పుడు కుంభకర్ణునివలె నిద్రపోవుచున్న యా బండివానిని లేపఁ బూనుకోఁగా, లేకలేమియు, బనిచేసినవికావు. కాని వాని కాలిమీఁద కొట్టిన దెబ్బలు మాత్రము వానిని కదల్చి యొక్క మూలుగు మూలిగి మరియొక్క ప్రక్కఁబరుండునట్లు చేసినవి. మహా ప్రయత్నముమీఁద వానినిలేపి క్రింద దిగి చూచువఱకు బండిత్రోవ తప్పవచ్చి యొక పొలములో మోఁకాలిలోతు బురదలో దిగఁబడియుండెను. అప్పుడందఱును దిగి యావచ్ఛక్తి నుపయోగించి రెండు గడియలకు బండినిరొంపిలో నుండి లేవనెత్తి మార్గమునకు లాగుకొనివచ్చిరి. కాని యెద్దు మాత్రము తాము బండిని గొనిపోవుస్థితిలో లేక తమ్మే మఱి యొకరు గొని పోవలసిన యవస్థయందుండెను. కాఁబట్టి చీఁకటిపడువఱకు బండి శ్రమచేసి వారిని లాగుకొని వచ్చినందుకు ప్రత్యుపకారముగా నిప్పుడు చీఁకటి పడ్డందున వారే బండి నీడ్చుకొని పోవలసిన వంతు వచ్చెను. ఇట్టి యవస్థ పగలు సంభవింపక రాత్రి సంభవించినందున నెల్లవారును మిక్కిలి సంతోషించిరి. అందఱి బట్టలకును బురద చేతఁ జిన్నవియుఁ బెద్దవియు నైన పలువిధములైన పుష్పము లద్దఁబడినవి. బండిలో నెక్కివచ్చినవారి కెట్లున్నను చూచువారు లేకపోయిరి కాని యున్నయెడల వారి కెంతయైన వినోదము కలిగియుండును. బండివాడు భీమునివంటివాఁడు గనుక రాజ శేఖరుఁడుగారి సాహాయ్యముచేత బండిని సులభముగా నీడ్చుచుండఁగా, సుబ్రహ్మణ్యము వెనుకజేరి యెద్దను స్త్రీలను నడిపించుకొని వచ్చెను. వారు నడిచియే వెళ్ళిన యెడల జాములోపలనే రాజమహేంద్రవరము వెళ్ళి చేరి యుందురు గాని బండికూడ నీడ్చుకొని పోవలసివచ్చినందున రాత్రి రెండు యామములకు రాజశేఖరుఁడుగారి పినతండ్రి కుమారుఁడగు రామమూర్తి గారి యిల్లు చేరిరి. అప్పుడందఱును మంచినిద్రలో నుండిరి. కాఁబట్టి బండి చప్పుడు కాఁగానే తలుపు తీయఁగలిగినవారుకారు. కొంతసేపు తలుపు

వద్ద బొబ్బలు పెట్టిన మీఁదట చావడిలోఁ బరున్నవారెవరో లేచివచ్చి తలుపుతీసిరి. రాజశేఖరుఁడుగారి మాట వినఁబడినతోడనే లోపలిగదిలోఁ బరుండియున్న రామమూర్తిగారు లేచివచ్చి, అన్నగారిని కౌఁగిలించుకొని వారావఱకే వత్తురని కనిపెట్టుకొనియుండి జాము ప్రొద్దుపోయిన మీఁదటను గూడ రానందున, ఆ దినము బయలుదేఱలేదని నిశ్చయించుకొని భోజనములు చేసి తా మింతకుమునుపే పడుకొన్నామని చెప్పి యంత యాలస్యముగా వచ్చుటకు గారణమేమని యడిగిరి. తాము చెప్పనక్కఱలేకయే తమ బట్టలును మోఁకాలివఱకును బురదలో దిగఁబడిన కాళ్ళను జెప్ప సిద్ధముగానున్న దానినిమాత్ర మాలస్యకారణముగాఁ జెప్పి బండిని దామీఁద్చుకొని వచ్చిన సంగతిని మాత్రము చెప్పక రాజశేఖరుఁడుగారు దాచిరి. అప్పుడీయవలసిన బండికూలి నిచ్చివేసి బండివానిని పొమ్మని చెప్పఁగా వాఁడు తాను విశేషముగా శ్రమపడితిననియు తన బండియెద్దంతటి మంచివి మఱెక్కడను దొరకవనియు జెప్పి తన్నును తన యెద్దును గొంతసేపు శ్లాఘించుకొని బహుమతి రావలెనని యడిగెను. తడవుగ మాటాడనిచ్చిన యెడల మాటవెంబడిని బండిని తాము లాగుకొని వచ్చిన మాటను చెప్పునేమోయను భయమున సామాను దిగిన తోడనే బహుమతిని సహితమిచ్చి రాజశేఖరుఁడుగారు వెంటనే వానిని బంపివేసిరి. క్రొత్తగా మగఁడు పోయినవారిని పుణ్యస్త్రీలు భోజనములు అయిన తరువాత మొదటిసారి చూడరాదు గనుకను, ఆ రాత్రి మంచి దినము కాదుగనుక, సువాసినులందఱును గదిలోనికిఁబోయి తలుపు వేసికొండని యొక విదవ ముందుగా రుక్మిణిని లోపలికిఁ దీసికొనివచ్చి మఱియొక గదిలోనికిఁ బంపి తలుపు దగ్గఱగా వేసెను; తరువాత లోపలినుండి యాఁడువారు వచ్చి మాణిక్యాంబ మొదలైనవారు పడమటింటిలోనికిఁ దీసికొనిపోయి రుక్మిణికి దటస్థించిన యవస్థకయి యేడుపులు మొదలైనవి. చల్లారిన పిమ్మట, వారి నిమిత్త మావఱకు చేసిన వంట

పెట్టియున్నది కాని వారికి వడ్డించి రాజశేఖరుఁడుగారి నిమిత్తమప్పు డిస్తరి పెట్టిరి. అందఱును భోజనము అయిన తరువాత మూఁడుజాము లకు పరుండి సుఖనిద్ర చేసిరి.

రాజశేఖరుఁడుగారు కొన్ని దినములు రామమూర్తిగారి ఇంటి లోపలనే యుండిరి. ఒకనాఁడు పడవమీఁద గోవూరునకుఁ బోయి యచటఁ బూర్వము గౌతముఁడు తపస్సు చేసిన స్థలమును మాయగోవు పడిన చోటును జూచి గోష్పాద క్షేత్రమున స్నానముచేసి రాత్రికి మరల వచ్చిరి. మరియొకనాఁడు కోటిలింగ క్షేత్రమున స్నానమునకుఁ బోయి యచట నొక శాస్త్రిల వలనఁ బూర్వ మాంజనేయులొక లింగము నెత్తుకొనిపోయి కాశిలో వేయుటయు అప్పటి నుండియు కాశీ పట్టణము ప్రసిద్ధిగనుటయు మొదలుగాఁ గల కథను వినిరి. ఇంకొకనాఁడు రాజ రాజ నరేంద్రుని కోటకుఁబోయి అందులోఁ బూర్వము చిత్రాంగిమేడ యున్న తావును సారంగధరుఁడు పావురముల నెగురవేసిన చోటును జూచి, పూర్వము రాజరాజ నరేంద్రునకమ్మవారు ప్రత్యక్షమయి నీవెంత దూరము వెనుక తిరిగిచూడ కుండ నడుతువొ యంత దూరము కోట యగునని చెప్పుటయు, ఆతఁడా ప్రకారముగా నడుచుచు వెనుక గొప్ప ధ్వని యగుచుండఁగాఁ గొంతసేపటికి మనస్సు పట్టలేక వెనుక తిరిగి చూచుటయు, చుట్టును బంగారు కట్టుతో నించుమించుగా ముగియ వచ్చిన కోట యంతటితో నిలిచిపోవుటయు, మొదలుగాఁగల కథను దగ్గఱ నున్న వారివలన విని, రాజశేఖరుఁడుగారు సారంగధరుని కాళ్ళను చేతులను, నఱికిన స్థలమునే చూచిరావలెనని బయలుదేఱి సారంగధరుని మెట్టకుఁబోయి యక్కడ నొకనిమ్మచెట్టు క్రింద సారంగధరుని కాళ్ళను చేతులను ఖండించిన చాపరాతిని దానిచుట్టును గడ్డి సహితము మొలవక నున్నగానున్న ప్రదేశమును దాని సమీపముననే సిద్ధుఁడు సారంగధరుని కొనిపోయి స్నానము చేయించిన కొలఁకును జూచి వచ్చిరి. రాజమహేంద్ర వరములో, నున్న కాలములో రాజశేఖరుఁడుగారు పట్టణము నుండెడి జనులకును పల్లెలలో నుండెడి జనులకును నడవడియందేమి వ్యత్యాస మందునో చూడవలెనని యెల్లవారియొక్క చర్యలును బరీక్షింప సాగిరి

కాఁబట్టి యిప్పుడిప్పుడాయనకు నిజమయిన ప్రపంచ జ్ఞానము కొంతకొంతకు గలుగ నారంభించెను. ఆ పట్టణములో—ఎరవడిగి తెచ్చుకొని యైన జేతికి మురుగులు నుంగరములును వేసికొని, చాకలివానియొద్ద పదిదెకుఁ దెచ్చు కొనియైనను విలువబట్టలను గట్టుకొనువారె మిక్కిలి గౌరవమునకుఁ బాత్రులుగా నుండిరి. లోపల సారమేమియు లేకపోయినను చెవులకు మంచి కుండలములను జేయించుకొని తలకు గొప్ప శాలువను జుట్టు కొన్నవారు మహాపండితులుగా నుండిరి.[1] ఎల్లవారును ధనికుల యిండ్లకుఁ బోయి జీవితకాలములో నొకప్పుడును దేవాలయము త్రొక్కి చూడక పోయినను భగవన్నామమును కలలోనైనను స్మరింపక పోయినను వారిని పరమ భాగవతోత్తములని భక్తాగ్రేసరులని పొగడుచుండిరి. నిజమైన విద్వాంసులయొక్కయు కవీశ్వరులయొక్కయు నోళ్లను కడుపులును సదా శ్లోకములతోను, పద్యములతోను మాత్రమే నిండి యుండెనుగాని బాహ్యాడంబము లేకపోవుటచేత నన్నముతో నొకప్పుడును నిండియుండలేదు. దినమున కెనిమిది దొమ్మర గుడిసెలలో దూఱినను, స్నానము చేసినట్టు జుట్టుచివర ముడివైచుకొని బిళ్ళగోచులను బెట్టుకొని తిరుగువారు పెద్దమనుష్యులని పొగడొందుచుండిరి. వేయేల? చాటున లక్ష దుష్కార్యములు చేయుచున్నను, బాహ్య వేషధారణమునందు మాత్రము లోపము లేకుండనున్నచో వారి ప్రవర్తనమును సంపూర్ణముగా నెఱిఁగియు నట్టివారి కందఱును సభలో సహితము మంచి నడవడి గలవారికిఁ జేయు దానికంటె నెక్కువ మర్యాదను చేయుచుండిరి. నీతి విషయమున వారి ప్రవర్తన యెంత హేయమయినదిగా నున్నను మత విషయమునందు మాత్రము పయికి భక్తులుగానే కనఁబడుచుండిరి. నిలువ నీడలేక బాధపడు చుండెడి ప్రాణమిత్రులకొక కుటీరము గట్టించి యియ్యలేనివారు సహితము, రాతి విగ్రహములు కాపురముండుటకయి వేలకొలఁది వెచ్చపెట్టి దేవాల

---

1. బసవరాజు గవర్రాజుగారనే తమ ఆప్తమిత్రులు చనిపోయినప్పుడు తిథి వార నక్షత్రాల పేచీ పెట్టి శవాన్ని కదలనివ్వకుండా బాధపెట్టిన ఆ టౌన్లోని సభాపతులను తీవ్రంగా ఆక్షేపిస్తూ 'తిర్యగ్విద్వన్మహాసభ' అనే ప్రహసనం రచించి వివేకవర్ధనిలో ప్రకటించారు వీరేశలింగం.

యములు కట్టించుచుండిరి; కట్టించినవారు పోయిన తరువాత వసతులు లేక పాడుబడిన దేవాలయములును నూట యిరువదిమూఁడిని లెక్కపెట్టి రాజశేఖరుఁడుగారు కోటి లింగములకుఁగూడ బూర్వమెప్పుడో దేవాలయములు పాడయినందున నా ప్రకారముగా నిసుకదిబ్బలయందుఁ బడియుండినవై యుండవచ్చు నని సంశయించిరి. అక్కడ వేశ్యలు తప్ప మఱియెవ్వరును స్త్రీలు చదువకుండిరి;[1] అట్టి వా రభ్యసించిన విద్యయున్ను తయ వ్యభిచారమును వృద్ధిచేసి పురుషులను దమ వలలోఁ బడవేసికొన్ని పట్టణము పాడుచేయుటకొఱకే పనికివచ్చు చుండెనుగాని జ్ఞానాభివృద్ధికిన్ని సన్మార్గ ప్రవర్తనమునకును లేశమయినను తోడుపడుచుండలేదు.

అక్కడ సప్తమివఱకు నుండి రాజశేఖరుఁడుగారు కాశికి వెళ్లుటకు ప్రయాణమయిరిగాని, సంవత్సరాదివఱకు నుండుఁడని రామమూర్తిగారు బలవంత పెట్టినందున నాతనిమాట త్రోసివేయలేక యొప్పుకొనిరి. ఫాల్గుణ బహుళ అమావాస్యనాఁడు పగలు మూఁడుజాముల వేళ సంపూర్ణ సూర్య గ్రహణము పట్టెను. జనులందఱును గోదావరిలో పట్టుస్నానము చేసి తమ పితరులకు తర్పణము లిచ్చుచుండిరి; కొందఱు పుణ్యముకొఱకు నవగ్రహజపములు చేయుచు బ్రాహ్మణులకు నవధాన్యములును దానము చేయుచుండిరి! కొందఱు ఛాందసులును వృద్ధాంగనలును సూర్యునకు

---

1. "ఆ కాలమునందు రాజమహేంద్రవరములో పాఠశాల యనగా వేశ్యల చదువు కూటమనియే యర్థము. వేశ్యల వృత్తిగీతాదులకై పెట్టఁబడిన పాఠశాలలప్పుడా పురవరము నందెన్నియో యుండెను. వేద పాఠశాలలకును శాస్త్ర పాఠశాలలకును చిల్లిగవ్వ యియ్యనొల్లని శుద్ధ శ్రోత్రియులు సహిత మధికారుల మెప్పునకయి యీ వేశ్యల పాఠశాలలకు నెలకయిదులు పదులు రూపాయలు చందా లిచ్చుచుండిరి. పుట 69, స్వీయచరిత్ర.

ప్రథమ భాగము, మొదటి సంపుటము—1903.

విపత్తువచ్చెనని కన్నులనీరు పెట్టుకొనసాగిరి; వారిలో దెలి
సినవార మనుకొనువారు సూర్యునకుఁ బట్టిన పీడను వదలఁగొట్టుటకయి
మంత్రములను జపించుచుండిరి; వారికంటెను దెలివిగలవారు గ్రహణ
కాలమునందు తన కడుపులలో జీర్ణముకాని పదార్థములుండిన దోషమని
యెఱింగి దానిముందు మూఁడుజాముల నుండియు నుపవాసములు చేయు
చుండిరి; ఎల్లవారును భోజన పదార్థములుండు పాత్రములో దర్భగడ్డిని
వేయుచుండిరి; కడుపుతోనున్న స్త్రీలు పైకి వచ్చినయెడల అంగ హీను
లయిన పిల్లలు పుట్టుదురని యెంచి పెద్దవా రట్టిస్త్రీలను గదులలోఁబెట్టి
తాళమువేసి కదల మెదలవలదని యాజ్ఞాపించిరి; మఱికొందరు మంత్ర
వేత్తలమని పేరు పెట్టుకొన్న వారి కేమయిన నిచ్చి మంత్రోపదేశమును
బొంది శీఘ్రముగా సిద్ధించుట కయి ఱొమ్ములబంటి నీటిలో జపము
చేయుచుండిరి. గ్రహణకాలమున నోషధులయందు విశేషగుణ ముండు
నని యెంచి కొందఱు మూఢులు స్నానముచేసి దిస మొలలతో జుట్టు
విరియఁబోసికొని చెట్లకు ధూపదీపములు సమర్పించి వేళ్ళను దీయు
చుండిరి; గ్రహణ సమయమున దానము చేసిన మహాపుణ్యము కలుగునని
చెప్పి బ్రాహ్మణ బ్రువులు తమ బట్టలు తడియకుండఁ బయికెగఁగట్టుకొని
మోకాలిలోతు నీళ్ళలో నిలుచుండి సంకల్పమును జెప్పుచు మూఢుల
యొద్దను స్త్రీలయొద్దను జేరి నీరు కాసులను గ్రహించుచుండిరి. పూర్వా
చారమును బట్టి రాజశేఖరుఁడుగారు తాము స్నానము చేసిరిగాని,
పయిని చెప్పిన కృత్యమును జేయువారందఱును మూఢులని యెంచి
గ్రహణ విషయమయి యచ్చటి పండితులతో వాదములు చేయ నారం
భించిరి. అతఁడు జ్యోతిషశాస్త్రమును నమ్మినను పురాణములను
మాత్రము శాస్త్రవిరుద్ధముగా నున్నప్పుడు నమ్మకుండెను. కాఁబట్టి—

శ్లో॥ పశ్చాద్భాగా జ్జలదవదధస్సంస్థితో భేత్యచంద్రో,
భానోర్బింబం స్ఫురదసితయా ఛాదయ త్యాత్మమూర్త్యా॥

అను సిద్ధాంతశిరోమణి శ్లోకమును,

శ్లో॥ ఛాదకో భాస్కరస్యేందు రధస్థో ఘనవద్భవేత్
భూచ్ఛాయాం ప్రాఙ్ముఖశ్చంద్రో విశత్యస్యభవేదసౌ॥—

అను సూర్య సిద్ధాంత శ్లోకమును చదివి, భూగోళమున కుపరి భాగమున సూర్యుఁడుండు నపుడు చంద్రుఁడు తన గతివిశేషముచేత సూర్యునకును భూమికిని నడుమ సమకళయందు వచ్చునేని సూర్య గ్రహణము గలుగునుగాని రాహువు మ్రింగుటచేతఁ గలుగదనియు, పౌరాణికులు చెప్పినదే గ్రహణమునకుఁ గారణ మయినయెడల రాహు కేతువుల మనసులలోని యభిప్రాయములను దెలిసికొనుటకు మనము శక్తులముకాము కాఁబట్టి గ్రహణమిప్పుడు కలుగునని ముందుగా దెలిసికో లేకపోయి యుందుమనియు, సూర్యగ్రహణ మమావాస్యనాఁడును, చంద్ర గ్రహణము పూర్ణిమనాఁడును మాత్రమే పట్టుటకుఁగారణ ముందదనియు, రాహుకేతువు లాకాశమున నెప్పుడును గనఁబడకపోవుట యెల్లరు నెఱుంగుదురుగాన సూర్యచంద్రులను మ్రింగఁగలిగినంత పెద్దవియే యయి యుండినయెడల గ్రహణ సమయమున నవేల కనఁబడకుండు నవియు, రాహువే మ్రింగునేని మన పంచాంగ రీతిగా నీ గ్రహణంమొక దేశమునఁ గనబడి మరియొక దేశమునఁ గనబడక పోవుటకు హేతువుండ దనియు, రాజశేఖరుఁడుగారు బహుదూరము వాదించిరి. అక్కడనున్న పండితులలో నెవ్వరికిని యుక్తులు తోచఁకపోయినను, విశేషముగా కేకలు మాత్రము వేసిరి. అక్కడ నున్నవారి కా వాదమేమియుఁ దెలియలేదు. కనుక బిగ్గరగా నఱచినందున శాస్త్రిల పేళ్ళవారే గట్టివారని మెచ్చుకొని రాజశేఖరుఁడుగారి వాదము బౌద్ధవాదమని దూషిం

చిరి.[1] ఒకరిని వెక్కిరించుటవలనఁ గలుగవలసిన సంతోషము తప్ప మఱి యొక విధమైన సంతోషము తమకు లేదుగనుక, విద్యాగంధ మెఱుఁగని మూర్ఖశిరోమణులు రాజశేఖరుఁడుగారిని బహువిధములఁ బరిహసించి పొందఁదగిన యానందము నంతటిని సంపూర్ణముగా ననుభవించిరి. ఇంతలో గ్రహణమోక్ష కాలము సమీపించినందున నెల్లవారును విడుపు స్నానమునకై పోయిరి. శుద్ధమోక్ష మయిన తరువాత ముందుగా స్నానము చేసివచ్చి యాఁడువారు వంటచేసినందున దీపములు పెట్టించి యెల్లవారును ప్రథమ భోజనములను జేసిరి.

---

1. తన సంఘ సంస్కరణ ప్రయత్నాల నిమిత్తం బందరు వెళ్ళి అక్కడ ఒకటి రెండు సభలలో స్త్రీ పునర్వివాహావశ్యకతను గూర్చి తాము ప్రసంగించిన ఉదంతాలను, తమ అనుభవాలను పేర్కొంటూ వీరేశలింగం స్వీయచరిత్రలో ఇట్లా వ్రాశారు.

"సభాపతులైన కష్ఠల నరసయ్యగారు మొదలైన బ్రాహ్మణులలోని ప్రసిద్ధ పురుషులు కొందరు తమ శిష్యబృందముతో గూడ వేంచేసి నా యుపన్యాసమును సాగనీయక చప్పట్లుగొట్టి యల్లరిచేయ నిశ్చయించుకొని వచ్చియున్నారని నా మిత్రులు కొందరు నాకా మహాపురుషులను జూపిరి. .... .... ....

సాధారణముగా పండితులు వాదములో తాము పరాజయము నొందినను తమ యోటమి నొప్పుకొనక "శేషంకోపేన పూర్ణయేత్" అను న్యాయము నవలంబించి క్రిందబడినను తామే గెలిచితిమని కేకలు వేయుదురు."

పుటలు 190, 191.

ప్రథమ భాగము, మొదటి సంపుటము—1932.

# ఎనిమిదవ ప్రకరణము

**సంవత్సరాది—రాజశేఖరుఁడుగారి ప్రయాణము—రాజానగరమునకు సమీపమున నౌకరాజు వడఁగొట్టి పడిపోవుట—వల్లె చెఱువు సమీపమున నొక యోగి కనఁబడుట—దొంగలు కొట్టుట—రుక్మిణి మరణము.**

సంవత్సరాదినాడు తెల్లవాఱిన తరువాత రామమూర్తిగారు మంగలి వానిని పిలిపించి రాజశేఖరుఁడుగారికిని, సుబ్రహ్మణ్యమునకును వానిచేత తలయంటించిరి. ఇంటనున్న మగవారి యభ్యంగన స్నానము లయిన తరువాత, ఆఁడువారందఱును తలలంటుకొని నీళ్ళుపోసికొనిరి. స్నానము లయిన పిమ్మట వేపపువ్వును క్రొత్త మామిడికాయ ముక్కలును క్రొత్త చింతపండు పులుసుతో నందఱును దేశాచారము ననుసరించి భక్షించి రెండుజాములకు పిండివంటలతో భోజనములు కావించి పండుగ చేసికొనిరి. పండుగదినములలో జనులు మఱింత యెక్కువ సుఖపడవలసిన దానికి మాఱుగా, ఈ దేశములో వేళ తప్పించి భోజనములుచేసి యట్టి దినములందు దేహములను మఱింత యాయాసపెట్టుకొందురు. మధ్యాహ్నము చల్లపడినమీఁదట రామమూర్తిగారు రాజశేఖరుఁడుగారిని వెంటఁబెట్టుకొని నూతన పంచాంగశ్రవణమున కయి వేణుగోపాలస్వామివారి యాలయమునకు వెళ్ళిరి. ఆ వఱకే యొక సిద్ధాంతి పసుపుతో గలిపిన యక్షతలను పళ్ళెముతో ముందు పెట్టుకొని—

శ్లో॥ శ్రీకళ్యాణ గుణావహం రిపుహరం దుస్స్వప్న దోషాపహం
గంగాస్నాన విశేషపుణ్యఫలదం గోదానతుల్యం నృణాం
ఆయుర్వృద్ధిదముత్తమం శుచికరం సంతాన సంపత్ప్రదం
నానాకర్మ సుసాధనం సముచితం పంచాంగమాకర్ణ్యతాం॥

అను శ్లోకము జదివి, సంక్రాంతి పురుషుని లక్షణమును వివరించి సంవత్సర ఫలమునుజెప్పి, ధాన్యాదులయొక్కయు వృశ్చికాదుల యొక్కయు వృద్ధిక్షయములను జదివి, జన్మనక్షత్రములను తెలియని యెడల నామనక్షత్రములను తెలిసికొని యెల్లవారికిని కందాయముల యంకములను ఆదాయవ్యయములను జెప్పెను. అక్కడ నున్న కాఁపులు మొదలగువారు సిద్ధాంతిగారిచేతిలో నేమైనఁబెట్టి తమకే కందాయమునందును సున్నలు రాకుండఁ జేసికొనిరి, పంచాంగశ్రవణ మయిన తరువాత రామ మూర్తిగారు – "సిద్ధాంతిగారూ! కలియుగము ప్రారంభమయి యిప్పటి కెన్ని సంవత్సరము లయినది!" అని యడిగిరి.

సిద్ధాంతి – ఇప్పటికి కలియుగాది గత సంవత్సరములు 4719 శాలివాహన శతాబ్దములు 1541, విక్రమార్క శక సంవత్సరములు 1676

రామ – మనదేశములో మ్లేచ్ఛుల యధికార మింకను ఎంతకాల ముండునో కాలమానమునుబట్టి చెప్పఁగలరా?

సిద్ధాంతి-మనదేశములో తురుష్కుల దొరతనము అయిదు వందల సంవత్సరములకు లోపలపోదు. ఆ పిమ్మట పూసపాటివారి వంశమున వేపకాయంత తోఁకగలవా డొకఁడుపుట్టి, ఆసేతుహిమాచలమునుగల సర్వప్రపంచమును మరల జయించును.

అంత ప్రదోష సమయమయినందున పంచాంగము కట్టిపెట్టి యందఱును తమ తమ యిండ్లకు నడచిరి.

రాజశేఖరుఁడుగారు విదియనాఁడు కాశీయాత్రకు బయలుదేఱ నిశ్చయించుకొని యెంద రెన్నివిధముల జెప్పినను వినక ప్రయాణ ముహూర్తమును పెట్టుటకై గుడిలో పంచాంగమును జదివిన పిడపర్తి శ్రీరామసిద్ధాంతిని పిలిపించిరి. అతఁడును తిథివార నక్షత్రములను

చక్కఁగా నాలోచించి యా రాత్రియే పదియాఱు ఘటికల తొమ్మిది విఘటికలమీఁద యాత్రకు యోగ్యసమయమని ముహూర్త ముంచెను.[1] ఆ సమయమున కుటుంబముతో బైలుదేరుట క్షేమకరముకాదని యెంచి, రాజశేఖరుఁడుగారు పొరుగింట నొక వస్త్రమును దానిలో చుట్టబెట్టి యొక పుస్తకమును నిర్గమన ముంచి తెల్లవాఱిన తరువాతనే బైలుదేరుటకు నిశ్చయించిరి. అప్పుడు రామమూర్తిగారు బండినిమిత్తము వర్తమానము పంపఁబోఁగా వలదని వారించి బండినెక్కి పోయినయెడల యాత్రాఫలము దక్కదు గాన కాలినడకనే పోయెదనని రాజశేఖరుఁడుగారు చెప్పిరి. ఆ రాత్రియే వారికందఱికిని క్రొత్తబట్టలు కట్టఁబెట్టి, రామమూర్తిగారు ప్రాతఃకాలముననే వారికంటె ముందుగాలేచి వారు ప్రయాణమగునప్పటికి సిద్ధముగా నుండిరి. అప్పుడు రాజశేఖరుఁడుగారు తాము ధవళేశ్వరము నుండి తెచ్చిన పాత్రసామగ్రియు, మంచములును, బట్టలపెట్టెలను తాము మరల వచ్చువరకును భద్రముగా జాగ్రత్త చేయవలయునని రామమూర్తిగారికి చెప్పి యొప్పగించి, దారి ప్రయాణమునకు ముఖ్యముగా కావలసిన వస్తువులను మాత్రము తమతో నుంచుకొనిరి. మాణిక్యాంబ మొదలగువారు బైలుదేఱునపుడు రామమూర్తిగారి భార్య వీధివరకువచ్చి వారు దూరదేశ యాత్రను జేయఁబూనుటకు దలఁచుకొని కంటఁదడిబెట్ట మొదలుపెట్టెను. అప్పుడు వారందఱును గుమ్మములోనున్న వారియొద్ద సెలవుపుచ్చుకొని, ఒంటిబ్రాహ్మణుఁడెదురుగా వచ్చుచుండఁగా నతఁడు పోవువరకును నిలిచి యావల నొక పుణ్యస్త్రీ రాఁగా మంచి శకున మయినదని దారిసాగి నడువ

---

1 కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారికి వీరేశలింగం పంతులుగారి సంఘసంస్కరణం, భాషా సంస్కరణం అసలు గిట్టవు. రాజశేఖర చరిత్రను విమర్శిస్తూ బ్రహ్మయ్యశాస్త్రి వివేక చంద్రికా విమర్శనం పేరిట ఒక గ్రంథం ప్రకటించారు.

రాజశేఖర చరిత్రలో రాజశేఖరుడుగారు చూసుకొని బయలుదేరిన ముహూర్తం దుర్ముహూర్తమనీ, అది చోరపంచకంలో పడింది కాబట్టే, దొంగలు కొట్టారని, వీరేశలింగానికి జ్యోతిశ్శాస్త్ర జ్ఞానం పూజ్యమనీ, యీ విధంగా ఆక్షేపించారు బ్రహ్మయ్యశాస్త్రి.

బ్రారంభించిరి. రామమూర్తిగారు వారి నూరిబయలవరకును సాగనంపి దూరదేశ ప్రయాణమును జేయుచున్నారు గాన భద్రముగా వెళ్ళుడని బుద్ధులుచెప్పి వెనుకకు మరలి యింటికి వచ్చిరి. రాజశేఖరుఁడుగారు త్రోవపొడుగునను చెట్లు మొదలగువానిని భార్యకును బిడ్డలకును జూపుచు దారినడువసాగిరి.

రాజ—చూచితిరా యీ మఱ్ఱిచెట్టు ఆమూలాగ్రము చిగురించి, పగడములవలె నున్న, యెఱ్ఱనిపండ్లగుత్తులతో నెంత మనోహరముగా నున్నదో!

సుబ్ర—ఔనౌను. దానిచేరువ నున్న మామిడిగున్న చీనాంబరము వలెనున్న లేఁత చిగుళ్ళతో మఱింత వింతగానున్నది. కొనకొమ్మనుజేరి కోయిలయొక్కటి మధురమైన కంఠధ్వనితోఁ జెవులపండువు సేయు చున్నది.

రుక్మి—నాన్నగారూ! రామచిలక కొమ్మమీఁద తలక్రిందుగా నిలుచుండి జామపండు నేప్రకారముగా ముక్కుతో పొడుచుకొని తిను చున్నదో చూడండి.

సీత—అన్నయ్యా! నా కా మామిడికాయ కోసియిచ్చెదవా?

సుబ్ర—అమ్మాయీ! చెట్టుక్రింద చిలుకకొట్టిన దోరకాయ లున్నవి తెచ్చుకో. (సీత పరుగెత్తుకొనిపోయి నాలుగయిదు కాయలను తెచ్చుకొని కొఱికి చూచి పంచదారవలెనున్నవని చంకలుకొట్టుకొను చున్నది.)

మాణి—ఎక్కడనుండియో యిప్పుడు గుప్పున మల్లెపువ్వుల వాసన కొట్టినది!

సుబ్ర—అమ్మా! వేగిరము రా అదిగో పొగడచెట్టుమీఁద నొక యడవిమల్లెఁతీగ అల్లుకొని, గంపలకొలఁది తెల్లని పుష్పములతో నిండి

యున్నది. మన యింటివద్ద నెన్ని నీళ్ళు పోసినను, మల్లెపూవు లీలాగున ఖాయవుగదా!

మాణి—అహా! పొగడపువ్వు లెంత సువాసన గలిగియున్నవి!

సుబ్ర—ఇప్పుడు పదిగడియల ప్రొద్దెక్కినను, గాలి యెంత చల్లగా కొట్టుచున్నది! మన యింటివద్ద నెన్నఁడైన వేసవికాలములో గాలి యింత చల్లగానున్నదా?

రాజ—సర్వేంద్రియములకు సౌఖ్యము కలుగునట్లుగా, మార్గస్థుల సంతోషమునకై యిటువంటివాని నన్నిటిని సృజించి నిర్హేతుక జాయమానకటాక్షముచేత స్వేచ్ఛగా ననుభవింప ప్రసాదించిన యీశ్వరుని మహత్త్వము నెఱిఁగి కొనియాడమన మెంతవారము? మన మెన్నఁడును నిల్లు కదలక పోవుటచేత నిటువంటి సౌఖ్యముల నేమియు నెఱుఁగనివారమై యుండియు, మనమే యెల్లవారికంటెను మిక్కిలి సుఖపడుచున్నా మను కొని గర్వపడుచుంటిమి. ఈ యడవులలోనే సదా కాపురముండి, దీన బంధువైన పరమాత్ముని యనుగ్రహమువలనఁ గలిగిన యీ సౌఖ్యము ననుభవించు చుండెడి యీ వనచరులైన కిరాతులు మొదలగు వా రెంతటి యదృష్టవంతులు! ఆహా! గ్రామములో నెప్పుడును మన కీ వసంతకాల మింత మనోజ్ఞముగా నుండలేదుగదా?

సీత—అమ్మా! నేనిఁక నడవలేను. నన్నెత్తుకో.

మాణి—ఆ చెట్టుదాఁక నడచిరా, అక్కడ నెత్తుకొనెదను. రుక్మిణీ! వెనుకపడుచున్నా వేమి? రెండడుగులు వేగిరము పెట్టు.

రుక్మి—అలవాటు లేకపోవుటచేత కాళ్లు పొక్కు లెక్కినవి శీఘ్రము నడవలేకున్నాను.

రాజ—పసులకాపరివాని నడిగినాను. ఊరొక క్రోసున్నదఁట! రెండు జాములు కావచ్చినది. ఏలాగునైనను కొంచెము శ్రమచేసి నాలు గడుగులు వేగిరము నడువవలెను.

మాణి—సీత నెత్తుకొని నడుచుచున్నాను. ఆఁకలి యగుచున్నదని యిది యేడ్చుచున్నది. మన కుడిచేతివైపున దూరమున నేమో మనుష్యుల మాటలచప్పుడు వినవచ్చుచున్నది. అది యూరేమో మనమీ పూఁట అక్కడ దిగుదమా?

రాజ—ఎవ్వరో మనుష్యు లక్కడ తొందరపడి పరిగెత్తుచున్నారు; వారిలో నెవ్వరికైన నొకయాపద వచ్చియుండఁ బోలును! శీఘ్రముగా వెళ్ళుదము రండి.

అని వేగముగ నడచి వారు మనుష్యుల కలకలము వినఁబడుచున్న ప్రదేశమునకు సమీపముగాఁ బోఁగా, మార్గమునకుఁ గొంచెము దూరములో దక్షిణపు దిక్కున మూఁగియున్న గుంపులోనుండి "శుద్ధిచేయుటకు మజ్జిగ" యని కేకలు వేయుచు కొందరు పఱుగెత్తుకొని వచ్చుచుండిరి. రాజశేఖరుఁడుగారు వాండ్రను జూచి యా సందడి యేమని యడుగఁగా, వారిలో నొక గొల్లవాఁడు "రాచకుమారుఁడొకఁడు వడగొట్టి యా రావిచెట్టు కింద పడిపోయినాఁ"డని చెప్పెను.

రాజ—మీ రాతని గొంతుకలోఁ గొంచెము నీళ్ళు పోయలేక పోయినారా?

గొల్ల—మొట్టమొదట మేము నీళ్ళియ్యఁబోఁగా, శూద్రులము కాఁబట్టి మా చేతినీళ్ళు త్రాగనని యా రాజు పుచ్చుకొన్నాఁడు కాఁడు. తరువాత దాహమునకు తాళలేక మా చేతినీళ్ళు త్రాగుట కొప్పుకొన్నాఁడు. కాని మా వారిలో పెద్దవాఁడు వచ్చి శూద్రుఁడు రాజనోటిలో నీళ్లుపోసిన పాపము వచ్చునని చెప్పి నీళ్ళు శుద్ధిచేయుటకై మజ్జిగ నిమిత్తము మమ్ముఁ

బంపినాడు. మా పల్లె యిక్కడికి పావుక్రోసు దూరమున నున్నది. మీరు బ్రాహ్మణులుగాఁ గనఁబడుచున్నారు. మీవద్ద నేమయిన మంచితీర్థ మున్నయెడల, వేగిరము పోయి యాతని గొంతుకలో నాలుగు చుక్కలు పోసి పుణ్యము కట్టుకొనుండి.

ఆ మాటలు విని రాజశేఖరుఁడుగారు రుక్మిణిచేతిలో నున్న మంచి నీళ్ళ చెంబును పుచ్చుకొని, చెట్టుదగ్గరకు పరుగెత్తిపోయి గుంపులోనుండి త్రోవచేసికొని ముందుకు నడచి గుంపునఁడుమను చెట్టునీడను కటికనేలను పరుండి చేతితో నోరును జూపి నీళ్ళనిమిత్తము సైఁగచేయుచున్న యొక మనుష్యునిఁ జూచిరి. ఆ మూఁకలో నొకఁడు నీళ్ళముంతను జేతిలోఁ బట్టుకొని 'ఈ రాజు నిష్కారణముగా జచ్చిపోవుచున్నాఁడు; ఏ దోషమూ వచ్చిననుసరే నీళ్ళుపోసి బ్రతికించెద' నని చేరువకుఁ బోవుచుండెను. అప్పుడొక ముసలివాఁడడ్డమువచ్చి వానిచేయి పట్టుకొని నిలిపి, 'ఈవలకు బూర్వజన్మములో మనమెన్నియో పాపములను జేయుటచేతనే మనకిప్పు డీ శూద్రజన్మము వచ్చినది.[1] ఇప్పు డీరాజును జాతిభ్రష్టునిజేసి యీ పాపము సహితము కట్టుకోవలెనా? నా మాట విని నీళ్ళు పోయవల'దని వారించు చుండెను. ఇంతలో రాజు కన్నులు తేలగిలవైచి, చేయి నోటివద్ద కెత్తఁ బోయి వడకించుచు క్రిందఁ బడవైచెను. అప్పుడు రాజశేఖరుఁడుగారు వెంటనే పోయి మంచినీళ్ళతో ముందుగా నెండుకొనిపోవుచున్న పెదవులను తడిపి నోటిలోఁ గొంచెము నీళ్ళు పోయగా గొంతసేపటి కాతఁడు మెల్లగా

---

1. సరిగ్గా ఇటువంటి సన్నివేశమే ఒకటి నరహరి గోపాలకృష్ణమ్మశెట్టి రచించిన శ్రీరంగరాజు చరిత్రలో కూడా వర్ణితమైంది. ఆ నవల ప్రచురణ కాలం 1872.

2. కాడి, n. Ayoke.కాడిగట్టు the ridge between two fields a boundary or land ma'k plu కాండ్లు. అని బ్రౌన్. P. 269: revised edition of 1905. A E S Reprint-1979.

జేప్పరింపనారంభించెను. అంతట రాజశేఖరుఁడుగారు తన చేతిలోని యుదకముతో మొగమును దడిపి మఱికొంచెము నీరు లోపలికిఁ బోయఁగా త్రాగి కన్నులు విప్పిచూచి రెండవప్రక్కకొత్తిగిలి మఱి కొంతసేపునకు సేదతేఱి, ఆ రాజు తన జీవములను నిలిపినందులకై రాజశేఖరుఁడుగారికి కృతజ్ఞతతో బహునమస్కారములు చేసి లేచి కూరుచుండెను. ఇంతలో పల్లెకుఁ బోయినవారు మజ్జిగయు, కొన్ని పండ్లను దీసికొనివచ్చి యిచ్చిరి. ఆ రాజు కొన్ని పండ్లను లోపలికిఁ బుచ్చుకొని మజ్జిగత్రాగి స్వస్థతపడెను. అంతట నక్కడున్నవా రందఱును తమ తమ త్రోవలను బోయిరి. ఈ లోపల మాణిక్యాంబ మొదలగు వా రొకతరువునీడను గూర్చుండి మార్గాయాసము కొంత తీర్చుకొనిరి. రాజశేఖరుఁడుగారు మిక్కిలి బడలియున్నవారయ్యును, సమీపములో నెక్కడను ఊరులేదని విన్నందున నేవేళకైనను రాజానగరమునకుఁ బోవ నిశ్చయించుకొని, తమ వారినందఱిని లేవ నియమించి యా రాజుతో ముచ్చటలాఁడుచు దారిసాగి నడవ నారంభించిరి.

రాజ—రాజుగారూ! మీ పేరేమి? మీ నివాసస్థల మెక్కడ? మీరిక్కడి కొంటిగా నెందులకు వచ్చినారు?

రాజు—నా పేరు రామరాజు; మాది పెద్దాపురమునకు సమీపముననున్న కట్టమూరు వాసస్థలము; మా కక్కడ నాలుగుకాండ్ల వ్యవసాయమున్నది; రాజమహేంద్రవరములోనున్న మా బంధువులఁ జూచుటకై పదిదినముల క్రిందటపోయి, నిన్న తెల్లవాఱుజామున బయలుదేరి మరల వచ్చుచుండఁగా నొక పెద్దపులి వచ్చి నన్నెదిరించినది. నాపైనున్న యుత్తరీయమును వేగముగా నెడమచేతికిఁ జుట్టుకొని యాచేయి పులినోటి కందిచ్చి రెండవ చేతిలోని కత్తితో దానిపొట్టనఁ బొడిచితిని; ఆ పులి మిక్కిలి బలము కలది కాఁబట్టి యాపోటును లక్ష్యము చేయక త్రోవపొడుగునను నెత్తురుగాలువలుగట్ట నన్నడవిలోనికి బహుదూరమీడ్చుకొని పోయెను; ఈ లోపల నేను కత్తితో దానిని పలుచోట్ల బొడిచినందున

నడువలేక యొక వృక్ష సమీపమునఁబడియెను. నేను బహు ప్రయాస ముతో, జేయివదల్చుకొనుటకై కుడిచేతిలోని కత్తివదలిపెట్టి దానినోరు పెగలించి చేయూడ దీసికొంటిని; ఇంతలో మునుపటిదానికంటెను బల మైన మఱియొక వ్యాఘ్రము చేరువ పొదయందుండి నామీఁదికి దుమి కెను; కాని దైవవశముచేతఁ గొంచెము గుఱితప్పి నా ప్రక్కనున్న చిన్న గోతిలోఁ బడెను; కత్తిని బుచ్చుకొనుటకు సమయము చిక్కనందున వెంటనే నేను వృక్షమున కెగఁబ్రాకి అది మరల దూఁకులోపల పైకొమ్మకు జేరి కూర్చుంటిని. పులియు విడిచిపోక వృక్షముక్రిందనే పీఁట పెట్టుకొని గూరుచుండెను; నేఁడు తెల్లవాఱిన తరువాత పదిగడియల ప్రొద్దెక్కు వఱకును అది యీ ప్రకారముగానే యుండి చివరకు విసిగి లేచిపోయి నది; నేను నిన్నటియుదయమునుండియు నిద్రాహారములు లేక వృక్ష శాఖయందే యుండి, పులిపోయిన గడియకు మెల్లగా వృక్షము దిగి కత్తిని చేతఁబుచ్చుకొని బయలుదేరి గత దినమంతయు నెండచేత మలమల మాడినందున నాలుక పిడచకట్టి నడచుటకు కాళ్ళయందు సత్తువలేక యే రీతినో దేహము నీ వృక్షచ్ఛాయకుఁ జేరవైచి పడిపోయితిని. నాకు చేతి మీఁద మాత్రమివిగో రెండు గాయములైనవి.

అని చెప్పి చేయిచూపి పైకి చేతికట్టులాగున నగపడుచునతి యొఱయందున్న కత్తినిదీసి చూపెను; రాజశేఖరుఁడుగారును దాన్ని పుచ్చుకొని చూచి యాతఁడు చేసిన సాహసకార్యమునకు మిక్కిలి యాశ్చర్యపడసాగిరి.

రామ—నాకు మీరీదినమున పోయిన ప్రాణములను మరల నిచ్చి నారు; మీకు నాప్రాణము లిచ్చినను, మీరు చేసిన యుపకారము యొక్క ఋణము తీఱదు. నా యందు దయచేసి నేను కృతజ్ఞతా సూచకముగాఁ జేయు నమస్కారముల నంగీకరింపుడు. అదృష్టదేవత యితరులను ధనదానము మొదలయిన కార్యములచేతఁ దమ కృతజ్ఞతను దెలుపు నట్టుగాఁ జేసి యిప్పుడు బీదవాఁడనైయున్న నన్ను మాత్రము మీ యంతటి మహోపకారికి వట్టిమాటలచేతనే నా కృతజ్ఞతను దెలుపునట్టు చేసినందున కెంతయుఁ జింతిల్లుచున్నాఁడను. అయినను నా చేతనైన

యుపకారము మీకేదైన కావలసియున్నచో నా ప్రాణములకైన నాశ
నక చేయసిద్ధముగా నున్నాండను. మీరిప్పు డెక్కడికిఁబోయెదరు ?

రాజ—కాశియాత్రకయి బయలుదేరినాము.

రామ—ఈ వేసవికాలము ప్రయాణమున కెంతమాత్రమును మంచి సమయము కాదు. ఈ యెండలో మీరు గాడుపుకొట్టి పడిపోవుదురు. త్రోవపొడుగునను దొంగల భయము విశేషము. మీకు రాజమహేంద్రవరములో నెవరైన బంధువు లున్నారా ? లేక మీకదే నివాసస్థలమా ?

రాజ—గోటేటి రామమూర్తిగారిని మీ రెఱుఁగుదురా ? అతఁడు నా పినతండ్రి కొమారుఁడు. వారి యింటనే నేను పదియేను దినములుండి బయలుదేరినాను. మా స్వస్థలము ధవళేశ్వరము.

రామ– మీ పేరేమి ? వీరందఱును మీకేమగుదురు ?

రాజ–నా పేరు రాజశేఖరుఁడు; వాఁడు నాకొమారుఁడు; ఆ యాఁడు పిల్లలిద్దఱును నా కొమార్తెలు; అది నా భార్య.

రామ–మీరింత వేసవి కాలములో యాత్రకు బయలుదేఱుటకు కారణమేమి ? మీ వైఖరి చూడ మిక్కిలి సుఖము ననుభవించిన వారుగాఁ గనబడుచున్నారు.

రాజ–నేను మొదట ధనికుఁడనే యౌదును. కాని నావద్దనున్న ధనమంతయు నా కొమార్తె వివాహములో నిచ్చిన[1] సంభావనల క్రిందను, ముఖస్తుతులు చేయు మోసగాండ్రకుఁజేసిన దానముల క్రిందను వెచ్చపెట్టి బీదవాఁడనయి, కడపట యాత్రకు బయలుదేరినాను. నిత్యమును వారి స్తుతి పాఠములను స్వీకరించి నేను తుష్టిబొందుచుంటిని; నా ధనమును స్వీకరించి వారు తృప్తినొందుచుండిరి. తుదకొక బైరాగి బంగారము చేసెదనని నాయొద్దనున్న వెండి బంగారముల నపహరించి వానికి బదులుగా నింతబూడిద నిచ్చిపోయి నన్ను నిజమైన జోగినిగాఁ జేసెను.

---

1. వీరేశలింగం పంతులుగారి తాతగారు కూడా పుత్రుల వివాహాలలో సంభావనలు కింద అధిక వ్యయం చేసినట్లు స్వీయచరిత్రలో వుంది.

రామ—మున్నెప్పుడు, మీరు దూరదేశ ప్రయాణములను చేసిన వారు కారు. నా మాట విని మీరీ శేసవికాలము వెళ్ళువఱకైన భీమవరములో నుండుఁడు. అది గొప్ప పుణ్యక్షేత్రము; భీమనది సమీపమున భీమేశ్వరస్వామివారి యాలయమున్నది; దానికిని పెద్దాపురమునకును క్రోసెడు దూరము కలదు. పెద్దాపురమును పాలించుచున్న కృష్ణగజపతి మహారాజుగారు మిక్కిలి ధర్మాత్ములు. వారు తమ ప్రజల క్షేమమును విచారించు నిమిత్తమయి మాఱువేషము వేసికొని తిరుగుచుందురు. వారి యొద్ద మా బంధు వొకఁడు గొప్ప పనిలో నున్నాఁడు. మీరు భీమవరములో నుండెడి పక్షమున మావానితో మాటాడి సమయము వచ్చినప్పుడు మీకొక యుద్యోగమును జెప్పించెదను.

రాజశేఖరుఁడుగారు మంచివారు గనుక పెద్దాపురము వెళ్ళినమీఁదట నాలోచించెదమని యప్పటికి చెప్పిరిగాని, యా రాజస్థితినిజూచి యాతఁ డుద్యోగముఁ జెప్పించునన్న యాశనుమాత్రము పెట్టుకొన్న వారుకారు. ఈ మాటలు ముగియునప్పటికి వారు గ్రామమును సమీపించిరి.

రాజ—ఆ చెట్లకు గ్రామ మెంతదూరము ?

రామ—గ్రామ సమీపమునకు వచ్చినాము. ఆ చెట్టు చెఱువు గట్టు మీఁదివి. చెఱువున కెదురుగానే సత్ర మున్నది.

రాజ—మీరీపూట మాతో భోజనము చేసెదరా ?

రామ—నాకు గ్రామములో బంధువులున్నారు; అక్కడికి వెళ్ళి భోజనము చేసి, చల్లపాటువేళ మెల్లగా బయలుదేరి వచ్చెదను. మీరు స్త్రీలతో బయలుదేరినారు. కాఁబట్టి భోజనము చేసిన తోడనే ప్రయాణమయి పొద్దుకుంకకముందే వేఁడిమంగలమును దాఁటవలెను. అక్కడ దొంగలభయము బహువిస్తారము. మీ రేలాగునయిన శ్రమచేసి చీఁకటిపడకముందే పెద్దాపురం చేరి యొకనాఁడక్కడ నుండుఁడు. నేను మిక్కిలి దస్సియున్నాను గనుక మీతో నిప్పుడు రాలేను. రేపటి దినము వచ్చి మిమ్ము గలిసికొనెదను.

అని రాజశేఖరుఁడుగారికి నమస్కారము చేసి, అందరివద్దను సెలవు పుచ్చుకొని త్రోవలో భద్రమని పలుమాఱులు చెప్పి రామరాజు తనదారిని పోయెను. వంటలైన తరువాత భోజనములు చేసి వారందఱును బయలుదేరి యెండలో దేహము నిండను చెమ్మటపట్ట, అడుగడుగునకు ముంతెడు నీళ్లు త్రాగుచు నడుమనడుమ వృక్షచ్ఛాయలను నిలుచుచు అడుగొక యామడగా నడిచి నాలుగుగడియలు ప్రొద్దువేళ నల్ల చెరువు చేరిరి. ఆ చెరువు గట్టునకు క్రిందుగానున్న యొకజువ్వి చెట్టు మొదలను తాటాకు పందిరిలో దేహమునిండ విభూతిపూసికొని కంఠమునను చేతులను శిరస్సును రుద్రాక్షమాలలను ధరించుకొని గూరుచుండి వారిని చేసైఁగచేసి పిలచి, దగ్గఱనున్న చాపమీఁద గూరుచుండ నియోగించి యొక యోగి కుడిచేతిలోని తులసిపూసల తావళమును త్రిప్పుచు నోటిలో నేమేమో జపించుకొనుచు నడుమ నడుమ నొక్కొక్క ప్రశ్న వేయ నారంభించెను

యోగి—మార్గస్థులారా! మీరు మిక్కిలి యెండఁబడి మార్గాయాస ముచే బడలియున్నారు. కొంచెము సేపిక్కడ విశ్రమించిపొండి. సకుటుం ముగా బయలుదేరినట్లున్నది. మీ రెక్కడికిఁ బోయెదరు?

రాజ—కాశీయాత్ర పోవుచున్నాము.

యోగి—అట్టి దూరదేశయాత్ర ధనవంతులకు గాని లభింపదు. త్రోవ పొడుగునను సత్రములు లేవు. మీరేమైన ధనమును సేకరించుకొని మఱి బయలుదేరినారు కారా ?

రాజ—మావంటి బీదవారికి విశేషధన మెక్కడినుండి వచ్చును ? అయినను మేము నూరు రూపాయల సొమ్ము తెచ్చుకొన్నాము. ఏలాగున నైనను దానితోనే గంగాయాత్ర చేసికొని రావలెనని యున్నది.

యోగి—మీరు బహుజాగ్రత్తగా నుండవలెను. ఇక్కడికి రెండు క్రోసుల దూరములో నున్న వేఁడిమంగములవద్ద బాటసారులను దొంగలు

కొట్టుచున్నారు. గడియసేపు తాళుదురేని మా శిష్యులను తోడిచ్చి పంపెదము.

అని చెప్పి యా యోగి తావళమును త్రిప్పుచు మరల జపముచేయ నారంభించెను. ఏ వేళకును నాతని శిష్యులు రానందున, రాజశేఖరుఁడు గారు మనసులో తొందరపడుచుండిరి. ప్రొద్దును అంతకంతకువాలు చుండెను.

రాజ—స్వామీ! మీ శిష్యు లీవఱకును రాలేదు. రెండు గడియల ప్రొద్దున్నది. వేగిరము వర్తమానము బంపెదరా?

యోగి—అవశ్యముగాఁ బంపెదము.

అని చివాలున లేచి జువ్విచెట్టునకు నూఱుబారల దూరములో నున్న యొక గుడిసెయొద్దకుఁ బోయి 'గోపాలిగా' యని యొక పిలుపుపిలిచెను. లోపలినుండి చినిగినగుడ్డను కట్టుకొని బొగ్గువంటి శరీరముతో బుఱ్ఱముక్కును మిట్టనొసలును తుప్పతలయు గొగ్గిపళ్లును గల యొక కిరాతకుఁడు బయటికి వచ్చెను. వానితో నేమేమో మాటాడుచు పందిరి వఱకును దీసికొనివచ్చి, రాజశేఖరుఁడుగారు వినుచుండగా 'వీరికి సహాయముగాఁ బంపుట కయి మనవాండ్రను బిలుచుకొని యిక్కడ నున్నట్లుగా రమ్మ'ని పంపెను.

రాజ—స్వామీ! మీ శిష్యు లేవేళకు వత్తురో చీఁకటి పడకముందే వేఁడిమంగలము దాఁటవలెను; మేము నడచుచుందుమా?

యోగి—అవును, మీరు చెప్పినమాట నిజమే; మీరు నడచు చుండుడి. వాండ్రువచ్చి మిమ్మిప్పుడే కలిసికొందురు.

అప్పుడు రాజశేఖరుఁడుగారు పెండ్లముతోను బిడ్డలతోను బయలు దేఱి దొంగలపేరు జ్ఞప్తికి వచ్చినప్పుడెల్ల గుండెలు తటతటఁ గొట్టుకొన బుజముల మీఁది మూటలను పలుమాఱు తడవి చూచుకొనుచు, చీమ చిటుక్కుమన్న వెనుక దిరిగి చూచుచు, కొంచెమెక్కడ నయినను పొద కదిలిన నులికిపడుచు నడుచుచుండిరి; ఆ యోగిచేఁ బంపబడిన కిరాతుఁడును వేగముగా నడచిపోయి త్రోవలో నొకచోట దిట్టముగా కల్లునీళ్ళు త్రాగి

తూలుచు పంకించుచు .చింతనిప్పులవలె నున్న గ్రుడ్లు త్రిప్పుచు సంకేత స్థలమును జేరి, అక్కడ నొక పాకలో నిదురించుచున్న మనుష్యుని చేతితో గొట్టిలేపి, "ఓరీ! ఒక బ్రాహ్మణుడును కొడుకును భార్యయు నిద్దరు కొమార్తెలును నూఱురూపాయలతో వెళ్ళుచున్నారు. కాబట్టి మీరు చీమలచింత దగ్గఱకు వేగిరము వెళ్ళవలెనని మన గురువుగారు చెప్పినారు" అని చెప్పి పోయెను. అతఁడా మాటలు విన్నతోడనే కొంతసేపేమో యాలోచించి సంతోషపూర్వకముగా లేచి, ఆ త్రోవలను సంకేత స్థలము లను నెఱింగియున్నవాడు కావున మాఱుమాటాడక కత్తిని చేతఁ బట్టుకొని పాకవెడలి బయలుదేఱెను. ఆ కిరాతుఁడును అడ్డుత్రోవను బోయి దారిలోఁ గనఁబడ్డ మఱియొకనితోఁగూడఁ జెప్పి తిరిగి యోగిని గలిసికొని యాతని యుత్తరువు ప్రకారము విల్లును నమ్ములను ధరించి వారిని మార్గము తప్పించి చీమలచింతయొద్దకుఁ దీసికొనిపోవుటకయి పరుగెత్తుకొనిపోయి సంజచీఁకటివేళ వారిని గలిసికొనెను.

కిరా—అయ్యా! శిష్యులు రానందున మా గురువుగారు మీ కాఁపుదలకయి నన్నుఁ బంపినారు. మంచిసమయములో వచ్చి మిమ్ముఁగూడు కొన్నాను. దొంగలు కొట్టు స్థలమునకు సమీపములో నున్నాము. అయి నను మీ కేదియు భయములేదు. మన మీ మార్గమును విడిచి కాలి మార్గ మునఁ బోయి భయపడవలసిన స్థలమును దాఁటిన తరువాత పెద్దబాటలో వెళ్ళి చేరుదము.

రాజ—ఏలాగున నయినను మమ్ము సుఖముగాఁ దీసికొని వెళ్ళవల సిన భారము నీది. నీ వే త్రోవను రమ్మన్న నా త్రోవనే వచ్చెదము.

అప్పుడా కిరాతుఁడు వారిని పెద్దత్రోవనుండి మరలించి యిఱుకు దారిని వెంటఁ బెట్టుకొని పోవుచుండెను. ఇంతలో మబ్బుపట్టి దారి కాన రాక గాఢాంధకారబంధురముగా నుండెను. చెట్లమీఁది పక్షుల కలకలము లుడిగెనుగాని గుడ్లగూబ మొదలగు కొన్ని పక్షులు మాత్రము మేఁతకయి సంచరించుచుండెను. చిమ్మటలు కీచుమని దశదిశలయందును ధ్వనిఁ జేయఁ జొచ్చెను; అడవిమృగముల యొక్క కూఁతలును పాములయొక్క

ఘూత్కారములును కర్ణకఠోరములుగా వినఁబడుచుండెను. నడుమనడుమ మేఘములలోనుండి తళుక్కని మెఱుపొక్కటి మెఱసి కొంచెము త్రోవ కనఁబడుచుండెను. ఈ రీతిని కొంచెము దూరము నడచిన తరువాత దూరమున వెలుతు రగపడెను; ఆ వెలుతురు సమీపించిన కొలఁదిని గొప్ప మంటగా నేర్పడుచు, ఒక గొప్ప చింత చెట్టునకు సమీపముగా నుండెను. చీఁకటిలో నీప్రకారముగా నడచునప్పుడు రాజశేఖరుఁడుగారి ప్రాణము లాయన దేహములో లేవు; తక్కినవారును అఱచేతిలో ప్రాణములు పెట్టు కొని కాళ్ళీడ్చుచు నడచుచుండిరి. ఆ రాత్రి యాపద నుండి తప్పించుకొని యేదైన నొకయూరు చేరితిమా యిఁక నెప్పుడును దారి ప్రయాణము చేయమని యెల్లవారును నిశ్చయము చేసికొనిరి. ఊరు చేరినతరువాత గ్రామదేవతకు మేఁకపోతును బలి యిప్పించెదనని మాణిక్యాంబ మ్రొక్కు కొనెను. ఈ ప్రకారముగా వ్యాకులపడుచు వారు నడచి యొక విశాల స్థలమును జేరునప్పటికి, చింతచెట్టుక్రింద మంటముందఱఁ గూరుచుండి యున్న రెండు విగ్రహములు లేచి, దేహమునిండ కంబళ్ళు కప్పుకొని నోటిలో చుట్టలంటించి బుజములమీఁద దుడ్డుకఱ్ఱలతో వారివంక నడచిరా నారంభించెను. వాండ్రను జూచినతోడనే వారి కందఱకును పయి ప్రాణ ములు పైని పోయినవి; వెనుక నున్న కిరాతుఁడు దొంగలని కేకవేసి వెనుకవాఁడు వెనుకనే పాఱిపోయెను. ఇంతలో నాదొంగలలో నొకడు ముందుకువచ్చి రెండుచేతులతోను కఱ్ఱను పూనిపట్టి, మాటాడక ముందున్న రుక్మిణి నెత్తిమీఁద సత్తువకొలఁది నొకపెట్టు పెట్టెను. ఆ పెట్టుతో మొదలునఱికిన యరఁటిచెట్టువలె రుక్మిణి నేల కొఱిగి నిశ్చేష్టురాలయి పడియుండెను. ఇంతలో నెవ్వడో కత్తి దూసికొని 'ఆగు' 'ఆగు' మని కేకలువేయుచు, మెఱుఁపు మెఱసినట్లు మీఁదబడి దొంగలలో నొకనిని మెడమీఁద ఖడ్గముతోవేసెను. ఆ వ్రేటుతో శిరస్సు పుచ్చకాయవలె మీఁది కెగిరి దూరముగాఁ బడఁగా మొండెము భూమిమీఁద బడి చిమ్మన గొట్టము లతోఁ గొట్టినట్లు రక్తధారలు ప్రవహింప కాళ్ళతోను చేతులతోను విల విలఁ గొట్టుకొనుచుండెను. శత్రు వాయుధపాణియయి యుండుటయు, తా నొంటిగాఁ డగుటయు, బాటసారులలో మఱియిద్దరు మగవాండ్రుండుఁ

టయు చూచి కిరాతునితోఁ గూడికొని రెండవ దొంగవాఁడు కాలికొలఁదిని దూఁకెను. ఖడ్గపాణియైన యాపుణ్యాత్ముఁడు వాం(డను కొంతదూరము వెంబడించెను. గాని వాం(డు నిమిషములోఁ జూపుమేర దూరము దాఁటి యదృశ్యులయినందున వెనుకకు మరల వచ్చి రాజశేఖరుఁడు గారిని కలిసికొనెను.

రామ—రాజశేఖరుఁడుగారూ! ప్రొద్దుండగానే యీస్థలమును దాఁట వలసినదని నేను మధ్యాహ్నముననే బహువిధముల బోధించితిని గదా? మీరు నా మాటలను లక్ష్యముచేయక యీయాపదను దెచ్చిపెట్టుకొంటిరి.

రాజ—ఓహోహో! రామరాజుగారూ! మీరు మాపాలిటి దైవము వలె సమయమునకు వచ్చి మా యందఱి ప్రాణములను నిలువఁబెట్టిరి. మీరింకొక నిమిషము రాకుండిన మే మందఱము నాదుర్మార్గుల చేతులలోఁ బడిపోయి యుందుము. మీరీవేళ నిక్కడ కెట్లు రాఁ గలిగితిరి?

రామ—మీతోవచ్చిన కిరాతుఁడు యోగిచే దొంగలను బిలుచుకొని వచ్చుటకయి పంపఁబడి యెండలో నడువలేక యొకపాకలోఁ బరుండి యున్న నన్నుఁ దనవారిలో నొకనిగా భ్రమించి తన గురువు కొందఱుఁ బ్రాహ్మణులను దోఁచుకొనుటకయి యీ చింతచెట్టువద్దకు వెళ్ళుచున్నాఁ డని చెప్పెను. ఆ మాటలు విన్నతోడనే యాబ్రాహ్మణులు మీరే యని యూహించి నా కపట గాలు నిలువక దొంగలను వారింపవలెనను నుద్దేశముతో యోగియున్న తావునకుఁబోతిని. అక్కడ నావఱకే దొంగలువచ్చి యోగితో మాటాడి పోయినారన్నవార్తవిని గుండెలు పగిలి నేను వచ్చు లోపల మీకేమి యుపద్రవమువచ్చునోయని మార్గాయాసమునేమియు లక్ష్యము చేయక యొక్కపరుగున వచ్చి యుక్తసమయమున మీకుఁ దోడు పడఁగాంచి నా జన్మము కృతార్థత గనెను గదాయని సంతోషించు చున్నాఁడను.

అనునప్పుడు మాణిక్యాంబ రుక్మిణిని నఖశిఖపర్యంతము తడవి చూచి గొంతెత్తి యేడ్వఁజొచ్చెను. రామరాజును రాజశేఖరుఁడుగారును గూడ దగ్గఱకుఁబోయి చూచి కడుపుపట్టిచూచి ముక్కుదగ్గఱ వ్రేళ్లపెట్టి

యూపిరిగానక దెబ్బచేతను భయముచేతను మరణమునొందె నని నిశ్చ యించుకొనిరి. రామరాజునూ నాడి నిదానించి చూచి యామె చచ్చినదనియే స్థిరపఱచెను. అప్పు డందఱును శవముచుట్టును జేరి విలపించుచుండిరి. ఆ సమయమున సమీపమునుండి వ్యాఘ్రము యొక్క కూఁత యొకట వినఁబడెను. అంత యాపదలోసహిత మాధ్వని కందఱును బెదరి వడఁకు చుండఁగా, రామరాజు వారికి ధైర్యము చెప్పి క్రూరమృగములతో నిండి యున్న యరణ్యమధ్య మగుటచేత నచ్చట నిలువఁగూడ దనియు తెల్లవాఱినమీఁదట మరల వచ్చి శవమునకు దహనాదిసంస్కారములు చేయవచ్చు ననియు బోధింపజొచ్చెను. కన్నకూఁతురును కాఱడవిలో విడిచిపెట్టి వెళ్లుటకు మనసురాక వారాతని మాటలను చెవినిబెట్టక రుక్మిణి సుగుణములను దలఁచుకొని యేడుచుచుండిరి. ఇంతలో మఱింత సమీపమున గాండ్రుమని పులి మఱల నఱచెను. ఆ రెండవకూఁతతో సూర్యకిరణములకు మంచు కరఁగునట్టుగా వారి ధైర్యసారము కరఁగి పోయెను. అప్పుడా రామరాజు హితబోధ నంగీకరించి, యెంతో కష్టముతో రుక్మిణిని విడిచిపెట్టి, నడవ కాళ్ళురాక ముందుకు నాలు గడుగులుపెట్టి మరల వెనుకతిరిగి చూచుచు, తుదకు విధిలేక రామరాజువెంట వారందఱును పెద్దాపురమునకుఁ బోయిరి. తమ ప్రాణములమీఁదికి వచ్చునప్పుడు లోకములో నెల్లవారును తామావఱకు ప్రాణాధికులుగాఁ జూచుకొనువారి యాపదలనయినను మఱచిపోయి తమ యాపదను తప్పించుకొనుటకే ప్రయత్నింతురు గదా!

# తొమ్మిదవ ప్రకరణము

రాజశేఖరుఁడుగారు పెద్దాపురము చేరుట—రుక్మిణి దేహమును వెదకవచ్చి కానక దుఃఖించుట—పెద్దాపురములోని వార్తలు—భీమవరమునకుఁబోవుట—అక్కడి విశేషములు—సుబ్రహ్మణ్యమును పిఠాపురము పంపుట.

రామరాజు నాఁటిరాత్రి మెల్లగా రాజశేఖరుఁడుగారిని కుటుంబ సహితముగా గొనిపోయి పెద్దాపురము చేర్చి, తిరుపతిరాజు చెఱువునకు సమీపముగనున్న సత్రములోదింపి, కాశీప్రయాణము మాని భీమవరములో నుండుఁడని బహువిధములఁజెప్పి, యొప్పించి తన దారిని బోయెను. ఒక్కనాఁటి ప్రయాణములోనే కూఁతురుపోవుటయు తక్కినవారు ప్రాణములు దక్కించుకొని బయలఁబడినను కాళ్ళన్నియు వాచి యడుగుతీసి యడుగు పెట్టలేనంత దుస్థితిలో నుండుటయుఁ దలఁచుకొని యాత్ర పేరన్న భయపడి రాజశేఖరుఁడుగారు కొన్ని దినములలో భీమవరముచేరి యందుండి సమయమయినప్పుడు రాజుగారిని చూచుటకు నిశ్చయించు కొనిరి. రుక్మిణి పోయినదన్న విచారముచేతను మార్గాయాసమున బడలి యుండుటచేతను వారా రాత్రి వంటలు చేసికొని భోజనము చేసినవారు కారు. వారికెవ్వరికిని కంటికి నిద్రయును పట్టలేదు. ఆ రాత్రినొక యుగముగావేగించి రాజశేఖరుఁడుగారు కోడికూసినతోడనేలేచి తామొక్కరును బయలుదేఱి రుక్మిణిని వెదకుటకయి వేఁడిమంగలపు మార్గమున నడచిరి.

అట్లు కొంతదూరము నడిచి రాజశేఖరుఁడుగారు పసులకాపరి బాలుర నడగి మార్గమును గనుఁగొనుచు అడవిలోఁ బ్రవేశించి నాలుగు గడియల ప్రొద్దెక్కువఅకు దొంగలుకొట్టిన స్థలముచేరి యక్కడ రుక్మిణి దేహమును గానక యిసుకలో నెత్తురు చుక్కలను మాత్రము చూచి

దుఃఖముతో నలుప్రక్కలను రుక్మిణిని వెదకికొనుచుఁ దిరిగియెందునేమియుఁ గానక మరల నెప్పటిచోటునకు వచ్చి, అచ్చటఁ గొంతసేపు పచ్చిక బయలను గూరుచుండి యాపచ్చికను తన కన్నీటితోఁ దడిపి రుక్మిణి దేహము నే మృగములో యీడ్చుకొనిపోయియుండునని నిశ్చయము చేసికొని యీ దుర్వార్తను గొనిపోయి యెట్లు భార్యతోను బిడ్డలతోను జెప్పుదునాయని కొంతసేపు దుఃఖించి మెల్లగాలేచి కాళ్లు తడఁబడనడుచుచు త్రోవపొడుగునను రుక్మిణియొక్క సౌందర్యమును సుగుణ సంపదలను దలఁచుకొని కన్నుల నీరునించుచు మధ్యాహ్నము రెండుజాముల కేలాగు ననో యింటికి దేహమును చేర్చి నడవలో చాపమీఁద చతికిలఁబడి యేమో చెప్పఁబోయి మాటరాక పెదవులు నాలుకతో తడుపుకొనుచు నూరకుండిరి. అప్పుడు మాణిక్యాంబ తొందరపడి లోపలికి పరుగెత్తుకొనిపోయి కంచు చెంబుతో మంచితీర్థముతెచ్చి నోటి కందిచ్చి పయిట చెఱఁగుతో మొగము మీఁది జెమ్మటతుడిచి విసనకఱ్ఱతో విసరుచు మగని మార్గాయాసమును కొంతవఱకు పోఁగొట్టెను. అంత నతఁడును కొంత ధైర్యము నవలం బించి, కన్నుకొలుకులనుండి నీరు కాలువలుకట్టి గడియ కొకమాట చొప్పున దుఃఖమును మ్రింగుకొనుచు రుక్మిణి వార్తను జెప్పెను. అప్పు డందఱును పెద్ద పెట్టున గొల్లుమని రోదనము చేయ నారంభించిరి. అది విని సత్రపు బ్రాహ్మణుఁడు చుట్టుపట్లవారు వచ్చి, వారికి వచ్చిన యాపదను దెలిసికొని బహువిధముల వారి నూరార్చి భోజనమునకుఁ లేవఁదీసిరి. వారును విస్తళ్లయొద్ద కూరుచుండి తినఁబోయిన మెతుకులు లోపలికిపోక కొంతసేపు కూరుచుండి విచారముతో విస్తళ్లను వదిలిపెట్టిలేచిరి. అప్పుడు నూతి ఫెరటిలోనికిఁ బోయి వారు చేతులు కడుగుకొనుచుండగా కేకలు వేయుచు వీధిలోనుండి పరుగులెత్తుచున్న మనుష్యులయొక్క కలకలము వినవచ్చెను. ఆ సందడియేమో చూతమని వీధిలోనికి వచ్చునప్పటికి తూర్పువయిపున దూరముగా మంటయును మిన్నుముట్టు పొగయును కనఁబడెను. ఇంతలో సత్రపుబ్రాహ్మణుఁడు వచ్చి కుమ్మరివీధి తగులఁ బడుచున్నది, చూచివత్తము రమ్మని రాజశేఖరుఁడుగారిని పిలిచెను. కాని యాతఁ డెంతదయార్ద్రహృదయుం డయినను కొండంత దుఃఖములో

మునిగియున్న వాఁడు గనుక, నిల్లు కదులుటకు మనసు గొలుపక యూరకుండెను. సుబ్రహ్మణ్యు మాపటి కెన్నఁడు నాపదల ననుభవించి యెఱుఁగని పసివాఁడగుటచేత పరుల కాపద వచ్చినదన్నమాట వినినతోడనే తనయాపద మఱచిపోయి, చేతనయిన యెడల వారికి సాహాయ్యము చేయవలెనను నుద్దేశముతో తానా బ్రాహ్మణునితోఁ గూడ బయలుదేఱి పోయెను. వారక్కడికిఁబోయి చేరునప్పటికి వేలకొలఁది జనులువచ్చి వేడుక చూచుచుండిరి. కాని, వారిలో నొక్కరయినను ఆర్పుటకు ప్రయత్నపడుచుండలేదు. ఇండ్లకు వేసిన వెదురుబొంగులు కణుపులయొద్ద పగిలి పెటపెట ధ్వనులతో తుపాకులు మ్రోగినట్టు మ్రోగుచుండెను. ప్రాతతాటాకులు పయికి లేచి గాలిలో తారాచువ్వలను తలఁపించుచుండెను. ఎండలవేడిమి చేత సమీపమునున్న చెఱువెండిపోయినందునను ఇంకిపోఁగా మిగిలిన నూతులలోని నీళ్ళు చేఁద మునుగుటకయిన వీలులేక పాతాళలోకమునకు సమీపముగా నున్నందునను, నీళ్ళను తెచ్చుకోలేక అంటుకొన్న యిండ్లవాండ్రు పెణకలను లాగుటకు ప్రయత్నపడుచుండిరి. ఆ చేరువ యిండ్లవారు తమ యింటిమీఁది తాటాకుల నయిన దీసిన మరల వేసికొనుటకయి శ్రమపడవలసి వచ్చునని వానిని ముట్టుకోక, కాలుచున్న యిండ్లవారు వేఁడుకొన్నను ఇయ్యక దాచిపెట్టుకొన్న కడివెడు నీళ్ళను బట్టుకొని నడికప్పులమీఁది కెక్కి తమ యిల్లంటుకొనువఱకును నుండి నీళ్ళకుండ నక్కడనే దిగవిడిచి రోదనములు చేయుచు దిగుచుండిరి. మఱి కొందరు తమ యిండ్లలోని సామానులు కాలిపోవునను భయముచేత వెలుపలికిఁ దెచ్చి వీధిలోఁ బెట్టుచుండిరి. వారొక వస్తువును దెచ్చి రెండవ వస్తువుకొరకు వెళ్ళునప్పటికి పరోపకార పారీణులయిన మహాత్ములు కొందఱు చూచువారులేక వీధిలో పడియున్న వస్తువులను దీసి తమయింట జాగ్రత్త చేసికొనుచుండిరి.

ఇట్లు కుమ్మరపేట పరశురామప్రీతి యగుచుండఁగా సత్ర బ్రాహ్మణుఁడు సుబ్రహ్మణ్యమును దూరముగా నున్న యొక చెట్టునీడకుఁ దీసికొనివచ్చి యిండ్లు కాలుటను గుఱించి ప్రసంగింప నారంభించెను.

సత్ర— ఈ ప్రకారముగా రెండుజాములవేళ ఇండ్లెందుకు కాలినవో కారణము మీకుఁ దెలిసినదా ?

సుబ్ర—కుమ్మరావములు కాల్చునప్పుడు ప్రమాదవశమున నిప్పంటుకొని తాటాకుల యిండ్లుగనుక కాలియుండవచ్చును. లేదా యెవ్వరయినను పోట్లాడి యిండ్లకు నిప్పుపెట్టియుందురు.

సత్ర—మీరు చెప్పిన రెండు కారణములను సరియయినవి కావు. ఈ గ్రామమున కేదో క్రొత్తగా నొక గ్రహమువచ్చి యీ ప్రకారముగా తగులబెట్టిందికాని వేఱుకాదు.

సుబ్ర—నీవు నాతోనే యిప్పుడిక్కడికి వచ్చితివిగదా ! ఎవ్వరిని అడిగి తెలిసికోకుండ గ్రహమే యిండ్లు తగులఁబెట్టినదని నీ వెట్లు రూఢిగా జెప్పఁగలవు ?

సత్ర—మా గ్రామముసంగతి నాకుఁ దెలియదా ? ఈ గ్రామ మేఁటేఁట వేసవికాలములో నాలుగుసారులు తగులుపడును. ప్రతి పర్యాయమును గ్రహమునకు జాతరచేసి యూరివారు దానిని సాగనంపు చుందురు. ఇది గ్రహముచేతనే కాకపోయిన పక్షమున, వర్షకాలములో నేల తగులపడకూడదు ?

సుబ్ర—ఇండ్లుకాలుట గ్రహముచేతనే యయినయెడల, ఒకసారి జాతరచేసి బంపిన గ్రహము మరల వచ్చుటకుఁ గారణమేమి ? వర్షాకాలములో ఇండ్ల కప్పులు వానతో నానియుండును కనుక —

సత్ర—కారణములు గీరణములును నాకుఁదెలియవు. నాకెప్పుడును యుపయుక్తులన్నఁ దలనొప్పి; కాబట్టి నేను జెప్పినమాటల కడ్డమాడక సత్యమని నమ్ము. ఇప్పుడు నమ్మకపోయినను రేపు జాతరగు చుండఁగా కన్నులార చూచినప్పుడయినను నమ్మెదవు.

ఈ ప్రకారముగా సంభాషణ జరుగుచుండఁగా అగ్నిహోత్రుడు తన చెలికాఁడగు వాయుదేవుని సాయముచే కుమ్మరిపేటను సంపూర్ణముగా దహనము చేసి తృప్తిపొంది ప్రశాంతి నొందెను. ఇండ్లు కాలినవారును

సొత్తు పోయినవారును విచారించుచుండగాఁ కొందఱు చుట్టకాల్చుకొనుటకు కావలసినంత నిప్పు దొరికినదనియు శేపు బొగ్గులు చవుకగా దొరకగల వనియు సంతోషించుచుఁబోయిరి. వారి వెనుకనే సుబ్రహ్మణ్యమును సత్రపు బ్రాహ్మణునితోఁ గూడ బయలుదేఱి సత్రమును జేరెను. ఈ లోపల నెవ్వరో రుక్మిణి యత్తవారి యూరికిఁ బోవుచున్న బ్రాహ్మణుడొకఁడు సత్రములోనికి భోజనమునకు రాఁగా, దుర్మరణ కథను జాబు వ్రాసి యుత్తరక్రియలను వేగిరము జరిగించుటకయి యా జాబు నతని చేతికిచ్చి రాజశేఖరుఁడుగారు వియ్యంకునకుఁ బంపిరి.

ఆ మఱునాఁడు పగలు రెండుజాములవేళ రాజశేఖరుఁడుగారు భోజనము చేసి వీధియరుగుమీఁద గూరుచుండియుండగాఁ, ఆ దారిని తుడు ములు డప్పులు మ్రోగుచుండఁగా కొందఱు బండిమీఁద కుంభమును బెట్టుకొని త్రాగి కేకలువేయుచు నడుచుచుండిరి; వారి వెనుకను జన సంఘము మూఁకలుకట్టి తమ చేతులలోని కఱ్ఱలతో త్రోవపొడుగునను ఇండ్లమీఁద కొట్టుచుఁబోవుచుండిరి. ఆ మూకలలోనుండి సత్రపు బ్రాహ్మ ణుఁడు నడుమునకు బట్టబిగించుకొని చేతిలో పెద్దకఱ్ఱ పెట్టుకొని దేవా మంతటను జెమ్మట కాలువలు గట్టవచ్చి సుబ్రహ్మణ్యము చేయి పట్టుకొని "నిన్న నేను జెప్పినప్పు డబద్ధమంటివే. ఇప్పుడయిన నా మాట నమ్మె దవా ?" యని క్రిందికి లాగెను.

సుబ్ర—ఉండు; నేను వచ్చెదను. ఈ యుత్సవ మెవ్వరిది ?

సత్ర—నిన్న చెప్పలేదా ? ఇండ్లు కాల్చు గ్రహము గ్రామము నకు వచ్చినప్పుడు ఈ ప్రకారముగా చేయుదురు. ఒక చేతితో వేప మండయు, రెండవచేతితో పేపబెత్తమును పట్టుకొని ముందు నడుచు చున్న యతనిని జూచినావా ?

సుబ్ర—పెద్ద కుంకుమబొట్టు పెట్టుకొన్నతఁడు కాదా ? చూచి నాను. అతఁడెవరు ?

సత్త—అతఁడే యీ తంతు నడిపించుచున్న మంత్రజ్ఞుఁడు; క్రొత్తగా వచ్చి యిండ్లు కాల్చుచున్న దేవతను కొంచెము సేపటికి వెళ్ళఁ గొట్టును. అతని పేరు వీరదాసు.

సుబ్ర—ఈవఱ కేమితంతు చేసినారు ?

సత్త—ఇంటికొకటికి రెండేసిచేరల బియ్యము చొప్పున ఏడిండ్లలో అడిగి పుచ్చుకొని, క్రొత్తకుండతెప్పించి గ్రామమునడుమ వీథిలో పొయ్యిపెట్టి ఆ కుండతో అడిగిపుచ్చుకొన్న బియ్యము, మునుగకూర, తెలగపిండికలిపి జామువరకు వంటచేసి, ఆ కుండను దిగువదించియుంచి నడివీథినలికి యెఱ్ఱముగ్గు, తెల్లముగు, నల్లముగ్గు, పచ్చముగ్గు, ఆకు పసరముగ్గు తెచ్చి వానితో బేతాళుని స్వరూపము వ్రాసి బేతాళ యంత్రము వేసి పూజచేసి ధూపదీపఫల నైవేద్యములు సమర్పించి ఏడేసి రావి యాకులతో కుట్టిన యేడు విస్తళ్ళలో వండిన కుంభమును వడ్డించి, నడివీధిలో నొక కొయ్యనుపాతి దానికి బేతాళ యంత్రమునకు గ్రహమును వ్రాసిన యాజ్ఞనుగట్టి ఈయన జరిగించవలసినపని యంతయు జరిపినాఁడు. తరువాత మేము కుంభమును బండిలో నెత్తించుకొని యీ కఱ్ఱతో గృహములమీఁద కొట్టుచు ఊరేగుచున్నాము. ఇఁక గ్రామదేవత గుడివద్దకు వెళ్ళిన తరువాత చిత్రము జరుగును.

సుబ్ర—అలాగయిన నేనును వచ్చెదను.

అని సుబ్రహ్మణ్యము వారివెంట బయలుదేఱెను. అందఱును గ్రామదేవత గుడి చేరిన తరువాత యంత్రజ్ఞుడు దిగ్గరగా గ్రామదేవత పేర వ్రాసిన యాజ్ఞను ఈ ప్రకారముగాఁ జదివెను.

యంత్రజ్ఞుఁడైన వీరదాసుగారు పెద్దాపురము గ్రామదేవత అయిన మరిడీ మహాలక్ష్మికి చేసిన యాజ్ఞ— ఈ గ్రామములో ఏదో గ్రహము చేరి యిండ్లు కాల్చుచుండఁగా ఈ గ్రామమునకు దేవతవయియుండియు నీవూరికే చూచుచుండుటకు నిమిత్తములేదు. ఆ గ్రహమునకు నీ తరఫున కుంభము కట్టబడి చేయించినాము. ఆ కుంభము ఆ గ్రహమునకిచ్చి మాఱుమన్యమయిన కొండలమీఁదికి దానిని పంపివేయ వలసినది. అలా

గున పంపించని పక్షమున, శ్రీ బేతాళుని చేతగాని శ్రీహనుమానుల చేతఁ గాని కఠినమయిన తాళీదును పొందగలవు.

"శ్లో॥ యక్షరాక్షస దుష్టానాం మూషకాశ్శలభాశ్శుకాః
క్రిమికీట పంతగానా మాజ్ఞాసిద్ధి ర్విభీషణః॥"

అని చదివిన తరువాత, యంత్రజ్ఞుఁడు ఏడు విస్తళ్ళను ఏడుచోట్ల వేయించి ఆ యేడింటిలోను కుంభము పోయించి, బండి తోలుకొని వచ్చినవానిచేత నల్లకోడి నొకదానిని కోయించి దాని రక్తమును కుంభము మీఁద పోయించి, "ఓ గ్రహమా ! నీ వీ కుంభము పుచ్చుకొని కొండల మీఁదికి పో" అని యాజ్ఞాపించెను. అక్కడికి వెళ్ళినవారందఱును చెఱువులో స్నానముచేసి యిండ్లకు వెళ్ళిరి. సుబ్రహ్మణ్యమును బ్రాహ్మణునితో సత్రమునకు వచ్చెను.

ఇంటికివచ్చి సుబ్రహ్మణ్యా మా సంగతియంతయుఁ జెప్పిన తరువాత రాజశేఖరుఁడుగారు కొంతసేపు జనుల మూఢత్వమును గుఱించి యాలోచించి, ఇంతలో రుక్మిణి తలఁపుబాఱిన దుఃఖమువచ్చి ధైర్యము తెచ్చుకొనవలెనని యెంతసేపు ప్రయత్నము చేసినను చేతఁగాక ఎక్కడికయిన వెళ్ళిన దుఃఖము మఱచిపోవచ్చునని తలంచి పట్టణమును జూచుటకు బయలుదేఱిరి. అతఁడు సత్రమును దాఁటి నాలుగడుగులు నడచిన తోడనే యొక యింటివద్ద దంపతులిద్దఱు వాక్కలహమున కారంభించిరి; అంతకంత కాకలహము ముదిరియొకరీతి యుద్ధముక్రింద మాఱినది. భార్య తిట్లెక్కువ చేసిన కొలఁదిని భర్త దెబ్బలెక్కువ చేయుచుండెను. మగని కేకలును భార్యయేడుపును విని వీధి వారందఱును గుంపులు గుంపులుగా చూడవచ్చిరి అంతమంది వచ్చినను వారిలో నొకరును వారిని వారింపవలెనని తలఁచుకొని వచ్చినవారు లేరు గనుక, అందఱును వేడుకచూచుచు మాత్రము నిలుచుండిరి. అంత రాజశేఖరుఁడుగా రాస్థలమును విడిచిపెట్టి ముందుకు సాగిరి. అవల మఱి మూఱుబారల దూరము వెళ్ళఁగా ఒకచోట వీధియరుగుమీఁద పెద్దమను

ష్యులు చేరి సత్ర తిఖ్ఖీ కూరుచుండిరి. వారు నాగరికులు గనుక వారి ప్రసంగ మెంతమనోహరముగా నుండునో వినియానందింపవలెనని తలంచి రాజశేఖరుఁడుగారు వీధిలోనే నిలువఁబడి వినుచుండిరి. ఆ సభికు లందఱును తామైనను పొగడుకొనుచుండిరి; లేదా స్నేహితులు పొగడగా సంతోషమైనను బొందుచుండిరి; వారందఱు నట్లానందించుచుండఁగా రాజ శేఖరుఁడుగారు తన్నెవరును పొగడువారును పొగడుకొన్న వినువారును గూడ లేనందునఁ జిన్నఁబోయి యిఁక నిందు నిలువఁగూడదనుకొని యక్కడనుంచి బయలుదేఱిరి. అటుపిమ్మట నాతఁడు త్రోవపొడుగునను నాలుగైదు రమణీయ సౌధములనుజూచి లోపలికిబోయి వానిని చూడవలెనని బుద్ధిపుట్టి గుమ్మమెక్కి తాను పండితుఁడననియు మేడనుచూడ వేడుకపడి వచ్చితిననియుఁ జెప్పి చూచెనుగాని, ఆ పట్టణస్థులందఱును ధనికులమీఁద మాత్రమే ప్రేమగలవారు గనుక ఆయన పాండిత్యమేమియు పనికిరాక మేడలయొక్క వెలుపలి భాగములను మాత్రము చూచి సూర్యాస్తమయ సమయము కావచ్చినందున వెనుకకు మరలి తిన్నగా సత్రమువద్దకు వచ్చి చేరవలసివచ్చెను.

అప్పుడు సత్రపు బ్రాహ్మణుఁడు రాత్రి వంటలేదు గనుక తీఱు బడిగా వచ్చి కూరుచుండి రాజశేఖరుఁడుగారితో ముచ్చటలకు మొదలు పెట్టెను.

రాజ—మీ పట్టణములో గొప్ప పండితులున్నారా ?

సత్ర—ఉన్నారు. ఆస్థాన పండితుఁడయిన హరి పాపయ్య శాస్త్రులుగారు లేరా ? ఆయన యెప్పుడు నెవ్వరితోను బ్రసంగింపఁడు గనుక అందఱికంటెను గొప్ప పండితుడని వాడుక. ఆయన యొకసారి యీ సత్రములో జరిగిన సంతర్పణమునకు భోజనమునకు వచ్చినప్పుడు విశేషముగా మాటాడకపోయినను భుజించినందున, ఆయన గొప్పపండితుఁ డనియే నేనును నమ్మినాను.

రాజ—ఆయనగాక మఱియెవ్వరయిన నున్నారా ?

సత్య—మాగురువులు భానుమూర్తిగారు వేదాంత శాస్త్రమందు నిరుపమానమయిన ప్రజ్ఞ గలవాఁడు. నాకు మొన్న రోగము వచ్చి నప్పుడు పుణ్యలోకము వచ్చుటకు తగిన సదుపాయమును చేసి పది రూపాయలను పట్టుకొని పోయినారు. ఆ మఱునాఁడే దొంగవస్తు వొకటి ఆయన యధీనములో కనఁబడినందున దుర్మార్గులయిన రాజభటులాయనను నిష్కారణముగా తీసుకొనిపోయి ఠాణాలో పెట్టినారు.

రాజ—గురువు లెప్పుడును శిష్యులకుఁ దమ్రవేలితో స్వర్గమునకు త్రోవ చూపుచుందురు. కాని తాముమాత్రము స్వర్గమార్గము, మాట యటుండఁగా దాముున్న యీ లోకమునే త్రోవఁగానక గోతిలో పడు చుందురు. తార్కికుఁడును వైయాకరణుఁడును నగుట సులభముకాని యోగ్యుఁడగుట యంతసులభము కాదు. ఆ మాట యటుండనిచ్చి మీ పట్టణములోని వారి స్థితిగతులను కొంచెము చెప్పుము.

సత్య—కష్టపడి పనిచేయువారు తాము తెచ్చుకొన్నది అన్న వస్త్రాదులకు చాలక బాధపడుచుందురు; పాటుపడని సోమరిపోతులు పూర్వులార్జించిన మాన్యముల ననుభవించుచు విలువబట్టలను పంచభక్ష్య పరమాన్నములునుగలిగి సుఖించుచుందురు. తాతముత్తాతలనాటినుండియు పరువుతో బ్రతికినవారు కొందఱు జీవనము జరగక రాజుగారిని చిర కాలమునుండి యాశ్రయించుచున్నారు; కాని యెంత యనుసరించినను రాజు నిర్దయుఁడై చదువురాదనిచెప్పి వారికి కొలువులియ్యకున్నాఁడు.

రాజ— అదృష్టవంతులము కావలెనని చేయు ప్రయత్న మొకటి తప్ప వేఱె ప్రయత్నము లేనివా రెప్పుడును భాగ్యవంతులు కారు. భాగ్య దేవత మాఱు పని లేక తనకొఱకే కాచుకొనియున్న వారియొద్ద నుండి పాఱిపోయి, యింటఁ గూరుచుండి. యొడలు వంచి పనిచేయువారినే చేరును. దాని కేమిగాని మిగిలిన వృత్తాంతమును చెప్పుము.

సత్య—మా పట్టణమున ననేకులు రాత్రులను పురాణ కాలక్షేప మును జేయుదురు. ఇక్కడికి దగ్గఱనే యొక పెద్దమనుష్యుఁ డున్నాఁడు. ఆయన యెప్పుడును చదువక పోయినను తాటాకుల పుస్తకము నొక

దానిని విప్పి సర్వదా ముందుపెట్టుకొని కూరుచుండును. మన పొరుగింట కాఁపురమున్న సముతుదారుగారి తల్లికి పురాణ మన్న నెంతో యపేక్ష; ఆమెకు నిద్రరానపుడెల్లను పురాణము చదువుమనును; పురాణ మారంభించిన తరువాత మంచి కథపట్టు రాఁగానే గోడను చేరగిలఁబడి హాయిగా నిద్రపోవును.

రాజ—ఇక్కడి వర్తకు లెటువంటివారు?

సత్ర—వర్తకులు తమ సరుకులను మాత్రమే కాదు, మాటలను సహితము విశేషలాభమునకు విక్రయింతురు. అయినను వారి కెంత లాభము వచ్చినను, ఆ లాభము మాత్రము వారి యాశకుఁ దగియుండదు. ఈ సంగతి నెఱిఁగి యిక్కడి పెద్దమనుష్యులు కొందఱు మొదట వారి వర్తకశాలకుఁ బోయి యొకవస్తువునుగొని వారడిగిన వెల నిచ్చి వేయుదురు; అపయిని చిన్నవస్తువు నొకదానిని అరువు తెప్పించి, దాని సొమ్మును మఱునాఁడే పంపివేయుదురు; అటుపిమ్మట క్రమక్రమముగా పెద్దవస్తువులను దెప్పించి వాని వెలలనుగూడ యుక్తసమయముననే యిచ్చివేయుదురు. ఈ ప్రకారముగా నమ్మకము కుదిరిన తరువాత పెండ్లి పేరో మఱియొక శుభకార్యము పేరో చెప్పి విలువ వస్తువులను విస్తారముగాఁ దెప్పించి కడపట సొమ్మీయక యపహరింతురు.

రాజ—ధనము నిమిత్తము ఈ ప్రకారముగా నక్రమమున కొడిగట్టిన కీర్తి పోదా?

సత్ర—కీర్తికేమి? దానిని కొనుటకయి ముందుగా ధనము సంపాదించిన యెడల తరువాత నిమిషములో కావలసినంత కీర్తిని కొనవచ్చును.

రాజ—మీ రాజుగా రెంతో ధర్మాత్ములనియు ప్రజలను న్యాయమార్గమున నడిపింపువా రనియు ఎప్పుడును వినుచుందును. వారి రాజధాని యైన యీ పట్టణమునందె యిట్టి ఘోరకృత్యములు జరుగుచుండగా రాజుగారు సహించి యూరకున్నారా?

సత్ర—ఈ పట్టణములో నిప్పు డేమియత్క్రమములు జరుగు చున్నవి? మా మహారాజుగారి తండ్రిగారి కాలములో పూర్వము జరుగు చుండెడి ఘోరకృత్యములలో నిప్పుడు గుమ్మడికాయలో నావగింజంత పాలయినను లేవు. ఆ కాలములోనే మీరీపట్టణమునకు వచ్చియుండిన యెడల మంచిబట్టలు కట్టుకొని పట్టపగలీ ప్రకారముగా వీధిలో నిర్భయ ముగా నడవఁగలిగి యుందురా? మా రాజుగారు సహస్ర ముఖముల కనుగొని నిత్యమును దుర్మార్గుల ననేకులను శిక్షించుటచేతనే యిప్పుడు నరహత్యలు మొదలయిన ఘోరపాతకము లేవియు జరగకున్నవి.

రాజ—ఈ పట్టణములో వేదవిహితకర్మానుష్ఠానములు చక్కగా జరుగుచుండునా?

సత్ర—త్రికాలములయందు యథావిధిగా జరుగుచుండును.

రాజ—అట్లయిన, నీవిప్పుడు సంధ్యావందనము చేసినావా?

సత్ర—ఎన్నడో వడుగునాఁడు నేర్చుకొన్న సంధ్యావందనము మఱచిపోక యిప్పటిదాఁక జ్ఞాపక ముంచుకొన్నా ననుకొన్నారా?

రాజ—పోనీ అర్ఘ్యమునయిన విడిచినావా?

సత్ర—ఒక్క అర్ఘ్యమును మాత్రమేకాదు సంధ్యావందన మంతయు విడిచినాను.

ఈ సంభాషణము ముగిసిన తరువాత ప్రొద్దుపోయినందున రాజ శేఖరుఁడుగారు లేచి వెళ్ళి భోజనముచేసి, తరువాత నొక్కరును పరుండి యాలోచించుకొని మోసములకెల్లను పుట్టినిల్లయిన యీ పట్టణమును సాధ్యమయినంత శీఘ్రముగా విడిచిపెట్టవలయునని నిశ్చయించుకొనిరి; కాఁబట్టి మఱునాఁడు ప్రాతఃకాలముననే యొకబండిని కుదుర్చుకొనివచ్చి, కుటుంబసహితముగా దానిమీఁదనెక్కి జాము ప్రొద్దెక్కు వఱకు భీమవరము చేరిరి. బండిమీఁద నెవ్వరో క్రొత్తవారు వచ్చినారని యూరిలో నెల్లవారును జూడవచ్చి వారి నివాస స్థలమును గుఱించియు ఆగమన కారణమును గుఱించియు ప్రశ్నలు వేయఁజొచ్చిరి; చెప్పినదానినే మరల మరల

నడిగినవారికెల్లను జెప్పలేక రాజశేఖరుఁడుగారును మాణిక్యాంబయు విసిగి పోయిరి. వారందఱు నట్లు పనికట్టుకొనివచ్చి ప్రశ్నలు వేయుటకయి ముందడుగిడుచు వచ్చినను, రాజశేఖరుఁడుగారు తమకు బసకావలెనని యడుగఁబోగానే తిన్నగా వినిపించుకోక లేదని వెనుకంజవేయ నారంభించిరి. అంతట రాజశేఖరుఁడుగారు బండిని వీధిలో నిలిపి, తాము బయలుదేఱి బస నిమిత్తమయి యెల్లవారి యింటికిని బోయి రెండు జాముల వఱకు నడుగుచుండిరి. గాని వారిలో నొక్కరును ఆ పూఁట వండుకొని తినుటకయినను స్థలమునిచ్చినవారు కారు. క్రొత్తగా వచ్చినవారు గనుక రాజశేఖరుఁడుగారు బసనిమిత్తమయి తిరుగునప్పుడు వీధులలో నిలువచేయఁ బడియున్న పెంటకుప్పలను జూచి యసహ్యపడుచు వచ్చిరిగాని యెరువున కుపయోగించుటకయి పొరుగూళ్ళకు సహితము గొనిపోయి యమ్ముకొనెడి యాయూరివారి కవియే కనకమన్న సంగతిని తెలిసికోలేకపోయిరి. అట్లా దుర్గంధమునకు ముక్కుమూసికొని నడచి గ్రామకరణముయొక్క యింటికిఁబోయి వారి యింటిపేరడిగి యేదో యొక ప్రాతబంధుత్వమును తెలుపుకొని మొగమాటపెట్టఁగా ఆతఁడాపూఁటకు తమయింట వంటచేసి కొనుట కంగీకరించి, పొరుగున నున్న యొక వైదికబ్రాహ్మణుని పిలిపించి రాజశేఖరుఁడుగారు కాఁపురముండుటకయి వారి ప్రాతయిల్లిమ్మని చెప్పెను. ఆతఁడాయిల్లు బాగుచేయించినఁగాని కాఁపురమున కక్కరకురాదనియు, తనభార్య సమ్మతి లేక యియ్య వలనుపడదనియు, పెక్కు ప్రతిబంధములను జెప్పెను; కాని రాజశేఖరుఁడుగా రాతనిని కూరుచుండఁబెట్టుకొని పరోపకారమును గూర్చి రెండుగడియలసే పుపన్యాసము చేసి యిల్లు బాగు చేయించుట పేరుచెప్పి రెండురూపాయలు చేతిలోఁబెట్టి చెప్పిన వాక్యము లన్నిటికన్నను చేతిలోబెట్టిన సొమ్మాతనిని నిమిషములో సమాధాన పఱిచినది. కాఁబట్టి రాజశేఖరుఁడుగారు వెంటనేపోయి బండిని తోలించుకొని వచ్చి యాపూఁట కరణము ఇంటిలోపల వంటచేసికొని భోజనముచేసి దీపములవేళ సకుటుంబముగా ఆ గ్రామ పురోహితులయింటఁ బ్రవేశించిరి. ఆ యిల్లు పల్లపునేలయందుఁ గట్టఁబడియున్నది; గవాక్షములు బొత్తిగా లేనేలేవు; వాస్తుశాస్త్ర ప్రకారముగా దూలములు యజమానునిచేత కంచు

తాగునఁ గట్టఁబడిన యా యింటి గోడలే పొట్టివి గనుక గుమ్మము లంత కన్నను పొట్టివిగా నుండెను. కాఁబట్టి యెక్కడను వంగినడవనివారు సహిత మక్కడ వంగి నడుచుచుందురు; లోపలి గోడ లెత్తుగా నుండక పోయినను దొంగలభయముచేతఁ గాఁబోలును. గాలివచ్చుటకు వలనుపడ కుండ దొడ్డిచుట్టును నున్న గోడలు మాత్రము మిక్కిలి యెత్తుగాఁ బెట్టఁ బడినవి; కాని యింటి వా రాయిల్లు విడిచిపెట్టి వెళ్ళిన తరువాత చూచువారు లేక కూలి యిప్పుడు మొండి గోడలుగా నున్నందున లోపలికి గాలి వచ్చుట కవకాశము కలిగినది. పూర్వ మిల్లుగల వా రందున్నప్పు డెవ్వరో యొకరు సదా రోగబాధితులై యుండుచు వచ్చినందునను, గృహాధిపతి యొక్క కూఁతు రందులోనే పోయినందునను ఆ యిల్లచ్చిరాలేదనియు, దానిలో నేదో గ్రహమున్నదనియు నెంచి దానిని విడిచి మఱియొకచోటికిఁ బోవయత్నించుచుండిరి. కూఁతురు పోయిన నక్షత్రము ధనిష్ఠాపంచకములో నొకటైనందున బ్రాహ్మణుఁ డాఱునెలలవఱకు ఆ యింటిని పాడుపఱచి తరువాత సహితము పిల్లలతో నందుండుటకు మనసొప్పక వేఱొక యిల్లు కట్టుకొని యందు కాఁపుర ముండెను. రాజశేఖరుఁడుగా రాయింటిలోఁ బ్రవేశించిన తరువాత కొన్ని గవాక్షముల నెత్తించి గాలి పీలు కలిగించుకొనుటయేగాక, తేమ పోవునట్టుగా యిల్లెత్తు చేయించి, వంటకు ప్రత్యేకముగా దూరమున దొడ్డిలో నొకపాక వేయించిరి. ఈ ఖర్చుల క్రిందను భోజనాదికముక్రిందను తెచ్చుకొన్న రూపాయలు వ్యయపడుచుండెను. కాఁబట్టి రెండు మూడు మాసములలోనే జీవనమున కిబ్బంది కలుగునట్టు కనఁబడుచుండెను.

అది యొక పల్లెగనుక భీమవరములో కొనుటకు పాలు మజ్జిగలు కాని కట్టెలుగాని దొరకవు; పాఁడిగలవారికి చిట్టును పొట్టును యిచ్చిన యెడల వారింత పలచని మజ్జిగ పోయుచుందురు. రాజశేఖరుఁడుగారు ప్రతి శనివారమునాఁడును పెద్దాపురమునకుఁ బోయి సంతలో వారమునకు సరిపడిన వస్తువుల నన్నిటిని కొని తెప్పించుకొనుచుందురు. నెలదినములు గ్రామములో కాఁపుర ముండునప్పటికి రాజశేఖరుఁడుగారికి పలువురు పరిచితులుగా నేర్పడిరి; వారాయన స్థితిగతులను దెలిసికొని విచార

పతి, రాజబంధువుఁడు కారాగృహాధికారియునైన శోభనాద్రిరాజుగారిని చూడుఁడని బోధించిరి. భీమవరమును చేరియే శ్యామలకోట యని యొక దుర్గముండెను. దానిలో శ్యామలాంబగుడి యుండెను. కాబట్టి దానికాపేరు కలిగియుండెను. అది యాకాలములో పెద్దాపురరాజుగారి యొక్క రాజ్యములో నేరము చేసినవారి నుంచు చెఱసాలగా నుపయోగపడుచుండెను. ఇప్పుడు కోట పడిపోయినందున, అది యుండు స్థానమున నొక్క గ్రామము కట్టఁబడి యున్నది; దానికి సామర్లకోటయని పేరు. ఆ కోట కధికారిగానున్న శోభనాద్రిరాజుగారి కొక గ్రామము కూడ నుండెను.

రాజశేఖరుఁడుగారా గ్రామములో కాఁపురమున్న కాలమందు తామరా జప్పుడప్పుడు రాత్రులువచ్చి చూచి పోవుచుండెను. ధనము క్రమక్రమముగా తఱిగిపోవుటకు చింతించి, మాణిక్యాంబ ప్రతిదినమును శోభనాద్రిరాజుగారిని జూచి యుద్యోగము నిమిత్తమయి ప్రయత్నము చేయవలసినదని బలవంత పెట్టుచుండెను. అతడు రెండు మూడుసారులు పోయి సమయమయినది కాదని మరల వచ్చుచుండెను. కడపటిసారి రాజశేఖరుడుగారు శోభనాద్రిరాజుగారి దర్శనార్థము వెళ్ళివచ్చినప్పుడు దంపతుల కిరువురకును యీ ప్రకారముగా సంభాషణ జరిగెను.

మాణి—మీకు రాజుగారిదర్శన మయినదా?

రాజ—అయినది. నేను వీధిగుమ్మములో నిలుచుండి యక్కడ నున్న యొక పరిచారకుని జూచి లోపలికి వెళ్ళవచ్చునా యని యడిగితిని. భాగ్యవంతుడవయిన పక్షమునఁ దిన్నఁగా లోపలికి వెళ్ళవచ్చుననియు, లేదవాఁడ వైనయెడల నిక్కడనే నిలుచుండవలసిన దనియు వాఁడు చెప్పెను. నేను గొంచెముసే పాలోచించి బొరవచేసి రాజుగారున్న చోటికిఁ బోయి నిలువఁబడితిని.

మాణి—రాజుగారితో మాటాడి మీ సంగతులన్నియు చక్కగా మనవి చేసినారా?

రాజు—నేను గదిలోనికి వెళ్ళి నా స్థితిగతులను జెప్పుకొన్నాను. ఎవరితో నందువేమో! రాజుగారితోఁ గాదు-ఎందుచేతనన్న నేనెంత సేపు చెప్పుకున్నను రాజు నోటినుండి యొకమాటయు బదులురాలేదు. నేను మాటాడ మొదలుపెట్టినతోడనే మంచము దగ్గఱనున్న కుక్క యొకటి మొఱగ నారంభించినది. కాఁబట్టి దానితోనే నేను మాటాడినానను కొన్నాను. కాని యది యేమి చెప్పినదో దాని భాష నాకు రానందున గ్రహింపలేక పోయినాను. ఇట్లు దాని యభిప్రాయము తెలియక యను మానించుచు నిలుచుండ, రాజు తన సేవకుని నొక్కని బిలిచి నాకుఁ దెలిసిన భాషతో ఈ బ్రాహ్మణు నావలికిఁబంపివేయుమని యాజ్ఞాపించెను. జరుగఁబోవు సంగతిని గ్రహించి వాడు రాకముందు మృదువుగా నేనే వెనుకకు మరలి తిన్నగా యింటికి వచ్చితిని.

అంతటి సన్మానము జరిపించిన రాజుగారిని మరలవెళ్ళి యాశ్ర యింప బుద్ధిపుట్టక రాజశేఖరుఁడుగారు ముందు జీవనోపాధి యెట్లు కలు గునా యని యాలోచించి సుబ్రహ్మణ్యము నెక్కడికైనను బంపవలెనని తలఁచి మాణిక్యాంబతోఁ జెప్పి యామె యనుమతిని కుమారునితో నా సంగతిని జెప్పిరి. అతఁడును పరమసంతోషముతో నొప్పుకొన్నందున; అందఱును నాలోచించుకొని చివరి కతనిని పిఠాపురమునకుఁ బంప నిశ్చ యించుకొనిరి. ప్రయాణము నిశ్చయించిన దినమున రాజశేఖరుఁడుగారు కుమారుని బిలిచి యనేకవిధముల నీతులు బోధించి బుద్ధులుచెప్పి, న్యాయ మార్గమునఁ బ్రవర్తింప వలసినదని పలుమారులు జెప్పి, నమస్కరించిన కుమారుని నాశీర్వదించి అయిదురూపాయలను ఖర్చునిమిత్త మిచ్చిరి; మాణిక్యాంబయు దగ్గర నున్నదానిలో నేమియు లోపముచేయక కావల సినన్ని దీవనలిచ్చెను. సుబ్రహ్మణ్యమును వారి నెడఁబాయవలసి వచ్చెనది గదా యని కంటఁదడి పెట్టుకొని చెల్లెలిని ముద్దాడి తనకిచ్చిన రూపాయ లలో నొకదానిని చేతిలోఁబెట్టి వారివద్ద సెలవు పుచ్చుకొని వెనుక తిరిగి చూచుచు దారిసాగి నడచెను.

# పదవ ప్రకరణము

శోభనాద్రిరాజుతో మైత్రి—సీత వివాహ ప్రయత్నము—రామమూర్తి వారి మరణవార్త—రామరాజుతో విరోధము—రాజశేఖరుఁడుగారిని చెఱసాలలోఁ బెట్టుట—సీత నెత్తుకొనిపోవుట.

ఒక యాదివారమునాఁడు నాలుగుగడియల ప్రొద్దెక్కిన తరువాత రాజశేఖరుఁడుగారు పెద్దాపురమునకు బోవుచుండఁగా, శోభనాద్రిరాజు వీధియరుగుమీఁదనున్న యున్నతాసనముపైని గూరుచుండి చూచి లంపతా వాని[1] నొక్కని బిలిచి "ఆ మార్గమునఁ బోవుచున్న బ్రాహ్మణుని దీసికొని రమ్మ"ని చెప్పెను. వాఁడును మహావేగముగాఁబోయి "రాజుగారి సెలవయినది రమ్మ"ని పిలిచెను. రాజశేఖరుఁడుగారెట్లయిన నాతని యనుగ్రహము సంపాదించుకోవలెననియే కోరుచున్నవారు గనుక పిలిచినదే చాలునని వెళ్ళి, అతఁడు చూపిన బల్లమీద కూరుచుండిరి.

శోభ—ఈ నడుమ భీమవరమువచ్చి సోమభట్లుగారిలోపల కాపురమున్నవారు మీరే కాదా?

రాజ—అవును. వెనుక నేనొక పర్యాయము తమ దర్శనము చేసినాను.

శోభ—జ్ఞాపకమున్నది. మేమప్పుడు మిక్కిలి తొందరపనిలో నుండి మీమీఁద కోపపడినాము. అంతేకాకుండ ఆ వచ్చినవారు మీరని

---

1. చిన్నయసూరి నీతిచంద్రికలో యీ ప్రయోగం వుంది. కావలివాడు. లంపతారు లంపతావాడు-n **A son of a slave.** దాసి పుత్రుడు అని బ్రౌన్ నిఘంటువు.

మాకప్పుడు తెలియలేదు. మీ పోష్యవర్గములో చేరినవారెంతమంది యున్నారు? పెండ్లి కెదిగిన కొమార్తె కూడ ఉన్నదఁట కాదా?

రాజు—ఇప్పుడున్నది వివాహము కావలసిన యాకూఁతురొక్కతయే. నా పెద్ద కొమార్తె మొన్న త్రోవలో దొంగలు కొట్టినప్పుడు చనిపోయినది. ఏదయిననొక యుద్యోగము సంపాదించుటకయి నా కుమారుని ఇక్కడకు వచ్చిన తరువాతనే పిఠాపురము పంపినాను.

ఈ ప్రకారము సంభాషణ జరుగుచుండఁగా కొంతమంది పెద్ద మనుష్యులు వచ్చి అరుగుమీఁదనున్న బల్లమీఁద గూరుచుండిరి. అప్పుడు రాజుగారు వారితో తాము చేసిన యద్భుతచర్యలను గురించి బహువిధముల ప్రశంస చేసిరి. చెప్పిన మాటలలో నేమియు చమత్కారము లేకపోయి నను, అక్కడ నున్నవారా లోపమును లోనవ్వుతో మాత్రము పూర్తి చేసిరి; వారందఱు నవ్వినప్పుడు తామొక్కరు నూరకున్న బాగుండదని నిజముగా నవ్వురాకపోయినను తెచ్చుకొని వారు నవ్వినప్పుడెల్లను రాజ శేఖరుఁడుగారును నవ్వుచు వచ్చిరి. ఆ రాజు తన్ను రాజశేఖరుఁడుగాఁడు తెలిసినవాఁడనుకొనుటకయి ప్రతి విషయములోను గొంచెము కొంచెముగా మాటాడి యన్నియు దెలిసిన వానివలె నటింపసాగెను; తన కేమియుఁ జెప్పుటకు తోఁచనప్పుడు అక్కడనున్న వారి మొగములవంకఁ జూచి నవ్వుచువచ్చెను. అప్పుడాయన పాండిత్యమును సభవారందఱు నూరక పొగడుచుండిరి. ఇంతలోఁ గొందఱు గాయకులువచ్చి సంగీతముపాడుట కారంభింపనియెడల, వారి పొగడ్తలు సభ చాలించువరకు నుండుననుటకు సందేహములేదు. వారు పాట నారంభింపఁగానే యెల్లవారికిని ఇండ్లమీఁద ధ్యానము పాఱ నారంభించినది. అయినను రాజుగారేమనుకొందురోయని యందఱును కొంతసేపు శ్రమచేసి మాటలు చెప్పుకొనుచు నచటనే కూరు చుండిరి. ఆ పాట విని విని తాళలేక కడపట నొక పెద్ద మనుష్యుడు చొరవచేసి, "వారు మంచివారని యదేపనిగా శ్రమయిచ్చుట న్యాయము కాదు. కాఁబట్టి, యీ పాటికి పాట చాలింప ననుజ్ఞ యియ్యవచ్చు"నని చెప్పెను. సభ వారందరును అది యుక్తమని యేకవాక్యముగాఁ బలికిరి. అంతట సభచాలించి యందఱును సెలవుపుచ్చుకొని వెళ్ళఁబోవునప్పుడు

రాజుగారు రాజశేఖరుఁడుగారిని 'అప్పుడప్పుడు వచ్చి దర్శనమిచ్చుచుండెదరు కాదా ?' యని అడిగిరి. 'ముఖ్యముగా వచ్చి దర్శనము చేసికొనుచుండెద'నని చెప్పి, ఆయన నాఁటికి పెద్దాపురము ప్రయాణము మానుకొని పది గడియల ప్రొద్దెక్కువఱ కిల్లుచేరిరి.

నాఁడు మొదలుకొని ప్రతి దినమును రాజశేఖరుఁడుగారు ప్రాతఃకాలమునను సాయంకాలమునను గూడఁ బోయి శోభనాద్రిరాజుగారి దర్శనము చేయుచుండిరి. ఆ రాజుగారును మిక్కిలి దయతో నాతని నాదరించి మంచిమాటలతో సంతోషపెట్టుచుండిరి. ఆయన రాజ కార్య విషయమైన పని జూచుచుండునపుడు సహితము రాజశేఖరుఁడుగారి వద్దనే యుండి సంగతి కనుఁగొనుచుందురు; గ్రామాదులలోని ప్రజలు వ్రాసికొన్న విజ్ఞాపనపత్రికలను కొలువుకాండ్రు చదువునపుడు వ్రాసికొన్న మనవి కడపట రెండుమూడు పంక్తులలో మాత్రమే యున్నను బిరుదావళి మాత్రము మొదటి రెండు పత్రములలోను పూర్ణముగా నిండియుండుట తెలిసికొని రాజుగారికి గ్రామములోని కాపులకన్న బిరుదు పేళ్ళే విశేషముగా నుండుట కానందించుచువచ్చిరి. రాజకార్యపుఁబని యైనతోడనే రాజుగారు సభవారితో ముచ్చట కారంభింతురు. అతఁడెంతసేపు చెప్పినను తన ప్రతాపమునే చెప్పుచుండును;ఆ కథలన్నియు నావఱకు పదిసారులు విన్నవే అయినను మొదటిసారినవ్వినట్టే ప్రతిపర్యాయమును సభలోనివారందఱును నవ్వుచుందురు; అందులోఁ గొందఱు స్తోత్ర పాఠములను జదివి రాజుగారి మనస్సును సంతోషపెట్టుచుందురు. అందఱును ముఖస్తుతులు చేయుచుండఁగా తా మొక్కరుమాత్ర మూరకుండుట న్యాయము కాదని యెంచి, రాజశేఖరుఁడుగారు స్తుతివిద్యయందు పాండిత్యము చాలని కావున నసత్యమునకు భయపడి యాతఁడు మఱి యేవిషయము నందును స్తోత్రార్హుఁడు కానందున మంచిబట్టలను కట్టుకొనుటకు కొంత శ్లాఘించిరి. ఇట్లు తఱుచుగా రాజశేఖరుఁడుగారు రాజాస్థానమునందు మెలంగుచు వచ్చుటచేత వేఱులాభమును బొందకపోయినను సభలో పది మందిని నవ్వించుమార్గమును మాత్రము నేర్చుకొనిరి; కాఁబట్టి యప్పటి నుండియుఁ దా మొకమాటను చెప్పుచు ముందుగాఁ దామే నవ్వుచు వచ్చిరి.

అది చూచి అందఱును నవ్వుచుండిరి. రాజుగారప్పుడప్పుడు దర్మోపన్యాసముల సహితము చేయుచుండుదురు. లోకములో నెవ్వరెన్ని పాట్లుపడినను భోజనమునిమిత్తమే కాఁబట్టి, ఆ విషయమున నేమిచేసినను దోషము లేదని వాదించుచుండిరి. సిద్ధాంతము మనస్సుననాఁటి యుండుట చేతనేకాఁబోలును రాజుగారు ప్రతిదినమును లేచినది మొదలుకొని పదిగడియలవఱకు ప్రాతర్భోజనమునకు వలయు యసంభారముల నిమిత్తమే ప్రయత్నము చేయుచుండుదురు; భోజన మయినది మొదలుకొని మధ్యాహ్నము ఫలాహార మేమిదొరకునా యని చింతించుచుందురు; ఫలాహారమయినప్పటి నుండియు రాత్రి భోజనమునకు వ్యంజనములేవి కలవని యాలోచించుచుందురు.

ఈ రాకపోకలచేత రాజశేఖరుఁడుగారికి రాజుగారివద్ద మిక్కిలి చనువు గలిగెను. ఆ సంగతి నెఱిఁగి బ్రాహ్మణులు రాజశేఖరుఁడుగారి యింటికిఁ బోయి పలు విషయములు ముచ్చటించుచు, వారిలోఁ గొందఱు సీత నెవ్వరికిచ్చి వివాహము చేయఁదలఁచినా రని మాటవెంబడి నడుగుచుందురు; ఇప్పుడు చేతిలో డబ్బు లేనందున, ఎవరికిచ్చి వివాహము చేయుటకు తలపెట్టుకోలేదని యాయన బదులు చెప్పుచుండును. ఒకనాఁడు రాజశేఖరుఁడుగారు భోజనముచేసి కూరుచుండి యుండఁగా దొమ్మగంటి సుబ్బారాయఁడను సిద్ధాంతి వచ్చి జ్యోతిశ్శాస్త్రము నందలి తన యఖండ పాండిత్యమును దానివలనఁ దనకుఁ గలిగిన గౌరవమును పొగడుకొని ఆంధ్రదేశమునందలి గొప్పవారందఱును జాతకములను తనకుఁబంపి ఫలములను దెలిసికొనుచుందురని చెప్పి దానికి నిదర్శనముగాఁ బెక్కు జాతక చక్రములను విజయనగరాది దూరదేశములనుండి ప్రభువులు వ్రాసినట్లున్న జాబులను జూపి ఫలముజెప్పుట కయి ఆయనయొక్క జన్మనక్షత్రమునుకూడ తెమ్మని యడిగెను.

రాజ—నా కిప్పుడు జ్యోతిషశాస్త్రమునందలి నమ్మకము పోయినది; నావద్ద కొల్లగా ధనము పుచ్చుకొని వ్రాసిన మావాంధ్ర జన్మపత్రికలలో ఫలము లేవియు నిజమయినవి కావు; మేము కాశీయాత్రకు బయలుదేరునపుడు మంచి ముహూర్తము పెట్టుకొని యిల్లు బయలుదేరినను

స్త్రీవలో గొప్పయాపదలు వచ్చినవి; అందుచేత జ్యోతిషముమీఁది నమ్మకము చెడినది. కాఁబట్టియే మొన్న పెద్దాపురము నుండి యిక్కడికి వచ్చునపుడు ముహూర్తము చూచుకొనకయే బయలుదేరినాను.

సుబ్బ—నాది అందఱి జ్యోతిషములవంటిదికాదు; నేను చెప్పిన ప్రశ్నకాని పెట్టిన ముహూర్తముకాని యెవర కెన్నడును తప్పిపోలేదు; నేను జాతకములో నెన్ని యక్షరములు వ్రాయుదునో యన్ని యక్షరములును జరిగితీరవలెను.

రాజ—మీరు చెప్పెడుఫలము నిజమైనను నాకక్కరలేదు. నాకు ముందు మేలు కలుగుననెడిపక్షమున, వచ్చెడు ననుకొన్నది రాకపోయె నేని మిక్కిలి వ్యసనముగా నుండును; నిజముగా వచ్చెనేని, అవలకే దాని నెదురు చూచియుండుటంజేసి వచ్చినప్పు డధికసంతోషము కలుగదు. కీడుగలుగునని చెప్పెడు పక్షమున నిజముగా వచ్చినప్పుడు దుఃఖపడుట యటుండఁగా ఇప్పటినుండియు విచారపడవలసి వచ్చెను; ఒకవేళ రాక పోయెడు పక్షమున వ్యర్థముగా లేనిపోని చింత పడవలసి వచ్చును; ఆ వట్టివిచారముచేతనే కీడు గలిగినను గలుగవచ్చునుగాని, సంతోషపడుట చేత మేలు మాత్రము కలుగనేరదు.

సుబ్బ—పండితులైయుండియు మీ రాలాగున సెలవిచ్చుట భావ్యముకాదు. పెద్దలు చెప్పిన శాస్త్రములయందు మన మెప్పుడు గురి యుంచవలెను. ఆ మాట పోనిండి; మీ కుమార్తెకు పెండ్లియీడు వచ్చి నట్టున్నది. ఇంకను వివాహ ప్రయత్నము చేయక యశ్రద్ధగా నున్నా రేమి?

రాజ—ఆ విషయమైయే నేనును విచారించుచున్నాను. అనుకూల మయిన సంబంధము కనఁబడలేదు; చేతిలో సొమ్ముసహితము కనఁబడదు. మీ ఎఱుక నెక్కడనైనను మంచిసంబంధము లేదుగదా?

సుబ్బ—సం-బం-ధమా? ఉన్నదికాని, వారు గొప్పవారు; మీ సంబంధము చేసికొందురో లేదో. అది మీకు సమకూడినయెడల మీకు సర్వవిధముల ననుకూలముగా నుండును.

రాజ—వారిదేయూరు? మన మేమిప్రయత్నముచేసిన ఆ సంబంధము లభ్యమగును?

సుబ్బ—వారిది పెద్దాపురము. వారి యింటిపేరు మంచిరాజువారు. వారికి సంవత్సరమునకు రెండువేలరూపాయలు వచ్చు మాన్యములున్నవి; ఇవిగాక వారియొద్ద రొక్కముగూడ విస్తారముగా నున్నదని వాడుక. చిన్నవాఁడు ప్రథమవరుఁడు;[1] స్ఫురద్రూపి; అతనికొక్క యన్నగారున్నారుగాని, ఆయనకు సంతానము లేదు. ముందు సమస్తమునకును ఈ చిన్నవాఁడేకర్తయగును. పెండ్లికుమారునిపేరు పద్మరాజుగారు. ఆ సంబంధము మన శోభనాద్రిరాజుగారు ప్రయత్నము చేసిన పక్షమున మీ యదృష్ట బలమువలన రావలెనుగాని మఱియొక విధముగా మీకు లభింపదు.

రాజ—అలాగయిన పక్షమున, ఈ సంగతిని ముందుగా మీరొకసారి రాజుగారితో ప్రసంగించి వారి యభిప్రాయమును తెలిసికొనెదరా?

సుబ్బ—నేను ముందు వెళ్ళి కూర్చుండెదను. తరువాత మీరు కూడ రండి. మీరుండగానే మాటప్రస్తావనమున మీ కొమార్తె వివాహపు సంగతిని తెచ్చిచూచెదను. దానిమీఁద మీ రందుకొని రాజుగారితో నొక్క మనవి చేయవలెను.

అని చెప్పి సుబ్బరాయఁడు సిద్ధాంతి బయలుదేఱి తిన్నగా శోభనాద్రి రాజుగారి యింటికిఁబోయి కూరుచుండెను. తరువాత మఱినాలుగు నిమిషములకు రాజశేఖరుఁడుగారును వెళ్ళి చేరిరి. అప్పుడు కొంతసేపు పలువిధముల ప్రసంగములు జరిగిన మీఁదట రాజశేఖరుఁడుగారి కొమార్తె సంగతి సిద్ధాంతి మెల్లఁగాఁ దెచ్చెను.

సుబ్బ—రాజశేఖరుఁడుగారికి పెండ్లికావలసిన కొమార్తెయున్న సంగతి దేవరవారెఱుఁగుదురా?

శోభ—ఎఱుఁగుదుము; ఈ మధ్య విన్నాము. ఆ చిన్నదానికిఁ బెండ్లియాడు వచ్చినదా?

---

1. ఆ కాలంలో ఇది గొప్పయోగ్యత. బాల్య వివాహాలు కాబట్టే, బాలింత మరణాలు అధికం కాబట్టే పురుషులు రెండో వివాహం సర్వసామాన్యంగా చేసుకొనే వారనుకోవాలి.

సుబ్బ—ఈ మధ్యాహ్నమే నేను చూచినాను. ఇక చిన్నదానిని నిలిపి యుంచరాదు; మొన్న మా బంధువుల గ్రామములో నింతకంటె చిన్నపిల్ల సమర్తాడినది.[1]

శోభ—ఎక్కడనైన సంబంధము విచారించినారా?

సుబ్బ—పెద్దాపురములో మంచిరాజు పద్మరాజుగారున్నారు. తమరుప్రయత్నము చేసెడిపక్షమున, ఆ సంబంధ మనుకూల పడవచ్చును.

---

1. ఆనాటి అగ్రవర్ణాల వారిలో బాల్యకా వివాహాలను గూర్చి ఎటువంటి అభిప్రాయాలుండేవో సామినేని ముద్దు నరసింహనాయని వారి హిత సూచన ఇట్లా తెలుపుచున్నది.

"వివాహము కాకమునుపే చిన్నది రజస్వల అయిన పక్షమందు తల్లిదండ్రులు తోడబుట్టినవారు ఆ చిన్నదానితో నదీగర్భమందు ప్రవేశించవలసినదని ఒక పురుషుడు నిర్ణయించినాడు.

పిల్లలు రజస్వలలు కాకమునుపే వారికి వివాహాలు చెయ్యవలసినదనిన్ని వివాహము కాకమునుపే కన్యలు రజస్వలలైన పక్షమందు తల్లిదండ్రులున్ను తోడబుట్టినవారున్ను ఆ కన్యలతో నదీప్రవేశము కావలసినదనిన్ని నిర్ణయములుండడము వల్ల అటువంటి కుటుంబముల వారికి అనివార్యములైన ఆపత్తులు కలుగుతున్నవి." పుట 220 - వివాహప్రమేయము. ఈ 'హితసూచని' 1862 సం॥ ప్రకటితం.

"బ్రాహ్మణ కన్యలకు ఎనిమిది మొదలుకొని పది సంవత్సరముల మట్టుకు మాత్రమే వివాహయోగ్య కాలమైనట్టు దశైకోనాష్ట వర్షాత్పిత్యాది వచన మందు లిఖింపబడియున్నదనిన్ని" సామినేని వారు అభిప్రాయపడ్డారు.(పుట 193).

ఆనాటి పరిస్థితులను గూర్చి వీరేశలింగం పంతులుగారు కూడా స్వీయ చరిత్రలో ఇట్లా ప్రసక్తం చేశారు. "రజస్వలయిన తరువాతనే బాలికలకు వివాహములు చేయుట నిజమయిన సంస్కారమును పరులకు మార్గప్రదర్శకమునగును. అప్పుడది చిన్న సంస్కారముగాక పెద్ద సంస్కారమే యగును.

నా పుత్రికకు రజస్వలమయిన తరువాతనే వివాహము చేయుచున్నానని చెప్పి చేయ వానిని సహించి యూరకుండక కులమువారు కులమునుండి వెలివేయుదురు" (పుట 101) అని శ్రీ పునర్వివాహ సంస్కార ప్రయోజనం అనే ప్రకరణపు ప్రారంభ వాక్యాలుగా వ్రాశారు.

స్వీయచరిత్రము, ప్రథమ భాగము : (1982)

శోభ—అవును; అది దివ్యమయిన సంబంధమే కాని, వా రీచిన్న దానిని చేసికొనుట కంగీకరింతురా?

రాజ—తమ రీలాగునైనను ప్రయత్నముచేసి మాకీ మేలు చేయక తప్పదు. తమరు సెలవిచ్చిన తరువాత వారు మఱియొక విధముగాఁ దలఁచుకోరు.

శోభ—ఈపూట పద్మరాజుగారిక్కడకే వచ్చినారు. మీ యెదుటనే వారితో చెప్పెదము. ఓరీ! స్వామిగా! మనబావగారితో మంచిరాజు పద్మరాజుగారు మాటాడుచున్నట్టున్నారు. వెళ్ళఁబోవునప్పుడొకసారి యవశ్యముగా దర్శనమిచ్చి మఱీ వెళ్ళు మన్నానని మనవి చేసిరా.

లంపటావాఁడు వెళ్ళిన కొంతసేపటికి ముప్పదియేండ్ల యీడుగల నల్లని పెద్దమనుష్యుఁడు చలువచేసిన తెల్లబట్టలు కట్టుకొని పదివ్రేళ్ళను ఉంగరములు, చేతులను మురుగులును, మొలను బంగారపు మొలత్రాడును పెట్టుకొని వచ్చెను. శోభనాద్రిరాజుగారు దయచేయుఁడని మర్యాదచేసి యాయనను తమ దాపునఁ గూర్చుండబెట్టుకొనిరి.

పద్మ—తమ సెలవయినదని సామిగాడు వర్తమానము చెప్పి నందున, వెళ్ళుచున్నవాడను మరలి వచ్చినాను. నాతో నేమయిన సెలవియ్యవలసింది యున్నదా?

శోభ— వీరు కొంతకాలమునుండి మా గ్రామములో నివసించి యున్నారు. మిక్కిలి దొడ్డవారు. వీరిపేరు రాజశేఖరుఁడుగారు. మీరు సంబంధముకొరకు విచారించుచున్నారని తెలిసింది. వీరి కొమార్తె యున్నది. చేసుకోరాదా? పిల్ల మిక్కిలి లక్షణవతి; వీరిది మొదటి నుండియు మంచి సంప్రదాయసిద్ధమైన వంశము.

పద్మ—పలువురు పిల్లనిచ్చెదమని తిరుగుచున్నారు. నాకీవఱకును వివాహము చేసికోవలెనని యిచ్ఛ లేకపోయినది; అలాగే కానియెడల, నాకు చిన్నతనములోనే వివాహమయి యీపాటికి సంతానయోగము కూడ కలుగదా? మీవంటి వా రందరును మెడలు విఱుచుటచేత విధిలేక యొప్పుకో వలసి వచ్చినది. అయినను తమరీలాగున సెలవిచ్చినారని మా నాన్న గారితో మనవిచేసి యే మాటయు రేపు విశద పఱిచెదను.

శోభ—ఈసారి నామాట వినకపోయినయెడల, మీ స్నేహము నకునీ మా స్నేహమునకును ఇదే యవసానమని మీ నాన్నగారితో నేను మనవి చేయుచున్నానని ముఖ్యముగా చెప్పవలెను.

పద్మ— చిత్తము, ఆయన మీ యాజ్ఞమీఱి నడువరు. సెలవు పుచ్చుకొనెదను.

పద్మరాజు వెళ్ళిపోయిన తరువాత సంబంధమును గురించి గట్టి ప్రయత్నము చేయవలయునని రాజశేఖరుఁడుగారు శోభనాద్రిరాజుగారిని బహువిధములఁ బ్రార్థించిరి. అతఁడును తన యావచ్ఛక్తిని వినియోగించి యీ సంబంధమును సమకూర్చెదనని వాగ్దానము చేయుటయేగాక, ఆ సంబంధము దొరికినయెడల రాజశేఖరుఁడుగారికి మునుపటికంటెను విశేష గౌరవమును బ్రసిద్ధియు గలుగఁగలదని దృఢముగాఁ జెప్పెను. అంతట బ్రొద్దుక్రుంకినందున రాజుగారు భోజనము నిమిత్తము లేచిరి. తక్కిన వారందరును సెలవు పుచ్చుకొని యెవరియిండ్లకు వారు పోయిరి.

మఱునాఁడు నాలుగు గడియల బ్రొద్దెక్కిన తరువాత రాజశేఖరుఁడు గారు వెళ్ళినతోడనే, శోభనాద్రిరాజుగారు చిఱునవ్వు నవ్వుచు లోపలినుండి వచ్చి "నిన్న మనము పంపిన వర్తమానమునకు రాత్రియే ప్రత్యుత్తరము వచ్చినది సుండీ"యని చెప్పెను. "ఏమని వచ్చినది? ఏమని వచ్చినది?" అని రాజశేఖరుఁడుగా రత్యాతురతతో నడిగిరి. "నే నంత ఖండితముగా వర్తమానము పంపిన తరువాత వారు మఱియొక లాగునఁ జెప్పెదరా? చేసికొనియెద మని జాబు వ్రాసి పంపినారు." అని యొక టాటాకు చుట్టను చేతికిచ్చెను. దానిని చదువుకొని రాజశేఖరుఁడుగారు పరమానంద భరితులయిరి. అప్పుడే రాజుగారు సుబ్బారాయఁడు సిద్ధాంతిని పిలిపించి వివాహమునకు ముహూర్తము పెట్టుఁడని నియమించిరి. అతఁడు పంచాంగ మును జూచి యాలోచించి వైశాఖ బహుళ సప్తమి గురువారము రాత్రి 24 ఘటికల 18 విఘటికల మీఁదట పునర్వసు నక్షత్ర మేషలగ్నమందు ముహూర్తము నుంచెను. వెంటనే పెండ్లిపనులు చేయుట కారంభింపవలెనని నదని చెప్పి మీకుఖర్చున కిబ్బందిగా నున్నయెడల ప్రస్తుత మీ నూఱు

రూపాయీలను పుచ్చుకొని మీ చేతిలో నున్నప్పుడు నెమ్మదిగా తీర్చివచ్చు నని శోభనాద్రిరాజుగారు పెట్టెతీసి రూపాయలను రాజశేఖరుఁడుగారి చేతిలోఁ బెట్టి 'సామిగా' అని సేవకునొక్కని బిలిచి 'నీ వీ వారము దినములును పంతులుగారితో కూడ నుండి వా రేపని చెప్పినను చేయు చుండుము' అని చెప్పి యొప్పగించెను. రాజశేఖరుఁడుగారు వానిని తీసుకొని యింటికిఁ బోయిరి.

ఆ దినము మొదలుకొని ప్రతి దినమును రాజశేఖరుఁడుగారు పెద్దాపురమునకు వెళ్ళుచు కందులు మొదలుగాఁ గల వానినెల్ల కొనితెచ్చి ఆదివారపు సంతలో కూరగాయలను దెప్పించిరి. ఈ విధముగా పెండ్లి పనులను సాగించుచు పంచమినాఁడు సీతను పెండ్లికూఁతురుఁగా జేసిరి. ఇఁక రేపురాత్రి పెండ్లియనగా షష్ఠినాఁడు రాత్రి చేతిలో కఱ్ఱ పట్టుకొని గొంగళి ముసుగుపెట్టుకొని యొక కూలివాడు చీఁకటిలో వచ్చి రాజమహేంద్రవరమునుండి యుత్తరము తెచ్చినానని యొక తాటాకు చుట్టను సీత చేతికిచ్చెను. ఇంతలో మాణిక్యాంబ లోపలినుండివచ్చి సీత చేతిలోని యుత్తరము పుచ్చుకొని రాజశేఖరుఁడుగారు పెద్దాపురము వెళ్ళి రాలేదనియు వచ్చెడి సమయమైనది గనుక వచ్చినదాఁక వీధిలో నిలుచుండవలసినదనియుఁ జెప్పి లోపలికి బోయెను. రాజశేఖరుఁడుగారు వేగిరము రాఁకపోగా కూలివాఁడు తొందరపడుచుండుటను జూచి మాణిక్యాంబ వానికి తవ్వెడు బియ్యమును దబ్బును ఇచ్చివేసెను. ఆ వెనుక సీత 'నాన్నగారు వచ్చుచున్నారేమో చూచివచ్చెద'నని వీధిగుమ్మములోనికి వెళ్ళి ఇప్పుడు వచ్చిన కూలివాఁడు కఱ్ఱ దిగఁబెట్టి పోయినాఁడని యొక చేతికఱ్ఱను దెచ్చి వాఁడు మరల వచ్చి యడిగినప్పు డియ్యవచ్చునని పడక గదిలో మూలను బెట్టెను.

కొంతసేపటికి రాజశేఖరుఁడుగారు వచ్చి, భార్య రాజమహేంద్రవరము నుండి యుత్తరము వచ్చినదని చెప్పి చేతి కియ్యఁగానే దీపము వెలుతురునకుఁ బోయి సగము చదివి చేతులు వడఁకఁగా జాబును క్రింద పడవయిచి కన్నులనీరు పెట్టుకొన నారంభించిరి. జాబులో నేమి విషయములున్నవో వినవలెనని చేరువను నిలువఁబడియున్న మాణిక్యాంబ

మగని చేష్టలు చూచి తొందరపడి యేమియు తోఁచక ఖేదపడియెను. అతఁడు గద్గదస్వరముతో మన రామమూర్తి విషూచి జాడ్యముచేత నిన్న మధ్యాహ్నము కాలముచేసినాఁడని చెప్పెను. అంత వారిద్దరును గొంత సేపు విచారమును పొందిరి.

ఆ మఱునాఁడు ప్రాతఃకాలముననే రాజశేఖరుఁడుగారు బయలుదేఱి శోభనాద్రిరాజుగారు యింటికిఁబోయి తన పినతండ్రి కొమారుఁడయిన రామమూర్తిగారి మరణమువలన సంభవించిన దురవస్థను జెప్పి ముహూర్త మశుభదినములలో వచ్చుటచేత వివాహకార్యమునకు సంభవించిన యాలస్యమునకును నష్టమునకును కొంత చింతపడి పెండ్లి కుమారునివారు తరలి రాకుండ వెంటనే వర్తమానము చేయుఁడని కోరిరి. శోభనాద్రి రాజుగారును ఆయనను గొంచెమోదార్చి తక్షణమే పెద్దాపురమునకు మనుష్యునిఁ పంపిరి. పిమ్మట రాజశేఖరుఁడుగారింటికిఁ బోయిరి.

తరువాత వచ్చిన యాదివారమునాఁడు రాజశేఖరుఁడుగారు భోజనము చేసి కూరల కావళ్ళను కూలివాండ్రచేత మోపించుకొని వానిని విక్రయించి వేయుటకయి పెద్దాపురము సంతకుఁ బోయి యొక యంగడి వానికి బేరమిచ్చి నిలువఁబడిరి. ఆ సమయమున నొక గృహస్థు తలగుడ్డ చుట్టుకొని నిలువుటంగీ తొడుగుకొని చేరవచ్చి "అన్నయ్యా! యీ మయిల యొట్టిక్కడిది!" అని యడిగెను. రాజశేఖరుఁడుగా రాయన మొగము వంకఁజూచి బిచ్చపడి మాటతోఁచక యూరకుండిరి. మరల ఆ పెద్ద మనుష్యుఁడు "గంధపుచుక్క పెట్టినారు. మనకు మైల యెక్కడి నుండి వచ్చినది?" అని యడిగెను.

రాజ—మన రుక్మిణి పోయిన వర్తమానము నీకు తెలియఁజేసి నానుగదా? మొన్న గురువారమునాఁడు సీతకు వివాహము నిశ్చయించు కొని పెండ్లి పనులన్నియుఁ దీర్చి సిద్ధముగా నుండఁగా బుధవారమునాఁడు రాత్రి యెవ్వఁడో దుర్మార్గు డొకడు నేను లేని సమయమునవచ్చి నీవు పోయినట్టు వ్రాసియున్న జాబు నొకదానిని మీ వదినె చేతికిచ్చి పోయి నాఁడు.

రామ—ఎవ్వఁడో పెండ్లి కార్యమునకు విఘ్నము కలిగించవలెనని యీ దుస్తంత్రమును చేసియుండెను.

రాజ—గిట్టనివాఁ డెవఁడో యీ పన్నుగడ పన్నినాఁడు ఇంటికి వచ్చి నీ వదినెగారిని సీతను చూచినత్తువుకాని రా.

రామ—నా కిప్పుడే రాజుగారితో మాటాడి మరల నిమిషముల మీఁద రాజమహేంద్రవరము వెళ్ళవలసిన రాజకార్యమున్నది. నెల దినములలో మరలవచ్చి మిమ్మందరను జూచి రెండు దినములుండి పోయెదను.

అని చెప్పి రామమూర్తిగారు తన పనిమీఁద రాజసభకు వెళ్ళి పోయిరి. రాజశేఖరుఁడుగారును తిన్నఁగా భీమవరమునకు వచ్చి భార్యతో రామమూర్తిగారి వార్తను జెప్పి వివాహకార్యమునకు భంగము కలిగించిన దుర్మార్గుని బహువిధముల దూషింపఁజొచ్చిరి. అప్పుడు కూలివాఁడు దిగఁబెట్టిపోయిన కట్టను తీసుకొని వచ్చి సీత తండ్రికిఁ జూపెను. దాని నాతఁ డానవాలుపట్టి, చేతఁ బట్టుకొని చూచి, నాడు రామరాజు చూపిన కత్తికట్ట యిదియేనని భార్యతోఁ జెప్పెను. వారిరువురును ఆలోచించుకొని నిశ్చయముగా నీ యుత్తరమును తెచ్చిన వాఁడు రామరాజేకాని మఱియొకఁడు కాఁడని దృఢపఱచుకొనిరి.

రాజ—రామరాజు మనవలన నుపకారమును పొందినవాఁడే? ఇట్లేల చేసెనో?

మాణి—నాటిరాత్రి మన యందఱిప్రాణములను గాపాడి మన కెంతో ప్రత్యుపకారమును చూపినాఁడు. అతఁడీ యపకారము తలఁచు కొనుటకు నాకేమియు కారణము నూహించుటకు తోఁచకున్నది.

రాజ—మన శత్రువులవద్ద ధనము పుచ్చుకొని యీ దుర్మార్గమున కొడికట్టి యుండవచ్చును. సొమ్ము ప్రాణమువంటి మిత్రులనయినను పగవారినిగాఁ జేయునుగదా?

మాణి—నేటికాలమునకు ధనాశ యాతనికి దుర్బుద్ధిని పుట్టించెనని గాఁబోలును, అదిగో రామరాజు వచ్చుచున్నాఁడు. అతని నడిగిన సమస్తమును తేటపడును.

రాజ— ఏమయ్యా! రామరాజుగారూ! మా వలన మహోప కారమును పొందియు మా కార్యవిఘాతము చేయుట మీకు ధర్మమా ?

రామ—మీకు నే నేమి కార్యవిఘాతము చేసినాను ?

రాజ—రామమూర్తి పోయినట్టు జాబు సృష్టించి నే నింట లేనప్పుడు మావాండ్ర కిచ్చిపోలేదా ?

రామ—నేను మీయింటి మొగమయినను చూడలేదు. ఇటువంటి లేని దోషముల నామీఁద నారోపించిన, మీకును నాకును తిన్నగా జరుగదు సుండీ.

రాజ—మీరు మాయింటి మొగమే యెఱుఁగని యెడల, మీ చేతి కట్టె యిది యిక్కడ కేలాగు వచ్చినది ?

రామ—ఆయిదారు దినములనుండి నా చేతికఱ్ఱను గానక దాని నిమిత్తమై సకల ప్రయత్నములును జేయుచున్నాను. సరిసరి; తెలిసినది మీ రాకఱ్ఱ యెత్తుకొని దానిని తప్పించుకొనుటకయి యెదురు నామీఁదను దోషారోపణము చేయుచున్నారా? మీరేమో యింతవరకును యోగ్యులను కొనుచున్నాను.

రాజ—నావద్ద నీవేమి యయోగ్యతను కనిపెట్టినావు ? ఇఁక ముందు నీవెప్పుడును మా యిల్లు తొక్కి చూడవద్దు.

రామ—నీవు నీ వనఁబోకు. నీ యింటిజోలి యెవరికిఁ గావలెను ?

అని చివాలున లేచి రామరాజు వెళ్ళిపోయెను. అతని వెనుకనే బయలుదేరి రాజశేఖరుఁడుగారు శోభనాద్రిరాజుగారి యింటికిఁ బోయి జరిగిన యావద్వృత్తాంతమును వినిపించి, మరల ముహూర్తము పెట్టుట కయి సిద్ధాంతిని పిలిపించవలెనని చెప్పిరి.

శోభ—మీలోపల ముహూర్తము పెట్టిననాఁటి రాత్రియే సిద్ధాంతికి జ్వరము తగిలి, వ్యాధి ప్రబలమయి జీవితాశపోయినందున మంగళ వారమునాఁడు మధ్యాహ్నమున ఆయనను భూశయనము చేసినారు. అప్పు

శాయన బంధువు లందఱును జేరి చదువుకొన్న బ్రాహ్మణున కిటువంటి చావు యోగ్యమయినదికాదని యాతురసన్యాస మిప్పించినారు. ఆ రాత్రి నుండియు రోగము తిరిగి యిప్పుడు కొంత వ్యాధి కుదిరియే యున్నాఁడట. మీరిప్పుడే పోయి యీ మాసములో వివాహ ముహూర్త మెప్పుడున్నదో విచారించి రండి.

రాజ—చిత్తము సెలవు పుచ్చుకొనెదను.

అని లేచి తిన్నగా సుబ్బారాయుడు సిద్ధాంతిగారి యింటికిఁబోయి వావడిలో పీటలమీఁదగోడకుఁ జేరగిలబడికూరుచుండియున్న యాయనకు నమస్కరించి, దేహము స్వస్థముగా నున్నదాయని రాజశేఖరుఁడుగారు కుశలప్రశ్నము చేసిరి.

సుబ్బ—కొంతవఱకు నెమ్మదిగా నున్నది. నారోగము ప్రబలముగానుండి నేను తెలివితప్పి యున్నయప్పుడు, నా సొత్తు నపహరింపవలెనని నాజ్ఞాతులందఱును జేరి నాకు సన్యాస మిప్పించినారు. నా రెండవ పెండ్లి భార్య కాపురమునకు వచ్చి యాఱునెల లయినది. దానితో పట్టుమని యొక సంవత్సరమైన సౌఖ్య మనుభవింపలేదు. నా దేహము బలపడఁగానే యింటసహిత ముండనీయక నన్ను తఱిమి వేయుదురు.

రాజ—జరిగిపోయినదానికి విచారించిన ఫలమేమి ? మీరిఁక సంసార సుఖములను మఱచి, మీరున్న యాశ్రమమునకు ముఖ్యముగా గావలసిన ప్రణవమును జరిపించుకొనుచు ముక్తిమార్గమును జూచుకొండి.

సుబ్బ—నేనిప్పుడు సర్వసంగములను విడిచియున్నాను. నేను మీకుఁ జేసిన యపకారమును మఱచి నన్ను మన్నింపవలెను.

రాజ— మీరు నాకేమి యపకారము చేసినారు ?

సుబ్బ—చేసిన పాపము చెప్పినఁబోవునని పెద్దలు చెప్పుదురు. మీరు మొన్న సీతనిచ్చి వివాహము చేసినతఁడు ధనవంతుఁడు కాఁడు. అతఁడు శోభనాద్రిరాజుగారికి ముందలను తార్చువాఁడు. అతఁడు

ధరించిన వస్త్రములు, మురుగులు మొదలయినవి రాజుగారివే. రాజుగారి తంత్రమును పన్ని నన్ను మీదగ్గరకుఁ బంపిన నేను వచ్చి కార్య సంఘటనేము చేసినాను. ఇంతకును దైవసంకల్ప మట్లున్నది కాఁబట్టి కార్యము జరిగిపోయినది. మీరన్నట్లు జరిగిపోయినదానికి విచారించిన ఫలములేదు.

రాజ—శోభనాద్రిరా జంతటి దుర్మార్గుఁడా? ఆతని సంగతి నేను మొదట దర్శనమునకు వెళ్ళినప్పుడే తెలిసినది. ఈ కపటము తెలియక రూపాయలు చేతిలోఁ బెట్టినప్పుడు నామీఁది యనుగ్రహముచేతనే యిచ్చుచున్నాఁ డనుకొన్నాను. రామరాజు ధర్మమా యని వివాహము కాకపోఁబట్టి సరిపోయినది కాని, లేకపోయిన యెడల నిష్కారణముగా పిల్లదాని గొంతుక కోసినవార మగుదుమే.

సుబ్బ—వివాహము కాలేదని మేలువార్త విన్నాను. నిశ్చయమైన కార్యమెట్లు తప్పిపోయినది.

రాజ—మాజ్ఞాతి యొకఁడు కాలముచేసినట్టు మయిల వర్తమానము వచ్చినందున మీరు పెట్టిన లగ్నమున శుభకార్యము కాలేదు. మరల క్రొత్త ముహూర్తమును పెట్టించుకొని రమ్మనియె యాదుర్మార్గుఁడిప్పుడు నన్ను మీ వద్దకుఁ బంపినాఁడు.

సుబ్బ—ఆ పాపకర్ముని మాఁట యిఁక నాతోఁ జెప్పకుఁడు. ఆ పాపాత్ముని ప్రేరణమువలన మీయింట ముహూర్తము పెట్టిననాఁడే నాకు రోగమారంభమైనది. కాబట్టి మీయెడల చేసిన మోసమునకు శిక్షగా భగవంతుడు నాకీ యాపదను దెచ్చిపెట్టినాఁ డనుకొని వివాహము కాకమునుపు రోగముకుదిరెనా మీతో నిజము చెప్పివేసి పాపపరిహారము పొందవలెనని కోటివేల్పులకు మ్రొక్కుకొన్నాను. ఆలాగునను కుదిరినదికాదు. అటు తరువాత

"వారిజాక్షులందు! వైవాహికములందు౹౹
బ్రాణవిత్తమానభంగమందు౹౹
జకితగోకులాగ్రజన్మ రక్షణమందు౹
బొంకవచ్చు నఘముపొంద దధిప౹౹"[1]

అను శుక్రనీతిని దలంచుకొని వివాహ కార్యమునకై కల్లలాడితిని గదాయని కొంత మనస్సమాధానము చేసికొన్నాను. ఈ నీతినిబట్టియే, యెవ్వరును మీతోఁ బద్మరాజు విషయమై ప్రస్తావించినవారు కారు.

---

1. ఆచంట లక్ష్మీపతిగారు రాజమహేంద్రవరములో వీరేశలింగంగారి దగ్గర విద్యార్థి. వీరేశలింగం క్లాసుల్లో పాఠాలు చెప్పేటప్పుడు ఈ పద్యాన్ని విమర్శిస్తూ ఉద్వేగంగా మాట్లాడేవారని రాశారు. "వీరేశలింగము పంతులుగారు మాకు తెలుగు పండితులు. క్లాస్‌లో పాఠములు చెబుతూ రెండు మూడు పద్యములు చదివి, ఏదో సోషల్ రిఫారమ్ విషయమును గూర్చి ఉపన్యాసము ప్రారంభించగా గంటంతా దానిమీద లెక్చర్‌తోనే గడిచిపోయేది. 'వారిజాక్షులము, వైవాహికములందు........' అనే పద్యమును చదివి హిందూ దేశమునందు సత్యప్రవర్తనము, హిందువుల ఆచారములు - వీటిని గూర్చి హేళన చేస్తూ క్లాసులో పెద్ద ఉపన్యాసములు ఇచ్చేవారు. పుట 39 - 1973.

వల్లూరి సూర్యనారాయణరావుగారు కూడా స్వీయచరిత్రలో ఇట్లా ప్రస్తావించారు పంతులుగారిని గూర్చి.

"ఆ 1878 సం॥లో నేను రాజమహేంద్రవరము గవర్నమెంటు కాలేజీలో నాల్గవ ఫారములో చేరినప్పటినుండియు, కందుకూరి వీరేశలింగం పంతులుగారు మాకుపాధ్యాయులుగా నుండి ఒక్క తెలుగే గాక మరికొన్ని గ్రంథములలో కూడ పాఠములను చెప్పుచుండిరి....

ఈయన యలవాటును బట్టియు; మేము పాఠములను సరిగా వల్లించకపో బట్టియు, క్లాసులో యేవియో లోకాభి రామాయణములలో దింపేవారము. మా కోమల మనస్సులకు నాటునట్లు హాకు ఉగ్రుపాలతో సంఘ సంస్కరణలను గురించియు, సాంఘిక మూఢ విశ్వాసములను గురించియు చిత్ర విచిత్రముగ యీయన ఉపదేశించుచుండిరి. పూర్వపు రాతి బొమ్మల నస్నిటిని బ్రద్దలు కొట్టుటే యీయన పరమావధి. ఆంధ్ర కవుల అతిశయోక్తులు, అలంకారములు యీయనకు తలకెక్కవు. వాని నెల్లపుడు యీసడించేవారు." పుట 165 - (1936)

రాజ— ఇప్పుడేపోయి యీ సంగతి శోభనాద్రిరాజు నడిగి యన వలసిన నాలుగుమాటలును మొగముమీఁదనే యనివేసి వచ్చెదను.

అని వెంటనే పోయి శోభనాద్రిరాజు వీధి గుమ్మములో నిలుచుండి యుండఁగా జూచి "మీరేమో గొప్పవారనుకొని మీమాటను నమ్మి మోస పోయినాను. మీతో నింతకాలము స్నేహముచేసినందుకు, నా కొమార్తెను నిర్భాగ్యునకిచ్చి వివాహము చేయించు కొఱకా ప్రయత్నము చేసినారు ?" అని నిర్భయముగాఁ బలికి రాజశేఖరుఁడుగారు వెనుకకు మరలిరి. శోభ నాద్రిరాజు మరలఁ బిలిచి "మావద్దఁ బుచ్చుకొన్న రూపాయలనిచ్చి మఱిపొమ్ము" అని నిలువఁబెట్టెను. "మీరిచ్చిన రూపాయలును నాయొద్ద నున్న రూపాయలును కూడఁ గలిపి వానితో వివాహమునకు వలయు వస్తువుల నెల్ల కొన్నాను. ఇప్పుడు నా యొద్ద రొక్కము లేదు; చేతిలో నున్నప్పుడిచ్చెదను" అని వెళ్ళిపోవుచుండగా, శోభనాద్రిరాజు తన భటుల చేత రాజశేఖరుఁడుగారిని పట్టితెప్పించి చెఱసాలలోఁ బెట్టించెను. ఆ సంగతి మాణిక్యాంబకు దెలిసినదీ మొదలుకొని పెనిమిటికి సంభవించిన యాపదను దలఁచుకొని నిద్రాహారములు మాని సదా యీశ్వరధ్యానము చేయుచు లోలోపల దుఃఖించి కృశించుచుండెను.

ఈ సంగతి జరిగిన మూఁడవనాఁడు సూర్యోదయమయిన తరువాత సీత వీధిగుమ్మములో నిలుచుండగా నెవ్వరో యిద్దరు మనుష్యులు వచ్చి "మీ యన్నగారు పిఠాపురమునుండి వచ్చి యావలి వీధిని కరణము గారి యింటిలోఁ గూరుచుండి నిన్నక్కడకు దీసికొని రమ్మన్నాఁడు" అని చెప్పి సీతను దీసికొనిపోయి యూరి బయటనుండి యెత్తుకొని పాఱి పోయిరి. ఈ దుఃఖవార్త మాణిక్యాంబకు దెలిసిన తోడనే యామె భూమి మీఁద పడి మూర్ఛపోయి కొంతసేపటికి దెలిసి పెనిమిటి యొక్క వియోగమునకుఁ బుత్రికాశోకము తోడుపడ నెవ్వరెన్ని విధములఁ జెప్పినను వినక కన్నీరు కాలువగట్ట విలపించుచుండెను.

# పదునొకండవ ప్రకరణము

సుబ్రహ్మణ్యము పిఠాపురము ప్రవేశించుట — ఒక మిత్రుఁడు కనబడి యింటికిఁ గొనిపోయి యాదరించుట — నీలాద్రిరాజు చర్య — రాజుగారి ధనము పోవుట — అంజనము వేయుట—పోయిన ధనము నీలాద్రిరాజు దొడ్డిలో మఱికొంత సొమ్ముతోఁ గూడ దొరకుట.

తల్లిదండ్రులను వీడ్కొని బయలుదేరిననాఁడు సుబ్రహ్మణ్యము త్రోవదప్పి యెచ్చటికోపోయి తుద కసలసంజవేళ పిఠాపురము చేరెను. అప్పుడు కొందఱు దుష్టాత్ములొకచోట గూరుచుండి యాతని వాలకమును జూచి తమలోఁ దామాలోచించుకొని "యీతఁడు పల్లెటూరి వాఁడుగాఁ గనఁబడుచున్నాడు. ఈతని బెదరించి మనమే మయిన పుచ్చుకొందము" అని నిశ్చయము చేసికొనిరి. వెంటనే యా గుంపులో నుండి రాజభటుఁడొకఁడు పైకివచ్చి ముందుకు నడిచి సుబ్రహ్మణ్యమువచ్చు మార్గమున కడ్డముగా నిలిచి గంభీరధ్వనితో "ఆ వచ్చెడువా రెవరు ?" అని అడిగెను.

సుబ్ర—నేను బ్రాహ్మణుఁడను; భీమవరమునుండి వచ్చుచున్నాను.

భటు—ఇంత చీఁకటి పడిన తరువాత వచ్చుటకు కారణమేమి ?

సుబ్ర—తిన్నఁగా బయలుదేరినది మొదలుకొని నడచివచ్చిన యెడల ప్రొద్దుండగానే యూరు చేరియుందునుగాని, దారితప్పి పెడదారిని పడి వచ్చినందున నింత యాలస్యమయినది.

భటు—ఈ గ్రామములో నీకు బంధువులెవరున్నారు ?

సుబ్ర—ఎవ్వరును బంధువులు లేరు. రాజుగారి నాశ్రయించి పని సంపాదించుకోవలె నని వచ్చినాను.

భటు—నీ భుజము మీఁది మూటఁ యెవరిది?

సుబ్ర—నాదే. మఱియొకరిమూట నాయొద్దకెందుకు వచ్చును?

భటు—నీది కాదు. నీ వనుమానపు మనుష్యుఁడవుగాఁ గనఁబడు చున్నావు. నిన్ను నే నిప్పుడు వదిలిపెట్టను. తిన్నగా ఠాణాకు నడువు.

సుబ్ర—నేను దొంగను కాను. చిన్నప్పటినుండియు నింత ప్రతిష్ఠతో బ్రతికినవాఁడను. నన్ను విడిచిపెట్టు.

భటు—చీఁకటి పడ్డతరువాత గ్రామమునకు వచ్చినవారిని విడిచిపెట్టఁగూడదని మా రాజుగారి యాజ్ఞ. విడిచిపెట్టెదు పక్షమున నా కేమిచ్చెదవు.

సుబ్ర—నాలు గణాలిచ్చెదను నన్ను విడిచిపెట్టు.

భటు—నాలుగురూపాయలకు తక్కువ వల్లపడదు. నీవు చూడఁ బోయిన దొంగవుగాఁ గనఁబడుచున్నావు. మూఁట నక్కడ పెట్టు; పెట్టకపోయిన నిన్నేమి చేసెదనో చూడు.

ఆవరకు బాహ్యభూమికి వెళ్ళి తిరిగివచ్చుచున్న యొకపురుషుఁ డింతలో నామార్గముననే యింటికి బోవుచు, ఆ సందడివిని యచట నిలుచుండి "ఏమా మనుష్యుని నట్లు తొందరపెట్టుచున్నారు?" యని అడిగెను.

సుబ్ర—చూచినారా, యీ మనుష్యుఁడు నాలుగు రూపాయలిచ్చినం గాని నన్ను పోనీయ్యనని నిర్బంధపెట్టుచున్నాఁడు.

పురు—సుబ్రహ్మణ్యమా? నీవా! కంఠస్వరమునుబట్టి యానవాలు పట్టినాను. ఇక్కడి కొక్కఁడవును రాత్రివేళ నెందుకు వచ్చినావు? ఇంటికడనుండి చెప్పకుండ పాఱిపోయి రాలేదు గదా? ఇంటికి రా పోదము?

సు|బ—ఉమాపతిగారా? మీ రిక్కడ నున్నా రేమి? మీరింకొక నిమిషము రాకపోయినయెడల, వాఁడు బెదిరించి నా యొగ నేమైన గాఁజేయును జుండీ.

ఉమా—ఏఁడీ; నిన్ను తొందఱపఱిచినవాఁ డెవ్వఁడు?

సు|బ—మనము మాటలాడుచుండుట చూచి మెల్లిమెల్లిగా జాతి దూరము నుండి పారిపోవుచున్నాఁడు.

ఉమా—పోనీ, వాని సంగతి రేపు విచారించి కనుగొందము.

అని మాటలాడుకొనుచు వారిద్దఱును గలిసి యింటివంక నడిచిరి. ఇల్లు చేరు లోపల సు|బహ్మణ్యము తన తండ్రికిని కుటుంబమునకును నాఁటివఱకు సంభవించిన విపత్తులును ప్రస్తుతపు స్థితియు తానక్కడికి వచ్చిన కారణము చెప్పెను. అది విని యుమాపతిగారు మిక్కిలి వ్యసన పడి తాను చిన్నతనములో రాజశేఖరుఁడుగారివద్దఁ జదువుకొన్నప్పుడున్న యైశ్వర్యమంతయు బోయి యింతలో నింత బీదతనము సంభవించి నందున కాశ్చర్యపడి తనకు విద్యాదానము చేసిన గురువు విషయమై శక్తి వంచన లేక ప్రయత్నము చేసి చేతనయిన యుపకారమును జేయ వలెనని మనసులో నిశ్చయించుకొనెను. కాఁబట్టి, సు|బహ్మణ్యమును పలు విధముల నాదరించి, తాను పిఠాపురపురాజుగారియొద్ద నిరువదిరూపాయల యుద్యోగములోనున్న సంగతిని జెప్పి, అతనికింత యనుకూలమైన పని చేయించుటకై రాజుగారి యొద్దఁ బ్రయత్నము చేసెద ననియు, పనియైనఁ దాక తనయింటనే యుండవలసిన దనియుఁ జెప్పెను. ఆ ప్రకారముగా ప్రతిదినమును సు|బహ్మణ్యము భోజనముచేసి యుమాపతిగారి తోడఁ గూడ రాజసభకుఁ బోవుచుండెను. పీఠికాపురాధీశ్వరుడయిన విజయరామ రాజుగా రొకనాఁ డాతని జూచి, యీయన యెవ్వరని యుమాపతిగారి నడుగఁగా, ఆయన వారి స్థితిగతులను మొదటనుండియుఁ జెప్పి, 'తమ యాస్థానములో నేదియయిన నొక యుద్యోగ మీతని కిప్పింపవలయు' నని మనవి చేసెను.

ఉమాపతిగారి యింటినుండి రాజుగారికోటకుఁ బోవుమార్గములో నొక గొప్ప మేడయుండెను. ఆ మేడ నద్దెకుఁ బుచ్చుకొని నెలదినముల నుండి యందులో నొక రాజుగారు తన సేవకులతోఁ గూడ కాపురముండి రెండు మూడు దినముల క్రిందట బ్రాహ్మణ సంతర్పణ మొకటి చేసెను. సొమ్ములేకుండ వచ్చినప్పుడు పుష్కలముగా భుజించుట యెల్లవారికిని సహజగుణమే కాఁబట్టి ఆ యూరిబ్రాహ్మణోత్తములును నిత్యము నింటి వద్ద ఘృతము నభిఘరించుకొనువారే యయ్యును నాఁడు మాత్రము చేరలకొలఁది నేయిత్రాగిరి. ఆ సంతర్పణమువలన రాజుగారి కీర్తి గ్రామ మంతటను వ్యాపించెను; కాఁబట్టి ప్రతిదినమును పలువురువచ్చి యాయ నను నాశ్రయించి పోవుచుండిరి. ఆయన పేరు నీలాద్రిరాజుగారు. ఒక నాఁడు నీలాద్రిరాజుగారు భోజనము చేసి వీధి యరుగుమీఁద పచారు చేయుచు నిలువఁబడి, ఆ త్రోవను రాజసభకుఁ బోవుచున్న సుబ్రహ్మణ్య మును దూరమునుండి చూచి 'మాట' యని చేసైఁగజేసి పిలిచెను.

నీలా—పూర్వము మిమ్మెక్కడనో చూచినట్టున్నది. మీ కాఁపు రపు గ్రామమేది?

సుబ్ర—నా జన్మభూమి ధవళేశ్వరము. మా యింటిపేరు గోచేటివారు. నా పేరు సుబ్రహ్మణ్యము.

నీలా—అవును జ్ఞప్తికి వచ్చినది. మీరు రాజశేఖరుఁడుగారి కొమాళ్ళు కారా? ఇప్పుడాయన యెక్కడ నున్నారు?

సుబ్ర—ఇక్కడనే భీమవరములో నున్నారు. మీ రాయన నెక్కడ నెఱుఁగుదురు?

నీలా—ధవళేశ్వరములోనే చూచినాము. మేము సంవత్సరము క్రిందట యాత్రార్థమై బయలుదేఱి పదిదినములు ధవళేశ్వరములో నుండి గౌతమీస్నానమును చేసికొని, కోటిఫలి మొదలగు పుణ్యక్షేత్రములను సేవించుకొని, మాసము క్రిందట పాదగయను దర్శించుటకయి వచ్చి యప్పటినుండియు నిక్కడనే యున్నాము. మీ తండ్రిగారికి మా యెడల

గురుభావము. మేమక్కడ నున్నదినములలో మీ తండ్రిగా రెప్పుడును మాయొద్దనే యుండెడివారు.

సుబ్ర—సంవత్సరములు క్రిందట మిమ్ముఁ జూచినట్లు నాకు జ్ఞాపకములేదు. మీరెక్కడ ఐసచేసినారు?

నీలా—మీకు జ్ఞాపకము లేదుగాని మాకు చక్కఁగా జ్ఞాపక మున్నది. మీ కిద్దఱు చెల్లెండ్రుండవలెను. వారు బాగున్నారా?

సుబ్ర—పెద్ద చెల్లెలు రుక్మిణి చనిపోయినది. చిన్న చెల్లెలు బాగున్నది.

నీలా—మీరు నా సంగతి బాగుగ నెఱుఁగరు. విజయనగరపు రాజుగారు మా మేనమామకొమాళ్ళు. మొగలితుఱ్ఱురాజుగారి కిచ్చినది మా సవతి మేనకోడలు.

సుబ్ర—నేనిప్పుడు సభకుఁ బోవుచున్నాను. మఱియొకప్పుడు సావకాశముగా దర్శనము చేసికొని మాటాడెదను. ఇప్పటికి సెల విచ్చెదరా?

అని సెలవు పుచ్చుకొని సుబ్రహ్మణ్యము రాజుగారి కొలువు కూటమునం బోయెను. అతఁడు ప్రతిదినమును తప్పక సభకుఁ బోవుచు, ఉద్యోగస్థులతో నెల్ల స్నేహముచేసి, అన్ని విధముల పనులను నేర్చు కొనెను. అక్కడి కొలువుకాండ్రందఱును ఏ కాగితము వ్రాయవలసి వచ్చినను సుబ్రహ్మణ్యమునే పిలిచి వ్రాయించుచుందురు. ఏ లెక్క కట్ట వలసి వచ్చినను సుబ్రహ్మణ్యముచేతనే కట్టించుచుందురు. అందుచేత నతనికి జీతమేమియు లేకపోయినను జీతగాండ్రకంటె పనిమాత్ర మెక్కువ గలిగి యుండెను. ఈ ప్రకారముగా నందఱికిని దయవచ్చునట్లుగా నెవ్వరే పని చెప్పినను జేయుచు వచ్చినందున వారందఱును గలసి 'యీ చిన్నవాఁడు బహుకాలమునుండి యాశ్రయించి సంస్థానము కనిపెట్టి యున్నాఁడ'ని రాజుగారితో మనవి చేసిరి. దానిమీఁద రాజుగారు నేమ యము వచ్చినప్పుడుద్యోగమును జెప్పించెద మనియు, అందాక దివాణ

మును కనిపెట్టుకొని యుండవలసినదనియు సెలవిచ్చిరి. ఈ లోపల సుబ్రహ్మణ్య మొకనాఁడు వెళ్ళి మరల నీలాద్రిరాజుగారి దర్శనము చేసెను.

నీలా— ఏమయ్యా ? సుబ్రహ్మణ్యముగారూ ! గ్రామములో విశేషము లేమి ?

సుబ్ర—వింతలేమియు లేవు. ఉద్యోగమున కయి రాజుగారి ననుసరించుచున్నాను. ఇంకను పని కలిసి రాలేదు.

నీలా—మీకింత యనుసరించుట యెందుకు ? దూరదేశమునకు వెళ్ళగలరా ? నిమిషములో విజయనగరపు మహారాజుగారివద్ద గొప్ప పని చెప్పించెదము. ఆయన మాకుఁ బినతల్లి కొమారుఁడు.

ఈ కడపటి వాక్యము పూర్వము మేనమామ కొమారుఁడని చెప్పిన దానికి విరుద్ధముగా నున్నందున, అతఁ డబద్ధమాడుచున్నాఁడని మనసులో ననుకొనియు చెప్పినమాట మంచిది గనుక కొంచెము సంతోషించి సుబ్రహ్మణ్యము మారుపలుక కూరకుండెను.

నీలా—అనుమానించుచున్నా రేమి ? మీతోడు. మీకు తప్పక గొప్ప యుద్యోగము నిప్పించెదము. కాళహస్తి రాజుగారయిన రామవర్మ గారికిని మాకును నత్యంతమైత్రి, చిన్నప్పుడు వారును మేమును నొక్క బండిలో నెక్కినాము. ఈ సంగతి పరమరహస్యము. ఎవ్వరితోను జెప్పవద్దు.

సుబ్ర—చిత్తము ఇక్కడ పని కలిసిరాని యెడల నవశ్యముగా వెళ్ళెదను.

నీలా—మీకింకొక రహస్యము చెప్పెదను. బాల్యములో మేమును గాళహస్తిరాజుగారును కలిసి జూదమాడెడివారము. ఆయన సంగతి మనకెందుకుఁగాని, అప్పుడాయన భోగముదాని నుంచుకొన్నాడు సుమ్మా.

సుబ్ర—తమరు ప్రొద్దుననే యక్షతలు ధరించినారు. పార్థివము చేయుచున్నారా ?

నీలా—పూర్వము పార్థివము చేయుచుంటిమి కాని యిప్పుడు శివపూజ మాత్రము చేయుచున్నాము. మీ రాజుగారు కూడా శివపూజా ధురంధరులఁట కాదా? అందుచేతనే వారికి విశేషైశ్వర్యము కలిగి యున్నదని విన్నాము.

సుబ్ర—అవును. వారు శ్రీమంతులనియే నేను విన్నాను.

నీలా—మీ రాజుగారివద్ద రొక్క మేమాత్ర మున్నదని చెప్పు కొనుచున్నారు.

సుబ్ర—పది లక్షలకు తక్కువ లేదని వాడుక.

నీలా—అది అంతయుఁ గోటలోనేగదా యుండును?

సుబ్ర—కోటలోనే యుండును. అక్కడ జిరకాలము నుండి. నమ్మకముగాఁ బనిచేయుచున్న ముసలిబంట్లు కావలియుందురు.

నీలా—విజయనగరపు మహారాజుగారు క్రొత్తగా నొకకోటను గట్టఁదలఁచి, మేము చూచిన పట్టణములలోనున్న కోటల పటములను వ్రాయించి తీసికొని రండని మఱి మఱి చెప్పినారు. మొన్ననే పెద్దాపురపు కోటపటమును దెప్పించినాము. మీరీ కోటపటమును కూడా వ్రాసి యియ్య గలరా?

సుబ్ర—చిత్తము. కాగితము కలమును దెప్పింపుఁడు. ఇప్పుడే వ్రాసి యిచ్చెదను.

అని, కాగితమును కలమును సిరాబుడ్డియు తెప్పించిన మీఁదట తాను జూచిన దంతయు జ్ఞాపకమునుబట్టి పటమును వ్రాసి నీలాద్రిరాజు గారి చేతికిచ్చెను. ఆయన దానిని జూచుకొని యా యా స్థలముల యుపయోగములను గుఱించియు పని యొక్క గట్టితనమును గూర్చియు ప్రశ్నలు వేయజొచ్చెను. సుబ్రహ్మణ్యమును దనకుఁ దెలిసినంతవఱకు సదుత్తరములను జెప్పుచు వచ్చెను.

నీలా—ఉత్తరపు వైపున వీధి ప్రక్క నున్నదేకదా ధనాగారము?

సుబ్ర—అవును.

నీలా—అంతయు బాగుగానున్నది; కాని కోటగోడ యెత్తెంత పెట్టినారు?

సుబ్ర—సుమారు పండ్రెండడుగు లుండవచ్చును.

నీలా—మన మీ కోట పటము వ్రాసికొన్న సంగతి యెవ్వరికిని దెలియనీయక రహస్యముగా నుంచవలెను. రాజులకు తమ కోటవంటిది మఱియొకటి యుండుట కిష్టముండదు.

అని చెప్పి, లోపలనుండి తమలపాకులును పోకచెక్కలును పళ్ళెముతోఁ దెప్పించి తాంబూల మిచ్చి, కోటకట్టించునప్పు డీ పటము వ్రాసి యిచ్చినది మీరే యని రాజుగారితోఁ జెప్పెదము సుండీ యని పంపివేసెను. సుబ్రహ్మణ్య మా మాటలకు సంతోషించి సెలవు పుచ్చుకొని, తనకొక వేళ గొప్పయుద్యోగ మగునేమోయను నాశతో పరిపరి విధముల నాలోచించుకొనుచు మెల్లగా నింటికి వచ్చెను.

తరువాత నాలుగుదినముల కొకనాఁడు ప్రభాతసమయముననే రాజుగారి యింట దొంగలుపడి ధనాలయములోని నగలును రొక్కమును దోచుకొనిపోయినారని యూరనొక కింపిదంతి కలిగెను. పిమ్మట గొంత సేపటికి రాజభటులు సందడి చేయుచు నూర నలుప్రక్కలను దిరిగి, తమకు విరోధముగా నున్నవారి నందఱిని పట్టుకొని తాఁకీడ్చుకొని పోవ మొదలు పెట్టిరి. అక్కడ నున్నవారు వాండ్రను కొట్లలోఁ బెట్టి నేరము నొప్పుకొండని పలువిధములఁ గొట్టి బాధింపఁ జొచ్చిరి. కాని వారు నిరపరాధుల నెందఱిని పట్టుకొని బాధపెట్టినను నిజమయిన దొంగలను మాత్రము కనిపెట్టలేకపోయిరి. ఉత్తరపు దిక్కున కోట గోడకు నిచ్చెన వేసికొని దొంగలు లోపల ప్రవేశించినట్లు అడుగుల జాడ కనఁబడుచుండెను. గచ్చుతో కట్టిన ధనమున్న గదియొక్క రాతిగోడలో చిన్న తలుపెట్టుటకు తగినంత పాణిద్వార మొకటి కొట్టబడియుండెను. ఆ ద్వార

మును త్రవ్వుటకు, బలమయిన పనివాండ్రు ముగ్గురు పూనుకున్నచో పథమపక్షము రెండుజాముల సేపయినను పట్టును. రాత్రి యంతసేపు మేలుకొని పనిచేయుటకు దొంగల నిద్ర యేమయిపోయినదాయని విచారింపవలసిన యక్కఱలేదు. వారి నిద్ర యంతయు ద్విగుణముగా వచ్చి కావలివాండ్ర నాశ్రయించినది. కొట్టులోపల రూపాయల సంచులు చప్పుడైనప్పుడు ధనలక్ష్మి మూలుగుచున్నదని జడిసికొని కావలియున్నవారు భద్రమైన గదిలో దూరి తలుపువేసికొని ప్రాణములను కాపాడుకొనిరనియు, గ్రామములో నొక ప్రవాదము పుట్టినది. ఇదెంత నిజమో యీశ్వరునకు దెలియును. ఏది యెట్లయినను ధనలక్ష్మి మాత్ర మారాత్రి నరవాహనారూఢురాలై నూతన ద్వారమున కోటవిడిచి వెళ్ళిపోయిన మాట మాత్రము వాస్తవము. ఎన్ని విధముల ప్రయత్నము చేసినను రాజకీయ భటులకు దొంగలజాడ యెక్కడను గానరానందున, విసిగి తుదకు వారు తమ నాయకుని కడకు వచ్చి తాము పడ్డ ప్రయాసనంతయుఁ జెప్పుకొనిరి. అందుమీఁద నాతఁడు చేయవలసినపని యేమియు తోఁచక కొంతసేపాలోచించి, దొంగలు పట్టుకొనిపోయిన సొమ్ము తెప్పించలేక పోయిన యెడల రాజుగారివలన మాట వచ్చును. గాఁబట్టి రాజకీయ నియోగులలో నొకరిమీఁద పెట్ట నిశ్చయించి, వారి నందఱిని వేఱువేఱ పేళ్ళొని యెవరిమీఁద బెట్టిన నెవరికి కోపము వచ్చునోయని జడిసి, వారితో లోకువయైన వారిమీఁదికి త్రోయనెంచి; యాపని తాను చేయుట యనుచితముకాదని యింటికిపోయి మాటాడి యంజనము వేయువాని నొకనిని పిలుచుకొని జాములోపల మరల వచ్చెను.

నాయ—ఏమోయి భీమన్నా! రాత్రి రాజుగారియింట ధనము పోయినది. నీ వా ధన మపహరించినవానిని చెప్పఁగలిగినయెడల, నీకు గొప్ప బహుమతి దొరకఁగలదు.

భీమ—అదెంతసేపు? సొమ్ము తెప్పించుకోగలిగినయెడల అంజనము వేసి నిమిషములో పేరు చెప్పించెదను.

నాయ— అంజన మిప్పుడు నీ యొద్ద సిద్ధముగా నున్నదా ?[1]

భీమ—ఉన్నది. అది పిల్లి కన్నులవానికేగాని పాఱదు. అటు వంటివాని నెవ్వని నైనను పిలిపించవలెను.

నాయకుఁ డా మాటలు విని యొకభటుని బిలిచి, "నీవు పోయి చాకలి సామిగానిని తీసికొనిరా. వానివి పిల్లికన్నులు" అని నియమించెను. వాఁడు వెంటనేపోయి రెండు గడియలసేపునకు సామిగానిని వెంటఁ బెట్టుకొని వచ్చెను. ఈ లోపల నంజనము వేయువాఁడు దాసదానిచేత గదినొకదానిని నలికించి, అందొకమూలను నూనెతో గొప్ప దీపమును వెలిఁగించి తాను స్నానముచేసి వచ్చి దీపము ముందట పిండి ముగ్గుతో నొకపట్టు పట్టి అందాంజనేయ విగ్రహమును కాటుక కరాటమును ఉంచి పూజ చేయుచుండెను. చాకలివాఁడు వచ్చినతోడఁనే యాతఁడు తనపూజను చాలించి, పట్టులో వానిని గూరుచుండఁబెట్టి బరిణలోని కాటుకను వాని కుడిచేతిలో రాచి దానిని నిదానించిచూచి దానిలో నేమి కనఁబడునో దాని నెల్ల తనకుఁ జెప్పుచుండుమని యుత్తరవు చేసెను.

భీమ— చేయి దీపము దగ్గరగాఁ బెట్టి దానివైపు తెప్పవాల్చక చూడు. నీ కిప్పుడేమయినఁ గనఁబడుచున్నదా ?

సామి—లేదు. కాటుకమాత్రము కనఁబడుచున్నది.

భీమ—చూపు చెదరనీయకు. ఇప్పు డేమయినఁ గనబడుచున్నదా?

సామి—కనబడుచున్నది. పెద్దబంగారపు రేకువలె నున్నది.

భీమ—ఆ రేకు నడుమ నేమయిన నున్నదా ?

---

1. అంజనము.

The magic ointment used, for the purpose of discovering any thing that is, concealed అంజనకాడు a conjurer, he who finds that which is concealed by putting this ointment on his hand or on his eyelashes. అంజనము వేసి చూచు to search for hidden things అని బ్రౌను నిఘంటువు.

సామి—అవిసిచెట్టున్నది.

భీమ—అవిసిచెట్టుకాదశోకవృక్షము. ఆ వృక్షము కొమ్మలలో నెవరున్నారో చూడు.

సామి—పెద్ద కోఁతియున్నది.

భీమ—కోఁతి యనఁబోకు. ఆంజనేయులువారును. నీ మనసులో నమస్కారము చేసి యేమిచెప్పునో తెలిసికో.

సామి—ఏమో పెదవులు కదుల్చుచున్నాడు. ఆ మాటలు నాకు దెలియవు.

భీమ—రాజుగారి సొమ్మెవ్వ రెత్తుకొనిపోయినారో యడుగు.

సామి—రాజుగారివద్ద కొలువున్న వారిలోనే యొకరు తీసినాలను చున్నాఁడు.

భీమ—వారింటిపే రడుగు.

సామి—గోటేటివారు.

భీమ—పేరు కూడా చెప్పమను.

సామి—సుబ్బమ్మ.

భీమ—సుబ్రహ్మణ్యమా ? గోటేటి సుబ్రహ్మణ్యము.

సామి—ఇందాక నీ వాలాగునఁ జెప్పలేదు.

భీమ—నీ వాంజనేయులవారితోనా మాటాడుచున్నావు ? ఆంజ నేయు లిందాక నాలాగునఁ జెప్పలేదనుచున్నావా ? ఆయన యాలాగుననే చెప్పినాఁడు. నీవే పేరు నోటఁబట్టలేక తప్పు పలికినావు. చాలు ఈపాటి కిఁకే ఇఁక మాటాడకు.

అని యాతఁడు సామిగానిని తనవెనుకకుఁ దీసికొని, సొమ్ము తీసినవాని పేరు బయటఁబడ్డదని కేకలు వేసి చెప్పనారంభించెను. భటుల

నాయకుఁడును 'ఈ దొంగతనము మఱియొకరివలన జరిగినది కా' దని యీ ప్రక్కనుండి యా ప్రక్కకుఁ దిరుగసాగెను. సభలోని యుద్యోగస్థు లందఱును పీం ద్దిద్దఱును గలిసి యామాట చాకలివానికి నేర్పి పెట్టిరికాని యిందు సత్యమేమియు లేదని తలఁచిరి. సాధారణ జను లందఱును నిజముగా దొంగతన మాతఁడు చేయకపోయినయెడల చాకలివానికా పే రెట్లు తెలిసినదనియు; గట్టిగా సుబ్రహ్మణ్య మాపని చేసిననియు, జెప్పుకొనుచుండిరి. ఊరనెక్కడఁ జూచినను సుబ్రహ్మణ్యము సొమ్మును తస్కరించినట్టు అంజనము వేయఁగా బయటపడ్డదని మూఁకలు గట్టి మాటాడుకొనఁ జొచ్చిరి; రాజుగా రామాటల నెంతమాత్రము విశ్వసించ లేదు.

అప్పుడు సభామందిరమునుండి యింటికిఁ బోవునపుడు త్రోవ పొడుగునను ప్రజలెల్ల 'ఈతఁడే కన్నము వేయించినవాఁడు' అని సుబ్రహ్మణ్యమును వ్రేలుపెట్టి చూపనారంభించిరి. అందుచేత నాతఁడు వట్టి నీలాపనింద వచ్చెగదాయని సిగ్గుపడి రాత్రి భోజన మయిన తరువాత నొక్కఁడును బరుండి తనలోఁ దానిట్లు చింతింప మొదలు పెట్టెను. ఆ గోడకు కన్నము వేసినవాఁ డెవ్వఁడయియుండును? ఒకడంత సాహసపుఁ బనిని చేయఁజాలడు. అటువంటి బలమయిన రాతిగోడకు కన్నము వేసినవా రిద్దఱు ముగ్గురుండక తప్పదు. ఆ ముగ్గురు నెవ్వరై యుందురు? కోట సంగతి గుర్తెఱిఁగినవారే కాని మఱియొకరు కారు. నాలుగు దినముల క్రిందట నీలాద్రిరాజు నాచేత కోటపటమును వ్రాయించుకొన్నప్పుడు ధనాగారమునుగూర్చి రెండుమూడుసారులడిగెను. అతడట్లడుగుటకుఁగారణ మేమి? ఈ దొంగతనములో నతని కేదో సంబంధము గలిగియుండవలెను. అతఁడు గోడయెత్తుకూడ నడిగెను. దొంగతనములో సంబంధమే లేనియెడల గోడ యెత్తుతో నతని కేమి ప్రయోజనము? అంతియకాక ఈ సంగతి గ్రామములో పొక్కకమునుపే వేకువజామున బహిర్భూమికి వెళ్ళుచుండఁగా నన్నుఁ బిలిచి యతఁడు రాజుగారిలోపల దొంగలు పడ్డారట యని యడిగినాఁడు; అతఁడు దొంగలలోఁ జేరియుండని పక్షమున, అంత పెందలకడ నాతని కాసంగతి యెట్లు తెలియును? నేను ప్రాయం

కాల మింటికి వచ్చునప్పుడు వీధిలో నిలుచుండఁగా నాతని జూచినాను. అప్పుడాతని చర్య వింతగా నున్నది. ఈ యన్ని హేతువుల చేతను విఁ రచిచూడఁగా ఈతఁడు దొంగల గురువనుటకు సందేహము లేదు. రేపు రాజుగారి నడిగి కొందఱు రాజభటులను బుచ్చుకొని యెవ్వరికిని దెలియ కుండ నాతని యింటిమీఁద పడి పెట్టెలు మొదలగునవి పరీక్షించెదను. అప్పుడు కొంతసొమ్మయిన దొరకగలదు. అందుమీఁద నామీఁది నింద యైనను పోవును, అని యాలోచించి యారాత్రి యెట్లో వేగించి తెల్లవారిన తోడనే రాజుగారిదర్శనముచేసి తనయందు దోషము లేశమయినను లేదని చెప్పుకొని తనవశమునఁ గొందఱు భటులనిచ్చి తనయాజ్ఞ ప్రకారము చేయు నుత్తరువిచ్చినచో దొంగలను సొత్తుతోఁ గూడఁ పట్టుకొనెదనని దృఢముగా జెప్పెను. రాజుగారాతని మాటయందు గౌరవముంచి, తక్షణమే పదుగురు భటులను రప్పించి, మీరందఱు నీయన చెప్పినట్లెల్లచేసి పర్యవసానము మాతో మనవి చేయవలసినదని గట్టి యుత్తరువు చేసిరి. సుబ్రహ్మణ్యము వారిని దీసికొని తిన్నగా నీలాద్రిరాజున్న యింటికిఁ బోయి వీధితలుపు వేసియుండఁగా వారినందఱిని ఇంటి చుట్టును కావలిపెట్టి యిద్దఱిని వెంటఁదీసికొని పాణి ద్వారముల దొడ్డిలో ప్రవేశించెను. అప్పుడు నీలాద్రిరాజు పెరటిలో నిలుచుండి క్రొత్త మనుష్యులు వచ్చుట చూచి తత్తరపడసాగెను.

నీలా—సుబ్రహ్మణ్యముగారా? ప్రొద్దుననే మీరిక్కడకు వచ్చినారేమి?

సుబ్ర—తమ దర్శనము నిమిత్తమే. దొడ్డిలో నేమిచేయించుచున్నారు?

నీలా—విత్తనములు చల్లించుటకయి దొడ్డి త్రవ్వించినాను ఏమి గింజలు చల్లింతునా యని యాలోచించుచున్నాను.

అని యాతొందరలో తన విషయమయిన బహువచన ప్రయోగమును మఱచిపోయి తన నిజమయిన స్థితికనుగుణముగా మాటాడెను.

సుబ్రహ్మణ్యము మాఱుమాటాడక భటులతో లోపలఁజొరబడి పెట్టె లన్నియుఁ దీయించి పరీక్షింపఁగా వానిలోనున్న తమ లోపల బైరాగి యెత్తుకొనిపోయిన వస్తువులును మఱికొన్ని వస్తువులును గానఁబడెను. గాని రాజుగారి సొత్తేమియుఁ గనఁబడలేదు. తన సొమ్ము దొరుకుటఁబట్టి నీలాద్రి రాజే దొంగయని నిశ్చయముజేసి వస్తువులు భూమిలో పాతిపెట్టి త్రవ్విన యానవాలు తెలియకుండ, మఱుగుపఱుచుటకయి దొడ్డియంతయుఁ ద్రవ్వించి విత్తనములు చల్లుటకని మిషపెట్టి బొంకుచున్నాఁడని యూహ చేసి యతఁడు భటులచేత దొడ్డియంతయు త్రవ్వించెను; అందొక చోట రాజుగారి లోపలఁ బోయినసొత్తంతయు గవ్వయయినం బోకుండ మొలలోతు భూమిలో గానఁబడెను. వెంటనే కూలి వాండ్రచేత సొమ్మును మోయించుకొని నీలాద్రిరాజును నాతని భృత్యులను బటుకొని తీసికొని వచ్చుటకయి భటుల నియోగించి సుబ్రహ్మణ్యము రాజుగారి యింటికివెళ్ళి నడచిన సర్వవృత్తాంతమును నివేదించి, కావళ్ళతో సొమ్మును ముందుబెట్టి దొంగల నొప్పగించెను. నీలాద్రిరాజును సేవకులును తమ నేరమున కొప్పుకొని క్షమింప వేడు కొనిరి. అంతట రాజుగారు మిక్కిలి సంతోషించి సుబ్రహ్మణ్యమునకు గొప్ప బహుమానముచేసి, తాను పెద్దాపురము రాజునకుఁ గప్పముగట్టెడి సామంతరాజు గనుక వారిని విమర్శింపఁ దన కధికారము లేదని దొంగలను రాజభటులవశమున నొప్పగించి వారికందఱకు సుబ్రహ్మణ్య మును నాయకునిగాఁజేసి విచారణకయి పెద్దాపురము శ్రీకృష్ణజగపతి మహారాజుగారికడకుఁ బంపెను. సుబ్రహ్మణ్యమును ఉమాపతిగారియొద్ద సెలవు పుచ్చుకొని పెద్దాపురమునకు ప్రయాణమయి బయలుదేరి వీధి గుమ్మమువద్దకు వచ్చునప్పటికి పైనుండి మాలబల్లి యొకటి మీఁద పడెను. అప్పుడు ప్రయాణమాపి గౌళిపాటుయొక్క ఫలము కనుఁగొనుటకు పురోహితునకు వర్తమానము పంపఁగా నతఁడు తాటాకుల పంచాంగమును

పట్టుకొనివచ్చి శిరస్సుమీఁద పడలేదు గనుక మరణభయము లేదనియు,[1] స్నానముజేసి దీపము పెట్టుకొని బ్రాహ్మణునకు కొంచెము సువర్ణదానము చేసినపక్షమున బల్లిపాటుయొక్క దోషము పోవుననియు జెప్పెను. సుబ్రహ్మణ్యము వెంటనే శిరస్స్నానము చేసివచ్చి రాగిలో సువర్ణముండును గనుక నాలుగుడబ్బు లా బ్రాహ్మణుని చేతిలోనే పెట్టి గాయత్రి చేసికొని తరువాత నెంతో యెండ యెక్కినను ఆ పూటనే పెద్దాపురమునకు వెళ్ళ బయలుదేఱెను.

---

బల్లి,

1. A lizard. పాలబల్లి the white kind మాలబల్లి the mottled kind చింతబల్లి the speckled kind అని బ్రౌన్ నిఘంటువు.

బల్లిపాటుకు ఫలితాలు ఇలా ఉంటాయని ప్రతి పంచాంగంలోనూ నేడు కూడా యీ వివరం తప్పనిసరిగా చేరుస్తున్నారు. తాటాకుల నాటినుంచీ ఇది ఆనవాయితీగా వస్తున్నదని ఇప్పుడీ రాజశేఖర చరిత్ర ప్రసక్తినిబట్టి తెలుసుకోవచ్చు. సువర్ణదానమూ, రాగిలో సువర్ణం ఉంటుంది కాబట్టి నాలుగు డబ్బులు దక్షిణ ఇచ్చాదనడం పంతులుగారి వేళాకోళం.

# పంద్రెండవ ప్రకరణము

రామరాజు సాయమున సుబ్బరాయఁడు సీతను వెంటబెట్టుకొని వచ్చుట—రామరాజు చెఱసాలలో రాజశేఖరుఁడుగారిని చూచుట—రాజశేఖరుఁడుగారి కారాబంధవిమోచనము—శోభనాద్రిరాజును శిక్షించుట—సుబ్బరాయుఁడు రుక్మిణి యయి తన వృత్తాంతమును చెప్పుట.

పెద్దాపురమునకు అయిదుక్రోసుల దూరములో జగ్గయ్యపేటయను గ్రామమొకటిగలదు. సీత నెత్తుకొనిపోయిన నాఁడు మధ్యాహ్నము రెండు జాములవేళ గ్రామకరణముయొక్క యింటివద్ద కెవ్వరో వచ్చి తలుపు తీయుమని కేకలు వేసిరి. అప్పుడు పదునాలుగు సంవత్సరముల ప్రాయముగలిగి మిక్కిలి యందగాఁడై యే హేతువుచేతనో తలపెంచుకొని యున్న చిన్నవాఁ డొకఁడు లోపలినుండి వచ్చి తలుపుతీసి యెందుకు వచ్చినారని యడిగెను. అక్కడ నిలుచుండియున్న యిద్దఱు మనుష్యులలో నొకఁడు "బ్రాహ్మణకన్యకకు డబ్బుపుచ్చుకొని యన్నము పెట్టెదరా?" యని యడిగెను. ఆ చిన్నవాఁడు వెలుపలికి వచ్చి చూచునప్పటికి, ఎనిమిదేండ్ల యీడు గల యొక చిన్నది యరుగుమీఁదఁ గూరుచుండి క్రిందు చూచుచు వెక్కి వెక్కి యేడ్చుచుండెను. ఆ మనుష్యులలో నొకఁడు చేరువ నిలుచుండి యూరకుండుమని యదలించుచుండెను. ఆ చిన్నవాఁడట్లు వెలుపలికి వచ్చి తమ మొగమువంకఁ దేఱిపాఱ చూచుచుండుటఁ గని ఆ మనుష్యులిద్దఱును మీ పేరేమని యడిగిరి. అతఁడు సుబ్బరాయఁడని చెప్పి, యా చిన్నదాని మొగమును నిదానించి కొంచెముసేపు చూచి యిట్లనియెను.

సుబ్బ—ఈ చిన్నది యెవరు? మీ రెక్కడనుండి తీసుకొని వచ్చినారు? ఎక్కడకు తీసికొని పోయెదరు?

మను—మాది కాకినాడ. ఈ చిన్నది మా గ్రామ కరణము కూఁతురు. పేరు సీతమ్మ. అప్పగారియింటిలో పెద్దాపురమున నుండఁగా తండ్రియింటికిఁ దీసికొనిపోవుచున్నాము. అక్కడికి వచ్చుట కిష్టములేక రాగములు పెట్టుచున్నది.

సీత—కాదు కాదు. నన్ను వీండ్రెత్తుకొని పోవుచున్నారు.

సుబ్బ—పెద్దాపురమునుండి కాకినాడ కీయూరు త్రోవగాదే. ఆ చిన్నది చెప్పినమాటే నిజమని తోఁచుచున్నది.

ఈ ప్రకారముగా ప్రశ్నోత్తరములు జరుగుచుండగా, వెనుకనుండి యెవ్వరో యేమఱుపాటున వచ్చి సీతయొద్ద నిలుచున్న వానిని జుట్టుపట్టుకొని వంగదీసి వీఁపుమీద పిసెగుద్దులను మఱుగుగుద్దులను దబదబ వర్షములాగున కురిపించెను. అది చూచి రెండవవాఁడు సీతను తన మిత్రుని విడిచిపెట్టి పరిగెత్తుటలోఁ దనకు గల సామర్థ్యమునంతను జూపెను. ఆ క్రొత్తగా వచ్చిన నాఁతడును "పోనీకు పోనీకు" మని చేతిలోని వానిని వదలివేసి పరిగెత్తుచున్న వానివెంటఁబడెను. అదే సమయమని రెండవ వాఁడు గూడ రెండవవైపునకుఁ బరుగెత్తి పరుగులో మొదటి వానికంటె దిట్టమయిన వాఁడని పేరు పొందెను. ఆ మనుష్యుని కొంతదూరము వఱకుఁ దఱిమి, క్రొత్త మనుష్యుఁడు మరల సీతయున్న చోటికి వచ్చెను.

సీత—రామరాజుగారూ! నన్నా దొంగలనుండి విడిపించినారు గదా! ఇఁక మా అమ్మయొద్దకు తీసికొనిపోయి యొప్పగించరా?

రామ—అమ్మాయీ! ఏడ్వబోకు. నేను సాయంకాలములోగా నిన్ను దీసికొనిపోయి మీ యింటికడ నొప్పగించెదను.

సుబ్బ—రాజుగారూ! ఈ చిన్నదాని తల్లిదండ్రు లెక్కడ నున్నారు? వారు చిరకాలము నన్ను కన్నబిడ్డలవలెఁ జూచినారు.

రామ—అట్లయిన మీరీ చిన్నదాని నెఱుఁగుదురా?

సుబ్బ—ఎఱుఁగుదును. ఈ చిన్నది రాజశేఖరుఁడుగారి రెండవ కొమార్తె. ఈ చిన్నదియు నేనును నీమెయన్నగారును నన్యోన్యమును సోదరభావమున నుండెడివారము; అందులో ముఖ్యముగా నీ చిన్నదాని యప్పగారును నేనును తానే నేనట్లు భేదములేక యుండెడివారము. ఈ చిన్నది నన్ను మఱచిపోయినట్లున్నది.

రామ—ఈ చిన్నదాని తలిదండ్రు లిప్పుడు భీమవరములో నున్నారు. వారివలన మీరింత యుపకారమును పొందియున్నయెడల, ఈ చినదానిని గొనిపోయి జననీజనకులకడఁ జేర్చవలెను. దారితోడుగా వచ్చెదరా?

సుబ్బ—అవశ్యముగా వచ్చెదను. నేను లోపలికిబోయి యీ సంగతిని మావాండ్రతోఁ జెప్పివచ్చువఱకును నిమిషమిక్కడ నిలువుండి;

అని సుబ్బారాయఁడు లోపలికిఁబోయి యింటివారితో సంగతి యంతయుఁ జెప్పి యా చిన్నదానిని భీమవరములో దిగఁబెట్టి సాధ్యమయి నంత శీఘ్రముగానే తిరిగివచ్చెదనని చెప్పెను. వారు వలదని యనేక విధములఁ జెప్పినను విననందున వారందఱును వీధిగుమ్మమువరకును వచ్చి 'నాయనా! వేగిరము రావలెనుసుమీ' యని మఱిమఱి చెప్పిరి. రామరాజా చిన్నవాని సౌందర్యమున కాశ్చర్యపడుచు, ఇంతటి చక్కఁదనము స్త్రీలయందుండిన నెంత రాణించునని తనలోఁ దాను తలపోయుచుండెను. అతఁడు వచ్చినతోడనే రామరాజా చిన్నదానిని బుజముమీఁద నెత్తుకొని సుబ్బరాయనితో మాటాడుచు భీమవరము మార్గము పట్టి నడవనారంభించెను.

రామ—మీరు బ్రాహ్మణులయ్యును, ఆ ప్రకారముగా తలపెంచు కొన్నారేమి?

సుబ్బ—వెంకటేశ్వరులకు మ్రొక్కున్నది. ఆ మ్రొక్కును బట్టియే తొడుగుకొన్న యంగీ మొదలగు వస్త్రములను భోజనము చేయు నప్పుడు సహితము తీయకుందును; బట్టలు మానినప్పుడు సహితము రెండవవారెఱుఁగకుండ మహా రహస్యముగా నొక గదిలో నుతికిన

ఖట్లను కట్టుకొనుచుందును. ఈ వ్రతము నేఁటి వఱకు దైవానుగ్రహము వలన సాగి వచ్చుచున్నది.

రామ—ఈ వ్రతము మిక్కిలి చిత్రముగానున్నది. ఇటువంటి వ్రతము నే నీవఱకు వినియు కనియు నెఱుఁగను.

ఈ విధముగా మాటలు చెప్పుకొనుచు వారు దీపములు పెట్టిన నాలుగు గడియలకు భీమవరమునకు సమీపమున నున్న యొక చిన్న పల్లెను జేరిరి; అక్కడినుండి త్రోవ మంచిది కాకపోవుటచేతను, రెండు దినముల క్రిందట నాయూరి బయటనే పెద్దపులి యొక మనుష్యుని నెత్తుకొనిపోయినదని వినుటచేతను, చీఁకటిలో వారిని నడిపించుకొనిపోవుట యుక్తము గాదని రామరాజు వారి నా గ్రామములో నొక కాఁపువానియింటఁ బరుండబెట్టెను. ఆ పల్లెలో బ్రాహ్మణులు లేరు. గనుక వారారాత్రి భోజనము చేయకపోయినను రామరాజు కోమటి యింటికి వెళ్ళి యటుకులను దెచ్చి పరున్న యింటివాండ్రకు పాడియావుటచేత చెంబెడు చిక్కని మజ్జిగ యడిగి పుచ్చుకొని వారి కిద్దఱికిని బెట్టెను. వానితో క్షుత్తు నివారణమై నందున వారును బసవాండ్రిచ్చిన తుంగచాపమీఁద పడుకొని హాయిగా నిద్రపోయిరి. రామరాజు జామురాత్రియుండగానే వారిని లేపి తనతోఁ గూడ దీసికొని బయలుదేఱి రెండుగడియలలో భీమవరము చేర్చి, యూరి బయటకు రాఁగానే తా నా వఱకు మఱచిపోయిన గొప్పసంగతి యేదో తనకప్పు డకస్మాత్తుగా జ్ఞప్తికి వచ్చినట్లు నటించి తొందరపడి తనకు వెంటనే వెళ్ళక తీరనిపనియున్న దని చెప్పి వారికి త్రోవచూపి తాను ప్రక్కదారిని పోయెను. వారిద్దఱును దారి యడిగి తెలిసికొనుచు కొంత దూరము కలసి వచ్చిరి. సీత తా నెఱిఁగియున్న వీధికి రాఁగానే సుబ్బ రాయని వెనుక దిగవిడిచి పరుగెత్తుకొనిపోయి యొకసందులో నుండి తప్పలి రిస్సఁగా నింటికిఁబోయి చేరెను. సుబ్బరాయఁడు చీఁకటిలో సీత పోయిన సందును కనిపెట్టలేక తిన్నగా వీధి చివరదాఁక నడచి యిల్లుఁ గనుగొనలేక గ్రామములో తిరుగుచుండెను. సీత వెళ్ళి వీధిగుమ్మమువద్ద పిలువఁగనే మంచముమీఁద పరుఁడి నిద్రపట్టక విచారించుచున్న మాణిక్యాంబ త్రుళ్ళిపడి లేచి పరుగెత్తుకొని వచ్చి తలుపు తీసెను. తలుపు తీసినతోడనే

సీత తల్లిని కౌగలించుకొని పెద్దపెట్టున నేడ్చెను. మాణిక్యాంబయు దుఃఖము పట్టఁజాలక కొంతసేపు తానుకూడ నేడిచి తన పైటచెఱఁగుతో కొమార్తె కన్నుల నీళ్లు తుడిచి నిన్నఁటి నుండియు నెక్కడికిఁ బోయితివనియు నింతచీకఁటిలో నొక్కతెవు నెట్లురాఁగలిగితివనియు సీతనడిగెను. ఆ క్రిందటిదినము ప్రొద్దుననే తన్నిద్దఱు దొంగ లెత్తుకొనిపోవుటయు, రామరాజును మఱియొక చిన్నవాఁడును తన్ను విడిపించి తీసికొని వచ్చుటయు, రామరా జేదో పనియున్నదని యూరి వెలుపలిదాఁక వచ్చి వెళ్ళిపోవుటయు సీత చెప్పెను. అప్పుడా రెండవచిన్న వాఁ డేమయినాఁడని తల్లి యత్యాదరముతో నడిగెను. తనతోఁ గూడ పయివీధివఱకును వచ్చి నాఁడనియు, అతఁడు పూర్వము తమ్మందఱి నెఱిఁగినవాఁడే యనియు, కొంచెము సేపటికెల్ల నచ్చటికి వచ్చుననియు కూతుఁరు బదులు చెప్పెను. ఈ ప్రకారముగా మాణిక్యాంబ సీతను తొడ(మీద గూరుచుండఁ బెట్టుకొని మాటాడుచుండఁగానే సూర్యోదయ మాయెను. అప్పుడు వీధిగుమ్మములో నెవ్వరో 'రాజశేఖరుఁడుగారి బస యెక్కడ?' నని యడిగిరి. ఆ మాట విని యది రుక్మిణి కంఠమువలె నున్నదని యొడిలోనుండి సీతను దించి మాణిక్యాంబ వీధిగుమ్మములోని కొక్కయంజవేసి యెవరువాగని కేక వేసెను. అప్పుడు సుబ్బరాయఁడు మాణిక్యాంబను జూచి 'అమ్మా!' అని కౌఁగిలించుకొని బోరున నేడువ మొదలుపెట్టెను. అంతట వారందఱును గలిసి లోపలికిఁ బోయిరి.

చెఱసాలలో బెట్టబడిన దినముననే రాజశేఖరుఁడుగారు వ్యసన పడుచు నొకచోటఁ గూరుచుండి యుండఁగా ఏఁబదిసంవత్సరములు దాఁటిన కారాబద్ధుఁడొకఁ డా మార్గమున కాళ్ళసంకెళ్ళతోఁ బోవుచు రాజశేఖరుఁడు గారి మొగమువంక గొంతతడవు చూచి యాయన సమీపమునకు వచ్చి కూర్చుండెను.

రాజ—నీపే రేమి?

కారా—నా పేరు పాపయ్య; మా యింటిపేరు మంచిరాజువారు; నన్నెక్కడనైన జూచినట్టు జ్ఞప్తియున్నదా?

రాజ—మీమొగ మెక్కడనో చూచినట్టే యున్నది కాని యెప్పుడు చూచినానో మాత్రము స్మరణకు రాలెదు. మంచిరాజు పద్మరాజు మీ కేమగును?

పాప—నన్ను మీరు నల్లచెఱువువద్ద జువ్విచెట్టుక్రిందఁ జూచి నారు. నే నప్పుడు బైరాగివేషముతో నున్నందున, న న్నానవాలు పట్టలేక పోయినారు. పద్మరాజు నా కొమారుఁడు.

రాజ—మునుపటిదుఃఖవస్థ పోయి మీ కింతలో నిప్పటి యీ స్థితి యెట్లు వచ్చినది?

పాప—నే నీ శోభనాద్రిరాజుతో స్నేహము చేసిన దోషముచేత, నాకీతని మాట వినవలసి వచ్చినది. ఈ రాజు దారులు కొట్టుటకై నలు గురిని తోఁడితెచ్చి నన్ను వారికి నాథునిగాఁ జేసి నల్లచెఱువునకు పంపెను. వెనుక కోయ రామిరెడ్డియు వాని మనుష్యులును పట్టుకోఁబడి రాజుగారిచే చెట్ల కొమ్మలకు ఉరితీయఁబడిన తరువాత మేమే ప్రబలులముగా నుండి రెండు మాసములు త్రోవలుకొట్టుటలోఁ బ్రసిద్ధిగాంచితిమి. దోఁచుకొని తెచ్చిన సొమ్ములో సగము శోభనాద్రిరాజు పుచ్చుకొనుచుండెను. మిగిలిన సగములోను సగము నా వంతునకు వచ్చుచుండెను. మెట్టుసొమ్ములో నాల్గవపాలును తక్కినవారు నలువురును సమభాగములుగా బంచుకొను చుండిరి. నేను యోగివలె నటింపుచుందును; నా తోడ నున్నవారు దూర ముగా నడవిలోఁ బగలెల్లి నుండి రాత్రులువచ్చి మాటాడి పోవుచుందురు; పగలు వారికేమయిన వర్తమానము చేయవలసి వచ్చినప్పుడు, గుడిసెతో గాపురమున్న కోయవానిని బంపుచుందును; వానికిఁ బ్రత్యేకముగా నేనే జీతమిచ్చెడివాఁడను.

రాజ—అప్పుడు విల్లును అమ్ములును బుచ్చుకొని మాతో వచ్చిన వాఁడు వాఁడేకాఁడా?

పాప—అవును భానపొట్టవాఁడే. మీ నిమిత్తమై పంపిననాఁటి రాత్రియే యా నలుగురిలో నొకఁడు చంపఁబడినాఁడు. రాజుగారి కేలాగున్న

దెలిసెనో కాని మఱునాఁడు తెల్లవారకమునుపే రాజభటులు కోయవానిని కొట్టినందున వాడు తక్కిన వారుండుస్థలములను జూపఁగా వారిని సహితము పట్టుకొని మమ్మందఱను రాజుగారి యొద్దకు తీసికొనివచ్చిరి. ఆయన మమ్మందఱను చెఱసాలయందుఁ బెట్టించెను; మా కందఱకు శిక్షకలిగినను ఖేమీరాజు పేరు చెప్పినవారముకాము; కాఁబట్టి నమ్మీతఁడు చెఱసాలలో స్వేచ్ఛగా తిరుగుట కంగీకరించి మిక్కిలి ప్రేమతో జూచుచున్నాఁడు.

రాజ—అట్లయిన శోభనాద్రిరాజు మీ కెంతో యుపకారమే చేయుచున్నాఁడు.

పాప—ఏమి యుపకారము? ఈ దుర్మార్గుని మూలమున చెఱసాలలోఁబడి బాధపడుచున్నాను. రాజుగా రెప్పుడో యీతని దుర్మార్గతను దెలిసికొని యీతనిని కూడ మాకు సహాయునిగా నిందేయుంతురు. అటు పిమ్మట మఱియొక కారాగృహాధికారి వచ్చినప్పుడు మాపాట్లు దైవమునకుఁ దెలియఁగలవు.

రాజ—మీ కొమారునకు పిల్ల నియ్యనందునకే సుమీ నన్నితఁడింతు బెట్టించినాఁడు.

పాప—అవును నే నెఱుఁగుదును. మీరు రాజుదగ్గఱ నుండఁగా పద్మరాజును పిలిపించినప్పుడు వాఁడు నా వద్దనే యున్నాఁడు. అది యంతయు నేనును మావాఁడును రాజును సిద్ధాంతియుఁ గలిసి చేసిన యాలోచనయే. అయినను మీ దినములు బాగుండి మా యాలోచన కొంత సాగినదికాదు. శోభనాద్రిరా జెక్కడికోగాని నాతోఁ గూడ నల్లచెఱువు వద్దనుండిన వాంఛ్ర నిద్దఱిని, సంకెళ్ళూడదీయించి పంప దలఁచు కొన్నాఁడు.

రాజ—ఎక్కడకో మీకుఁ దెలియలేదా?

పాప—తెలియలేదు. ప్రొద్దున నాతో నేమో యాలోచించుటకు వచ్చినప్పుడు రాజుగారి తమ్ముఁడిక్కడకు వచ్చినందున రాత్రి చెప్పెదనని వెళ్ళిపోయినాఁడు. నేను మీకు పూర్వము గొప్ప యుపకారము చేసితిని:

చానికి మాఱుగా నిప్పుడుపకారము నొకదానిని జేసెదను. పెద్దాపురపు రాజుగారు బహు యోగ్యులు; శోభనాద్రిరాజు మిమ్మిట్లు నిర్బంధపెట్టి యున్న సంగతి మనవి వ్రాసుకొన్న యెడల మిమ్ము తక్షణమే విడుదల చేయుదురు. కాగితము మొదలయినవి నేను తెప్పించి ఇచ్చెదను.

అని పాపయ్య కాగితమును కలమును తెప్పించి యిచ్చెను. తోడనే రాజశేఖరుఁడుగారు విజ్ఞాపనపత్రిక నొకదానిని వ్రాసి మడఁచి జిగురం టించి పయిని చిరునామా వ్రాసి యియ్యఁగా పాపయ్య యొక మనుష్యుని చేత దానిని రాజుగారి కంపెను. కాని, యాయన యొద్దనుండి యొక యుత్తరువుగాని, విమర్శచేసి న్యాయము దయచేయు సూచనలుగాని రెండుమూడు దినములు కడచినను రాలేదు. రాజబంధువుమీఁద జేసిన విన్నపము గనుక బదులు రాదని రాజశేఖరుఁడుగా రూరకుండిరి.

సీత నెత్తుకొనిపోయిన మఱునాఁడు ప్రొద్దుననే రాజుగారు చెఱ సాలను జూచుటకు వత్తురని యచట నొక వదంతి కలిగెను. తరువాత గొంచెము సేపటికి రామరాజు రాజశేఖరుఁడుగారున్న తాపునకు వచ్చెను.

రాజ—రామరాజుగారూ! నా తప్పును క్షమింపవలెను. మీ రా రాత్రి జాబును తెచ్చియిచ్చుటయే నాకు మహోపకారమయినది. నేను సంగతిని తెలిసికోలేక మిమ్ము నిష్కారణముగా కానిమాట లాడినాఁడను.

రామ—మీకు నేను జేసియున్న యుపకారమునకు నన్నటువంటి మాటలనవలసినదే; ఇఁక నెప్పుడును మేలుచేయకుండ మంచి బుద్ధి చెప్పి నారు.

రాజ—నా యందు కరుణించి మీ రా సంగతిని మఱచిపోవలెను. మంచి సంబంధము చెడిపోయెఁగదా యని యా సమయములో నొడలు తెలియక యేమో యన్నాను. నన్ను క్షమింపుఁడు.

రామ—రాజుగారు చెఱసాలనుజూడ బయలుదేఱినా రఁట. నేను వేగిరము పోవలెను.

అని రామరాజు వెళ్ళిపోయెను. తరువాత రెండుగడియలకు వెండి బెత్తపు బంటొకఁడు వచ్చి రాజుగారు కొలువుదీర్చి కూరుచుండి, రాజశేఖ

రుఁడుగా రేమో విన్నపము వ్రాసినందునకయి పిలుచుకొని రమ్మన్నారని చెప్పి, ఆయనను వెంటబెట్టుకొని పోయెను. అయన వెళ్ళునప్పటికి సమస్తాభరణ భూషితులయి రాజుగారు రత్నసింహాసనముమీఁద గూరుచుండి యుండఁగా, వేత్రహస్తులు పసిఁడిబెత్తములను చేతఁబూని ముందు నిలుచుండిరి. చామరధరు లిద్దఱు ప్రక్కల నిలుచుండి వింజామరలు వీచుచుండిరి. ఒక ప్రక్కను శోభనాద్రిరాజు చేతులు జోడించుకొని నిలుచుండెను. రెండవప్రక్కను మఱియిద్దఱు మనుష్యులు చేతులు కట్టుకొని నిలువఁబడియుండిరి? రాజశేఖరుఁడుగారు వచ్చి యెదుట నిలువఁబడగానే కృష్ణగజపతి మహారాజుగారు 'మీరీ శోభనాద్రిరాజుగారిమీఁద నేమైన షూపేర మనవి చేసికొన్నారా?! అని యడిగిరి. రాజశేఖరుఁడుగారు తనమీఁది కేమివచ్చునో యని భయపడుచు, శరీర మంతయు కంపము నొంద నోరు మెదల్పక యూరకుండిరి.

కృష్ణ—శోభనాద్రిరాజా! నీవీ రాజశేఖరుఁడుగారి విషయమయి చేసిన యక్రమపు పనులన్నియు మాకు దెలియవచ్చినవి. నీకు చనవరిగా నున్న తుచ్ఛునకు తన కొమార్తె నియ్యమన్న మాత్రమున, నీ వాయనను పట్టి చెఱసాలయందుఁ బెట్టుటయేగాక చెఱసాలలోనున్న వాంద్ర నిద్దఱను విడిచిపుచ్చి యా చిన్నదాని నెత్తుకొనిపోవునట్లు ప్రేరేపించితివి.

శోభ—ఆ చిన్నదాని నెవ్వరెత్తుకొనిపోయినారో నా కేమియుఁ దెలియదు.

కృష్ణ—నీకుఁ దెలియకపోయినయెడల చెఱసాలలో నున్న వీంద్రిద్దఱును నెట్లు వెలుపలికి వెళ్ళగలిగిరి.

శోభ—వీంద్రిద్దఱును నిన్నటియుదయకాలమున గోడదాటి పాఱిపోయినారు. నే నప్పటినుండియు వీంద్రను బట్టుకొనుటకు భటులను బంపి వెదకించుచున్నాను.

కృష్ణ—ఏమిరా? గుఱవా! మిమ్మీయన యెక్కడికయిన పంపినాఁడా? లేక మీరే గోడదూఁకి పాఱిపోయినారా?

గుర—మహాప్రభూ! నిన్న ప్రొద్దున్న మమ్మిద్దఱను పిలిచి యీ రాజుగారు చిన్నదానిని రవణక్కపేట కెత్తుకొనిపోయి, యక్కడ పద్మ రాజున కొప్పగించవలసిన దని యాజ్ఞాపించినారు. చిన్నది రాగానే దొంగతనముగా పెండ్లియాడుటకై పద్మరాజు ముందుగానే పోయి యక్కడ నున్నాఁడు.

శోభ—కాదు కాదు. ఈ దొంగలంజకొడుకులు పాఱిపోయి, తప్పించుకొనుటకయి యీలాగున బొంకుచున్నారు.

గుర—ఈ రాజు దొంగల గురువు. మునుపు మా చేత దారులు కొట్టించి తిన్నగా మా సొమ్ము మా కియ్యక సకలమయిన చిక్కులు పెట్టినాఁడు. ఈ బ్రాహ్మణుని దోచుకొనుటకు వచ్చి మే మారాత్రి యాయన మూలముగా పడ్డపాట్లు తలఁచుకొన్న నిప్పటికి మాకు దుఃఖము వచ్చుచున్నది.

కృష్ణ—వెనుక నీ ప్రకారముగా దారులు దోపించినావా?

శోభ—లేదు లేదు. ఈ విధవకొడుకు లబద్ధ మాడుచున్నారు.

గుర—మా మాట లబద్ధమేమో పాపయ్యగారిని పిలిపించి విచారింపవచ్చును. ఇప్పు డాయన యీ చెరసాలలోనే యున్నాఁడు.

కృష్ణ—ఓరీ! పాపయ్యను పిలుచుకొనిరా.

కొంతసేపటికి పాపయ్య వచ్చి రాజుగారు నిజము చెప్పిన యెడల శిక్ష తగ్గించెదమని వాగ్దానము చేసినందున మొదటినుండియు నాతని చర్యయంతయు నేకరువుపెట్టెను. అందుమీద శోభనాద్రిరాజు మాఱుపలుక నోరురాక క్రిందుచూచుచు మిన్నకుండెను. రాజుగారి మొగము పోలికయు కంఠస్వరమును రామరాజుగారివలె నున్నందున, రాజశేఖరుఁడుగారు దేహమంతయుఁ జెమర్ప దిగ్భ్రమము నొంది యూరక తెల్లపోయి చూచుచుండెను. అప్పుడు రాజుగా రాయన వెలవెలపాటును తత్తరమును గని పెట్టి సింహాసనమునుండి దిగివచ్చి చేయిపట్టుకొని, వెనుక రామరాజను పేరునఁ బలుమాఱువచ్చి యోగక్షేమంబుల నారయుచు వచ్చినది తామేయనియు, వెంటనే సహాయము చేయుటకు శక్తిగలిగి యుండియుఁ

ప్రవర్తనమును బరీక్షించుటకయి యింతకాల ముపేక్ష చేసితి మనియు చెప్పి, వెంటనే కారాబంధ విమోచనము చేయించిరి. రాజశేఖరుఁడుగారు కొంతసే పేమీ పలుకుటను తోచక కొంత భయము తీఱినవెనుక మెల్లగా వెలుగు[1] తెచ్చుకొని, గద్గద స్వరముతో "దేవరవారి స్థితి తెలియక సామాన్యమానవునిగా నెంచి యగౌరవముతోఁ జూచినందుకును, సీత వివాహకార్యమునకు భంగము కలిగెనన్న కోపమున దూషణవాక్యములు పలికినందులకును క్షమించి రక్షింపవలయు" నని బహు దీనత్వముతో వేఁడుకొనిరి. ఆ విషయమునఁ దమ కెప్పుడును మనసులో మఱియొక లాగున లేదని చెప్పి, రేపు పెద్దాపురమునకు వచ్చి తమ్ముఁ జూడవలసిన దని సెలవిచ్చి రాజుగా రాయన నింటికిఁ బంపిరి.

ఆయన వెళ్ళిన తరువాత రాజుగారు శోభనాద్రిరాజును బిలిచి యాతఁడు చేసిన నేరమున కెంత గొప్పదండనమునో విధింపవలసి యున్నను దయారసము పెంపున నెలదినములు మాత్రము చెఱసాలలో నుండ శిక్ష విధించి భటులవశమున నొప్పగించిరి. అంతేకాక సీత నెత్తు కొనిపోయిన వారికి తాను పట్టి తెప్పించినప్పుడు నిజము చెప్పినయెడల శిక్షల కొంతభాగము తగ్గింపఁబడునని వాగ్దానముచేసి యుండుటఁబట్టి వారిఁద్రశిక్షలో సగము తగ్గించుటయేకాక మంచిరాజు పాపయ్యకు సహితము సగముశిక్ష తక్కువ చేసిరి. ఈ కార్యముల నన్నిటిని జక్కఁ బెట్టుకొని శ్రీకృష్ణజగపతి మహారాజులవారు భద్రగజారూఢులయి, వంది మాగధులు బిరుదు పద్యములు చదివి కొనియాడ, మృదంగాదిభేరీ వాద్యములు బోరుకలుగ, చతురంగ బలసమేతులయి తమ రాజధానికి విజయం చేసిరి.

రాజశేఖరుఁడుగారింటికి వెళ్ళునప్పటికి మాణిక్యాంబ పడమటింటి గోడకుఁ జేరగిలఁబడి గూరుచుండి తలవంచుకొని సుబ్బారాయుడా మెతో నేమో చెప్పుచుండెను. రాజశేఖరుఁడుగారు గుమ్మమువద్దకు వెళ్ళి, ఆ చిన్న దాని ముఖలక్షణములును, బలుకుబడియు రుక్మిణిని పోలియున్నందున

1. యెలుగు, కంఠస్వరము.

నాశ్చర్యపడి చూచి పురుషుఁడయి యున్నందున నేమని నిశ్చయించుటకు తోఁచక విభ్రాంతితో నాతని మొగమువంకనే తెప్పవేయక చూచుచు లోపలికి రాక యచ్చటనే నిలుచుండిరి. ఇంతలో సీత గుమ్మములోనుండి తొంగిచూచి, "అమ్మా! నాన్నగారు వచ్చినా" రని కేకవేసి వెళ్ళి తండ్రిని కౌగలించుకొనెను.

అంతట-మాణిక్యాంబ పరమానంద భరితురాలయి వెంటనే లేచి వెళ్ళి, కాళ్ళు కడుగుకొన నీళ్ళు తెచ్చియిచ్చి పాదములతడి తన పయఁట చెఱఁగుతో నొత్తి కూరుచుండుటకయి గోడదరిని పీట వేసెను. రాజశేఖరుఁడుగారు పీటమీఁద గూరుచుండి, సీతను ముద్దాడి తొడమీఁద కూర్చుండఁబెట్టుకొనెను. అప్పుడు మాణిక్యాంబ సీతను దొంగ లెత్తుకొని పోవుటయు, రామరాజు మరియొకరును వదలించి తెచ్చు టయుఁ జెప్పెను. రాజశేఖరుఁడుగారు రామరాజు పెద్దపురాధినాదులయిన కృష్ణజగపతి మహారాజులనియు, ఆయన ప్రజల క్షేమము కనుఁగొనుటకయి యట్టి మారువేషముతో సంచరించుచుందురనియు, రామరాజను పేరునవచ్చి మనకు బహూపకారములను జేసి తుదకు ,కారాబంధ విమోచనమును జేయించిరనియుఁ జెప్పి తన్ను విడిపించిన క్రమమును వివరించి కొంత సేపు నృపుని సద్గుణవర్ణ నమును జేసెను. మాణిక్యాంబ రామరాజు దేశాధీశుఁడని విని, యాశ్చర్యపడి, ఆయన యొక్క గర్వరాహిత్యమును, పరోపకార శీలతను బహుభంగుల మెచ్చుకొనెను.

ఇట్లు మాటాడుచుండగానే సుబ్బరాయఁడు వచ్చి రాజశేఖరుఁడుగారి కాళ్ళమీఁదపడి "నేను రుక్మిణి" నని చెప్పెను. ఆయన సంతోషముచేత కొంతసేపు మాటాడలేక, తుదకు హృదయము పదిలపఱచుకొని లేచి పెద్ద కుమార్తె నాలింగనము చేసికొనెను. అప్పుడు చచ్చిపోయినదను కొనుచున్న కూతురు లేచి వచ్చుటచేత నా దంపతుల కిరువురకును గలిగిన సంతోషము మింతింతయని చెప్పశక్యముకాదు; ఆ సమయమున సీతకుఁ గలిగిన సంతోషము పట్టశక్యము కాకపోయెను. ఆ యుద్రేకము కొంత నిమ్మళపడినమీఁదట, ఆ వధూవరులు తమ్మెడఁబాసినది మొదలు

కాని నేఁటి వఱకును జరిగిన వృత్తాంతమును సవిస్తారముగాఁ జెప్పుమని రుక్మిణి నడిగిరి. రుక్మిణి ఈ ప్రకారముగా వినిపింప నారంభించెను.

మనలను దొంగలు కొట్టిననాఁటి రాత్రి పిండియారఁబోసినట్లు తెల్లగా వెన్నెల కాయుచుండఁగా నాకు మెలఁకువ వచ్చి చూతునుగదా! కటిఁకినేలను మహారణ్య మధ్యమునఁ బడియుంటిని; నలుదిక్కులను నెంత వఱకుఁ జూచిన నెందు నెవ్వరును గనఁబడలేదు; ఎక్కడను మనుష్య

---

1. రాజశేఖరుడుగారు చెరసాలనుంచి ఇంటికి వచ్చినదాకా రుక్మిణి సుబ్బారాయుడు వేషంలో ఉన్నదని తల్లికి కూడా తెలియదా? చెల్లికి తెలియదా? స్త్రీల సహజ స్వభావాలను; మానసికమైన వత్తిళ్లను, ఉద్వేగ ప్రవృత్తులను పంతులుగారు సరిగా వర్ణించలేకపోయారనే అనుకోవాలి. సుబ్బారాయుడు తల్లికి తాను రుక్మిణిని అని చెప్పలేకపోవటానికి బలమైన కారణం కన్పించటంలేదు.

ఈ ప్రకరణంలోనే జగ్గంపేట నుంచి సీతను దొంగల బారినుంచి తప్పించి రామరాజు భీమవరంలో ఆ పిల్లను ఇంటిదగ్గర అప్పచెప్పటానికి వచ్చిన సందర్భంలో రామరాజు వెంట తోడుగా వచ్చిన సుబ్బారాయుడు వీధిలో రాజశేఖరుడు గారింటిని గూర్చి వాకబు చేస్తుండగా "మాణిక్యాంబ వీధిగుమ్మములోని కొళ్లాయంజె వేసి యెవరు వారని కేకవేసెను. అప్పుడు సుబ్బారాయుడు మాణిక్యాంబను జూచి, "అమ్మా" యని కౌగలించుకొని జోరున నేడువ మొదలుపెట్టెను. అంతట వారందరును గలిసి లోపలికి బోయిరి." అని వర్ణించటం ముందువచ్చే సన్నివేశ కథాక్రమంతో సరిగా అతకటంలేదు. తండ్రి ఇంటికి వచ్చిందాకా తల్లికి కూడా రుక్మిణి గురించి తెలియదనుకోవడం ఎట్లా? తొలినాళ్ల నవలా రచనలో ఇటువంటి లోపాలను పట్టించుకోకూడదని ఇప్పటివారు అనుకోవాలి మరి. అంతకన్నా గత్యంతరం లేదు.

సంతారము కనఁబడలేదు గాని మృగముల యొక్క కూఁతలు మాత్రము చెవితో వినఁబడసాగెను. ఇంతలో నొకవ్యాఘ్రము నా దగ్గఱ నుండియె పోయినది కాని నన్నుఁజూడక చేరువనున్న యొక మనుష్యుని మొండెము నీడ్చుకొని తొలఁగిపోయెను. దానిని చూచినతోడనే నా దేహము నాకు స్వాధీనము కాలేదు. కొంత తెలివి వచ్చిన తరువాత మీ రెవ్వరును లేకపోవుట చూచి బ్రతికియున్న యెడల మీరు నన్నొంటిగా విడిచి పోరను నమ్మకమును మీరందఱును దొంగలచేత మరణము నొంది యుందురనియు ఘాతుకమృగము లేవియో మీ దేహముల నీడ్చు కొనిపోయి యుండవచ్చుననియుఁ దలపోసి, చూడఁ జుట్టమును బ్రొమొక్క దైవమును గానక దావ నిశ్చయించుకొని, మరల నింతలో నాత్మహత్యా దోషమను బుద్ధి యొకటి పుట్టుటచే కొంత జంకి మీలో నెవరయినను బ్రతికియుండవచ్చుననియు నొకవేళ మిమ్మందఱను మరల జూచు భాగ్యము కలిగినను కలుగవచ్చుననియు నూహచేసి మరణ ప్రయత్నమును మానుకొని, లేచి నాలుగడుగులు నడిచితిని. అక్కడ నెత్తుట దోఁగి యున్న శిరస్సొకటియుఁ దానిప్రక్కను బట్టల మూటయుఁ గనఁబడఁగా, అంతటి యాపదలో సహితము దుర్వారమయిన క్షుద్బాధకు సహింప లేక తినుట కందులో నేమయిన దొరకవచ్చునని యా మూటను విప్పిచూచి తిని. అందు పురుషులు ధరించుకోఁదగిన వస్త్రాదులు మాత్రమున్నవి. వానిని చూచినతోడనే చక్కని స్త్రీలు నిజవేషములతో నొంటరిగాఁ దిరుగుట క్షేమ కరముకాదు కాఁబట్టి పురుషవేషము వేసికొని యేదో యొక గ్రామము చేర వలెనను యాలోచనతోఁచి యా వస్త్రములను గట్టుకొని యంగీని తొడిగి కొని పురుషవేషమును ధరించి, నా పూర్వపు బట్టలను మిగిలిన బట్టలతోఁ జేర్చి మూటగట్టి నా శరీరముననున్న నగలను తీసి చెంగున ముడివైచు

కొని బయలుదేఱి,[1] యొక కాలిమార్గమున నడచి తెల్లవాఱు వఱ కొక గ్రామమును జేరితిని; ఆ గ్రామములో ఆ పూట నుండి, నగం నమ్మివేసి శౌక్యమును జేర్చుకొని తలమీఁది దెబ్బచేత బాధపడుచునే చేరువ గ్రామమునకుఁబోయి యక్కడ కొన్ని దినములుండి వైద్యము చేయించుకొని నిమ్మళించిన తరువాత బయలుదేఱి చుట్టుపట్ల గ్రామములలోఁ దిరుగుచు పూటకూటి యిండ్లలో భోజనము చేయుచు పదియేను దినముల క్రిందట జగ్గంపేటఁ జేరితిని. ఆ గ్రామ కరణము ముసలివాఁడును పుత్ర సంతానము లేనివాఁడును గనుక నన్నుఁజూచి ముచ్చటపడి తన పనికి నేను సాయముగా నుందునని యెంచి నన్నుఁ దనయొద్దనే యుంచుకొని యాదరించుచు నా ప్రవర్తనమునకు మిక్కిలి సంతోషించి తనకున్న యొక్క కుమార్తెను నాకిచ్చి వివాహముచేసి యిల్లరిక ముంచుకోవలెనను

---

1. పంతులుగారి స్వీయచరిత్రలో ఇటువంటి సన్నివేశం ఒకటి వర్ణితమైంది. స్త్రీ పునర్వివాహ ప్రయత్నం తొలిరోజుల సంఘటన అది. పెద్దాపురమునుంచి ఒక బాల వితంతువును రాజమహేంద్రవరంలో పంతులుగారి ఇంటికి చేర్చడం గూర్చిన ఉదంతం ఇది.

"పరమ నిపుణుఁడును మాకు పరమ విశ్వాసమునయి మా ముద్రాశాలలో పనిలో నుండిన మునిసామిని పెద్దాపురమునకు బంపితిమి. అతఁడెవ్వరికిని అనుమానము కలుగకుండ మార్గస్థునివలె నటించి రాత్రి వారి వీధి యరుగుమీఁదనే పరుండి తన సందేశము నా చిన్నదానికి తెలిపి నేర్పుతో పని చేసెను. అమావాస్య నాడు రాత్రి రెండు జాములవేళ మబ్బుపట్టి చినుకులు పడుచుండగా తన తండ్రికి తలనొప్పి వచ్చుటచేత నుపచారములు చేయుచున్న తల్లి మొదలైనవారి నేమరించి లఘుశంకకుపోవు మిషపై వీధిలోనికి వచ్చి యా చిన్నది మా మనుష్యునితో తాను వచ్చుటకు సిద్ధముగా నున్న సంగతిని తెలిపెను.

అతఁడు వెంటనే యా చిన్నదానిని వెంటఁగొని బైలుదేరి, కొంతదూరము పోయిన తరువాత తానా వఱకు తీసుకొని పోయిన బట్టలా చిన్నదానికి కట్టి పురుష వేషమువేసి, పగలు చూచుకొని వచ్చిన మారుమూల దారిని గాఢాంధకారములో వానలో తడియుచు పడుగెత్తి, కొంతదూర మెత్తుకొని మోచియు తెల్లవారువప్పటికి రెండామడలు నడిచి, అక్కడ బండి చేసుకొని మరునాడు పగలు రెండుజాములవేళ నామెను మా యింటికి జేర్చెను."

పుటలు, 165 - 166, స్వీయచరిత్ర, ప్రథమ భాగము (1982)

నుద్దేశముతో నా కులగోత్ర నామముల నడిగి తెలిసికొనెను. నేనక్కడ సుబ్బారాయఁడను పేరున మిక్కిలి నమ్మకముగా నుండి, మీరు విద్య చెప్పించిన మహిమచేత లెక్కలు మొదలైనవి వ్రాయుటలో తోడుపడుచుండి, నాకు వెంకటేశ్వరుల మ్రొక్కుచేత మా వారు తల పెంచుకొనునట్లు చేసినారనియు, ఈ వ్రతసమాప్తియగు వఱకును తలయంటుకోఁగూడదనియు, చెప్పి యా వ్రతమునకు భంగము కలుగకుండా గాపాడెదమని వారిచేత ననిపించుకొని పురుషవేషము బయలఁ బడకుండఁ గడుపుకొనుచు వచ్చితిని. అట్లుండగా నొకనాఁడు మధ్యాహ్నము సీతనెత్తుకొనివచ్చి యెవ్వరో యిద్దరు మనుష్యులు భోజనము పెట్టించుటకై నేనున్న యింటికిఁ దీసికొని వచ్చిరి. అప్పుడు మనము దాహముతీర్చి బ్రతికించిన రాజు వచ్చి వాండ్రను కొట్టి సాగనంపెను. అంతట నా యింటివారివద్ద సెలవుపుచ్చుకొని నేనును రాజుగారును సీతను దీసికొని వచ్చితిమి. మీ యంతట మీరందఱును నన్నానవాలు పట్టి కనుఁగొనువఱకును నేను రుక్మిణినని మీతో నెవ్వరితో జెప్పకుండ నుండవలెనని[1] మార్గము పొడుగునను తలంచుకొని వచ్చితినిగాని, అమ్మను జూచిన తోడనే మనస్సు పట్టలేక లోపలినుండి దుఃఖము పొంగివచ్చి కౌఁగలించుకొని నా సంగతి జెప్పివేసితిని.

అని రుక్మిణి చెప్పిన తరువాత రాజశేఖరుఁడుగారు కొమార్తెయొక్క బుద్ధికిని సాహసకార్యమునకును సంతోషించి యామెను కౌఁగలించుకొని మిక్కిలి గారవించెను. రుక్మిణి యొక్క యీ చరిత్రమును విన్నవారెవ్వరైనను, ఉన్న యూరిలో సహితము గడపదాఁటి పొరుగువీధికైన నెప్పుడును పదచలముచేసి యెఱుఁగనంత సుకుమారిగాఁ బెరిఁగిన పదునాలుగేండ్ల ప్రాయముగల ఒక ముగ్ధ బాలిక అంతటి ధైర్యమును పూని సమయోచిత బుద్ధితో మంచియుపాయము నూహించి పరుల కెవ్వరికిని భేద్యముకాని మాఱువేషమును ధరించి లోకానుభవమువలన నాతి

---

1. అమ్మకు జెప్పివేసితిని అంటున్నది రుక్మిణి. కాని రాజశేఖరుఁడుగారు చెరసాలనుంచి ఇంటికిరాగానే మాణిక్యమ్మగారు యీ విషయం ఆయనకు చెప్పక పోవటంలో ఏమీ ఔచిత్యం లేదు అదికాక చెల్లెలు సీతకు కూడా అక్క సంగతి తెలియకపోవటం వాస్తవదూరం.

తేఱిన ప్రౌఢాంగనలకు సయితము కష్టసాధ్య మయినరీతి ప్రచ్ఛన్న ముగా నుండఁగలిగిన దన్నవార్త నమ్మశక్యము కాకున్న దనవచ్చును. ఎవరు నమ్మినను ఎవరు నమ్మకపోయినను వాస్తవమును మఱుఁగు పఱచక చెప్పుట చరిత్రకారునికి విధాయక కృత్యము; గనుక, జరిగిన సంగతి నేమో జరిగినట్టు చెప్పుచున్నాను. పురాణగాథల యందువలె మనుష్యులు లేడి రూపమును ధరించినారని కాని, పురుషులు కేవల స్త్రీలుగానే మాఱినారని కాని అసాధ్యమయిన సంగతి యిందేదియుఁ తెలుపఁబడలేదు. ఆమెకిట్టి యద్భుతవిధమున ప్రవర్తింప నేర్పినది, యామె నాశ్రయించి యున్న సరస్వతియే కాని స్వశక్తికాదు. విద్యాప్రభావము నెఱిఁగిన వారెవ్వరిట్టిదొక ఘనకార్యమని యాశ్చర్యపడుదురు?[1]

---

1. స్త్రీ విద్య పట్ల ఆయన కంతటి గొప్ప అభిమానం. సత్యహరిశ్చంద్ర నాటకంలో చంద్రమతి విద్యాధికురాలు కాబట్టి, భర్తకెన్ని విఘ్నాలుగానో తోడ్పడింది అని పంతులుగారు వర్ణించారు. అతిమానుష, అమానుష అద్భుత సంఘటనలనా నాటకంలో పంతులుగారు పరిహరించారు.

# పదుమూడవ ప్రకరణము

శంకరయ్య కాసులపేరుతో వచ్చుట — అతఁడు తన తండ్రి వృత్తాంతము వినిపించుట — వైష్ణవ గురువుల యూరేగింపు — నృసింహస్వామి యొక్క రాక — అతఁడు తన కథను చెప్పుట.

పైని చెప్పినరీతిగా రుక్మిణియు తల్లిదండ్రులును మాటాడుకొనుచుండఁగానే పదునాఱు సంవత్సరముల యీడుగల యొక చిన్నవాఁడు వచ్చి భుజముమీఁది మూటను క్రిందఁబడవైచి రాజశేఖరుఁడుగారి కాళ్ళమీఁదఁబడి 'అయ్యో, మామయ్యా' యని యేడువ నారంభించెను.

రాజ—ఏమి శంకరయ్యా! ఆఁడుదానివలె నాలాగున నేడ్చుచున్నావు? ఊరుకో

శంక—మా నాయన పదియేను దినముల క్రిందట కాలము చేసినాఁడు. నేనప్పుడు గ్రామములోకూడ లేకపోయినాను.

రాజ—ఏమి రోగముచేత పోయినాఁడు? నీవప్పుడు గ్రామములో లేక యెక్కడకు వెళ్ళినావు?

శంక—అతఁడాత్మరోగముచేత పోలేదు; ఇల్లుకాలి పోయినాఁడు. నేనావరకు పదిదినముల క్రిందటనే నా సవతితల్లిని తీసుకొని యేలూరు వెళ్ళియుంటిని. నేనక్కడ నుండఁగా నాకీ వర్తమానము తెలిసినది.

రాజ—ఇల్లెందుచేత కాలిపోయెనో యాతఁ డేల బయటికి రాకుండెనో నాకా సంగతి వివరముగాఁ జెప్పు.

శంక—మీరు గ్రామములో నుండఁగానే మా నాయన భూత వైద్యమునందు ప్రబలుఁడుగా నున్నాఁడుగదా? అటు తరువాత చుట్టు ప్రక్కల గ్రామములయందుఁ గూడ అతని ప్రసిద్ధి వ్యాపించినది. ఎవ్వరి యింట నెవ్వరికి కొంచెము జ్వరము వచ్చినను మా నాయనను పిలిచి తీర్థ మిప్పించుచుండిరి; ఎవ్వరికి కాలు కాసంత నొచ్చినను మా నాయన చేతనే రక్షరేకు కట్టించుకొనుచుండిరి; ఎవ్వరికి కొంచెము గాలి సోకినదన్నను మా నాయననే పిలుచుకొని పోవుచుండిరి. ఎవ్వరు కొంచెము జడిసికొన్నను మా నాయనచేతనే విభూతి పెట్టించుచుండిరి. వేయేల? చుట్టుపట్ల నే గ్రామములో నెవరికేజబ్బు వచ్చినను మా నాయనను పిలువని స్థలము లేదు. ఈ ప్రకారముగా జరుగుచుండుటచేత నెల్లవారును సమస్త వస్తువులను మా యింటికిఁ దెచ్చి భక్తిపూర్వకముగా సమర్పించుచుండిరి. ఎవ్వరియింట నే శుభకార్యము జరిగినను మొదటి కట్నము మా నాయనదిగానే యుండెను.

ఈ విధముగాఁ గొంతకాలము జరిగిన పిమ్మట నొకనాఁడు ప్రాతఃకాలమున మా నాయన వీధిలో నడచుచు, ఒక యాదిగవాని వాకిట కాయల గెలలతో నిండియున్న యొక కొబ్బరిచెట్టును జూచి ఆ యింటివానిని పిలిచి తనకు నాలుగు లేఁత బొండములు పంపుమని యడిగెను. వాఁడు కొంచెము పొగరుఁబోతుగనుక సొమ్ము తెచ్చుకొన్నచో కాయల నిచ్చెదనని మాఱు పలికెను. అందుమీఁద మా నాయన కోపదృష్టితో వానివంక నెఱ్ఱపాఱి చూచి కాయల నియ్యవా యని గద్దించెను. నేనియ్యను నన్నెఱ్ఱపాఱిచూచి యేమిచేసెదవో చూతమని వాఁడును వెనుకతీయక గట్టిగాఁ జెప్పెను. తేపీపాటికి నీ చెట్టేమగునో చూచుకొమ్మని తల యూఁచుచు మా తండ్రి యింటికిఁ బోయెను. దయ్యాలు పెట్టి చంపినప్పటిమాట చూచుకొందమని వాఁడును లోపలికి నడిచెను.

ఆ రాత్రి రెండుజాములవేళ మా తండ్రి, గాఢనిద్రలోనున్న నన్ను లేపి నా యుత్తరీయపుకొంగున గిద్దెడుబియ్యము మూటగట్టి కడుగుచెంబు చేతికిచ్చి తనతోఁగూడ రమ్మని చీఁకటిలో నన్నుఁ దీసికొనిపోయెను. నేనును కన్ను కనఁబడని గాఢాంధకారములో నిశాసమయమున తోటి

మోచుకొనుచు మా తండ్రితో నీడిగవాని యింటికడకుఁ జేరి నిలిచితిని. అప్పుడు నన్నక్కడ నిలువఁబెట్టి మా నాయన కాలికి బంధమువేసుకొని కొబ్బరచెట్టున కెగఁబ్రాకి, యొక కత్తితో దాని మువ్వను చితుకఁబొడిచి యందు నేను దెచ్చిన బియ్యమును కడుగును బోసి చెట్టు దిగివచ్చి యా యర్ధరాత్ర మప్పుడు మరల నన్నుఁ దీసికొని యింటికి వచ్చి యారాత్రి సుఖనిద్ర చేసెను. మఱునాఁడతఁడు తన్నుఁ జూడవచ్చిన వారితో నెల్ల 'యీడిగవాఁడు కొబ్బరికాయ లియ్యకపోయినందున వానిచెట్టునకుఁ బ్రయోగము చేసితి'నని చాట మొదలుపెట్టెను. అందుకు దృష్టాంతముగా నాఁడు మొదలుకొని మువ్వవాడి క్రమక్రమముగా ఆకులెండిపోయి నాలుగైదు దినములలో చెట్టు చచ్చెను. "తమకు కొబ్బరకాయలియ్యనన్న కోపము చేత బాపనవాఁడు నిష్కారణముగా నా కొబ్బరచెట్టును దయ్యాలుపెట్టి చంపినా"డని యూర నెల్లవారితోను జెప్పుకొని యీడిగవాఁడేడువ నారంభించెను. ఆ వార్త శీఘ్రకాలములోనే చేరువ గ్రామములకును బ్రాఁకెను. అందుమీఁద నెల్లవారికిని మా నాయనమీఁద నొక విధమయిన యసూయ కలిగెను.

ఆ పిమ్మట గ్రామములో నొకరికి రోగము వచ్చినప్పుడు మా నాయన ప్రయోగము చేసినాఁడేమో యని కొందఱి కనుమానము కలిగెను. అందుచేత గ్రామములోనివారు తమయింట రోగాదికము వచ్చినప్పుడు మునుపటంత తరుచుగా మా నాయనను పిలుచుకొనిపోవ మాని వేసినారు; కాని యాతనిని పిలువకపోయిన నేమిచేసి పోవునో యని మనస్సులలో భయపడుచుండిరి. ఈరీతి నుండఁగా నొక కోమటివాని పిల్లవానికి రోగము వచ్చినప్పుడు, వాని తల్లియు ముత్తవయు వెళ్ళి సోదె యడుగఁగా పేరంటాలు గుడియొద్దనున్న మాలది యా చిన్నవానికి గ్రామములోనివారే యొకరు ప్రయోగము చేసినారని చెప్పెను. అందుమీఁద వారిద్దఱు నేడ్చుచు నింటికివచ్చి యావత్సమాచారమును మగవాండ్రకు వినిపింపఁగా వాండ్రా ప్రయోగము చేసినవాఁడు మా తండ్రియేయని నిశ్చయించి భూతవైద్యులను పిలిపించి పలువిధముల పాటుపడిరికాని వచ్చిన రోగమునకు చికిత్స చేయించక పోయినందునను, జ్వరబాధితుఁ

తమ్ముఁడొకఁడుండఁగా భూతవైద్యులాతనిని పలుమాఱు స్నానములు చేయించి చన్నీళ్లు పోసినందునను వాయువుచేసి యా పిల్లవాఁడు కాలధర్మము నొందెను. అది మొదలుకొని మా తండ్రి ప్రయోగములుచేసి యందఱను జంపు చున్నాఁడన్న నమ్మక మొకటి యూర నందఱికిని గలిగెను. ఆ నమ్మకమునకుఁదోడు మును పెన్నఁడో గ్రామమున చచ్చినవారు తాము ప్రయోగముచేతనే చచ్చినామనియు, మీరు నిజమును కనుఁగొనలేక రోగమని భ్రమపడి తమ్ముఁ బోఁగొట్టుకొన్నా రనియు చెప్పుకొని యేడ్చుచున్నట్లు గ్రామములోని ముసలిముండలిద్దఱు ముగ్గురు రోదనముల నారంభించిరి. ఆ కాలములో కామేశ్వరి మొదలైన యిలవేల్పులు గృహములోని విధవల కావేశమై యెవరికైన రోగము వచ్చినప్పుడు ప్రయోగమని యొకటి రెండు చోట్ల పలుకుచు వచ్చెను. ఈ యన్ని కారణముల చేతను గ్రామములో నెవ్వరి కేవిధమయిన జబ్బు కలిగినను, అది యంతయుఁ మా నాయన చేసిన ప్రయోగముచేతనే కలిగినదని జనులు భ్రమపడుచుండిరి. తా నే దోషము నెఱుఁగనని మా నాయన యెన్నివిధముల ప్రమాణములు చేసి చెప్పినను, ఎవ్వరు నాతనిమాటలను విశ్వసించిన వారుకారు. జనులపిచ్చి యేమందును? గ్రామములో మరణము నొందిన వారందఱు మా నాయన చేసిన ప్రయోగము చేతనే పోయిరని దృఢముగా నమ్మిరి. వ్యాధి గ్రస్తులైన వారందఱును మా నాయనయొక్క మంత్రశక్తిచేతనే బాధపడు చున్నారని తలఁచిరి. కాఁబట్టి యెల్లవారును కొంతకాలమునకు మా నాయ నను గ్రామమునకొక మృత్యుదేవతగాఁ జూచుకొనుచుండిరి. మా నాయన పొడ గనఁబడినప్పు డెల్లను గ్రామములోని యాఁడువారు నెటికలు విఱిచి తిట్టఁజొచ్చిరి. మగవాండ్రు కొఱకొఱలాడుచు మునుపటివలె మాటాడక యాతఁడు కనఁబడినపు డెల్లను తప్పించుకొని పెదదారిని తొలఁగిపోవు చుండిరి. ఇరుగు పొరుగున నున్నవారు నిప్పు సహితము పెట్ట మాని వేసిరి. ఏ వస్తువుబదులు నిమిత్తము వెళ్ళినను లేదనుచుండిరి. పొరుగు వారు తమ నూతిలో నీళ్ళు తోడుకొనవలనుపడదనిరి. అందుచేత నీ ప్రకారముగా శత్రుమధ్యమున కాపురము చేయుట మా నాయన కెంతో భారముగానుండి, ఇదియంతయుఁ దాను భూతవైద్యుఁడనని వేషము

వేసికొనుటవలన గలిగిన పాపఫలముగదా యని తెలుసుకొని పశ్చాత్తాప పడిన కార్యములేక స్వయంకృతాపరాధమునకు నోరెత్తక యనుభ వించుచుండెను. ఇట్లున్న సమయములో నొకసారి సవతితల్లికి దేహములో రుగ్మతవచ్చినది; అప్పుడెందఱిని గాళ్ళగడుపులు పట్టు కొన్నను ఒక్కరైనను పథ్యపానములుచేసి పెట్టుటకుఁ గాని నిద్రరాకుండ దగ్గఱనుండి మాటలు చెప్పుటకుఁగాని వచ్చినవారుకారు; గ్రామములోని వారెవ్వరును పథ్యపానములకయి తమ నూతిలోనుండి నీళ్ళుసహితము తెచ్చుకోనిచ్చినవారుకారు. మీరు గ్రామమునుండి లేచివచ్చిన నాల్గవనాఁడే మన గ్రామములో వైద్యుఁడుగా నుండిన నంబి వరదాచార్యులు పోయినాఁడు. నేతి రామయ్య మన యింట వంట బ్రాహ్మణుఁడుగా నుండి కంచుచెంబుల జోడెత్తుకొనిపోయి ముండకిచ్చినందునకయి మీరు పని తీసి వేసిన తరువాత వాడు మఱియెందునకును పనికిరాని వాఁడౌటచేత చదువులు బడి పెట్టుకొని జీవనము చేయుచుండెనుగదా.[1] వరదాచార్యులు పోఁగానే వైద్యము కూడ నారంభించి వాఁడిప్పుడు గ్రామములో మన వైద్యుఁడయి

1. తనతండ్రి మరణ వృత్తాంతం మేనమామకు తెలియజేస్తూ శంకరయ్య ఇంత విషయ వివరణం చేయడం, అనవసరమైన, అప్రస్తుతమైన విషయాలు చెప్పడం ఈ నాటి నవలలు చదివే పాఠకులకు వింత అనిపించకపోదు. కాని ఆనాటి సాంఘిక దురాచారాల తీవ్రతను పాఠకునికి తెలియజేయటం ప్రథమ కర్తవ్యంగా పంతులుగారు భావించారు.

"వంట బ్రాహ్మణులలో నిద్దరు కూడ మా యిల్లు విడువవలసిన వారయిరి. వారియిరువురిలో నొకడు హస్తలాఘవ విద్యయందు నిపుణుడు. అతని శక్తిచేత మా యింటనే వస్తువును పెట్టి కొంత మేమరియుండినను ఆ వస్తువు నిముషములో నదృశ్యమగుచు వచ్చెను....

ఆ బ్రాహ్మణుడు మేము చెన్నపట్టణములో నున్నప్పుడు మా ముద్రాక్షర శాలలో పనిలో నున్న మునిసామి యనువాని కత్తెర మొదలయినవానిని తస్కరింపగా, అతడు గదిలో పెట్టి దిట్టముగా కొట్టినందున వంట బ్రాహ్మణుడు భయపడి మునిసామిని తన వెంట తానుంచుకున్న ముండయింటికి తీసికొనిపోయి యాతనివస్తువుల నిచ్చివేసెను." (పుట 159-స్వీ.చ; ప్ర. భా.—1982) అని స్త్రీ పునర్వివాహ ప్రయత్నాల తొలినాళ్ళ సంగతులు ప్రస్తావించారు పంతులుగారు.

యున్నాడు. మొదట వైద్యమారంభించినప్పుడు క్రొత్తగనుక రోగముల నామములను ఔషధనామములను మా నాయనచేతనే వ్రాయించుకొని, యెఱ్ఱనివియు నల్లనివియు నయిన కుప్పెలుచేసి తీసికొనివచ్చి యేమందే రంగుగలదిగా నుండునో మా నాయనవలనే తెలిసికొని వానిమీద "పూర్ణ చంద్రోదయ" "వాతరాక్షసము" మొదలయిన పేర్లను వ్రాసి యంటించి నాఁడు. జీలకఱ్ఱ, మిరియములు మొదలయిన వస్తువులలో సింధూరము వేసి నిమ్మకాయలరసముతో నూరి మా యింటనే మాత్రలుచేసి తీసికొని వెళ్ళుచుండెను. అతఁడే యౌషధమునడిగినను తనయొద్ద లేదనక తులమునకు రూపాయ మొదలుకొని యిరువదిరూపాయల వఱకును వెలగట్టి యిచ్చుచుండెను. ఆరంభదశయందు వచ్చినసొమ్ములో మా నాయనకుఁ గూడ భాగమిచ్చెడివాఁడుగాని తాను పెద్ద వైద్యుఁడని పేరు పొందిన తరువాతను, మా నాయనకు గ్రామములోనివారితో విరోధము వచ్చిన తరువాతను భాగమిచ్చుట మానివేసినాడు. అట్టివాఁడు మా నాయన స్వయముగా వెళ్ళి తన భార్యకు జబ్బుగా నున్నదని బతిమాలి పిలిచినను ప్రజలకు వెఱచి యొక్కసారి చేయియయినను చూచి పోయిన వాఁడు కాఁడు. వేయేల? ఊరివారు పెట్టవలసిన నిర్బంధములనన్నిటిని బెట్టిరి; చీఁకటిపడిన మీఁద ఇంటిమీఁద బెడ్డలు వేయ నారంభించిరి. నన్ను భార్యకుఁ గావలిపెట్టి మా నాయనయే చెఱువుకుఁబోయి స్నానముచేసి నీళ్ళు తెచ్చుకొని వంటంతచేసి పగలు రెండుజాములకు పథ్యము పెట్టుచు, మీరయిన గ్రామములోనున్నఁ దనకింత యిబ్బంది రాదుగదాయని మీకు చేసిన యుపకారములను దలఁచుకొనుచు బహువిధముల విచారించెను. బహు ప్రయాసముమీఁద కొన్నిదినములకు మా తల్లికి వ్యాధి నిమ్మళించి నది గాని దేహములో బలము మాత్రము చేరినదికాదు; గ్రామములో విరోధమంతకంతకు ప్రబలినది. తెల్లవారిలేచి చూచువఱకు మా వీధిగుమ్మమున

నింపి నశుద్ధ పదార్థములును మనుష్యుల పుత్తైలును పడియుండుచు వచ్చెను. మా తండ్రి వాటినన్నిటిని దీసివేసి నిత్యమును రెండుమూడు స్నానములు చేయుచు భార్య కుపచారము తిన్నగా జరగనందున నన్నామె వెంట నిచ్చి సవారి మీఁద పుట్టినింటికి హేలాపురము[1] పంపి, తానొక్కఁడు నిల్లు కనిపెట్టుకొని యుండెను.

బయలుదేఱిన మఱునాఁడు రాత్రి నాలుగు గడియల ప్రొద్దుపోయిన తరువాత మేము సుఖముగాపోయి యేలూరు చేరితిమి. అక్కడఁ గొన్నాళ్ళున్న మీఁదట పథ్యము బంటఁబట్టుట చేతను, తల్లిదండ్రుల యాదరణచేతను నా సవతితల్లి దేహము స్వస్థపడినది. ఒకనాఁడు నేనును నా సవతిమేనమామయు నుదయ కాలమున దంతధావనము చేసికొని వీధిలో రావిచెట్టుచుట్టును గుండ్రముగా రెండు అడుగుల యెత్తుగా వేయఁ బడియున్న యరుగుమీఁదఁ గూరుచుండి యుంటిమి. నా సవతితల్లి తండ్రి రావిచెట్టునకును వేపచెట్టునకును పెండ్లి చేయించి వాని చుట్టును విశాల మయిన యా యరుగు వేయించినాఁడు. ఆ యరుగుమీఁద చెట్టునీడను గూరుచుండి గ్రామ కరణ మెప్పుడును పనిచూచుకొనుచుండును. అప్పుడు ముప్పది సంవత్సరముల యీడుగల యొక నల్లని శూద్రుఁడు తెల్లబట్టలు కట్టుకొని చంక మూటను దగిలించుకొనివచ్చి 'మీరేమయిన కాసులపేరు గొనియెదరా?' యని యడిగెను. మా సవతిమేనమామ 'ఏదిచూపు' మని యడిగెను. ఆ శూద్రుఁ డరుగుమీదగూరుచుండి మూటనువిప్పి కాసులపేరు తీసి యాతని చేతికిచ్చెను. అతఁడు చూచి వెలయడిగి నా చేతికిచ్చి బాగున్న దేమో చూడుమని చెప్పెను. నేను దానిని చేతఁబట్టుకొని నిదానించి చూచి, కొలికిపూసను బట్టి యానవాలుపట్టి రుక్మిణిదని తెలుసుకొని 'నీకీ కాసుల పేరెక్కడినుండి వచ్చె' నని వానిని ప్రశ్నలు వేసితిని. వాడు 'నేను వర్తకుడను కాఁబట్టి మా యూరిలో నొకనిచేత పట్టుతో కట్టించినా'

1. ఏలూరు.

నని చెప్పెను. అందుమీఁద నేనా పేరు మా బంధువులదని చెప్పి 'యీ దొంగ సొమ్ము నీ యొద్దఁ గనఁబడినది కాబట్టి నిన్ను రాజభటుల కొప్ప గించెదనని బెదరించితిని. వాఁడును జడియక కానులపేరు మా యొద్దనే దిగవిడిచి, ఠాణాకుఁబోయి మీరుచేసిన యక్రమమును జెప్పి మిమ్ములను బట్టుకొని శిక్షించుటకు బంట్రోతులను దీసికొనివచ్చెద' నని కేకలు వేయుచుఁబోయి, నే నచట రెండుదినములున్నను మరల రానేలేదు.

మూఁడవనాఁడు ప్రాతఃకాలముననే యొక కూలివాఁడు ధవళేశ్వరము నుండి వచ్చి నారాయణమూర్తిగారు వ్రాసిన జాబు నొకదానిని నా చేతి కిచ్చెను. నేను దానిని పుచ్చుకొని విప్పి, చూచుకొను నప్పటికి "మీనాయన నేఁడే గృహము తగులబడి కాలము చేసినాఁడు. కాబట్టి తత్క్షణము బయలుదేఱి రావలసినది" అని యందు వ్రాసియుండెను. పిడుగువంటి యీ వార్త చూడఁగానే గుండెలు బ్రద్దలయి లోపలికిఁబోయి యేడ్చుచు నా సవతితల్లికా దుర్వార్తను వినిపించితిని. ఆ మాట విన్నతోడనే యామె నేలఁబడి కొప్పు విడిపోవ దొర్లుచు, బొమ్ముచఱచుకొనుచు నిల్లెగిరిపోవు నట్లు రోదనముచేయ నారంభించెను. ఆ యేడుపులును పెడబొబ్బలు కొంచెము చల్లాఱిన తరువాత నామెకు ధైర్యముచెప్పి, ఆ కూలివానివెంట నా పూటనే బయలుదేఱి కాళ్ళు పొక్కు లెక్కునట్లుగా, తెల్లవారినద్వాక నడచి మఱునాఁడు పగలు రెండుజాములవేళకు మా ఇల్లు చేరితిని. అప్పుడా యింటికి గోడలుతప్ప మఱేమియులేవు. చుట్టుపట్ల నొక యిల్లయిన కాలక నింతగా మా యొక్క యిల్లు మాత్రము పరశురామప్రీతి యయినది. నేనక్కడ విలపించుచుండగా నిరుగుపొరుగువారు వచ్చి నన్నోదార్చి నాలుగుదినముల క్రింద రాత్రి యాకస్మికముగా గృహమునకు నిప్పంటు కొని సాయము వచ్చులోపలనే కాలిపోయినదని చెప్పిరి. నే నంతట నారాయణమూర్తిగారి యింటికి బోయితిని. అతఁడావఱకే మా తండ్రికి దహన సంస్కారములు చేయించెను. మీరా గ్రామమునుండి వచ్చినప్పటి

డుండియు మా నాయనయు నారాయణమూర్తిగారును ప్రాణస్నేహితులుగా నుండిరి. మీరు ధవళేశ్వరము విడిచిపెట్టిన నెలదినములకు నారాయణమూర్తిగారి ఇంటిలోపల దొంగలుపడి యొకరాత్రి సర్వస్వము దోచుకొనిపోయిరి. అందుచే నతఁడు మరల బీదవాఁడై మా తండ్రి ననుసరింపఁగా, భూతవైద్యములో తనకు సహాయునిగా నాతనిని త్రిప్పుచు భోజనమున కేమయిన నిచ్చుచుండెను. మా నాయనకు గ్రామములో నందఱును శత్రువులుగా నేర్పడినప్పుడు నారాయణమూర్తిగారొక్కరే పరమమిత్రుఁడుగా నున్నాఁడు. మీ బావమఱఁదికి గ్రామములోనివారు తనసొత్తును దోచుకొని పోవుదురని భయము తోఁచినప్పుడు, ఒకనాఁటిరాత్రి రహస్యముగా నన్ను తోడు పట్టుమని నగలును రొక్కము నున్న పెట్టెను నారాయణమూర్తిగారి యింటికిఁ గొనిపోయి అతని పడకగదిలోఁ బెట్టి లక్కతో ముద్రవేసి పైన కప్పు తాళమువేసి తాళపు చెవిని తనదగ్గఱనే యుంచుకొనెను. నారాయణమూర్తి నన్నుఁ జూచి మా నాయనను తలచుకొని యేడ్చునప్పుడు, "నాయొద్ద దాఁచుకొన్న నగల పెట్టెను గూడ మరణకాలమునకుఁ దీసికొని పోతివా" యని యేడ్చెను. నేను పడకగదిలోనికి వెళ్ళినప్పుడు పెట్టె యచటలేదు. ఆ యింట మఱియొక చోటను గనఁబడలేదు. తరువాత మా తండ్రి చావును గురించి యడుగగా నేను హేలాపురము నకు వెళ్ళినది మొదలుకొని వీధిలోనికి వచ్చిన నెవ్వరేమి చేసెదరో యను భీతిచేత మీ బావమఱఁది లోపల తలుపులు వేసికొని కూరుచుండుచు వచ్చెననియు, అట్లు రెండుమూడు దినములు జరిగిన పిమ్మట దామోదరయ్య లోపల తలుపువేసికొని కూరుచుండి యేమో పాతాళహోమము చేయుచున్నాఁడని గ్రామములో నొక వదంతి కలిగినదనియు, ఆవల గ్రామములోని వారందఱును నాలోచించి యందఱకును కీడు గలుగుటకై యేదో మహామంత్రమును పునశ్చరణ చేయుచున్నాఁడు కాని వేఱు కాదని నిశ్చయించి దానికి విఘ్నము కలిగిం

తిరుగాని తమకు బ్రతుకు లేదని గోదావరి యొడ్డున సతచేసినారనియు, ఆ రాత్రియే యిల్లు కాలుట మొదలుగాఁగల పని యంతయు జరిగిన తరిని యు, అతఁడు చెప్పెను. నేనును పది దినముల కర్మయు జరిగినదాఁక వారియింటనే యుండి, పదమూఁడవనాడు బయలుదేఱరాదు గనుక పదు నాలుగవనాఁడు కాసుల పేరుతో మీరున్న గ్రామమునకు రావలెనని పత్చుచుండగా, త్రోవలో సిద్ధాంతి యగపడి రహస్యమని నన్ను దూర ముగాఁ దీసుకొనిపోయి మా నగల పెట్టెను నారాయణమూర్తి తమ యింట దాఁచుట చెప్పి తనకు నూరురూపాయలిచ్చేపక్షమున పెట్టె నాతని కియ్యక విలిపియుంచెదననియు, మీ మామగారిని చూచి వచ్చినతోడనే తగవు పెట్ట వలసినదనియు జెప్పెను. నేనును మంచిదని చెప్పి మీ కొఱకు వెదకు కొనుచు వచ్చితిని.[1]

అని శంకరయ్య తన తండ్రిసంగతి యంతయుఁజెప్పి మూటను విప్పి కాసుల పేరును దీసి రాజశేఖరుఁడుగారిచేతి కిచ్చెను. ఆయన దానిని పుచ్చుకొని మేనల్లుని కౌఁగలించుకొని యూదార్చుచు, దామోదరయ్య పోయినందుకుఁ గొంత తడవు విచారించెను. అప్పు డింటనున్న వారంద ఱును దామోదరయ్య నిమిత్త మొకసారి రోదనముచేసి భోజనములు చేసిరి. ఆ మధ్యాహ్న మంతయు లోక వార్తలతో ప్రొద్దు జరిగినది.

దీపములు పెట్టిన కొంతసేపటికి వాద్యముల చప్పుడు వినఁబడి నందున రాజశేఖరుఁడుగారు మొదలగు వారందఱును వీధిలోనికి వచ్చిరి. బలముగా ద్వాదశోర్ధ్వపుండ్రములను ధరించి యొక వైష్ణవ స్వామి పల్లకిలోఁ గూరుచుండి యిరుప్రక్కల నిద్దఱు వింజా మరలు వీచుచుండ కరదీపిక లనేకములు వెలుఁగ

1. రాజశేఖరుడుగారు సకుటుంబముగా కాశీయాత్రకని బయలుదేరినా పిఠాపురం దగ్గర భీమవరంలోనే నిలిచిపోయారని సిద్ధాంతి మొదలయిన వాళ్ళ ద్వారా శంకరయ్యకు తెలిసి వుంటుంది.

నూరేగు చుండెను. ఆ వెనుక కొందఱు తెలగాణ్యులును నొక వైష్ణవుఁ డును గంధములు పూసుకొని తాళవృంతములతో విసరుకొనుచు నడచు చుండిరి. ఆ వైష్ణవుని రాజశేఖరుఁడుగా రెఱుంగుదురు గనుక దగ్గరకు పిలిచి యీ ప్రకారముగా ముచ్చటింప నారంభించిరి.

రాజ—మీరు ధవళేశ్వరములో నున్న గూడూరువారికి గురువులు కారా?

వైష్ణ—అవును. ఆ పల్లకిలోఁ గూరుచున్నవారి కీగ్రామములో నవసరాలవారు శిష్యులు.

రాజ—వెనుక నేను చూచినప్పుడు మీరు గురువులుగాను, మీ కాయన శిష్యుఁడుగాను ఉండెడివారు కారా?

వైష్ణ—మాలో మాకటువంటి భేదములేదు. నాకు శిష్యులున్న గ్రామములో నతఁడు శిష్యుఁడుగాను, అతనికి శిష్యులున్న గ్రామములో నేను శిష్యుఁడనుగాను మాఱుచుందుము. అయన తాతయు, మా తాతయు సహోదరులు; వారి తండ్రి ప్రతివాది భయంకరము గండభేరుండాచార్యులు వారు, జగదేకపండితులు. వారు పరమపదమునకు వేంచేసిన తరువాత వారు సంపాదించిన శిష్యులను మా తాతలును తండ్రులును పాళ్ళు వేసు కొని పంచుకొన్నారు. ఈ గ్రామములోనివారు మా వాని వంతునకును ధవళేశ్వరములోనివారు నా వంతునకును వచ్చినారు. మా కాపురపు గ్రామ మైన శ్రీకూర్మము విడిచి ఈ ప్రకారముగా సంవత్సరమున కొకసారి శిష్యసంచారము చేయుదుము.

రాజ—వెనుక మీ రాయనకు ఛదువు లేదని చెప్పినారే. ఆయన శిష్యులకేమి యుపదేశము చేయును?

వైష్ణ—ఆయన కెంతచదువు వచ్చునో నాకు నంతే వచ్చును. శిష్యుల కుపదేశించుట కేమి చదువు రావలెను? శిష్యుల కష్టాక్షరి చెవిలో నుపదేశించి నిత్యమును నష్టోత్తరశతము జపము చేసికొమ్మని చెప్పి, గురువే దైవమని నమ్మి కొలిచిన వైకుంఠము కరస్థమని పలికి, భుజముల మీఁద తప్తముద్రధారణము చేసి, మా గురుదక్షిణ పుచ్చుకొని మా దారిని మేము పోదుము. మే మెవ్వరితోనూ ప్రసంగించము గనుక మమ్మంద ఱును పండితులే యనుకొందురు.

రాజ—మీరీ గ్రామములో పదిదినము లుందురా?

వైష్ణ—ఉండము. రేపే వెళ్ళిపోయెదము. తరువాత సావకాశముగా దర్శనము చేసి మాటాడెదను.

అని యాతఁడు పల్లకితోఁ గలిసికొనుట కయి పరుగెత్తెను.

వారు వెళ్ళిన తరువాత వీధితలుపు వేసివచ్చి మగవారు రాత్రి భోజనమునకుఁ గూరుచున్నతోడనే యెవరోవచ్చి వీధితలుపుకడ "రాజశేఖరుఁడు మామగారూ" అని పిలువఁజొచ్చిరి. మాణిక్యాంబ నడవ లోనికివెళ్ళి 'యెవరువా' రని యడుగఁగా 'నేను నృసింహస్వామి' నని వెలుపలినుండి యొకరు పలికిరి. ఆ మాటయొక్క ధ్వనియు పేరును విన్నతోడనే మాణిక్యాంబ భయపడి తటాలున లోపలికిఁ బరుగెత్తుకొని వచ్చి యా సంగతి భర్తతోఁజెప్పి, 'నృసింహస్వామి పోయి అన్నాళ్ళయి నది; ఎప్పుడును నాకీవఱకు స్వప్నములో నైనను గనఁబడలేదు. ఇప్పుడీ విరుద్ధమే' మని యాశ్చర్యపడఁ జొచ్చెను. ఇంతలో వీధితలుపువద్ద మరల గేకలు వినఁబడెను. అప్పుడు రాజశేఖరుఁడుగారు భోజనము చేసి దీపము వెలిగించుకొని పోయి తలుపు తీసిరి. తీయఁగా నిజముగా నృసింహ స్వామియే 'మామా' అని పలుకరించి, ఆయన చేయి పట్టుకొనెను. ఆయన యల్లునిఁ బ్రత్యక్షముగాఁ జూచినను నమ్మక మరల మరల దేహమును పట్టి చూచి, పాదములు వెనుకవైపునకు తిరిగి యుండక తిన్నగానే యుండుటవలన మాయకాదని నిశ్చయించి యాతనిని లోపలికిఁ దీసికొని వచ్చి భార్యతో మన నృసింహస్వామియే వచ్చినాఁడని చెప్పి కాళ్ళు కడుగుకో నీళ్ళిమ్మని తొందరపెట్టెను. ఆమెయు దీపముదగ్గరగాఁ దీసికొని వచ్చి మొగముపాఱఁజూచి, 'నాయనా'యని కౌగిలించుకొని కన్నీరు నించెను.

తామెను జూచి యల్లుడును కన్నులనీరు పెట్టుకొనెను. ఆ యుద్రేకమంతయు నడఁగిన మీఁదట, నృసింహస్వామిలేచి కాళ్ళు కడుగుకొని భోజనము చేయుచు తాను కాశీయాత్ర వెళ్ళుటయు దారిలో తన మిత్రుడు తన్ను విడిచి వచ్చుటయు మొదలుగాఁగల సంగతి నీ ప్రకారముగాఁ జెప్ప నారంభించెను.[1]

“నాకుచిరకాలము నుండి కాశీయాత్ర చేసిరావలెనని మనసులోకోరిక యుండెను గాని తగినతోఁడు లేకపోవుటచేత నాకది దుర్లభమని యాతలఁపు విడిచి పెట్టితిని. ఇట్లుండగా నొకనాఁడు చామర్తివారి చిన్నవాడు శేషాచలము నా యొద్దకు వచ్చి యెవ్వరితోను జెప్పనని నా చేతఁ దనచేతిలో చేయి వేయించుకొని రహస్యముగాఁ దనకు హిమవత్పర్వతముదగ్గఱ తపస్సుచేసి స్వర్ణవిద్యను గ్రహింపవలెనని కోరిక గలదనియు, నేనుకూడ వచ్చిన పక్షమున తనతో దీసికొని వెళ్ళి యా విద్య నుపదేశించెదననియు, మనమిద్దఱమును బంగారము చేయు యోగము గ్రహించిన మీఁదట మరల నింటికివచ్చి కావలసినంత బంగారమును జేసికొని కోటీశ్వరులము కావచ్చునియు

---

1. వీరేశలింగంపంతులుగారి బాల్య వృత్తాంతం ఒకటి ఇక్కడ గుర్తు చేసుకోవచ్చు. స్వీయచరిత్రలో విశదంగా దాన్ని వర్ణించారువారు.

“తపో మహత్త్వములను గూర్చి చదువుచున్నపుడెల్లను నాకు చిత్తోద్రేకము కలిగి నేనెప్పుడు తపస్సునకు బూనుదునా యెప్పుడా మహిమలను మించిన మహిమలను బొందుదునాయని తహతహ పడుచుందును........

ఈ తపోవర్ణనలన్నియు దివాస్వప్నములనుకోక సత్యములని నమ్మి నేను శ్రమపడి యితరులను నాభ్రమలోబడవేయ దొడగితిని. నాభ్రమలో సునాయాసముగా బడినవారు నా సహపాఠులయిన రాచర్ల వేంకటరామయ్యగారును, కనపర్తి లక్ష్మయ్య గారును, హోలా వీరభద్రయ్యగారును....

తపోమహిమయొక్క ప్రాశస్త్యమును వారికి బోధించి, హిమవత్పర్వతము మీద తపస్సు చేయునట్లు పథకమేర్పరచి వారిని ముగ్గురుని ప్రయాణముచేసితిని. వీరిలో గడపటియతడు హిమగిరియందలి సంజీవనౌషధములను సువర్ణకరణ మూలికలను సహితము సంపాదింపవలయునని యుపదేశించెను.

వారల్పకాలములోనే యుత్సాహమునందు నన్ను మించినవారయి యచిర తపో మహిమాప్త్యులు కాగోరి....త్వరపెట్ట మొదలు పెట్టిరి.”

పుటలు 20, 21 - ప్రథమ భాగము (1982)

చెప్పెను. ఆ మాటలమీఁద మనస్సులో నాకును మిక్కిలి యాశపుట్టి, తప్పక బయలుదేఱి సాధ్యమయినయెడల కాశీయాత్రకూడఁ జేసికొని రావలెనని నిశ్చయించితిని. తరువాత మేమిద్దరము బాఠశాలలో రహస్యముగా బ్రయాణము సంగతిని మాటాడుకొనుచు, బయలుదేఱవలసిన దినము నిర్ణయము చేసికొని, యాలోపుగానే బట్టలు మొదలగువానినొక చోట పదిలముగాఁ జేర్చి ప్రొద్దుననే భోజనముచేసి శాస్త్రులవారి యొద్దకుఁ బోయి కావ్యములు చెప్పించుకొని వచ్చెదనని చెప్పి తిన్నగా నడచి మఱునాఁడు ప్రాతఃకాలమునకు పెద్దాపురము చేరితిమి.[1] మేము బయలుదేఱిన

1. మిత్రులతో కలిసి తమ హిమవత్పర్వత తపోగమనాన్ని గూర్చి తమ చిన్ననాటి వృత్తాంతం ఇంకా ఇట్లా పొడిగించారు పంతులుగారు స్వీయచరిత్రలో.

"ఒకనాటి సాయంకాలము వారిలో నిరువురు నా యొద్దకువచ్చి రేపే ప్రయాణమని చెప్పిరి. నేను వారివెంట రాజాలనంటిని. అంతట వారు నాతో మరల ఘూటారక యింటివద్ద పాఠశాలకు బోయెదమని చెప్పి భోజనములుచేసి పుస్తకములు పట్టుకొని పాఠశాల దారినే తపోగమన ప్రారంభులయి యుత్తరాభిముఖముగా వెడలిరి. సాయంకాలము వేళకువారిండ్లకు రాకపోగా బంధువులు వెదక నారంభించి మూడవ యతనిని పిఠాపురము వద్దనే పట్టుకొని యింటికి గొనివచ్చిరి. విజయనగరమునకును బోయిన తరువాత రెండవయతడు మొదటియాతనితో దగవులాడి మురుగులమ్ముకొని వెనుకకు మరలెను. మొదటియతడు కొంత దృఢమనస్కుడయి ముందుకుసాగి దారిబత్తెమునకయి వెండి మొలత్రాడమ్ముకొని జగన్నాధము వరకునుబోయి యాత్రచేసికొని పోయిన దారినే మరల వచ్చెను. ఈ ప్రకారముగా నా మానసిక యాత్రతోను మిత్రుల దేహయాత్రతోను మా తపోయాత్రావ్రత ముద్యాపనమయినది" అని పంతులుగారు హాస్యం చేశారు. ఈ స్వీయ జీవిత వృత్తాంతాన్ని నృసింహస్వామి కథకు జోడించారు పంతులుగారు. ఇందువల్ల వాస్తవిక కథనంపట్ల వారికి ఎంతో ఆసక్తి ఉండేదని, వీలైనంతవరకు సన్నివేశ కల్పనంలో వాస్తవికతకు, సహజత్వానికి ప్రాధాన్యం ఇచ్చేవారని నిర్ణయించవచ్చు.

అయితే ఈ ప్రకరణంలో ఇప్పటివరకు నృసింహస్వామి వచ్చాడనగానే రుక్మిణి కోసం పాఠకులు తహతహ పడతార్రు, ఏమైంది ఆమె, భర్త దగ్గరకువచ్చి పలకరించ లేదని! కాని ఆనాటి సాంఘిక కట్టుబాట్లు, కుటుంబ జీవనం, భార్యాభర్తల అనురాగాలు, మమకారాలు, అనుబంధాలు సేవ్యసేవక పద్ధతిని మాత్రమే సాగేవనుకోవాలి. నృసింహస్వామి కూడా నా ఇల్లాలు రుక్మిణి ఏది? అని అడిగాడేమో చూడండి. తరువాత నవల సత్యవతీ చరిత్రంలో ఆనాటి అవిభక్త కుటుంబ జీవన వైఖరి ఇంకా వివరంగా తెలుస్తుంది.

నాఁటి క్రిందటిదినము నేను పుట్టినదినము గనుక నాఁడు మావాండ్రు పండుగచేసి నాకు బంగరుకంటెయు మురుగులును బెట్టిరి. ఆ రాత్రి నేను మా తండ్రిగారి పెట్టెను మాఱు తాళపుచెవితో దీసి యందులోనున్న యేఁబదినాలుగురూపాయలను మూటగట్టుకొని, మఱినాఁ డానగలతోను సొమ్ముతోను మేము గ్రామము విడిచితిమి. శేషాచలము తనతో మూఁడు రూపాయలను మాత్రము పట్టుకొని వచ్చినాఁడు. త్రోవ పొడుగునను మా యిద్దఱకుఁ గావలసిన ఖర్చును నేనే పెట్టుచు వచ్చితిని. మేము జగన్నాథమును దాటి కటకము వెళ్ళునప్పటికి నా యొద్దనున్న రూపాయలన్నియు నైపోయినవి. కాఁబట్టి యక్కడ నా మురుగులను నలువదిరూపాయలకు విక్రయించి మునుపటివలె నధికవ్యయము చేయక యాసొమ్ముతోనే కాశి చేరితిమి. అతఁడు దారిపొడుగునను తాను వాడుకొనుట కేమైనను నిమ్మని యడుగుచు వచ్చెనుగాని నేను రూపాయికంటె నెక్కువగా నెప్పుడును చేతిలోఁబెట్టలేదు. అందుచేత నతఁడు నా మీఁద కొఱకొఱగానుండి తిన్నగా మాటాడక మొగము ముడుచుకొని యొకరీతిగాఁ బ్రవర్తించుచుండెను. మేము కాశి చేరునప్పటికి నావద్ద నాలుగు రూపాయలుండినవి; అవియుఁ బదిదినములలోనే వ్యయమయి పోయినవి. తరువాత నూటయేఁబది రూపాయలకు నా కంటెను సహితము కాశిలో నొకవర్తకున కమ్మివేసితిని. మేము మొట్టమొదటననుకొన్నట్లు బంగారము చేయుటకు మాఱుగా మునుపున్న బంగారము సహితము పోఁగొట్టుకొనుచుంటిమి. శేషాచలము భోజనమునకుఁ దడవుకొనక్కఱలేకుండా నా సొమ్ముతో నిర్విచారముగాఁ గాలక్షేపముచేయుచు, అంతతో నైనఁదృప్తినొందియుండక యొకనాఁడు నా యొద్దకువచ్చి తన కేఁబది రూపాయలేదోపనికిఁ కావలసి వచ్చెనని కాఁబట్టి యిమ్మని యడిగెను. నే నియ్యనని నిర్దాక్షిణ్యముగాఁ దెలియఁ జెప్పితిని. దానిపైని నాతో పోట్లాడి 'కృతఘ్నుఁడ' వని నన్నుఁ దిట్టి

విస్తరిలో వడ్డించిన యన్నమును సహితము తినక పగలు రెండుజాముల వేళ లేచిపోయెను. నేను తరువాత నాలుగు మాసములు కాశిలో నివాసముగానుండి, యింటిమీఁద బుద్ధిపుట్టినందున బయలుదేఱి వచ్చుచు నిన్నటియుదయమున మీరిక్కడ నున్న సంగతి తునిలో విన్నాను.

అని నృసింహస్వామి తన వృత్తాంతమును జెప్పినమీఁదట రాజశేఖరుఁడుగారు శేషాచలము చేసిన దురాగతము నాతనితోఁ జెప్పి భోజనమయిన తరువాత పక్కవేయించి యాతఁడు పరుండి నిద్రపోయిన మీఁదట తాము పరుండిరి.

# పదునాల్గవ ప్రకరణము

సుబ్రహ్మణ్యము పిఠాపురమునుండివచ్చి తండ్రిని దర్శించుట— శ్రీశంకరాభార్యులవారి యాగమనము—నీలాద్రిరాజు సభలో తన వృత్తాంతమును జెప్పుట - కృష్ణజగపతిమహారాజులుగారు రాజశేఖరుఁడుగారి మాన్యములను విడిపించి యిచ్చుట.

సుబ్రహ్మణ్యము పిఠాపురమునుండి బయలుదేఱి, సొమ్ముతో నీలాద్రిరాజు వెంటవచ్చుచున్న రాజభటులతోఁ గలసి భీమవరమునకు వచ్చి, అక్కడనుండి వారిని పెద్దాపురము పొమ్మని తా నొక్కఁడును తిన్నగా నింటికిఁ బోయెను. అప్పుడు రాజశేఖరుఁడుగారు భోజనమునకు లేవఁబోవుచుండిరి. కొమారుఁడు వీధి గుమ్మములోనుండి లోపల నడుగు పెట్టగానే చూచి, అబ్బాయి వచ్చినాఁడని రాజశేఖరుఁడుగారు కేకవేసిరి. ఆ కేకతోనే 'యేడీ యేడీ' యని లోపలి వా రందఱును నొక్కసారిగా పరిగెత్తుకొనివచ్చిరి. అందఱికంటెను ముందుగా సీత పరుగెత్తుకొనివచ్చి అన్నగారిని కౌఁగలించుకొనెను. ఇంతలో మాణిక్యాంబరాఁగా సుబ్రహ్మణ్య మామెను కౌఁగిలించుకొని, తరువాత తల్లిదండ్రులకిద్దఱికిని నమస్కారము చేసి వారిచేత నాశీర్వాదములను బొందెను. ఈ నడుమ నృసింహస్వామి వచ్చి సుబ్రహ్మణ్యముయొక్క చేయిపట్టుకొని 'బావా!' యని పిలువగానే యతఁ డాతని మొగమువంక దిరిగిచూచి మాటరాక యద్భుతపడి చూడసాగెను. ఆట్లొక నిమిషము చూచి మఱఁది నాలింగనము చేసి 'యెప్పుడు వచ్చినా'వని యడిగి, మగఁడు జీవించియున్నాఁడన్న వార్త విని సంతోషించుటకు రుక్మిణికి ఋణము లేకపోయెనుగదా యని

కన్నుల నీరుపెట్టుకొనెను. అంతట రుక్మిణి బ్రతికి యుండుటయు దొంగలు కొట్టిన రాత్రినుండియు నామెకు సంభవించిన ఆపదలును తుదకు సుఖముగా నిల్లు చేరుటయుఁ జెప్పి, రాజశేఖరుఁడుగారు కొమారుని నూరార్చఁజొచ్చిరి. ఆ మాటలు ముగియక మునుపే సంతోషం పట్టలేక సుబ్రహ్మణ్యము లోపలికిఁబోయి రుక్మిణి నాలింగనము చేసికొని యామె తన్నుఁజూచి కంటఁదడి పెట్టుకోఁగా నూఱడించెను. ఈవలకు వచ్చిన తరువాత నృసింహస్వామి తన కథను సొంతముగా వినిపించెను. పిమ్మట నందఱును స్నానములు చేసి యుతికిన మడుగు దోవతులు కట్టుకొని భోజనములకడఁ గూరుచుండిరి. భోజన సమయమున సుబ్రహ్మణ్యము పీఠాపురములో రాజుగారి లోపల దొంగలు పడుటయు, దొంగలను తాను పట్టుకొన్న రీతియు, దొరికినసొత్తులో బైరాగి యెత్తుకొనిపోయిన తమ సొమ్ముకూడఁ గనఁబడుటయు విమర్శన నిమిత్తమయి కృష్ణజగపతిరాజు గారియొద్దకుఁ బంపఁబడిన దొంగలతోఁ గూడఁ దన్నిచ్చటకుఁ బంపు టయుజెప్పి, యిక్కడ నుండి వెళ్ళినతోడనే తనకొక మంచి యుద్యోగము నిచ్చెదమని పీఠాపురపురాజుగారు వాగ్దానము చేసియున్నారని చెప్పెను. అప్పుడు రాజశేఖరుఁడుగారు "మన యింటికి రాకపోకలు చేయుచువచ్చిన రామరాజే కృష్ణజగపతిమహారాజుగా" రని చెప్పి, ఆయన యద్భుత చర్యలను తమకుఁజేసిన యుపకారమును నామూలాగ్రముగా వినిపించి యాయనను పొగిడిరి. ఇంతలో భోజనములైనందున లేచి చేతులు కడుగు కొని తాంబూలములు వేసికొని తెల్లబట్టలు కట్టుకొని రాజశేఖరుఁడుగారును సుబ్రహ్మణ్యమును బయలుదేఱి నృసింహస్వామిని వెంటఁబెట్టుకొని పెద్దా పురమునకుఁ బ్రయాణ మయిపోయిరి.

వారు పెద్దాపురము చేరి రాజవీధిని ప్రవేశింపగానే యావీధినే దూర మునఁనొక పల్లకియును దానిముందొక యేనుగును రెండుగుఱ్ఱములును బండిమీఁద నొక భేరియును మఱికొన్ని వాద్యములును వెనుకను స్వస్తి వాచక బృందములును దృగ్గోచరమయ్యెను. ఆ యాడంబరము చూచి రాజశేఖరుఁడుగారా దినమేదో దేవతోత్సవము కాఁబోలు ననుకొని, కుమా రునివంకఁ జూచి యాయుత్సవము శివునిదయి యుండునా యని యడిగిరి.

సుబ్ర—అది దేవుని యుత్సవము కాదు. శ్రీ శంకరభగవత్పాదుల వారీ పట్టణమునకు వేంచేసియుందురు.[1] వారు నెలదినములనుండి పీఠాపురములో నివాసము చేసియున్నారు. నేను బయలుదేఱి నప్పుడే వారును ప్రయాణమయి ఈ పట్టణమునకు రావలెనని బండ్లు మొదలగు వానిని వాకిట నిలుపబెట్టియుండఁగా జూచితిని.

రాజ—అక్కడ భిక్షలు విశేషముగా జరిగినవా?

సుబ్ర—మిక్కిలి చక్కగా జరిగినవి. వారింటింటికిని శ్రీముఖములను వ్రాసి తలకొక రూపాయవంతున పోగుచేసినారు. అదిగాక యనేక విత్తవంతులును ధనవంతులును పళ్ళెరములలో పండ్లును రూపాయలను చేసికొని వెళ్ళి పాదపూజకని సమర్పించుకొనుచువచ్చిరి. వారు సాష్టాంగ నమస్కారము చేసినప్పు డెల్లను స్వాములవారు "నారాయణ" యనుచు రాఁగా, చేరువనుండు శిష్యులు పళ్ళెములోని వానిని జాగ్రత్తచేసి వట్టి పళ్ళెములను వారివి వారికి మరల నిచ్చుచుండిరి. గ్రామము నందలివైదికు లందఱును జేరి రెండు భిక్షలు చేసినారు; లౌకికుల యిండ్లలో నాలుగు భిక్షలు జరిగినవి; తక్కినదినములలో కోమట్లు బ్రాహ్మణ గృహమున భిక్షలు చేయించుచు వచ్చిరి.[2]

రాజ—నీ వెప్పుడయిన వెళ్ళి పీఠదర్శనము చేసినావా?

---

1. స్వీయచరిత్రలో ఇటువంటి ఊరేగింపునుగూర్చి ప్రస్తావించారు పంతులుగారు. "శంకరాచార్యస్వాములవారిని మహావైభవముతో మా వీధిని మా గుమ్మముముందర నుండి గొనిపోయి రాత్రి కరదీపికా సహస్రములతో రాజమహేంద్రవర పురవీధులలో నూరేగించిరి."

పుట 150; ప్రథమ భాగము (1982)

2. "ఇటువంటి సంతోషదినములలో స్వాములవారు రాజమహేంద్రవరమును విడువక ప్రతిదినమును వాద్యములతో వీధులగుండ నూరేగుచు భిక్షలు చేయుచు కొన్ని మాసములక్కడనే నిలిచియుండిరి."

పుట 151, ప్రథమ భాగం, స్వీయచరిత్ర (1982)

సుబ్ర— రెండు మూడు పర్యాయములు చేసినాను. పీఠము నిలు వెత్తున నున్నది; దానినిండను బహువిధములైన విగ్రహములును సాలి గ్రామములును నున్నవి. వెండిపువ్వు పీటమీఁద గూరుచుండి పట్టు కాటి కట్టుకొని స్వాములవారెప్పుడును కుంకుమతో పీఠపూజ చేయుచుందురు. ఆ పీఠములో శ్రీ యంత్రముకూడ నున్నదనియు, వారు పూర్వాశ్రమము నందు. సహితము విద్యోపాసకులే యనియు విన్నాఁడను. ఆదిసత్యమౌనో కాదో కాని వారిప్పుడు మాత్రము రాత్రులు చీకటిలో ముసుగు వేసికొని యొక మనుష్యుని వెంటబెట్టుకొని ప్రత్యక్షమయిన శ్రీ యుపాసనము చేయుటకే బయలుదేఱుచుందురని చూచినవారే యొకరు నాతో రహస్యముగాఁ జెప్పినారు. మొన్న నీనడుమ నొక శిష్యుఁ డెత్తుకొని పోఁబోయినదిగాక, యింకను పీఠమునకు రెండు వేలరూపాయల వెండి సామగ్రి ఉన్నది.[1]

రాజ—వారు గ్రామములో నున్న కాలములో మతసాంకర్య నివారణముగాని, మతవ్యాపనముగాని చేయుటకేమయిన ప్రయత్నము చేసినారా ?

సుబ్ర—అట్టి పనులేమియు చేయలేదుగాని యొక్క ఘనకార్య మును మాత్రము చేసినారు. ఆ గ్రామములో ధనవంతురా లయిన యొక బాలవిధవయున్నది. ఆమె యేమో భ్రూణహత్య చేసిన దని గ్రామములోని సభాపతులు కొంద ఱామెను జాతినుండి బహిష్కారము చేసిరి. తరువాత నామె జగన్నాధ సంతర్పణము చేసినప్పుడు ధనమున కాశపడి కొందఱు బ్రాహ్మణులు భోజనములు చేసిరి. అందుచేత నక్కడకు భోజనములకు వెళ్ళినవారందరు నొక కక్షగాను, వెళ్ళనివారందరు నొక

1. "ఆ కాలములో స్వాములవారు విధవా వివాహముల నెంత నిషేధించుచు వచ్చినను ఘోటకబ్రహ్మచారులైన వారి శిష్యులు మాత్రము రండలతోడ రాత్రుల మంత్రికములైన వివాహములను రహస్యముగా జరుపుచునే వచ్చిరి. పాఠశాలలోని విద్యార్థులు కొందరీ రహస్యమును కనిపెట్టి యొకనాటిరాత్రి కాచియుండి యొక వితంతుపుత్రో సంసారము చేయుచున్న శిష్యుని పట్టుకొని, ఆ యపూర్వ దంపతులను పెరిటిలోని కీడ్చుకొని వచ్చి యెల్ల వారికిని జూపి యవమానపరచిరి."

పుట 151. స్వీయ చరిత్ర; ప్రథమ భాగము (1982)

కక్షగాను నేర్పడిరి. లోకమునకెల్లను ధనమె మూలమగుటచేతను, ఆమె లక్షవత్తుల నోము మొదలయిన వ్రతములు చేసీ యప్పుడప్పుడు బ్రాహ్మణ సమారాధనములు చేయుచు వచ్చుచుండుటచేతను, క్రమక్రమముగా సంఖ్యయందామె పక్షమువారే బలపడి మొదట వెలివేసిన వారికే యిప్పుడు వెలిగా నుండెను. తరువాత స్వాములవారు విజయంచేసి యా రెండు పక్షములవారిని సమాధానపరచి, ఆమె యొద్ద తాము రెండువందల రూపాయలను స్వీకరించి యామెకు పుట్టువెంట్రుకలు తీసి వేయుంచి, ఆ కేశ ఖండన మహోత్సవమయిన మరునాడే యామె యింట భిక్షచేసి ముందుగా తాము హస్తోదకము పుచ్చుకొని తరువాత బ్రాహ్మణుల కందఱకును నిప్పించి నాటితో నామె వెలి తీర్చివేసిరి.[1]

రాజ—ఆ స్వాములవారు పూర్వాశ్రమములో నే గ్రామ నివాసులు?

సుబ్ర—వారి నివాసస్థలము ముంగండ యగ్రహారము. ఆయనకు నలుగురు కొమాళ్లున్నారు. ఆశ్రమమును స్వీకరించిన తరువాతనే స్వాముల వారు మునుపు మాన్యములమీఁదనున్న ఋణములను దీర్చివేసి నలుగురు కొమాళ్ళకును వివాహములు చేసి కోదండ్ర కొక్కొకరికి రెండేసివందల రూపాయల యాభరణము లుంచినారు. ఇప్పుడీ స్వాములవారి పేరు శ్రీ చిదానందశంకరభారతీస్వామి యఁట.

స్వీయ చరిత్రతో ఆనాటి కొందరు పీఠాధిపతులను గూర్చి తీవ్రంగా విమ ర్శించారు పంతులుగారు.

---

1. "పీఠాధిపతుల యర్థ కృత్యములను గూర్చియు, వారు విత్తాపహరణ విచి త్రము చేయుచున్న యకృత్యములను గూర్చియు, వారిని స్వకృత్యముననకు మరల్చు టకు శిష్యులు చేయవలసిన కర్తవ్యమును గూర్చియు మా వివేకవర్ధని బహువిధ ములవ్రాసి ప్రజలకన్నులు తెరుపుటకారంభించినది; స్వాములవారు మగనిని విడిచి లేచిపోయి బహిరంగముగా జగన్నాథపురములో వ్యభిచరించుచుండిన యొక.... కులట వలన ధనస్వీకారమునుజేసి యా యిల్లాలివలన భిక్షగైకొని భార్యను విడిచి పెట్టినందుకయి దాని మగనికి బహిష్కార పత్రికనుబంపి యాతనికి శుద్ధ పత్రిక నిచ్చుటకయి యధికవిత్తమును లాగజూచిరి." (పుట. 118, ప్ర. భా. 1982)

అని మాటాడుకొనుచు వారు రాజసభకుఁ బోవునప్పటికి రాజుగారు కొలువు కూటమునకు విజయంచేసి సింహాసనాధిష్ఠితులై కూరుచుండి యుండి మంత్రి తెచ్చి యిచ్చిన విజ్ఞాపనపత్రికలను జదివి చూచుకొని పీఠా పురమునుండి వచ్చిన దొంగలను తమయెదుటఁ బెట్టుటఁ కుత్తరువు చేసిరి. ఈ లోపల రాజశేఖరుఁడుగారును, సుబ్రహ్మణ్యమును, నృసింహ స్వామియు సభలో ప్రవేశించి తగినచోటులఁ గూరుచుండిరి; రాజభటులును దొంగలను గొనివచ్చి ప్రభువునెదుర నిలువఁబెట్టి తాము ప్రక్కలను కత్తులుదూసికొని నిలుచుండిరి. అప్పుడు రాజుగారు సభ కలయఁజూచి 'యీ దొంగలను పట్టుకొన్నావా రెవ' రని ప్రశ్న వేసిరి. సుబ్రహ్మణ్యము లేచి నిలువఁబడి 'నేను' అని మనవి చేసెను. తోడనే ప్రభువువారు రాజశేఖరుఁడుగారి వంక దృష్టి బఱపి "యీతడు మీ కొమారుఁడు కాఁడా ?" అని యడిగి 'చిత్తమ'ని యాయన బదులు చెప్పఁగానిని యెడమ ప్రక్కను గూరుచున్నావా రెవ రని మరల నడిగిరి. రాజశేఖరుఁడుగారు చేతులు కట్టుకొని నిలుచుండి యీతఁడు తన యల్లుండగుటయు గిట్టనివాఁడొకఁడు అతఁడు వారణాసీపురముననున్న కాలములో వచ్చి మృతుఁడయ్యెనని వట్టి ప్రవాదము వేయుటయు, రుక్మిణి దొంగలచేత దెబ్బతిని మూర్ఛపోయి యుండఁగా తన్నందఱును దిగవిడిచిపోయిన తరువాత మూర్ఛతేఱి పురుషవేషము వేసికొని సీత నెత్తుకొని పోయిన గ్రామమునుండి చెల్లెలితోఁ గూడ వచ్చుటయు సమగ్రముగా విన్నవించిరి. రాజుగారు హర్షమును దెలుపుచు శిరఃకంపనము చేసి, కొంతసే పూరకుండి యావంకఁ దిరిగి "మీ రేమి చెప్పుకొనెద"రని యడిగిరి.

నీలా—సర్వమును దెలిసిన దేవరవారికడ మేము వేఱుగ చెప్పుకో వలసిన దేముండును? మేము నిరపరాధులమని చెప్పఁబోము. దేవరవారు దయాపూర్ణ హృదయులు గనుక ఆ దయారసమును మా మీఁదఁ బ్రస రింపజేయ దీనత్వముతో వేడుకొనుచున్నాము.

కృష్ణ—నీది యే దేశము ? చిన్నప్పటినుండియు నీవెక్కడ నున్నావు ? నీ చరిత్రమేమి ?

నీలా——నా చరిత్రము మిక్కిలి యద్భుతమయినది. నేను దానిని చెప్పుకొనుటకు సిగ్గుపడవలసియున్నను దేవరయంతటివా రడుగుచున్నారు గాన దాఁచక విన్నవించెదను. ఈ వఱకు నేను చేసిన దుష్కృత్యములన్నిటిని తీఱికగలిగి యున్నప్పుడెల్ల నాకు స్మరణకుఁ దెచ్చి నా మనస్సు పలువిధముల నన్ను బాధించుచున్నది; రాత్రులు నన్ను నిద్రపోనీయదు. కలలో సహితము నేను జేసిన ఘోర కృత్యములకు రాజభటులు నన్నుఁ గొనిపోయి శిక్షించుచున్నట్టు కనఁబడి యులికిపడుచుందును. అంతేకాక నా కిప్పుడు వార్ధక్యము వచ్చియున్నది. కాఁబట్టి, చిరకాలము బ్రతుకఁబోను; ఆ సంగతిని తలంచుకొనునప్పుడెల్ల నాకు యమభటుల వలన భయముచేత దేహము కంపమెత్తుచున్నది. రాజదండనను పొందినవారికి యమదండన లేదని పెద్దలు చెప్పుదురు. కాఁబట్టి నేను చేసిన పాపమునకు మీవలన శిక్షను బొంది సుఖింపఁగోరుచున్నాను.

కృష్ణ——నీ చరిత్రమంత యద్భుతమయిన దయ్యేనేని, ససాకల్యముగా వినిపింపుము. ఇచ్చట నున్నవారందఱును విని యానందించెదరు.

నీలా——నా జన్మస్థానము కాళహస్తి. నా తలిదండ్రు లంతగా ధనవంతులు కాకపోయినను శూద్రకులములో మిక్కిలి గౌరవమును గాంచిన వంశమునందుఁ బుట్టినవారు. నా తలిదండ్రులకు నేనొక్కఁడనే పుత్రుడను గనుక నన్ను వారు మిక్కిలి గారాబముతోఁ బెంచుచుండిరి. నే నేది కావలెనన్నను తక్షణము తెచ్చి పెట్టుచుండిరి. అయిదేండ్లు వచ్చిన తరువాత నన్నొకనాఁడు చదువవేసి, పంతులకు ధోవతులచాపును గట్టఁబెట్టిరి. ఆ పంతు లేవిధముననను దనకు జీవనము జరగనందున పీనుగుల మోయు వ్యాపారమునఁ బ్రవేశించి ముసలివాఁడయి తాను చిన్నప్పుడైనను చదువుకొన్నవాఁడు కాకపోయినను తుదకు చదువులబడిని జీవనోపాధిగా నేర్పఱుచుకొని మా గ్రామమును జేరెను. ఆతఁడు చెప్పెడు చదు వొక్కటుక్కయైనను లేకపోయినను గొట్టెడి దెబ్బలు మాత్ర మక్షరలక్షగా నుండెను. అయిన నాతఁడు ధనమిచ్చిన వారియెడ మిక్కిలి ప్రేమగల

వాఁడు గనుక నా తలిదండ్రులు చిఱుతిండి నిమిత్తమయి నా కిచ్చెడి సొమ్ములో సగము పండితునకిచ్చి దెబ్బలు తప్పించుకొంటిని. అందుచేత పంతులు నా మీఁద నత్యంత ప్రేమగలవాఁడై నాకు బడిపెత్తనమిచ్చి, నా తలిదండ్రులతో మీ కొమారునంతటి బుద్ధిమంతుఁడు లేడని చెప్పు చుండును. చిన్నప్పటినుండియు నేను నిజముగా సూక్ష్మబుద్ధికల వాఁడను, నేర్పుకలవాఁడను అవుదును. నా నేరుపరితనమువలన మావారి కెప్పుడును నష్టమే కాని చిల్లి గవ్వయైనను లాభము కలుగకపోయినను నా జననీజనకులు నన్ను నేరుపరినిగానే యెంచి సంతోషించుచుండిరి- ఏలయనిన, నేను నా నేరుపంతయు నితరులను మోసము చేయుటయందే యుపయోగించుచు వచ్చితిని. నేను మోసములను నేర్చుకొనుటలో నిచ్చిన శ్రద్ధలో సగమైనను ఏదో యొక వృత్తిని నేర్చుకొనుటలో నిచ్చియుంటినేని, నేనీపాటి కెంతో భాగ్యవంతుడనై యుందును. ఆ సంగతి నట్లుండనిండు. నాకు బడిపెత్తనము వచ్చుటచేత పంతులతో చాడిచెప్పి కొట్టించెదనని పిల్లలను బెదిరించి తినుబడి పదార్థములను లంచము పుచ్చుకొను చుందును. ఇట్లుండఁగా నా దురదృష్టవశమున ఆ పంతులు కాలము చేసెను. ఆ కాలములో పంతులెంత విస్తారముగా దెబ్బలు కొట్టుచున్న నంతగట్టివాఁడనిపించుకొనుచుండును గనుక చదువుకొన్న పంతు లదివఱకే మాయూర బడిపెట్టుకొని యున్నను, అతఁడు పిల్లల యందు ప్రేమగలవాఁడై నిష్కారణముగా కొట్టుటకు పాలుపడ నందున, పిల్లల నెవ్వరు నాతనిబడికిఁ బంపకుండిరి. ఇప్పుడు గ్రామములో రెండవ పంతులు లేనందున, మా బడిలోని పిల్లలనందఱను విధిలేక యక్కడికే పంపవలసి వచ్చెను. ఈ క్రొత్త పంతులవద్ద మునుపటివలె నా యాటలేమియు సాగినవికావు. ఇంతలో మా తండ్రియు నాకస్మికముగా గుండెలలో నొప్పివచ్చి లోకాంతరగతుఁ డయ్యెను. అతఁడు తన ధనము నెక్కడనో పాతిపెట్టి మరణకాలమునం దెవ్వరితోను చెప్పకయే కాలము చేసినందున పెద్దమ్మవారు మమ్ము మఱింత శీఘ్రముగా వచ్చి యాశ్రయిం చెను. ధనికుఁడైన మా పొరుగువారి పిల్లవాఁడొకఁడు మా బడిలోనే చదువు కొనుచుండెను. అతఁడు చదువునందు మిక్కిలి యాసక్తికలవాఁడు. అతనితో నేను మైత్రి చేసికొని మిక్కిలి నమ్మకమిచ్చి మెలఁగుచుంటిని.

కొందఱు నమ్మకమిచ్చినప్పుడు మనసుకూడ నిచ్చి యూరకుందురు. నేను తెలివిగలవాఁడను గనుక అలాగున జేయక వేయినమ్మకము లిచ్చినను మనసు మాత్రమియ్యక దాఁచుకొంటిని. ఈ ప్రకారముగా నుండి యతనిని పలువిధముల మోసముచేసి, ధనమార్జించుచుంటిని. అది యేమిమాయయో కాని నే నెన్నివిధముల మోసముచేసి ధనము సంపాదించుకొనుచున్నను బీదవాఁడనుగాను, అతఁడు ధనవంతుడుగాను ఉంటిమి. అతఁడు విద్యయందు వృద్ధిపొందినకొలఁది, నేను ద్యూతవిద్యయందు పాండిత్యమును పొందనారంభించితిని. చెడుపిల్లవాండ్రతోడి సాంగత్యము వలనఁ జదువు మానివేసి డబ్బుపెట్టి జూదమాడ మొదలుపెట్టి యా వ్యసనములోఁ బడి యింటగల వస్తువులను దొంగతనముగాను బలవంతముగాను దీసికొనిపోయి జూదగాండ్రకు సమర్పించుచుందును. ఇట్లుండియు మా పొరుగు చిన్నవానితోడి చెలిమిని మాత్రము మానలేదు. అతని పేరు భాస్కరుఁడు. నా పేరు పద్మనాభుఁడు. ఇట్లు జరుగుచుండఁగా నాకు పదియాఱు సంవత్సరములు దాఁటినవి. నా మిత్రుఁడు పెద్దవాఁడై గృహయాజమాన్యమును వహించి విద్యాభిరుచి గలవాఁడై సదా పండితుల గోష్ఠిని ప్రొద్దుపుచ్చుచుండెను. నే నొకనాఁడతని యొద్దకుఁ బోయి నా స్థితిగతులను జెప్పుకొని నా తండ్రియు వర్తకుఁడే గనుక నాకు వ్యాపారము చేయ నిష్టము కలదనియు మూలధనముక్రింద నేమైనఁ బెట్టుబడిపెట్టి సాయము చేయవలసినదనియు కోరితిని. అతఁడు తానుగూడ పాలికుండెదనని చెప్పి రెండువందల రూపాయలను నా చేతికిచ్చి నేను పనిచేయుటకును తాను వడ్డి పుచ్చుకొనకుండుటకును వచ్చిన లాభములో చెఱిసగము చూచుకొనుటకును నన్నొడబఱిచి పంపెను. మాకు వచ్చిన లాభము స్వల్పమేయైనను పనిచేయువాఁడను గనుక నా కెక్కువ లాభము కావలెనని నేను నా మిత్రునితో కలహము పెట్టుకొనఁ జొచ్చితిని. రాజు లనుభవించుటకు రాజ్యములున్నను, ఒకరితోనొకరు పోటాడి చత్తురు; సన్యాసులకు కౌపీనముకంటె నధిక మేమియు లేకపోయినను పోరులేక సంతుష్టి పొందియుందురు. దైవము దయచేసిన దానితోఁ దృప్తి పొందియున్న నే కలహములును గలుగవు. తృప్తిలేక యాశాపిశాచముచే నావహింపబడినచో నెల్లకలహములు

గలుగును. అయినను నా స్నేహితుఁడు మిక్కిలి మంచివాఁడును ఉదార సాహసము కలవాఁడును గనుక, ఒకనాఁడు నన్ను తనదగ్గఱకుఁ బిలిచి యిట్లనియెను.

"నీవు మొదటినుండియు వర్తకుఁడవుగా నున్నావు గనుక నీకు సొమ్మునందే యిష్టము; నాకు విద్యాధనమునందు మాత్రమిష్టము. త్యాగ భోగముల కక్కఱకు రాకపోయినను ధనమును జూచుకొనుచున్నను నీకు సంతోషము కలుగును. నాకు గౌరవముతో జరుగుట కున్నంజాలును. కాఁబట్టి యీ రెండువందల రూపాయలను నీవు పుచ్చుకొమ్ము.

అని యాతఁడు పెట్టుబడి పెట్టిన సొమ్మును నాకు విడిచిపెట్టెను. ఆ సొమ్ము చేతికందిన సంతోషముచేత, మఱింత యుల్లాసముతో దుకా ణము కట్టిపెట్టి రాత్రియు పగలునుకూడ జూదమాడ సాగించి కొన్ని మాసములలో సొమ్మంతయుఁ బోఁగొట్టుకొని జోగినైతిని. తరువాత పశ్చాత్తాపపడి, తిండికి సహితము జరగక యిబ్బందిపడుచు నొకనాఁడు మాసికలు వేసిన బట్టలతో స్నేహితునియొద్దకుఁ బోయి యాతఁడు చేసిన యుపకారమును బహువిధములఁ గొనియాడి నాకు సంభవించిన దురవస్థ యంతయుఁ జెప్పుకొంటిని. అతఁడు నాస్థితిని విని మిక్కిలి విచారపడి, సొమ్ము చేతనుండినయెడల పాడుచేయుదునని యెఱింగి, యొకస్నేహితునకు జాబు వ్రాసి నన్నచటికిఁ బంపెను. నేనా యుత్తరమును దీసికొనిపోయి చూచిన తోడనే యాతఁడు నన్ను మధ్యాహ్నమున రమ్మనిచెప్పి నాకు నెలకు పదిరూపాయల జీతముగలపని నొకదాని నిచ్చెను. నేనాపనిలో రెండుమాసములుండువరకు నాకది యెంతో భారముగా కనఁబడెను. ఒంటిగానున్నప్పుడు నాకంటఁబడిన వస్తువులనెల్లను హస్తలాఘవమును జూపి నేనుమాయము చేయుచు వచ్చినందున, నా యజమానుఁడు వారి మీఁదను పెట్టి వీరిమీఁదను పెట్టి నన్ను దిట్టుచుండెను. అంతియకాక యొకరికి లోఁబడియుండి వారు చెప్పినట్లెల్ల పనిపాటలు చేయుట నా స్వభావ మునకు సరిపడినదికాదు. నాకు స్వభావముగా మహారాజువలె నుండవలెనని యాశ గనుక, ఆపనిని విడిచిపెట్టివచ్చి యింటివద్దకాలుమీఁద కాలువేసుకొని కూరుచుండి నన్ను నమ్మినవారికడ నెల్లను ఋణములుచేయుచు, అప్పు

పుట్టినంత కాలము సులభముగా జీవనము చేయుచుంటిని. శః ప్రఖ్యాత ముగా నిరుద్యోగముగా జీవనముచేయుచున్న కాలములో నేనితరులుచేయు హితబోధ నెప్పుడును వినకపోయినను, అడుగుటయందు మాత్రము విశేష శ్రద్ధపుచ్చుకొని విశేష నీతివాక్యములను నేర్చుకొంటిని. అటుతరువాత నా నీతివాక్యములు నాకేమియుఁ బనికిరాకపోయినను, ఇతరులకైనఁ బనికి వచ్చునని యెంచి మూఢులకు హితోపదేశములుచేసి గొప్పవాఁడనని పేరు పడి ధనమార్జింప నారంభించితిని. అప్పుడు సహితము నా నడత తిన్నగా నుండనందున నొకనాఁడొక భక్తుఁడువచ్చి 'మీరిన్ని నీతులను జెప్పుచున్నారుగాని మీ ప్రవర్తనము తిన్నగానున్నదా?' యని నన్నుఁ బ్రశ్నచేసెను. 'నాకుఁ బనికిరావనియేకదా యీ నీతులన్నిటిని మీకు వదిలివేయుచున్నాను; నాకే పనికివచ్చిన యెడల నొక్క వాక్యమయిన నా కుక్షిలోనుండి పైకి రానిత్తునా?' యని సమయోచితముగా బ్రత్యుత్తరము నిచ్చి, యిఁక నందు నిలుచుట కార్యము కాదనుకొని శీఘ్రముగా నాగ్రామము వదలివేసి దేశాంతరమునకుఁ బోవలెనని బయలుదేఱితిని. అట్లు బయలుదేఱి గ్రామైకరాత్రముగా శయనించుచు భోజనము చేసిన యూరఁ బరుండక నిత్యప్రయాణములు చేయుచు, ఒకనాఁడొక గ్రామము పఱగడ గొప్పమేకలమంద నొకదానిని జూచి ఇన్ని మేఁకలను వాఁడెట్లు కాపాడఁగలఁడాయని గొల్లవానియందు మిక్కిలి కనికరముతోఁచి కొంత భారము తగ్గించినను తగ్గించుటయే యని రెండు మేఁకపిల్లలను బుజము మీఁద వేసికొని నడవ నారంభించితిని; అప్పుడు వానివెంటనే తల్లియు నఱచుచు రాసాగెను; అది చూచి తల్లిబిడ్డల నెడఁబాపిన పాపమువచ్చునని కొంత భూతదయగలవాఁడనై యాపిల్లల తల్లినిగూడఁ దోలుకొని పోవు చుంటిని. ఆ సంగతి నేలాగుననో కనిపెట్టి గొల్లవాఁడు నా వెనుక 'దొంగా! ఆగు'మని కేకలువేయుచు పరుగెత్తివచ్చుచుండెను. అదివరకును పై గ్రామము నెంతప్రొద్దెక్కి చేరుదునోయని భయపడుచుంటిని. గాని, వాని కేకలతో నిమిషములో నూరుచేరి సంతోషించి తిరిగి చూచితిని; వాఁడు నా పరుగు కలిసికోలేక తక్కిన మేఁకల నెవ్వరెత్తుకొని పోదురో యని యప్పుడే వెనుకకు మరలిపోయెను.

నేనా మేకను పిల్లలను పొరుగూరులో విక్రయించి యాసొమ్ము భారి బత్తెమునకుంచుకొని, కొన్ని దినములలో కొండవీడుచేరి యచట యోగినై యుండి, నాయొద్ద సీతారామమంత్ర మున్నదనియు దానిని జూచిన వారికి సమస్త సంపదలు గలుగుననియుఁజెప్పి, యొకబొమ్మరాతిని గదిలోనుంచి రహస్యముగా దబ్బు దబ్బు చొప్పున బుచ్చుకొని చూప నారంభించితిని. ఏ పాడువస్తువు నయిననుసరే రహస్యముగా నుంచుటవలన దానియందు గౌరవము హెచ్చును. దివ్య క్షేత్రముల యందలి దేవాలయములలోని విగ్రహములను పామరులు పూజారులకు దక్షిణలిచ్చి స్వామి యెంత బాగుండునో యని చూచులాగుననే యెల్లవారును నాకును కానుకలను సమర్పించి యాబొమ్మరాతిని మూఁకలుగావచ్చి జనులు చూచి పోవు చుండిరి. చూచినతరువాత చేతకాని పనివానిచేతఁ జెక్కఁబడిన యా కురూపముగల విగ్రహములందువలెనే యా రాతియందును వీధిలో గనఁబడెడి బొమ్మరాయియేయని యెల్లవారికిని ననాదరము కలుగ నారంభించెను. నిజముగా నేను సీతారామయంత్రమని లోపలఁబెట్టిచూపిన శిలను ఒకదినమున వీధిలోఁబెట్టి చూపినచో మఱునాఁ డెవ్వరును దానిమొగము వంకనైనఁ జూడఁగోరరు. నేనాప్రకారముగా యోగిగా నున్న కాలములో ప్రయోగవిద్యయందును, భూతవైద్యమునందును మిక్కిలి ప్రసిద్ధికెక్కిన వాఁడనుకాఁబట్టి నా మహత్త్వమును నెల్లవారును చెప్పుకొనుచుందురు. నేను వదలింపబూనుకొన్న దయ్యముల కథలనుబోలె నా కథలను సహితము మెల్లవారును నత్యాదరులై వినుచువచ్చిరి. కాని యివియు వానివలెనే వినువారిభయమును మఱింత వృద్ధిపఱుచుటకే వినియోగపడుచు వచ్చి నందున, గ్రామములో నందఱును నేనేమి ప్రయోగముచేసిపోదునో యని నాకు జడియుచుండిరి.

పయిమిషచేత ధన మార్జించి యా గ్రామములో సుఖజీవనము చేయుచుండఁగా నన్ను వ్యాధి యాశ్రయించినందున, నే నదివర కెందఱికో

మరణమున బ్రహ్మైకమే కాఁబట్టి సంతోషింపవలయునని బోధించుచు వచ్చినను చచ్చిపోదునని భయపడఁజొచ్చితిని. మీ రేయోగినైన బిలిచి మీకు మరణమన్న భయ మేమైనఁ గలదా యని యడిగిన తడవుకోకుండ లేదని చెప్పునుగాని యాతనికిఁ గొంచెము రోగము వచ్చినప్పుడుమాత్ర మాతని చర్యవలన మూఢులకుండు దానికంటె నెక్కువ భయము కలిగి యుండుటను గనిపెట్టవచ్చును. నేనట్లు యోగివేషము వేసికొని యున్న కాలమున నితరు లే యోగిని ప్రశంసించినను, నేనాతఁ డెంతవాఁడని తృణీకరించుదును. సాధారణముగా యోగ్యులు తాము కీర్తిని బొందవలెనని కోరుచుండఁగా అయోగ్యులు వారి కీర్తిని పాడుచేసి తమ కీర్తితో సమాన మైనదానినిగాఁ జేయఁ జూచుచుందురుగదా? నే నిట్లనే వేషములు వేసి కడపట బైరాగినై వీరినిద్దఱిని శిష్యులనుగాఁ గైకొని చిదానందయోగియను పేర ధవళేశ్వరము ప్రవేశించి, యీ రాజశేఖరుఁడుగారినే స్వర్ణముచేసి యిచ్చెదనని మాయచేసి యిప్పుడు తమయొద్దకుఁ దెచ్చిన నగలనే యపహరించుకొని పోతిని. అక్కడినుండి పోయిన పిమ్మట గడ్డమును మీసమును గొఱిగించుకొని నీలాద్రిరాజునయి పిఠాపురము ప్రవేశించి, పేంద్రసాయముచేతనే రాజుగారి ధనాగారములోని ధనమును తరలించితిని. ఈ రెండు చోట్లను నేను జరిగించిన యద్భుత చర్యలును, నా నటనమును రాజశేఖరుఁడుగారును కొమారుఁడును చక్కఁగాఁ జెప్పఁగలరు. కనుకను, ఆత్మప్రశంస యనుచిత మగుటచేతనుఁ ఇంతటితోఁ జాలించుచున్నాను" అని యూరకుండెను.

కృష్ణజగపతిమహారాజులవా రాతని చరిత్రము విన్న తరువాతను నిమిషమాలోచించి, పద్మనాభునివంకఁ దిరిగి నీ విప్పుడు బుద్ధితెచ్చుకొని నిజముగాఁ బశ్చాత్తప్తుఁడ వైనాఁడవు గనుక నిన్నొక్క సంవత్సరము కారాగృహమునందుఁ బెట్టింప నిశ్చయించినా మని చెప్పి, కారాగృహాధికారి కట్టి యుత్తరువును వ్రాసి యాతనిని రాజభటుల వెంబడిని సామర్లకోటకుఁ

బంపివేసిరి. తరువాత పిఠాపురపువారి ధనము నచ్చటికి వెంటనే పంపివేయ మంత్రి కాజ్ఞ వేసి, దొంగతనమును పట్టుకొన్నందులకు సుబ్రహ్మణ్యమును శ్లాఘించి, రాజశేఖరుఁడుగారివంకఁ దిరిగి రాజుగారిట్లు చెప్పిరి:

మీ రిదివఱ కెన్నో కష్టముల ననుభవించి యా యాపదల నన్నిటిని గడచి మరల సుఖము ననుభవించుదశకు వచ్చుచున్నారు. కాఁబట్టి మీకు నేను కొన్ని హితవాక్యములను జెప్పబోవుచున్నాను. మీరు నా మాటలను సావకాశముగా వినవలెను. పడినతరువాత లేచుట గొప్పతనము గాని యెప్పుడును పడకుండుట గొప్పతనముకాదు. మీ రీ నీతిని మనసునం దుంచుకొని వెనుకపడిన కష్టములకై విచారపడకుండవలయును. ఇతరులు చేయు ముఖస్తుతులకుబ్బి, ఆదాయమునకంటె నధికమైన ధనము దానము చేయకుండవలయును. ఒక్క కుటుంబములోవారు పలువురు పది మందిలో నత్యంతమైత్రి కలిగియే యున్నను గృహము చేరినతోడనే గర్భశత్రువులుగా నుందురు. కాఁబట్టి మీ కుటుంబమునందట్టి కొఱత కలుగకుండఁ గాపాడుచు రావలయును. విరోధమును సాధించుటకు మంచి యుపాయము శాంతిని వహించుటయే. మన కెవ్వరిమీఁదనైనను పగతీర్చుకో శక్తిగలిగియుండియు క్షమింతుమేని, శత్రువులు సహితము మనలనుజూచి బుద్ధి తెచ్చుకొని జ్ఞానవంతులగుదురు. కప్ప కఱవవలెనని ప్రయత్నముచేసిన నెంత ప్రయోజనకారియగునో బీదవాఁడు గొప్పవానిని పగసాధింపఁ దలఁపుగొన్న నంత ప్రయోజనకారిగానే యుండును. వట్టి బెదరింపులతోనే ముగిసెడు కోపము నెవరు లక్ష్యము చేయుదురు? అట్టి కోపమువలన మన కార్యమును సాధించుకోలేకపోవుట యటుండగా మీదుమిక్కిలి నష్టమునుకూడఁ బొందుదుము. మీరు శోభనాద్రి రాజు మీఁద తొందరపడి మీ కోపమును చూపినందులకే కదా మీకు కారాగృహబంధనము సంభవించినది. కాఁబట్టి యిఁకముందెప్పుడును మీరు మీకంటె నధికులైన వారిమీఁద మీ కోపమును కనఁ బఱుపకుండవలయును.. కొందఱు మతిహీనులు పూర్వకాలమే మంచిదని పొగడి మీరుచేయు దోషములను కాలమునందారోపించి మిమ్ము నిరుత్సా

హాలను జేయుదురు. కాని, చక్కఁగా నాలోచించి చూడఁగా బూర్వకాల మునకంటె నిప్పటికాలమే మంచిదని నాకుఁ దోఁచుచున్నది.[1] పుణ్యపాప ములు మనుష్యుల ప్రవర్తనములో నున్నవికాని కాలములో నేమియు లేవు. కాఁబట్టి మీరు చేసిన దోషములకు కాలమును దూషింపక మీ ప్రవర్తన మును దిన్నపఱచుకొనుటకే ప్రయత్నపడవలయును. మీకు గౌరవముతో జీవనము జరుగుటకు చాలినంత సొమ్మున్నచో విశేషముగాలేదని మీరెప్పు డును చింత పడకుండవలయును. ఈ రీతిని దెలిపెడి పూర్వకథ నొక దానిని మీకుఁ జెప్పెదను వినండి. పూర్వమొక ధనవంతుఁడు శరీరము నిండ రత్నఖచితములైన స్వర్ణాభరణములను ధరించుకొని వీధిబడి పోవు చుండగా, బీదవాఁడొకఁ డాతనిని వెంబడించి నగలను జూచి మాటిమాటికి నమస్కరింప నారంభించెను. ఆ ధనికుఁ డాతనిని జూచి 'నా నగలలో నే నేదియు నీ కియ్యలేదే. ఎందుల కట్లు చేయుచున్నా' వని యడిగెను. 'ఆ నగలు నా కక్కఱలేదు. మీరు నన్ను నగలను చూడనిచ్చినారు గనుక నమస్కారములు చేసినాను. మీరును చూచుకొని సంతోషించుటయేకాని నగలవలన వేఱొక ప్రయోజనమును బొందఁజాలరు. మీరు నగలు

---

1. తమ చిన్ననాటి కాలానికి డెబ్బయ్యేళ్ళు తమకు నిండిన కాలానికీగల వ్యత్యాసం వీరేశలింగం స్వీయ చరిత్రలో ప్రస్తావించారు. "అప్పుడు రాజ మహేంద్రవరమువంటి పట్టణములలో సహితము యువజనులు సభలు చేయుటయే సామాన్యజనుల దృష్టికి తప్పిదముగా గనబడుచుండెను; ఇప్పుడు చిన్నపల్లెలయందు సహితము సభలు జరుగుచు నందు వివిధ విషయములు వితర్కింపబడి జన సామాన్యముచే మెప్పొందు చున్నవి. అప్పుడు స్త్రీ విద్య పేరు చెప్పిన మాత్రమున తలకంటకముగానుండి బహుజనులచే, దూషింపబడుచుండెను. ఇప్పుడెల్లయెడల బాలికా పాఠశాలలేర్పడి స్త్రీ విద్యయభివృద్ధినొంది సభలు ప్రసంగములు పుస్తక ములు చేయగల స్త్రీలచేనొప్పి భూషింపబడుచున్నది."

పుట 308, స్వీయ చరిత్రము
రెండవ సంపుటం (1984)

కాపాడుకొనుటకై యెంతయు శ్రమపడుచున్నారు. నా కా శ్రమయక్కఱ లేకయే సంతోషము లభించుచున్నది. మీకును నాకును గల వ్యత్యాస మిదియే' యని వాఁడు బదులు చెప్పిపోయెను. ఈ హేతువునుబట్టియే నేను మీకు విశేషధనము నియ్యఁగలవాఁడ నయ్యును, ఇయ్యక మీ మాన్య ములను మాత్రము విడిపించి యిచ్చుచున్నాను. వానితో మీరు తృప్తి చొంది సుఖజీవనము చేయుచుండుఁడు.

అని చెప్పి కృష్ణజగపతిమహారాజుగారు 'మీకు మఱియేదియైనఁ గోరిక కలదా' యని రాజశేఖరుఁడుగారి నడిగిరి. ఆయన ప్రభువులవారి సుగుణ సంపత్తిని వేయివిధములఁ గొనియాడి, తన కుటుంబమునకు జేసిన మహోపకారమును స్మరించి తాను చెఱసాలలో నున్న కాలములో విజ్ఞాపన పత్రికను వ్రాసి పంపుట మొదలగు పనులలో దనకత్యంత సహాయుఁడుగా నున్న మంచిరాజు పాపయ్యను చెఱనుండి విడిపింపుఁడని వేడుకొనెను. తన కపకారముచేసిన శత్రువునందుకూడ దయ గలిగి యుండుటను శ్లాఘించి, రాజుగారప్పుడే యాతనిని విడిచిపెట్ట నాజ్ఞా పత్రికను బంపి తాము కొలువు చాలించి యంతఃపురమునను విజయం చేసిరి. అంత రాజశేఖరుఁడుగారు మొదలగువారు కొలువుకూటమును విడచి తమ తమ యిండ్లకు బోయిరి.

# పదునేనవ ప్రకరణము

రాజశేఖరుఁడుగారు స్వగ్రామమునకుఁ బోవుట— సుబ్రహ్మణ్యము వివాహము— సీత వివాహము— రాజశేఖరుఁడుగారు తానుబడిన కష్టముల వలన కృత్యమును నేర్చుకొని సుఖముగా జీవనము చేయు చుండుట.

మఱునాఁడు రాజుగారి యుత్తరువు ప్రకారము రాజశేఖరుఁడుగారు సభకు వచ్చినప్పుడు, కృష్ణజగపతిమహారాజుగారు తన సభికులలో నొకరిని బిలిచి రూపాయలసంచులను రెంటిని తెప్పించి ముందుపెట్టి 'మీరీ ధనమును బట్టుకొని రాజశేఖరుఁడుగారితో ధవళేశ్వరమునకుఁబోయి గృహమును మాన్యములను విడిపించి యిచ్చిరం'డని యాజ్ఞాపించి, అవి గాక మఱి నాలుగువందల రూపాయలను రాజశేఖరుఁడుగారికిచ్చి 'మీరీ సొమ్ముతోనే సీతయొక్కయు సుబ్రహ్మణ్యము యొక్కయు వివాహము లనుజేసి వచ్చురాబడికి మించిన వ్యయమెన్నఁడును జేయక సుఖజీవనము చేయుచుండుఁ'డని, హితబోధచేసి వారికి సెలవిచ్చి పంపిరి. రాజుగారి వద్ద సెలవు పుచ్చుకొని రాజశేఖరుఁడుగారు భీమవరమునకు వెళ్ళునప్పటికి జగ్గంపేటనుండి వచ్చి యింటికడ నెవ్వరో బంధువులు కాచియున్నారని సమాచారము తెలిసెను.

ఆ మాటవిని వేగిరపడి యిల్లుచేరఁగా వీధియరుగుమీఁద నొక ముసలి బ్రాహ్మణుఁడు కూరుచుండి యుండెను. రాజశేఖరుఁడుగారాయ ననుజూచి మీరెవరని ప్రశ్నవేయఁగా, తమ యింటిపేరు భావరాజువార నియు, తనపేరు సూర్యనారాయణయనియు జెప్పి 'రాజశేఖరుఁడుగారు మీరేకారా' యని ప్రశ్నవేసెను.

రాజ— అవును, మీరే పనిమీఁద వచ్చినారు ?

సూర్య—మీయింటి కినడుమ సుబ్బరాయఁడను చిన్నవాఁడు వచ్చినాఁడు. అతఁ డెక్కడనున్నాడు ?

రాజ—ఆ పేరుగల చిన్నవాఁడెవ్వడును మా యింటికి రాలేదు.

సూర్య—మీ కొమార్తెను దొంగ లెత్తుకొనిపోయినప్పుడు మా గ్రామము నుండి తీసికొని వచ్చినాఁడు. అతఁడు వేంకటేశ్వరుల మ్రొక్కును బట్టి తల పెంచుకొన్నాఁడు. మిక్కలి చక్కనివాఁడు; ఒక రాజుతోడఁగూడ బయలుదేఱి మీ యింటికి వచ్చెదనని మాతోఁ జెప్పినాఁడు; చిన్నతనములో మీవద్ద విద్య నేర్చుకొన్నాడట :

రాజ—అతనితో మీ కేమిపని యున్నది ?

సూర్య—మా యింటియొద్దఁ గొన్నిదినములున్నాఁడు; అతని రూప గుణ సంపదను జూచి యతనికి నాకొమార్తెనిచ్చి వివాహముచేసి, నాకు పుత్రసంతానము లేదుగనుక అతని నిల్లఱిక ముంచుకోవలెనని నిశ్చయించుకొన్నాను.

అనిన తరువాత రాజశేఖరుఁడుగారు రుక్మిణి సుబ్బరాయఁడను పేర పురుషవేషము వేసికొని యుండుట లోనుగాఁగల వృత్తాంతమంతయు వినిపించి, యాచిన్నదానిని తనకుమారుఁడైన సుబ్రహ్మణ్యమునకుఁ జేసికొనియెదనని వాగ్దానము చేసిరి. అంతట సూర్యనారాయణగారు పెన్నిధి దొరికిన పేదవానివలె పరమానందభరితుఁడై, రాజశేఖరుఁడుగారి యొద్ద సెలవుపుచ్చుకొని వెంటనే తన గ్రామమునకుఁబోయి భార్యను కుమార్తెను వెంటబెట్టుకొని మఱునాఁడు మధ్యాహ్నమునకుఁ మరల వచ్చెను. ఆ దినముననే రాజశేఖరుఁడుగారు చల్లపాటువేళ బండ్లు చేసికొని సకుటుంబముగా బయలుదేరి, రెండు మూడు దినములలో సూర్యనారాయణగారితోఁ గూడ రాజమహేంద్రవరముచేరి, అక్కడ రామమూర్తి గారి లోపల రెండు దినములుండి, వారికడ దాచిన పాతసామగ్రిని దీసికొని వారినిగూడ వివాహమునకై వెంటఁ బెట్టుకొని సుఖముగాఁ బోయి ధవళేశ్వరము ప్రవేశించిరి.

పెద్దాపురమునుండి వచ్చిన కృష్ణజగపతి మహారాజుగారి సభికుఁడు రాజశేఖరుఁడుగారి మాన్యములను గృహమును విడిపించియిచ్చి మరలఁ దనప్రభువువారి యొద్దకు పోఁగోరగా రాజశేఖరుఁడుగారాయనను బహువిధముల బతిమాలుకొని కొమారుని యొక్కయు, కొమార్తె యొక్కయు వివాహములు జరుగువరకు నిలుచునట్లొడఁబఱిచిరి. రాజశేఖరుఁడుగారు మరల గ్రామమునకు వచ్చి మాన్యములు వదలించుకొని ధనికులయి యున్నారన్న వార్త విన్నతోడనే బీదతనము వచ్చినప్పుడు మొగము చాటువేసిన పూర్వస్నేహితు లందఱును పెల్లగిలి రాసాగిరి. మున్ను పిలిచినను పలుకని యాశ్రితకోటిలోని వారందఱును దినమున కాఱు పర్యాయము లింటిచుట్టును దిరుగనారంభించిరి; తొల్లి చూడమనసయినను గనఁబడని భృత్యవర్గము జీతబత్తెములు లేకయే సదాగుమ్మమువద్ద నిలువఁజొచ్చెను. రామశాస్త్రియు, సిద్ధాంతియు వచ్చి ముఖస్తుతులయందుఁ దమకుఁగల పాండిత్యప్రకర్షమును మునుపటికంటె ద్విగుణముగాఁ బ్రకటించుచు వచ్చిరిగాని, తమవిద్యాసారస్యమును గ్రహించి యక్షర లక్షలిచ్చెడి మునుపటి యౌదార్యమును, రసికత్వమును రాజశేఖరుఁడుగారి యందప్పుడున్నట్లు వారికి కనఁబడలేదు. వారిలో సిద్ధాంతి తనమీఁద రాజశేఖరుఁడుగారికి కోపము వచ్చినదేమో యనుకొని తదనుగ్రహమును మరలఁబడయఁగోరి, నారాయణమూర్తి తనయొద్ద దాచిపెట్టిన దామోదరయ్యయొక్క నగలపెట్టె నొకకూలివానిచేత మోపించుకొనివచ్చి రాజశేఖరుఁడుగారి కొప్పగించెను; మఱియు రాజశేఖరుఁడుగారికిఁ దెలియవలయునని బంధువుల ముందరను మిత్రుల ముందరను ఆయనను కొనియాడఁజొచ్చెను; సుబ్రహ్మణ్యము జాతకమంత జబ్బుదిలేదన్న నోటనే యిప్పుడు మరల మారకదశ తొలగిపోయినది కాఁబట్టి దానియంతటి దివ్యజాతకము లోకములో మఱియొకటి లేదని పొగడఁదొడఁగెను. ఆ సంగతి తెలిసికొని బీదతనము వచ్చినప్పుడు పిల్లనియ్యమన్నవారే యిప్పుడేలాగునైన, దమకన్యలను సుబ్రహ్మణ్యమునకుఁ జేసికొండనియు నాలుగువందల రూపాయలు వరదక్షిణయిచ్చెదమని రాజశేఖరుఁడుగారి చుట్టును దిరిగి యనుసరింప మొదలుపెట్టిరి. వారు భాగ్యవంతులును, అల్లునకు కానుకలను

కట్నాలమును పెట్టువారును అయినను వారిపిల్లల నెవ్వరిని జేసికోక రాజశేఖరుఁడుగారు కొమారునకు సూర్యనారాయణగారి కొమార్తె మహాలక్ష్మినిఁ జేసికొనుటకే నిశ్చయించిరి.

తరువాత నొక శుభముహూర్తమున ముందుగా రాజశేఖరుఁడుగారు కుమారుని వివాహము చేసిరి; భోగముమేళము లేకపోయినయెడల వివాహము శోభగాంచదని యెందఱు చెప్పినను,[1] వారిమాటల నాదరింపక పాతివ్రత్యమును బోధింపఁదగిన యుత్తమదినములలో లంజలతోడి పొత్తు కూడదని భోగస్త్రీల పాటలకై విశేషధనమును వ్యయపెట్టక, యల్ప ధనముతో గాయకశిఖామణులచేత కర్ణరసాయనముగా హరికీర్తనను పాడిం

---

1. 1881 వ సంవత్సరంలో తెలుగుదేశంలో జరిగిన మొట్టమొదటి వితంతు వివాహంలో భోగం మేళం కొన్ని అనివార్య పరిస్థితులలో పెట్టడం జరిగిందని వీరేశలింగం పంతులు సంజాయిషీగా స్వీయచరిత్రలో వ్రాశారు.

"వేశ్యలనగానే సంస్కార పరాయణులు చేసెడు వితంతు వివాహములకు గూడ భోగముమేళముల నుంచిరా యని సంస్కార ప్రియులకు సందేహం కలుగ వచ్చును. వితంతు వివాహ పక్షమువారికి కార్యదర్శినయి వేశ్యల మేళములకు వెళ్ళనని ప్రతిజ్ఞను గైకొన్న నేనీ విషయమున గొంచెము సమాధానము చెప్పవలసి యున్నది....

తెలుగుదేశములో మొదటిదైన యీ వితంతు వివాహమును మహావైభవముతో జరుపవలెనని మా పక్షమువారి అభిప్రాయము....

ఆయిన మా పక్షమువారిలోని యెక్కువ సంఖ్యగలవారి యభిప్రాయమును బట్టి భోగముమేళము పెట్టుటకు నిశ్చయింపబడి ముందుగా కొంత సొమ్మీయబడినది. వివాహము జరుగవలసిన స్థలము మా ఇల్లు. నృత్యగానములు సలుపుటకయి వేశ్యాంగనలను మా యింటి లోపలికడుగిడనియ్యనని నేను పట్టుపట్టితిని" అంటూ ఊరేగింపులో మాత్రమే సమ్మతించానన్నారు పంతులుగారు.

పుట 185, ప్ర. భా. (1982)

1878 వ సంవత్సరం ఈ నవల వ్రాసేనాటికే పంతులుగారి అభిప్రాయాలు స్థిరంగా రూపొందాయని ఇందువల్ల తెలుస్తున్నది. అప్పటికాయనకు వయస్సు 30 సంవత్సరాలే.

చిరి. సదస్యమునాఁడు సంభావనసమయమున సపాత్రదానమున కొప్పుకొనక యోగ్యులును పండితులునగు కొందఱిని యథాశక్తిని సత్కరింప నెంచి, వచ్చిన బ్రాహ్మణులకందఱికిని సంభావన యియ్యకపోయిన సభవారిలోఁ దలవంపుగా నుండునని చెప్పవచ్చిన బంధువులతో వివాహదినములలోఁ దలయెత్తుకొని తిరిగి యప్పులపాలై తరువాత నెల్లకాలము దలవంచుకొని తిరుగుటకంటె నీ యైదుదినములును తలవంచుకొని యావల వలయెత్తుకొని తిరుగుటయే మంచిదని చెప్పి తమయిష్ట ప్రకారమే జరిగించిరి; వీధులు గట్టి సత్రములు వేయుట వృథావ్యయమని బంధువులును మిత్రులు నైనవారిని మాత్రమే భోజనమునకు బిలిచి యాదరించిరి; ఈ ప్రకారముగాఁ జేయుటచేత మొదట నుద్దేశించుకొన్న దానికంటెను వెచ్చము తక్కువ పడినందున, మిగిలిన యా ధనము పెట్టి కోడలి కాభరణములు చేయించి పెట్టిరి.

కౌమారుని వివాహమైన మూఁడవదినముననే సీతను మేనల్లుఁడైన శంకరయ్యకిచ్చి రాజశేఖరుఁడుగారు పెండ్లి చేసిరి. ఈ వివాహమును సమస్త విషయములందును ముందుగా జరిగిన వివాహమునే పోలియున్నది. ఈ రెండు వివాహముల యందును బూజముబంతులు మొదలగు దురాచారములును, మోటు తనముగా నుండు వేడుకలును, నాకబలియైన తరువాత బుక్కాయును వసంతమును చల్లుకొనుచు స్త్రీలుఁ బురుషులనను భేదమును పాటింపక విచ్చలవిడిగా నల్లరిచేయు చెడువాడుకయును మాన్పబడినవి; కుంటితనము, గ్రుడ్డితనములోనుగాగల యంగవైకల్యములచేతఁ బాటుపడ సమర్థులయినవారును, స్వదోషమువలనఁ గాక దైవకృత్యమువలననే హీనదశకు వచ్చిన దరిద్రులును, సత్ప్రవర్తనముకలిగి సకలవిద్యావిశారదులయియున్న పండితులును, భగవద్భక్తులును మాత్రము ధనసత్కారమును బొందిరి. ఈ రెండు వివాహములును విధ్యుక్తముగా జరిగిన పిమ్మట నొకదినమున పెద్దాపురమునుండి వచ్చిన సభికుఁడు రాజశేఖరుఁడుగారి కడకువచ్చి తాను శీఘ్రముగా పోవ వలసియున్నది గనుక సెలవిచ్చి పంపవలయునని యడిగెను.

రాజ—నా ముద్దు చెల్లించి యీ పదిదినములును మీరున్నందునకు మనుగడుపులయినదాక కూడ నుండి నా మనస్సును సంతోషపెట్టి మఱి వెళ్ళవలయును.

సఖి—ఇఁక నన్ను మన్నించి విడిచిపెట్టవలయును. మనము బయలుదేఱి యిచ్చటికి వచ్చుటకుముందు మా యూరికి విచ్చేసియున్న యాచార్యస్వాములవారు శ్రీముఖమును బంపినప్పుడు వెంటనే రూపాయల నియ్యక తిరస్కరించినాఁడని మా మేనల్లునికేమో యాంక్షపత్రిక వ్రాసినారనియు, మూడు దినములనుండి మావాని యిల్లెవ్వరును త్రొక్కి చూడకున్నారనియు, మంగలవాఁడు క్షౌరము చేయుటకుఁగాని చాకలవాఁడు బట్టలుదుకుటకుఁగాని రాకున్నారనియు, ఇప్పుడే యుత్తరము వచ్చినది. స్వాములవారు వెలివేసినప్పుడు పొరుగువారు నిప్పయినను బెట్టరు; నూతిలో నీళ్ళయినను తోడుకోనియ్యరు.[1]

రాజ—సన్యాసు లెప్పుడును కామక్రోధాదులను వర్జించి పరమశాంతులై యుండవలసినవారే; ఇంత యల్పదోషమున కంత క్రూరశిక్షను విధింతురా ?

సఖి—సన్యాసులన్న పేరేకాని వారికున్నంత కోపము ప్రపంచములో నెవ్వరికినుండదు. ఇదియేమి చూచినారు? ఈస్వాములవారే క్రిందటి సంవత్సరము శ్రీకాకుళములో భిక్షకు వెళ్ళిన యింటి యజమానుని భార్యతోనేమో సరసమాడుచుండఁగా మగఁడువిని సన్యాసి నేమైననన్న నపరాధమని యూరకుండి భిక్షానంతరము దక్షిణ యియ్యక బోఁగా, ఆతనిని మూఁడుమాసములు వెలివేసి యేబఁదిరూపాయలు పుచ్చుకొని ప్రాయశ్చిత్తము చేయించి తరువాత మతములో కలుపుకొన్నాఁడు. నేను వెంటనేవెళ్ళి మా వానిచేత నపరాధ క్షమార్పణము కోరించినంగాని

1. "రాజమహేంద్రవరమున జరుగుచున్న విధవా వివాహ ప్రయత్నమును గూర్చి తుని యొద్దనున్నప్పుడే మా స్వాములవారు విని తామచ్చటికి విజయము చేసినప్పుడా పనిలో ప్రవేశించినవారి నందరిని వెలివేసెదమని యానతిచ్చిరట." పుట 118; వీ. శా. స్వీయ చరిత్రము (1903)

తార్యము సుష్టపడదు. కాబట్టి నన్ను బలవంత పెట్టక యీ పూటనే పంపి వేయువలయును.

రాజ—మీరింతగా సెలవిచ్చుచున్నప్పుడు మిమ్మిఁక నిర్బంధ పెట్టకూడదు.

అని రాజశేఖరుఁడుగా రాయనను క్రొత్తబట్టలు కట్టబెట్టి సమస్త విధముల గౌరవించి, కృతజ్ఞతాసూచకముగా ప్రభువువారితో మనవిచేయ వలసిన సంగతులను దెలిపి యాయనను బంపివేసిరి. తరువాత వివాహము నిమిత్తము వచ్చిన బంధువు లెవరి యూళ్ళకు వారు పోయిరి. ఆ సభి కుఁడును పెద్దాపురము చేరినతోడనే తన విషయమై రాజశేఖరుఁడుగారు చేసిన యాదరణమును ఆయనయొక్క యుపకార స్మృతియును సాధు వర్తనమును కృష్ణగజపతి మహారాజుగారితో మనవిచేసి, తన్నాయన ప్రభువువారితో చెప్పవేఁడుకొనిన మాటలను విన్నవించెను.

రాజశేఖరుఁడుగారు భాగ్యవంతులై మరల గ్రామమునకు వచ్చి యున్నారని విన్న కొన్ని దినములకు నారాయణమూర్తి యొకనాఁడువచ్చి, రహస్యముగా రాజశేఖరుడుగారితో దానును దామోదరయ్యయుఁ ప్రాణ మిత్రులుగా నుండుటయు దామోదరయ్యయొక్క మరణానంతరమున తానాతని చెలికాడఁను ద్వేషముచేత జనులు తనయింటఁగల సొత్తంతయు దోపించుటయు అందువలనఁ దానప్పుడు అన్నవస్త్రములకే యిబ్బంది పడుచుండుటయుఁ జెప్పి సాహాయ్యముచేయఁ వేఁడుకొనెను.

రాజ—కృతఘ్నుఁడును మిత్రద్రోహియు నగు నీవంటివాని కుప కార మెన్నడును జేయరాదు. నేను నీకెంతో మేలుచేసిన వాఁడనైనను నాకాపద సంభవించినప్పుడు, శక్తిగలవాఁడవై యుండియు నేను వేఁడు కొన్నను లేశమైన సాయము చేయకపోతివి. దామోదరయ్య ప్రాణ మిత్రుఁడుగానున్నను నీయొద్ద నాతఁడు దాఁచుకొన్న పెట్టెను మిత్రుని పుత్రునికీయక యపహరింపఁ దలంచితివి.

నారా—ఆ సొమ్ము పెట్టెను. తనయొద్ద దాచవలసినదనియు దానిని సులభముగా నపహరించవచ్చుననియు సిద్ధాంతియే మొదటనా

కాలోచన చెప్పినాఁడు, నేను సొమ్ము పెట్టి నాతనియొద్దఁ బెట్టిన తరువాత ధనకందులో సగభాగము రావలెనని పోరాడి, స్నేహితునిసొమ్ము పరుల పాలగుట కిష్టములేక నేనొప్పుకొనినందున మీ మెప్పునకై పేట్టెను మీకుఁ దెచ్చియిచ్చినాఁడు.

రాజ—సిద్ధాంతియే నిన్నుఁ బ్రోత్సాహపఱిచినను నీవు సహితము దోషివే కాని నిర్దోషివి కానేరవు. స్వయంకృతాపరాధమువలననే నీకిప్పడీ దుర్దశ ప్రాప్తించినది కాఁబట్టి యెఱుఁగక చేసికొన్నదాని ఫలము నీవ వశ్యముగా ననుభవింపవలెను.

అని చెప్పి రాజశేఖరుఁడుగా రాతని కేమియు సాయము చేయక సాగనంపిరి. అది మొదలుకొని రాజశేఖరుఁడుగారు వెనుక సిద్ధాంతి మొదలైనవారి చర్యలవలనఁ దెలివితెచ్చుకొని ముఖస్తుతుల కుబ్బి యెప్పుడును ధనము పాడుచేసికొనకయు, సమీపమునకువచ్చి మంచి మాటలు చెప్పువారి నందఱిని మిత్రులని నమ్మకయు మెలఁగఁజొచ్చిరి. యోగి వెనుకచేసిన కుతంత్రమువలన నాతనికి యోగులనువారి యందెల్లను కేవల జఠర పూరకులను నభిప్రాయమును మంత్రములయందును సువర్ణ కరణాది విద్యలయందును దృఢమైన యవిశ్వాసము గలిగెను. రుక్మిణికి వెనుక పట్టిన దయ్యములు భూతవైద్యము శకునములు మొదలగువానివలన నెల్లవారికిని వానియందలి నమ్మకము చెడుటంజేసి మఱియెప్పుడును వారి యింట నెవ్వరికిని గ్రహబాధకాని ప్రయోగలక్షణముకాని దేవత లావహించుటగాని కలుగలేదు. కుటుంబములోనివారి జాతకములును పెట్టిన ముహూర్తములును పలుమాఱు విరుద్ధ ఫలముల నిచ్చుచు వచ్చినందున, రాజశేఖరుఁడుగారికిని తత్సంతతివారికిని జ్యోతిషమందు సహిత మప నమ్మకము కలిగెను. రుక్మిణి వివాహకాలమున చేసిన ధర్మములకై చేసిన ఋణములవలన నష్టముల ననుభవించియుండుటంజేసి రాజశేఖరుఁడుగా

రిఁక నెప్పుడును పరులకు ఋణపడకూడ దని నిశ్చయము చేసికొనిరి. అంతటి నుండియు రాజశేఖరుఁడుగారు మితవ్యయమునే చేయుచు వ్యర్థ డంభమునకై ధనము పాడుచేసికోక, తమ కీశ్వరుఁడు దయచేసినదానితోడనే తృప్తినొందుచు, కలకొలఁదిని బీదసాదలకు దానధర్మములు చేయుచు, కలలో సహితము సత్యమును భూతదయయును తప్పక, "ధర్మోజయతి" యను నీతివాక్యమును సదా హృదయము నందుంచుకొని సమస్త కార్యములయందును నీతిపథకమును నీగకాలంతయు దాటక ఋజువుగా ప్రవర్తించుచు మంచివాఁ డని లోకమున ప్రసిద్ధికెక్కి, పెక్కండ్రు మనుమ లను మనుమరాండ్రనెత్తి సిరియు సంపదయుఁగలిగి చిరకాలము సుఖింపు చుండిరి. ఆయన జీవితకాలములోనే సుబ్రహ్మణ్యము పిఠాపురపు సంస్థానములో గొప్ప యుద్యోగములుచేసి కడపట మంత్రియై రాజకార్యములయందును సన్మార్గ ప్రవర్తనమునందును నసమానుఁ డన పేరు పొందెను. అల్లుఁడైన పెద్దాపురపు రాజుగారి యోలగములోఁ గొలువు కుదిరి క్రమక్రమముగా గొప్పదశను బొంది విశేష ఖ్యాతిని సంపాదించిరి. రాజశేఖరుఁడుగారి కుటుంబములోనివారే కాక యాయన బంధువర్గములో చేరినవారుకూడ అధర్మవృత్తి కొంతకాల మిహలోక సుఖమును గలిగించి నను సద్ధర్మవృత్తియే శాశ్వత సౌఖ్యమునకు విధానమని రాజశేఖరుఁడుగారి వర్తనమువలన నెఱిఁగి నిరంతరము ధర్మమార్గ ప్రవిష్టులై యుండుచు వచ్చిరి. చిన్నప్పుడెప్పుడో చచ్చిపోయిన మగఁడు పట్టుకొని వేధించు చున్నాఁ దన్న సిద్ధాంతి కొమార్తె పెద్దదై బ్రతికియున్న మఱియొక మగఁడు మిక్కిలి మక్కువతో తన్నాశ్రయించి మోహింపఁ జేయగాఁ నాతనివెంట నింట దొరికినసొత్తు నెత్తుకొని లేచిపోయి చెడి కడ పటదాసి యయి తమ కన్నుల ముందటనే గ్రామములోఁ దిరుగు

చుండుటయు,[1] బాల్యదశలోనే భర్తలను బోగొట్టుకొన్న భాగ్యహీను లాండ్రైన పెద్దియలు పడు కష్టములును, అట్టివారు దురతిక్రమణీయమైన కామబాధకు తాళఁజాలక యింద్రియచాపల్యముల దుష్టపురుషుల వలలోఁపడి పాడగుచుండుటయు, కొందఱు కులములవారికి వెరచి రహస్యముగా శిశు హత్యలు, గర్భపాతములు మొదలైన ఘోరపాతకముల కొడిగట్టు చుండుటయు, ప్రతిదినమును కన్నులారఁ జూచి మనసు కరగి యట్టి బాలవితంతువుల దుర్దశను తొలగించుటకేమైన జేయవలయునని పలు ప్రయత్నములు చేసియు మూఢశిరోమణులయిన జనులయొక్కయు నాచారపిశాచావేషసన్యస్తవివేకులై యున్న పండితులయొక్కయు, మనస్సు లను మళ్ళింపశక్తులుగాక విఫలప్రయత్నులై రాజశేఖరుఁడుగారు కొంత కాలమ్మునకు లోకాంతరగతు లయిరి. రాజశేఖరుఁడుగారు కాలముచేసి యిప్పటికి రెండువందల సంవత్సరములైనను ఆయన వలన మేలుపొందిన వారి సంతతి వా రిప్పటికిని ఆయనను బ్రశంసించు చుందురు. రాజశేఖ రుఁడుగారి సంతతివారుకూడ దేశమంతటను వ్యాపించి యిప్పుడు పెక్కుఁ చోట్ల గొప్ప స్థితి కలవారయి యున్నారు.

# సంపూర్ణము

---

1. బ్రాహ్మ వివాహం అనే ప్రహసనంలో పంతులుగారు బాల వితంతువుల దయనీయ ప్రవర్తనను ఎంతో జాలిపుట్టేలా వర్ణించారు.

# వీరేశలింగము
# రాజశేఖర చరిత్రము

తెలుగు నవలా రచనకిది నాంది. ఇంగ్లీషు, తమిళం, కన్నడ భాషల్లోకి అనువదింపబడటం దీని గొప్పను నిరూపిస్తుంది. ఇది "ఆలివర్ గోల్డుస్మిత్" రచన "ది వికార్ ఆఫ్ వేక్ ఫీల్డు" నవలకు స్వేచ్ఛానుసరణమని పంతులుగారే చెప్పారు.

ఇతివృత్తం సాంఘికం, కథాచిత్రణ ఖచ్చితంగా లోకధర్మానుసారం. తెలుగు వారి ఆచార వ్యవహారాలకు అద్దం. వాటి బాగోగులకు వివరణ. అధునాతనమైన వ్యంగ్యం, హద్దులు తప్పని హాస్యం, సలక్షణమైన సరళభాష, సామాన్యులకు దుర్లభమైన గుణాలను వర్ణించి, వాటికి అభిముఖత్వం కలిగించే ఘరానా నవల.

ప్రసిద్ధ నవలా రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు ఈ నవల చదివి, గ్రహించి నవలలు రాయటం నేర్చుకున్నారట. సమకాలీన సారస్వతేయులలో, పాఠకులలో గొప్ప ఆదరాభిమానాలను పొందిన ఈ నవల ఎన్నోమార్లు యూనివర్సిటి పాఠ్యపుస్తకంగా ఎంపిక చేయబడ్డది.

గద్యతిక్కన, దక్షిణ భారత విద్యాసాగరుడు, నవ్యాంధ్ర జాతిపిత అని అనిపించుకున్న పంతులుగారు ఆంధ్రావనికి అక్షరాలా ఆరాధ్యులు.

**వారి ఈ నవల ఆధునిక సాహిత్యంలో అనర్ఘరత్నం.**